మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.8.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



అభిమన్యు

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



అర్జున

మాసపత్రిక, సెప్టెంబర్, 2025 ₹ 50/-

ISSN 2454–4329

Mismi September 25 title.indd 1 16-08-2025 15:27:22



ద్రోణాచార్య



అశ్వత్థామ

# మిసిమి


మాసపత్రిక

**సంపుటి 36**　　**సంచిక 9**

**సెప్టెంబరు - 2025**



సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**


---


Published by

**BAPANNA ALAPATI**

**1-1-60/5, R.T.C. 'X' Roads,**
**Hyderabad - 500 020.**
**Ph. 040-27645536.**


---


Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**


---


**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**కార్యదర్శి : జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
**Misimi A Unit of Kalajyothi**

---

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

**PEER REVIEWED**

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

---

**misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com**
www.misimimonthly.com
YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## సెప్టెంబరు నెల సూచికలు...


సంపాదక బాధ్యతలు : అశ్వినికుమార్ ... 3

శ్వేతాశ్వతర ఉపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 9

లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 13

దేశ గ్రంథాలయ వ్యవస్థ : వి. వరదరాజు ... 16

అట్లాస్ కథ : టి.వి. ప్రసాద్ ... 18

పల్లె ఆటల ప్రశస్తి : ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు ... 23

వయొలిన్ విద్వాన్-ద్వారం దుర్గాప్రసాద రావు : సంభాషణ – **మిసిమి** ... ... 30

ఆరుద్ర నాటికలు- ప్రాసంగికత, ప్రయోగాత్మకత : డా. జె. నీరజ ... 44

ఓ బుల్లి దేశం – లిక్టెన్‌స్టైన్ : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 49

హృదయపుటాకలి – పైనాపిల్ జామ్ : డా. కె. శ్రీనివాసులు రెడ్డి ... 59

బాలారిష్టాలు : జూకంటి జగన్నాథం ... 62

అజంతా – శూన్యలిపి : జాని తక్కెడశిల ... 65

'నిట్టల' బుర్రకథ : కన్నీడి మనోహర్ ... 70

కురివికుళం సంస్థానం-పెమ్మసాని వారి ప్రస్థానం : డా. సగిలి సుధారాణి ... 73

కన్నీరు : శ్రీరామ్ ... 76


### అట్టమీద బొమ్మలు



అర్జున



ద్రోణాచార్య



అశ్వత్థామ



అభిమన్యు

పుట : *79* చూడండి

# సంపాదకుని బాధ్యతలు

**మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్ గారితో "సంపాదక బాధ్యతలు" అనే అంశంపై ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం గతనెలలో వారి పరిచయాన్ని ప్రసారం చేసింది. ఆకాశవాణి విశ్రాంత సహాయ సంచాలకులు సి.యస్.రాంబాబు వారితో జరిపిన ఆ సంభాషణ నుంచి కొన్ని భాగాలు **మిసిమి** పాఠకుల కోసం.

**రాంబాబు : అశ్వినీ కుమార్‌గారు నమస్కారం. పదిహేనేళ్ళుగా సంపాదకత్వం అనే ముళ్ళకిరీటం మోస్తున్నారు.. ఎలా అనిపిస్తోంది?**

**అశ్విని :** మీరన్నట్టు సంపాదకత్వం ముళ్ళ కిరీటమే. అదొక థాంక్ లెస్ జాబ్. మీరెంత పెర్ఫెక్ట్‌గా చేసినా, ఒక అచ్చు తప్పో, ఒక తప్పు తేదీయో.. అవే కనిపిస్తాయి పాఠకులకు. 99.99% కరెక్ట్‌గా ఉన్నా, పాఠకులకు ఆ .01% తప్పు మాత్రమే కనిపిస్తుందే అన్న బాధ కలుగుతుంది. కానీ నిజమే కదా. ఆ చిన్న తప్పు కూడా ఎందుకు దొర్లాలి. నూటికి నూరుశాతం కరెక్ట్‌గా ఉండాలి అని పాఠకుడు ఆశించటంలో తప్పులేదనిపిస్తుంది.. కానీ సంపాదకత్వంలో అది కుదరదండీ.. కంటెంట్ నుంచి కవర్ పేజి వరకు సమీక్షలు నుండి శీర్షికలు వరకు పాఠకులకు సంపాదకుడి పేరే కనిపిస్తుంది. కానీ సంపాదకుడు ఒక్కడే అన్ని పనులు చేయలేడు కదా. ఒక్క పనిచేయటానికి కూడా పెక్కుమంది సహాయం, సహకారం అవసరం. అక్కడే వస్తుంది సమస్య అంతా. మనం అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరగవు. ప్లానింగ్ .. ఎక్సిక్యూషన్ మధ్య ఉండేటటువంటి లోటు.. ఆలోటు ఎందుకంటే వాళ్ళు మనం అనుకున్నట్లు చేయరు. ఎందుకు చేయరు అంటే వాళ్ళకంత ట్రైనింగ్ ఉండకపోవచ్చు.. మనకున్న విజన్ వాళ్ళకి ఉండకపోవచ్చు..

**రాంబాబు : అంటే ప్లానింగ్ మంచి పేరు తెస్తుంది. ఎక్సిక్యూషన్ చెడ్డపేరు తెస్తుంది..**

**అశ్విని :** ఎవరు సరిగ్గా చేయకపోయినా చెడ్డపేరు సంపాదకుడికి వస్తుంది. ఉదాహరణకు ఒక సినిమా నిర్మాణంలో నటులు, టెక్నిషియన్స్ ఎందరో ఉన్నా, ఆ సినిమా బాగాలేకపోతే దర్శకుడినే అంటారు కదా. ప్రతినెలా పత్రిక మొదటి తేదీన బయటకు సరైన రూపంలో రావాలంటే, ఆ పత్రిక సంపాదకుడు ఇరవై నాలుగు గంటలూ, మూడొందల అరవై రోజులు ఆ పత్రిక గురించి ఆలోచించాల్సిందే. పత్రికను పర్ఫెక్ట్‌గా తీసుకురావాలంటే అదో కత్తిమీద సాములాంటిదండి. కాలం తెచ్చిన మార్పుల్లో ఒకటేమిటంటే ఎవరికీ దేనిమీద శ్రద్ధ ఉండటంలేదు. ఇది ప్రతి ఆఫీస్‌లో కనిపించే దృశ్యం.

**రాంబాబు : దినపత్రిక, వారపత్రిక, మాస పత్రిక.. వీటి నిర్వహణలో తేడాలెలా ఉంటాయి?**

**అశ్విని :** దినపత్రికలో వార్తలకే పెద్ద పీట వేస్తారు. ప్రూఫ్ రీడింగ్‌కు ఒక వందమంది ఉంటారు. ఇరవై నాలుగు గంటలూ శ్రమ పడతారు. దాంతో మనం పోల్చుకోలేం. అదే వారపత్రిక, ఒక వారం పూర్తవ్వగానే గిర్రుమని మరో సంచిక సిద్ధం అవుతుంది..

**రాంబాబు : మరి మాసపత్రిక నిర్వహణలో మీకు వెసులుబాటు ఉన్నట్టే కదా.**

**అశ్విని :** మాకు ముప్ఫై రోజులపాటు సమయం ఉంటుంది.. నిజమే. కానీ నాణ్యతలో చాలా తేడా ఉంటుంది. దినపత్రిక కాఫీ తాగుతూ చదివేసి పక్కన పడేస్తాం. వారపత్రిక ఆ వారంతో దానిని మర్చిపోతాం. మాసపత్రిక అలాకాదు. నెలంతా మీతో ఉంటుంది. ఎవరూ ఏ పత్రికను జీవితకాలం దాచుకోకపోవచ్చు. కానీ **మిసిమి** పత్రిక అలాకాదు. జీవితమంతా దాచుకునేవారు అనేకమంది ఉన్నారు. దానికోసమే మా కృషి అంతా. ఇందులో వచ్చే వ్యాసాల ఎంపిక, కలకాలం దాచుకునేట్టు చేస్తుంది. విషయపరంగా లోతైన వ్యాసాలు పాఠకులను అలరిస్తాయి.

**రాంబాబు : చాలా సంతోషకరమైన విషయం చెప్పారు అశ్వినీ కుమార్ గారు. ఒకమాట చెప్పండి. కరోనా సమయంలో ఎన్నో పత్రికలు మూతపడ్డాయి. కానీ మిసిమి మాత్రం ఒక సంచిక కూడా మిస్ కాకుండా వచ్చింది..**

**అశ్విని :** మీరన్నది నిజమే. క్రమం తప్పకుండా కరోనా సమయంలో కూడా మా పత్రికను తేగలిగామంటే, దానికి కారణం మా పత్రిక చక్రవర్తి పోషకులు కళాజ్యోతి యాజమాన్యం వారు. వారి దృఢసంకల్పం కారణం. ఇక నా విషయానికి వస్తే, లాక్ డౌన్ నెలరోజులు తప్ప, ఒక్కరోజు కూడా ఆఫీస్ మిస్ చేయలేదు. మా పాఠకులు చాలామంది మాకు **మిసిమి** పత్రిక ప్రాణవాయువు వంటిది అంటారు. వారికి ఆ ప్రాణవాయువు సక్రమంగా అందించాల్సిన బాధ్యత మాకుంది కదా.

**రాంబాబు : మీరందించే సంపాదకీయాల్లో ఒక ఒరవడి ఉంది.. అదేవిధంగా కంటెంట్ కూడా..**

**అశ్విని :** దినపత్రిక సంపాదకీయాలు రాజకీయాల చుట్టూ తిరుగుతాయి. వారపత్రికలకు సంపాదకీయాలు ప్రధానం కాదు. మా సంపాదకీయాలకు ఒక permenancy ఉంది. ఎందుకు రాయాలి, ఎవరి కోసం రాయాలి, ఎలాంటివి రాయాలి అన్న ప్రశ్న వేసుకుంటాను.. కంప్యూటర్, సెల్ ఫోన్ వచ్చాక సమాజంలో ఎన్నో అంశాలు మారిపోయాయి. కాలంతో పరుగులు తీస్తున్నాం. మన దైనందిన వ్యవహారాల్లో ఎంతో మార్పు వచ్చింది. ఇవాళ బ్యాంక్‌కు వెళ్ళటం మానేశాం. డబ్బు నగదు రూపంలో ఇవ్వడం మానేశాం. జీవితం ఆన్‌లైన్ మయమై పోయింది. ఆనందం మాయమై పోయింది. ఆలోచనా విధానం మారిపోతోంది. ముఖ్యంగా యువత ఆలోచనల్లో మార్పొచ్చింది. మనతరం వారికి ఇల్లు కొనుక్కోవడం ఒక కల.. సంసార బాధ్యతలు ఒక కీలకాంశం. వ్యక్తి సంసార బాధ్యత సమాజ నిర్మాణానికి మూలస్తంభం.ఇప్పటి యువత ఇల్లు కొనుక్కోవడం పట్ల ఆసక్తి చూపటం లేదు. పెళ్ళి గురించి ప్రస్తావిస్తే, అప్పుడే పెళ్ళా అంటున్నారు 35 ఏళ్లు వచ్చినా. ఈ ఆలోచనకు ఆడా, మగా తేడాలేదు. ఒకప్పుడు పెళ్ళి చేసుకుని, ఇల్లు కట్టుకోవడంపై పాటలున్నాయి.. అదో గురుతర బాధ్యత. అది ఇప్పుడెందుకు మారిందో మనం ఆలోచించాలి.. దృష్టి పెట్టాలి.. అమెరికా వారిలాగా కట్టూ, బొట్టూ మార్చుకుంటున్నాం.. ఎప్పుడైతే లైఫ్‌స్టైల్ అరువు తెచ్చుకున్నామో, బతుకే కాదు, ఆలోచనలూ మారిపోతున్నాయి. కో లివింగ్ కాన్సెప్ట్ కూడా దిగుమతయ్యింది. ఈ కో లివింగ్‌లో ఎమోషనల్ బాండేంజ్ ఉండదు. ఈనాడు మన జీవితంలో వచ్చిన ఈ మార్పులన్నింటినీ మేం సంపాదకీయాల ద్వారా, వ్యాసాల ద్వారా ప్రతిఫలిస్తున్నాం. **మిసిమి** కి వ్యాసాలు పంపే వారంతా ఆయా రంగాల్లో నిష్ణాతులు. ఇది సైకో అనాలిసిస్ అనండి.. సైకో ఫిలాసఫీ అనండీ.. ఏపేరయినా మీరు ఇవ్వొచ్చు.. సాంఘిక చరిత్ర అనండి.. వీటన్నిటినీ మేం కవర్ చేస్తున్నాం.. సాంఘిక చరిత్ర అంటే ఏమిటి.. సంఘం ఎలా మారుతూ వస్తోంది.. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఎలా ఉంది.. మానవ సంబంధాలు ఎలా ఉన్నాయి.. ఇదంతా సాంఘిక చరిత్ర.. జీవనశైలి కూడా అందులో భాగమే. ముప్పై ఏళ్ళనాడు బతికినట్టు ఇప్పుడెవరూ బతకటంలా.. అంతా నగరీకరణ అయిపోయింది.. సమస్యంతా నగరీకరణతోనే వస్తోంది.. నాగరికత ద్వారా అన్నింటినీ మనం మెరుగుపరచుకున్నాం. కానీ నాగరికత సమస్య ఏమిటంటే అది వ్యక్తి స్వేచ్ఛను హరించి వేస్తుంది. మనం తయారుచేసుకున్న నాగరికతకు మనమే బందీలమైపోతున్నాం. న్యాయవ్యవస్థ, ప్రభుత్వం అన్నీ నాగరికతలో భాగమే.. ఈ బందీ తత్వంలోంచి బయటపడటానికి మనం కథలు రాస్తున్నాం, కవిత్వం రాస్తున్నాం.. బొమ్మలేస్తున్నాం.. పాట పాడుతున్నాం.. అనేక పాట్లు పడుతున్నాం.. దేనికిదంతా అంటే ఆ స్వేచ్ఛ కోసం.. మహాకావ్యాలన్నీ ఇలా పుట్టినవే. వీటినన్నింటిని **మిసిమి** ప్రస్తావిస్తుంది .. పాఠకులను చైతన్యపరుస్తుంది..

ఇక మీరు కంటెంట్ గురించి అడిగారు. కంటెంట్ మేం ఐడెంటిఫై చేస్తామండీ.. తర్వాత దానిని చక్కగా పేపర్‌పై పెట్టగలిగే రచయితలను తయారుచేస్తాము.. తయారు చేస్తామంటే, ఆ అభిరుచి కలవారిని వెతికి పట్టుకుంటాం.. వారితో సబ్జెక్టు చర్చిస్తాం.. వారికో ఫ్రేంవర్క్ ఇస్తాం.. ముందు రాయలేమంటారు.. తర్వాత అర్థం చేసుకుంటారు. చక్కని వ్యాసాలందిస్తారు..అలాగే ఏ అంశాలు ఎంచుకుంటామంటే సంగీతం, చిత్రకళ, నాటకం.. ఇవన్నీ అనాదిగా మానవ జీవితాన్ని మారుస్తూ వస్తున్నాయి.వీటి గురించి

ఎవరూ రాయరు కానీ, మాకు ఇవి ముఖ్యమైన అంశాలు. ఉదాహరణకు చిత్రకళ మీద వ్యాసాలు రాసేవారికి ఆ అంశానికి సంబంధించిన పుస్తకాలిచ్చి, మేమేమీ అనుకుంటున్నామో చర్చించి, వారితో రాయిస్తాము.. దిన, వారి పత్రికల్లో ఇలాంటి అంశాలు కనిపించవు. ఎందుకంటే వారు పట్టించుకోరు.. భారతీయ చిత్రకళ, ప్రపంచ చిత్రకళ, ఐరోపా చిత్రకళపై కొన్ని సంవత్సరాలుగా మేము వ్యాసాలందిస్తున్నాము. ఆంగ్ల భాషలో అనేక పుస్తకాలొచ్చాయి.. కొన్ని అంశాలు మేము తయారు చేస్తాం. వాటిపై కొన్ని వ్యాసాలు శ్రీతంగెడ విశ్వేశ్వర ప్రసాద్, శ్రీ కోడూరు పుల్లారెడ్డి తయారు చేస్తారు. కొన్ని వ్యాసాలు ముక్తవరం పార్థసారథి తయారు చేస్తారు.. అలాగే చరిత్రపై చాలా పుస్తకాలు వచ్చాయి. అవన్నీ పాఠ్య పుస్తకాల కోసం రాసినవే. మేం ఒక కొత్త దృక్పథంతో రాయించాము. ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ గారని ఢిల్లీలో ఉండేవారు. ఆయనకు చరిత్ర అంటే ఆసక్తి. ఒకసారి ఆయనే మా దగ్గరకు వచ్చారు. ఆయనా, నేను కలిసి చర్చించి ముందు కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రతిఏటా ఇచ్చే పురస్కారం పొందిన రచయితల సాహిత్యం పరిచయం చేయాలనుకున్నాం.. పురస్కార సాహిత్యం పేరిట వ్యాసాలు ప్రచురించాం. అవన్నీ ఆ రచయితల వర్క్స్‌పై సుదీర్ఘ విశ్లేషణలతో కూడి ఉండిన వ్యాసాలు.. అలాగే చరిత్రకు సంబంధించిన వ్యాసాలు.. ఉదాహరణకు విజయనగర సామ్రాజ్య పరిపాలన రెండు వందల సంవత్సరాలు సాగితే మనం ఇరవై సంవత్సరాల కృష్ణ దేవరాయలు పాలననే ఉటంకిస్తాం.. ఎందుకు అన్న ప్రశ్న నాకు నేను వేసుకుని విజయనగర సామ్రాజ్యంపై వచ్చిన అనేక పుస్తకాలు తెప్పించాను.. ఆయనచేత ఆ డైనాస్టీ గురించి సవివరంగా రాయించాం.. అష్టదిగ్గజాలు రాసిందే మనకు తెలుసు.. అలా ఆ లోతుల్లోకి వెళ్ళాం.. ఒకసారి ఒక ఎయిర్పోర్ట్‌లో *Witness to World History* అనే పుస్తకం చూశాను. సంపాదకవర్గ సమావేశంలో ఈ పుస్తకం గురించి చర్చిస్తే తప్పకుండా తెలుగు పాఠక లోకానికి పరిచయం చేయాలన్నారు. అందులో కొన్ని చారిత్రక ఘటనలు చూసిన వారున్నారు.. వారు ఆ అనుభవాలను ఆ పుస్తకంలో చెప్పారు. అలాగే Ascent of Man మరో పుస్తకం. మానవ పరిణామాన్ని చెప్పే పుస్తకం. ఆ పుస్తకంపై వ్యాసాలను బొమ్మలతో సహా వేయించాం.. ఇవన్నీ శ్రీ ముక్తవరం పార్థసారథి రాశారు. ఇదేవిధంగా డా. రావెళ్ల రమేష్ గారి ప్రవాస సాహిత్యం, కిల్లాడ సత్యనారాయణ గారి బెనారస్ గురించి వ్యాసాలు వేసాము. **మిసిమి** పాఠకులు చాలామంది పుస్తకం అందాక ఫోన్ చేసి చెబుతారు. ఇవాళ ఇది చదివాను, రేపు ఇది చదువుతాను అంటూ. ఇదెందుకు చెబుతున్నానంటే, వారి ప్రేమను తెలిపేందుకు. జాగ్రత్తగా దాచుకుని చదువుకుంటారు. ప్రియంగా భద్రపరచుకుంటారు. **మిసిమి** పత్రిక వెనక ఇంత శ్రముందని మీద్వారా పాఠకులకు తెలియచేయాలన్నదే నా తపన.

**రాంబాబు : మిసిమిలో కథ, కవిత, సినిమా అంశాలు కనపడవెందుకని?**

**అశ్విని :** మాకు నిషిద్ధాక్షరాలు నాలుగున్నాయి. అవి రాజకీయాలు, కథ, సినిమా, వచన కవిత్వం.. ఎంత పెద్ద వారివయినా తీసుకోం.. అట్లా అనేకమంది లబ్ధప్రతిష్ఠులను నిరాశపరచాం. కొంతమంది రాజకీయ నాయకులు వారిని ఇంటర్వ్యూ చేయమని అడుగుతుంటారు. ఎందుకు వద్దనకున్నామో కూడా చెబుతాను. రాజకీయాలకు దినపత్రికలున్నాయి. కథలకు సండే అనుబంధాలు, వారపత్రికలున్నాయి. ఇక కవిత్వం ఎక్కడపడితే అక్కడ ప్రత్యక్షమవుతోంది. సినిమా గురించి చెప్పేదేముంది. మేము సత్యజిత్ రే పుస్తకాల గురించి రాయించాం కానీ, ఆయన సినిమా గురించి రాయలేదు. నాటకం గురించి తప్పకుండా శ్రద్ధ తీసుకుంటాం. గొల్లపూడి మారుతీరావు నాటకం గురించి అనేక వ్యాసాలు రాశారు. "లే మిసరబుల్స్" ఎందుకు బావుంది.. అగాథా క్రిస్టీ "మౌస్ ట్రాప్" యాభై ఏళ్లుగా ఎందుకు ప్రదర్శిస్తున్నారు.. వాళ్ళ నాటకాలు ఎందుకాడుతున్నాయి.. మన నాటకాలు ఎందుకు ఆడటం లేదు.. మనం నాటకాన్ని ఎలా చంపేసుకున్నాం.. ఇవన్నీ తెలియ చెప్పాలి అని మా తాపత్రయం. యూరోప్‌లో సినిమా లేదు. నాటకమే ఉంది. టిక్కెట్టు కొని వాళ్ళు నాటకం చూస్తారు. ఆ టికెట్ ఖరీదు డెబ్బై పౌండ్లు.

**రాంబాబు : సమీప చరిత్రకు మీరు ప్రాధాన్యం ఇస్తారు**

**అశ్విని :** అవునండీ.. ఉదాహరణకు మీరు, మీ నాన్న, మీ తాతగారు, మీ ముత్తాతలు వీళ్ళున్నారనుకుందాం. వాళ్ళు ఎంత కష్టపడుంటారు.. వాళ్ళు సంసారం ఏరకంగా ఈదారు.. ఇలా ప్రతి మనిషికి ఓ చరిత్ర ఉంటుంది. ఇవన్నీ ఇప్పటి యువత చదివితే వెనుకటి జీవితం వారికి తెలుస్తుంది. వారికి మారుతూ వస్తున్న జీవితం గురించి తెలుస్తుంది..

**రాంబాబు : పాతతరం వారి గురించి రాయిస్తున్నారు కదా..**

**అశ్విని :** ఎందుకు రాయిస్తున్నామో చెబుతాను. ప్రొఫెసర్ లక్ష్మీ అయ్యర్ చేత వేమన గురించి రాయించాము. ఆవిడకు నాలుగు భాషలొచ్చు. ఆవిడ రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీలో హిందీ ప్రొఫెసర్గా ఉన్నప్పుడు కబీర్ గురించి రాయించాము. రాజస్థాన్లో 350 కోటలున్నాయి. మనకు అన్నీ తెలియవు. అలా ఆ కోటల గురించి రాశారావిడ. వెయ్యేళ్ళ క్రితం తిరువళ్ళవార్ నైతికత గురించి చెప్పిన చిన్న చిన్న వాక్యాలను సందర్భసహితంగా రాయించాం.. ఈ రకంగా సబ్జెక్టుల నెంచుకుంటాం. అట్లాగే రచయితల నెంచుకుంటాం.. నేను పత్రిక సంపాదకుడి బాధ్యతలు తీసుకున్నప్పుడు నలుగురైదుగురు రచయితలు ఉండేవారు. వారిలో నేనొకడిని.. ఇవాళ **మిసిమి**కి వందమంది ఉన్నారు.. రచయితలను తయారు చేయలేం.. తెలుగు ప్రొఫెసర్లు, ఇంగ్లీష్ ప్రొఫెసర్లతో చర్చించి, ఈ సబ్జెక్టు మీరు రాస్తే బావుంటుందని చెప్పి పుస్తకాలిచ్చి, హోంవర్క్ చేయించి, మంచి వ్యాసాలను వారినుంచి రాబడుతున్నాం.. వాళ్ళు కూడా ఈ ప్రాసెస్ బాగా ఎంజాయ్ చేస్తారు.. ఒక పేజీ రాయాలంటే వంద పేజీలు చదవాలి. మాది క్రియేటివ్ వర్క్ కన్నా విమర్శ, పరిశీలన. **మిసిమి** ట్యాగ్ లైన్ “చింతనాత్మక సారస్వతం”.. సాహిత్యం అందులో ఒక భాగం. చదివే ప్రతి వ్యాసం ఆలోచింప చేస్తుంది. ఎందుకీ వ్యాసం వేశారు అని పాఠకుడు ఆలోచిస్తాడు. ఇక సంపాదకీయాలంటారా.. మన సాహిత్యం కానీ, సారస్వతం కానీ గతాన్ని ఆశ్రయించి ఉంటుంది. వర్తమానంలో ఉండం.. మనం వర్తమానంలో ఉన్నామా అని ఒక ఎడిటోరియల్ రాశాను. మనం వర్తమానంలో లేమనే అందరూ చెప్పారు. ఈ పత్రికను వర్తమానంలో నిలబెట్టాలి, ఎలాగా అని నాకు నేను వేసుకున్న ప్రశ్న. దానికి ఇప్పుడున్న మనుషులను ఇంటర్వ్యూ చేయాలి. అంటే దారిన పోయే వ్యక్తుల్ని ఇంటర్వ్యూ చేస్తామని కాదు. ఒక 80, 90 ఏళ్ళు బతికిన వ్యక్తులను ఇంటర్వ్యూ చేస్తే వారు ఏం చెప్తారో విందాం అనుకున్నాను.. ఈ ఇంటర్వ్యూస్ మొదలు పెట్టిన తర్వాత అవి చాలా పాపులర్ అయ్యాయి .. చాలామంది మమ్మల్ని ఎందుకు చేయట్లేదు అని అడుగుతున్నారు.. కారణం అవి ఒక వర్తమాన చరిత్రను రికార్డు చేస్తున్నాయి. వర్తమానం చరిత్ర అవదు కానీ వర్తమానాన్ని భవిష్యత్ తరం కోసం డాక్యుమెంట్ చేస్తున్నాం. మిగిలిన వారు ఇంటర్వ్యూలు చేయటం లేదా అంటే చేస్తున్నారు, కానీ మేం చేసే పద్ధతి వారికి భిన్నంగా ఉంటుంది.. డబ్బు సంపాదించడమే సక్సెస్ అనుకోవడం తప్పు.. మనిషి ఆనందంగా, ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. అలాంటి వారిని మేము ఎంచుకుంటాం.

భగవద్గీతలో కృష్ణుడు ఎప్పుడూ అలెర్ట్గా ఉండమని హెచ్చరిస్తాడు! అంటే జాగరుకుడవై ఉండు అని చెప్పాడు.. అదే బుద్ధుడు ఎరుకలో ఉండు అని చెప్తాడు.. అంటే కృష్ణుడు జాగ్రత్తలో ఉండు అని చెప్పాడు, బుద్ధుడు స్పృహలో ఉండు అని చెప్పాడు.. రెండూ గొప్ప విషయాలే. ఇవన్నీ మాకు దారి చూపేవే.

**రాంబాబు : మిసిమి సంపాదకీయాల లాగానే మిసిమి కవర్ పేజీలు కూడా ఎంతో ప్రాచుర్యం పొందాయి ..**

**అశ్విని :** మా కవర్ పేజీలు అన్నీ కూడా ఆర్ట్ వే అయి ఉంటాయి .. ఫోటోగ్రఫీ ఉండదు. ఫోటోగ్రఫీ కూడా మాకు నిషిద్ధాక్షరే కానీ దాని గురించి అప్పుడు చెప్పలేదు .. దేనికంటే లోపల మేము ఫోటోగ్రఫీకి సంబంధించిన అంశాలు వేస్తాం. **మిసిమి** కవరు పేజీలు ప్రధానంగా సౌందర్యాన్ని చూపేవి అయి ఉంటాయి.. అది ప్రకృతి సౌందర్యం కావచ్చు.. మనిషి సౌందర్యం కావచ్చు.. స్త్రీ సౌందర్యం కావచ్చు..




వాటికి చక్కటి క్యాప్షన్‌ని జత చేస్తాం .. మీకు చిన్న కథ చెప్తాను. ఒకసారి ఒక పల్లెటూరు నుంచి నాకు ఒక పెద్దాయన ఫోన్ చేశారు "ఏవండీ **మిసిమి** పత్రికలు వస్తున్నాయి గాని పైన కవర్ పేజీ ఉండట్లేదు" అని చెప్పారు. ఆయనే ఒక నెల రోజుల తర్వాత ఫోన్ చేశారు.. ఆయన ఏం చెప్పారంటే "సార్ నేనొక పెళ్లికి వెళ్లాను అక్కడ ఒకాయన ఈ మిస్సయిన **మిసిమి** కవర్ పేజీలను ఫ్రేమ్ కట్టించి పెళ్లిలో బహుమతిగా ఇచ్చారండి" అని చెప్పారు.. ఇది ఎందుకు చెప్తున్నాను అంటే **మిసిమి** కవర్ పేజీలకు ఉన్నటువంటి పాపులారిటీ గురించి పాఠకుల దృష్టికి తీసుకొద్దామని.. ఇప్పటికీ నెలకు ఒకరిద్దరు అన్నా నాకు ఫోన్ చేస్తారు.. **మిసిమి** కవర్ పేజీ హై రిజల్యూషన్‌తో పంపిస్తారా, ఫ్రేమ్ కట్టించుకోవడానికి అని చెప్పి రిక్వెస్ట్ చేస్తారు.

మేము యాత్ర కథనాలు కూడా **మిసిమి**లో ఒక భాగంగా ప్రచురిస్తున్నాం.. ఎందుకంటే మనిషి తనను తాను తెలుసుకోవటానికి ప్రయాణాలు చేయాలి. ఆ ప్రయాణాల గురించి వ్యాసాలు వేస్తున్నాం.. డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి రావు గారు తన ప్రవృత్తిలో భాగంగా అనేక దేశాలు తిరుగుతున్నారు. ఆయన లండన్‌లో ఉండేటువంటి సైక్రియాటిస్ట్ .. కానీ ఆయన అనేక దేశాలు తిరుగుతూ ఆ విశేషాలన్నీ ఇంగ్లీష్‌లో రాస్తున్నారు.. అట్లూరి జయశ్రీ గారు **మిసిమి** కోసం వాటిని తెలుగులోకి అనువదిస్తున్నారు అవి కూడా పాఠకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అలాగే డా. పురుషోత్తమాచార్య గారు తెలుగు సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతం గురించి మాకు వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలకు గత సంవత్సరం జాతీయ చలనచిత్రోత్సవ పురస్కారం లభించింది. ఒక వేదికను వారితో కలిసి పంచుకున్నప్పుడు రేడియోలో వచ్చిన లలితసంగీత పాటల గురించి మాకు రాయమని కోరాను. అంటే ఆ పాట నేపథ్యం, పుట్టు పూర్వోత్తరాలు వివరించమని అడిగాను. అవన్నీ **మిసిమి**లో వ్యాసాలుగా వచ్చాయి ఇటీవల ఆ వ్యాసాలు "లలిత సంగీత పరిమళం" పుస్తకంగా ఆవిష్కరించారు.

**రాంబాబు : ఒక మాట చెప్పండి మీ పాఠకులు ఏ వయసు వారు అంటే మీ మిసిమి చదివే పాఠకులు ఏ వయసు వారు..?**

**అశ్విని :** నేను సంపాదకుడిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు 60 ఏళ్లు దాటినవారే మా పాఠకులుగా ఉండేవారు.. ఇప్పుడు మా పాఠకులు వయసు 40ఏళ్ళకు తగ్గించాను అని నేను అనుకుంటున్నాను.. అది ఎందుకు అంటే పత్రికను వర్తమానంలో ఉంచడం వల్ల. సంగీతం గురించి చెప్పడంవలన, పెద్దవారి ఇంటర్వ్యూలు వేయటం వల్ల, ఒక సోషల్ హిస్టరీ మేము తెలియచేయడం వల్ల ముఖ్యంగా రీసెర్చ్ చేసేటటువంటి విద్యార్థులు మా పాఠకులవుతున్నారు. వాళ్లు కూడా **మిసిమి**కి తమవంతుగా కాంట్రిబ్యూట్ చేయగలుగుతున్నారు.

**రాంబాబు : ఇంకా మీరు మిసిమిని ఎలా తీర్చి దిద్దాలి అనుకుంటున్నారు?**

**అశ్విని :** కంటెంట్ పరంగా మార్పులు ఉండకపోవచ్చండి కానీ **మిసిమి** రచయితలుగా మాత్రం రీసెర్చ్ స్కాలర్స్‌ను తీర్చిదిద్దాలి అని అనుకుంటున్నాను..

**రాంబాబు : అయితే పెద్ద తరం వారికి మాత్రం మీరు అన్నట్టు మీ పత్రిక ప్రాణవాయువు లాంటిది.. యంగ్ జనరేషన్‌ని కూడా మిసిమిని పాఠకులుగా చేస్తే మరింతగా ఒక బ్యాలెన్స్ ఒక సమన్వయం చేకూరుతుందేమో.**

**అశ్విని :** ఒకరిద్దరూ పెద్ద తరం పాఠకుల గురించి మీకు చెప్పాలి.. వి.ఎస్.ఆర్. మూర్తి గారు గురించి మీరు వినే ఉంటారు.. ఆయన ఒక సైంటిస్టు.. ఒక ఆధ్యాత్మికవేత్త. ఆయన అప్పుడప్పుడు ఫోన్ చేసి

ఏమంటారంటే .. మీ **మిసిమి**ని చదవటం లేదండి అధ్యయనం చేస్తున్నాను అంటారు, అదో పెద్ద కాంప్లిమెంట్ కదా మాకు.

**రాంబాబు :** **మిసిమి అంటే "చింతనాత్మక సారస్వతం" అంటూ ఆ వారసత్వాన్ని, వర్తమానాన్ని కలిపి కొనసాగిస్తున్నారు..**

**అశ్విని :** వారసత్వాన్ని వర్తమానంలోకి తీసుకువచ్చి కొనసాగిస్తున్నాం.. అలాగే సంపాదకత్వం 24/7 బాధ్యత..

**రాంబాబు :** **సంపాదకత్వం ఎందుకు ఒక ముళ్ళ కిరీటం అవుతుందో చెబుతూనే ఒక బాధ్యతగా అది నిరంతర జ్వలనమై మిమ్మల్ని నడిపిస్తూ ఉండటం అభినందనీయం అశ్వినీ కుమార్ గారు ధన్యవాదాలు..**

**అశ్విని :** రాంబాబు గారు శ్రోతలకు మరో విషయం కూడా చెప్పాలి. శ్రీమాన్ పప్పు వేణుగోపాలరావు గారు మీకు తెలుసు - మన దురదృష్టం వారిప్పుడు లేరు. వారు **మిసిమి**కి అపురూపమైన కంట్రిబ్యూషన్ చేశారు. ఒకటి - భారతీయ నాట్యరీతులు అస్సాం నుంచి కేరళ వరకూ - సోదాహరణగా రాసారు - అలాంటివి తెలుగులో ఎప్పుడూ రాలేదు. **మిసిమి**లో ప్రచురితమైన నాట్యరీతులన్నీ నృత్యభారతి పేరుతో శ్రీ చెన్నూరు ఆంజనేయ రెడ్డి గారు చాలా విలువైన పుస్తకంగా తీసుకు వచ్చారు. రెండోది - శ్రీ వేణుగోపాల రావు గారు ఉపనిషత్ ఉద్యానవనము శీర్షికన ఉపనిషత్తుల సారాన్ని సామాన్య పాఠకులకు అర్థమయ్యేరీతిలో సరళంగా రాసి ఇచ్చారు - మూడు ఉపనిషత్తులు రాసే సమయానికి వారికి మృత్యువు ముంచుకొచ్చింది. ఇప్పుడవి వియన్నరావు గారు పూర్తి చేశారు.

**మిసిమి** పాఠకులు అయిన ఆచార్య హరినాథ్, మైసూరులో ఉంటారు. ఒకసారి నాతో మాట్లాడారు. ఆయన సంస్కృతాంధ్ర పండితులు - వారిని భర్తృహరి సుభాషితాలు, ఏనుగు లక్ష్మణ కవి - అనువాదం రెండు పుటలు రాయమని అడిగాను. ఆవిధంగా భర్తృహరి **మిసిమి**లో కనపిస్తున్నారు. ఇలాంటివి చాలా వున్నాయి. మీ రేడియోవారు అంత సమయం ఇవ్వరు. మరోసారి మాట్లాడుకుందాం - శ్రోతలకు నా నమస్సులు. ధన్యవాదాలు రాంబాబు గారు.

*(ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం సౌజన్యంతో)*

---

**క్యాబ్ వెతలు :** సాయంత్రం అయిదు అవుతోంది, మెట్రో దిగి హైటెక్ - మై హోమ్ దగ్గర నిలబడి కాబ్ బుక్‌చేసాను. ఇక్కడ మిలియూ చూడాలి - ఒకప్రక్క హైటెక్కులు - మరోప్రక్క గుడి మొక్కులు - రహదారి టిక్కుటిక్కులు- అన్ని కలిసిన సాయంత్రపు సిటి ట్రాఫిక్కు - అప్పుడే వచ్చి ఆగాడు రమేష్ - బాగున్నావా రమేష్ అని అడిగి పిన్ చెప్పాను - పిన్ ఎంటర్ చేసి నావంక తిరిగాడు - గడ్డం పెరిగే వుంది - బుగ్గలు పీక్కుపోయాయి - కళ్లల్లో వెలుగు ఎక్కడో వుంది - సార్ మీ పాదాలకు నమస్కారం - హైద్రాబాద్ వచ్చి ఇనేళ్లయింది. ఈమాట ఎవరూ అడగలేదు - సార్! అని కొంచెం ఉద్వేగంతో అన్నాడు - సరేసరే పద అని సర్ది చెప్పాను - బండి పోనిస్తూ - సార్ మీరు అడిగారు కనుక చెప్తున్నాను - ఏమి బాగోలేదు సార్ - వారం నుంచి జ్వరం వస్తోంది, రెండు రోజుల్నుంచి డ్యూటీకి వస్తున్నాను - ఇ.ఎమ్.ఐ కట్టాలి కదా - అరె డాక్టరు దగ్గరకు వెళ్లావా - మందులు వేసుకుంటున్నావా - అన్నాను. వెళ్లాను సార్ టాబ్లెట్‌లు వేసుకుంటున్నా - కొద్దిగా బెటర్ కాని పూర్తిగా తగ్గలేదు - అయినా మందులు వాడుతూ బండి తోలకూడదు సార్ - మనుష్యుల్నే నమ్మలేం - మందుల్ని ఎట్టా నమ్ముతాం? చెక్కర కొడితే - మీకు నాకు ఇబ్బందే కదా - అంటూ జాగ్రత్తగానే పోనిస్తున్నాడు - ఇంతలో మాకు ఎడంపక్క నుంచి ఒక లేడీ డ్రైవర్ వెళ్తోంది- సార్ వీళ్లని అసలు నమ్మకూడదు అటు చూస్తూ ఇటు పోనిస్తారు - చాలాసార్లు జరిగింది - అని దూరంగా పోనిచ్చాడు - అమ్మా నాన్న ఊళ్లో వుంటారు - డ్వాక్రా లోను తీసుకుని కట్టలేదు - పది తప్పాను - లెక్కల్లో - నేనే కూలీనాలీ చేసి తీర్చాను - చదువు అటకెక్కింది - ఏదో చేద్దాం అని ఇక్కడకు వచ్చాను - అతను అరగంట సేపు మాట్లాడుతూనే వున్నాడు - **దేశంలో చాలా దుఃఖం వుంది.** ఇంతలో ఆశ్రమం చేరాము - ఇదిగో మందులు కొనుక్కో అని రెండువందలు ఇచ్చి - దిగాను. అతని కళ్ళల్లో ఫ్లాష్‌తో నన్ను ఫొటో తీశాడు - రమేష్!



# శ్వేతాశ్వతర ఉపనిషత్తు

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు

**ఈ** ఉపనిషత్తు కృష్ణ యజుర్వేదానికి చెందినది. దీనిని శ్వేతాశ్వతర ఋషి తన శిష్యులకు బోధించినట్లు చెప్పబడింది. కాలక్రమాన అనేక మంది గ్రంథకర్తలు మరిన్ని విషయాలను దీనితో జత చేసినట్లు పలువురి అభిప్రాయం. అందుచేత విషయపరంగాను, శైలిచేత కొంత అసంబద్ధత ఉన్నట్లు తోస్తుంది. ఏమైనప్పటికి ముఖ్యమైన ఉపనిషత్తులలో ఇది కూడా ఒకటి. అర్థం ప్రకారం శ్వేత అంటే తెల్లనిది, శుభ్రమైనది లేదా స్వచ్ఛమైనది. అశ్వతరము అంటే గుర్రాలు లాగే బండి లేదా కోడెదూడ అని కూడా చెప్పబడింది. వేదాంతపరంగా అశ్వతరాన్ని ఇంద్రియ నిగ్రహానికి సంబంధించిన అంశంగా చెప్పవచ్చు. ఈ ఉపనిషత్తు మొత్తం ఆరు అధ్యాయాలుగా ఉన్నది. దీనిలో మొత్తం 113 శ్లోకాలు ఉన్నాయి. ఈ ఉపనిషత్తు ఎక్కువ భాగం కవితా నిర్మాణ శైలి కలిగి ఉంది. అయితే కవితా నిర్మాణంలో ఒక క్రమ పద్ధతి అంతగా గోచరించదు. అందుచేత ఈ ఉపనిషత్తులో జోడింపు ఎక్కువగా ఉన్నదని పలువురి అభిప్రాయం. విషయపరంగా గమనిస్తే ఉపనిషత్తు యొక్క ప్రాధాన్యాన్ని తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. శ్వేతాశ్వతరోపనిషత్తు కొద్ది మంది బ్రహ్మవేత్తలు లేదా మహనీయుల జిజ్ఞాస ఫలితంగా కొన్ని ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నంగా సాగుతుంది.

ఆ ప్రశ్నలు ఏవనగా

కిం కారణమ్ బ్రహ్మ ?

కుతః స్మ జాతా ?

జీవా (నా)మ కేన ?

క్వ చ సం ప్రతిష్టితా ?

అధిష్టితాః కేన సుఖేతరేషు వర్తామహే–బ్రహ్మ విదో వ్యవస్థామ్?

1. ఈ ప్రపంచము సృష్టించబడడానికి కారణము ఏది? అసలు ప్రతి చర్యకు ఒక కారణం ఉండవలెనా?
2. ఈ సృష్టికి కారణం బ్రహ్మమా? లేక మరేదైనా ఉందా?
3. బ్రహ్మమనగా ఏమి ?
4. ఈ సృష్టి అంతా ఎవరి చేత కల్పించ బడుతున్నది?
5. ఈ జీవుడు ఎవరు? ఎవరి వలన జన్మిస్తున్నాడు? ఎవరి శక్తిచే చరిస్తున్నాడు?
6. సృష్టికి ముందు జీవులందరు ఎక్కడ ప్రతిష్టితమై ఉన్నారు? ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ప్రళయంలో ఎక్కడ ఉంటారు? జగత్తు లేకపోయినా జీవులు మనుగడ సాగిస్తాయా ?
7. జీవులకు సుఖదుఃఖాలను కలిగిస్తున్నది ఎవరు?
8. ఎందుచేత మనుషులు జీవిస్తున్నారు? వారి అంతిమ విశ్రాంతి స్థలం ఎక్కడ?
9. సృష్టిలో వేదన (Suffering) ఎందుకు ఉన్నది? దానిని ఎవరు కలుగజేస్తున్నారు?

పైన పేర్కొన్న ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నంగా ఈ ఉపనిషత్తు కూర్చబడింది. ఈ ప్రయత్నం లోనే అనేకసిద్ధాంతాలు, వాదాలు పరిగణన లోనికి తీసుకొన్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగా కాలవేత్తలు, లోకాయతుకులు, నియతివాదుల, మీమాంసవాదుల, ప్రకృతివాదుల, నిరీశ్వరవాదుల, బ్రహ్మవేత్తల అభిప్రాయాలు, దృక్కోణాలు చర్చించబడ్డాయి.

**సృష్టి కారణము :** దీని విశ్లేషణతో ఈ ఉపనిషత్తు యొక్క మొదటి అధ్యాయం మొదలౌతుంది. ఇంతకు ముందు చెప్పినట్లుగా దీనికి సంబంధించి అనేక వాదాలు వెలుగు చూసాయి. కాలవాదుల ప్రకారం కాలమహిమ చేత సృష్టి జరిగింది. దీనికి ఎవ్వరూ కారణం కాదు. లోకాయతుల ప్రకారం ఈ ప్రపంచం దాని యొక్క స్వభావం చేత జనిస్తున్నది, ప్రవర్తిస్తున్నది. సత్యవాదుల ప్రకారం జగత్తు పంచభూతములైనటువంటి భూమి, జలము, అగ్ని, వాయువు మరియు ఆకాశముల సమ్మేళనం వలన ఏర్పడింది. వేదాంతుల ఉద్దేశ్యంలో ఆత్మ యొక్క స్వీయ కల్పితము. అందుచేతనే శ్వేతాశ్వతరోపనిషత్తు స్వీయ జ్ఞానాన్ని, స్వీయ క్రమశిక్షణను ప్రోత్సహిస్తుంది. దీని ప్రకారం స్వస్వరూపమే పరమాత్మ. ఏ విధంగానైతే వెన్న పాల మొత్తంలో వ్యాపించి ఉంటుందో అదే విధంగా పరమాత్మ లేదా బ్రహ్మం నీ యందే వ్యాపించి ఉన్నాడు. అసతోమా సద్గమయ. అసత్యాన్ని రూపుమాపి సత్యాన్ని తెలుసుకోవడమే స్వీయ జ్ఞానం.

**సర్వాజీవే సర్వ సంస్థే బృహంతే,**
**అస్మన్ హగ్ం సో భ్రామత్యే బ్రహ్మచక్రే**
**పృథక్ ఆత్మానమ్ ప్రేరితారమ్ చ మత్వా**
**జుషః తతః తేన అమృతత్వమేతి**

సర్వ జీవులకు, సర్వమునకు సంస్థానమైనట్టిది, బృహత్తరమైనది, ప్రేరణ అయినది అగు ఈ జీవుడు బ్రహ్మ చక్రంలో నివశించుచూ అనేక రకాలుగా సంచారం సలుపుచున్నాడు. ఈ విధంగా సంచరించుచున్నది తానేయని, భోక్తను, భోగించబడునది, భోగము కూడా తానేయనే జ్ఞానము పొందుటయే స్వీయ జ్ఞానము. క్షరము

(నశించునది లేదా మార్పు చెందునది, దీనినే మాయ అని కూడా పేర్కొంటారు), అక్షరము (మార్పు చెందనిది, స్థిరమైనది), హరుడు (అజ్ఞానాన్ని హరించేవాడు, పరమాత్మ) అన్నీ తానే అయి ఉన్నాననే భావన బ్రహ్మ జ్ఞానాన్ని కలిగిస్తుంది.

**సర్వవ్యాపినమ్ ఆత్మానమ్**
**క్షీరే సర్పిరివ అర్పితమ్**
**ఆత్మవిద్యా తపో మూలం**
**తత్ బ్రహ్మోపనిషత్ పరమ్ ॥**
**తత్ బ్రహ్మోపనిషత్ పరమ్ ॥ఇతి॥**

సర్వ వ్యాపితమగు ఆత్మ, పాలలో వెన్న వలె అంతటా వ్యాపించి ఉన్నది. ఆ పరబ్రహ్మమే పొందవలసిన శాశ్వత వస్తువు. ఇతర వస్తువుల వలన ఏమీ ఉపయోగం లేదు. ఈ విధమైన వివరణతో మొదటి అధ్యాయయం ముగుస్తుంది.

**మనస్సును, ఇంద్రియాలను కట్టడి చేసే సాధనంగా యోగా:** ఇంద్రియాల పైన, మనస్సు పైన అదుపు సాధించడానికి యోగ సాధనను ఏ విధంగా ఉపయోగించవచ్చునో ఈ ఉపనిషత్తులోని రెండవ అధ్యాయయం తెలియజేస్తుంది. అంతిమ సత్యము లేదా పరమాత్మను తెలుసుకోవడంలో ఇవి అడ్డుపడుతున్నాయనే భావనతో ఇది మొదలౌతుంది. కాబట్టి మనస్సును ఇంద్రియ లోలత్వం నుండి మరలిస్తూ, ఓంకార స్వరూపుడైన పరమాత్మను ధ్యానించాలి. ఇట్టి సాధనకు యోగధారణ సరైనదని చెప్పబడింది. శిరస్సును, కంఠమును, శరీరమును సమానముగా, నిలువుగా, నిశ్చలముగా నిలుపుకొని మనస్సును హృదయము నందు ప్రతిష్ఠించాలి. ఈ సందర్భంలో సమస్తము ఆత్మ ప్రదర్శనమే అనే విషయాన్ని స్వానుభవములోనికి తెచ్చుకోవాలి. ఈ విధమైన అనుభూతి పొందడానికి వీలుగా యోగ సాధన ఏ విధంగా చేయాలి అన్న వివరణ విపులంగా ప్రస్తావించ బడింది. దీని వలన ఏ విధమైన ప్రయోజనం కలుగుతుంది అన్న విషయాన్ని ఈ క్రింది శ్లోకం తెలియజేస్తుంది.

**లఘుత్వం, ఆరోగ్యం, అలోలుపత్వం,**
**వర్ణప్రసాదం, సర్వసౌష్ఠవం చ**
**గంధః శుభోమూత్రపురీషం అల్పమ్,**
**యోగ ప్రవృత్తిం ప్రథమాం వదంతి॥**

యోగాభ్యాసము యొక్క ప్రభావం చేత మొదట శరీరం మృదువుగాను, ఆరోగ్యంగాను, అందంగాను తయారవ్వడమే కాకుండా, దేహమంతా సుగంధ భరితమవుతుంది. అట్లే మూత్రము, పురీషము దుర్గంధ రహితమవుతాయి. ఈ విధమైన లక్షణాలతో, సర్వ బంధముల నుండి విముక్తి పొందుచూ, బ్రహ్మతత్వమును తెలుసుకొనుటకు యుక్తుడై ఉంటాడు.

**యదా ఆత్మతత్త్వేన తు బ్రహ్మతత్వం దీపోపమే**
**న ఇహ యుక్తః ప్రపశ్యేత్**
**అజమ్, ధృవగ్ం సర్వ తత్త్వైః విశుద్ధమ్**
**జ్ఞాత్వా దేవమ్ ముచ్యతే సర్వ పాశైః॥**

పైన తెలిపిన విధంగా యుక్తుడైన మానవుడు, క్రమంగా బ్రహ్మతత్వము నందు లీనమై, ఆత్మ స్వరూపుడై సర్వపాశముల నుండి విముక్తుడౌతాడు.

**రుద్రుని యొక్క స్వరూపము :** శ్వేతాశ్వరోపనిషత్తు మూడవ అధ్యాయంలో రుద్రుడు అంటే పరమాత్మ యొక్క స్వరూపాన్ని విశదీకరించడం జరిగింది. దీనికి సంబంధించిన శ్లోకం ఈ విధంగా ఉంది.

**ఏకోహిరుద్రో న ద్వితీయాయతస్థుః**
**యః ఇమామ్ లోకాన్ ఈశత ఈశనీభిః ।**
**ప్రత్య జనాం తిష్ఠతి (ఈ) సంచుకోచ**
**అంతకాలే సగ్ంసృజ్య విశ్వాభువానాని గోపాః ॥**

రుద్రుడు ఒక్కడే. అతనికి ద్వితీయమనునది లేదు. ఆయనే లోకమంతా దృశ్యరూపుడై ఉన్నాడు. జగత్తును సంరక్షిస్తూ, ప్రళయ కాలమందు తనలోనే విలీనం చేసుకుంటాడు. అనేక బాహువులు, పాదములు, ముఖములు కలిగి సర్వవ్యాపి అయి ఉన్నాడు. ఏ విధముగా విశ్వమునంతా వ్యాపించి, సర్వజీవుల యందు అంతర్యామిగా ఉన్నాడో అటువంటి ఈశ్వరుని తెలుసుకుంటారో, వారు మృత్యువును అధిగమించి అమృతత్వాన్ని పొందుతారు.

**తతః పరం బ్రహ్మ, పరం బృహంతమ్,**
**యథా నికాయం సర్వ భూతేషు గూఢమ్**
**విశ్వస్యైకం పరివేష్ఠితారమ్**
**ఈశమ్ తం జ్ఞాత్వా అమృతా భవంతి ॥**

ఈ భావనను మరింత ముందునకు తీసుకొని పోవుచూ, ఈ ఉపనిషత్తు ఈశ్వరుని ఈ విధంగా వర్ణిస్తుంది.

**యస్మాత్ పరమ్ న అపరమ్ అస్తి కించిత్**
**యస్మాత్ న అణీయో నజ్యాయో అస్తి కశ్చిత్**
**వృక్ష ఇవ స్తబ్ధో, దివి తిష్ఠతి ఏకః**
**తేన ఇదమ్ పూర్ణమ్ పురుషేణ సర్వమ్॥**

ఎవరైతే పరము, అపరము లేని వాడై ఉన్నాడో, ఎవరి సమక్షంలో అణువు, అతి పెద్ద వస్తువు వేరుగా కానరాదో, జగత్తును నిర్వహిస్తూనే వృక్షము వలె స్థబ్దుడై ఉన్నాడో, అట్టి పరమాత్మ చేతనే జగత్తంతా పూర్ణమై ఉన్నది. అట్టి పరమాత్మను తెలుసుకొన్నవాడు, జనన-మరణ రహితునిగా అమృత స్వరూపుడై ఉన్నాడు.

**జీవాత్మ-పరమాత్మల సంబంధం :** పర బ్రహ్మమే జీవాత్మ - పరమాత్మలుగా ప్రకాశితముగుచున్నది. జన్మరహితము,

ఏకము అయిన పరమాత్మయే అనేక జీవాత్మల రూపుదాల్చి కార్యాలను జరిపిస్తాడు. దీనికి సంబంధించి ఈ ఉపనిషత్తులో ఒక ఆసక్తికరమైన కథ చెప్పబడింది. ఒక వృక్షము పై రెండు పక్షులు స్నేహ భావంతో, అన్యోన్యంగా నివశిస్తున్నాయి. ఒక పక్షి వృక్షము యొక్క ఫలములను ఆరగిస్తూ, దాని కొమ్మలు, శాఖలపై ఎగురుతూ, ఆడు కుంటున్నది. రెండవ పక్షి మాత్రం దేనినీ అనుభవించక మౌనంగా మొదటి పక్షిని వీక్షిస్తూ ఉన్నది. ఈ కథలో వృక్షము దేహము. మొదటి పక్షియే జీవుడు. రెండవ పక్షి పరమాత్మ. జీవుడనే మొదటి వ్యక్తి స్వీయ కల్పితమగు అనుభూతులలో, మోహ బంధంలో చిక్కుకొని ఈశ్వర తత్త్వాన్ని ఏమరచి ఉన్నాడు. ఈ విధంగా జీవుని-పరమాత్మల మధ్య సంబంధం చాలా అందంగా వివరించ బడింది.

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా**
**సమానం వృక్షమ్ పరిష స్వజాతే**
**తయోః అన్యః పిప్పలగ్ం స్వాద్వత్**
**అనశ్నన్ అన్యో అభిచాక శీతి ।**

ఆ విధంగా జీవునితో అన్యోన్యమైన బంధం నెరపే పరమాత్మ ఏక స్వరూపుడు, అవర్ణుడు, భేద భావం లేనివాడు అయి ఉన్నాడు.

**య ఏకో అవర్ణో బహుధా శక్తి యోగాత్**
**వర్ణాన్ అనేకాన్, నిహితార్థో దధాతి**
**విచ ఏతి చ అంతే విశ్వమ్ ఆదౌ సదేవాః**
**స నో బుద్ధ్యా శుభయా సంయునక్తు ॥**

అతడే అగ్ని స్వరూపుడు, ఆదిత్యుడు, వాయువు, చంద్రుడు, అమృత స్వరూపుడు అయి ఉన్నాడు. అతడే జీవనాధారమగు జలము, రస స్వరూపుడు, సృష్టికర్తయగు ప్రజాపతి అయి ఉన్నాడు.

**ఛందాగ్ంసిః యజ్ఞాః క్రతవో వ్రతాని**
**భూతం-భవ్యం యత్ చ వేదా వదంతి ।**
**తస్మాత్ మాయీ సృజతే విశ్వమేతత్**
**తస్మిగ్ంశ్చ అన్యో మాయయా సన్నిరుద్ధః ॥**

ఆ విధమైన పరబ్రహ్మము నుండియే చతుర్వేదములు, యజ్ఞములు, క్రతువులు, భూత, భవిష్యత్, వర్తమాన కాలములు జనించుచున్నాయి. అతడే తన మాయాశక్తి చేత విశ్వమంతా ఆవరించి యున్నాడు. ఈ మాయయే ప్రకృతి స్వరూపము. ఈ మాయ ఎవరిదో అతడే ఈశ్వరుడు.

**సూక్ష్మాతి సూక్ష్మమ్ కలిలస్య మధ్యే**
**విశ్వస్య స్రష్టారమ్ తమ్ అనేక రూపమ్ ॥**
**విశ్వస్య ఏకమ్ పరివేష్టితారమ్**
**జ్ఞాత్వా శివమ్ శాంతిమ్ అత్యంతమ్ ఏతి ॥**

లోకాలన్నింటిని ఆక్రమించి కూడా సూక్ష్మాతి సూక్ష్మమై ఉన్నవాడు, అనేక రూపములను ధరిస్తూ విశ్వమునంతటిని సృజించినవాడు, పర్యవేక్షించేవాడు శివుడే అయి ఉన్నాడు. అట్టి శివుని తెలుసుకున్న జీవుడు, శివుడే అవుతాడు.

**విద్య-అవిద్య :** ఈ రెండింటి మధ్య గల భేదాన్ని వివరించడంతో ఈ ఉపనిషత్తు యొక్క అయిదవ అధ్యాయం మొదలవుతుంది. అది ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పబడింది.

**ఓం ద్వే అక్షరే బ్రహ్మపరేతు అనంతే**
**విద్యా అవిద్యే నిహితే యత్ర గూఢే**
**క్షరంతు అవిద్యా హి । అమృతం తు విద్యా ।**
**విద్యా-అవిద్యే ఈశతే అస్తు సో అన్యః ॥**

విద్య అంటే నాశనము లేనిది, క్షయము కానిది, అమృతమైనది. అవిద్య అంటే మృతమైనది, క్షయమయ్యేది. విద్య అంటే పరమాత్మను ఎరిగి ఉండటం. అవిద్యతో నిండియున్న వానికి జీవుని యొక్క రూపం స్త్రీయా లేదా పురుషుడా అనే సందేహం కలుగుతుంది. రెండూ కాదనేది విద్య. ఐహికమగు భౌతిక దేహము, మోహము లేదా మాయ మాత్రమే అన్నది సరైన విద్య. జీవుడు ఒక దేహమును ఆశ్రయించి, అన్న పానాదులు స్వీకరించి, శరీర పోషణ చేస్తూ ఉంటాడు. కొంతకాలం తరువాత దేహం శిథిల స్థాయికి చేరుకొన్నప్పుడు, జీర్ణమమైన వస్త్రమును త్యజించినట్లుగా, వేరొక దేహాన్ని ఆశ్రయిస్తాడు. ఈ విధమైన జనన-కర్మ-మరణ చక్రబంధాన్ని ఏ జీవుడైతే ఛేదించగలుగుతాడో, అతడు పరమాత్మను పొందుతాడు. ఈ సందర్భంలో చెప్పబడినదే ఈ క్రింది శ్లోకం.

**అనాది-అనంతమ్ కలిలస్య మధ్యే**
**విశ్వస్య స్రష్టారమ్ తమ్ అనేక రూపమ్**
**విశ్వస్య ఏకమ్ పరివేష్టితారమ్**
**జ్ఞాత్వాత్ ఏవమ్ (జ్ఞాత్వాదేవం) ముచ్యతే సర్వపాశైః॥**

ఎవరైతే తన యొక్క సహజ రూపమగు మహదాత్మను గ్రహిస్తాడో, అతడు సర్వ పాశముల నుండి విముక్తుడు కాగలడు.

**విశ్వము-జీవాత్మ-ఈశ్వరుడు :** ఇంతకు ముందు పేర్కొన్న అయిదు అధ్యాయములలోని విషయ సంపదకు శిఖరాగ్రమనదగిన చర్చ ఉపనిషత్తు యొక్క చివరి అధ్యాయమైన ఆరవ భాగంలో చేయబడింది. ఈ ఉపనిషత్తు ప్రకారం విశ్వం మొత్తం ఆవరించి ఉన్నవాడు, జ్ఞాన స్వరూపుడు, కాల నిర్ణయం చేయువాడు, గుణి స్వరూపుడు, సర్వజ్ఞుడు పరమాత్మ ఒక్కడే. అతడే ఈశ్వరుడు.

**యేన ఆవృతమ్ నిత్యమ్ ఇదగ్ం హి సర్వమ్**
**జ్ఞః కాలకాలో గుణీ, సర్వ విద్యః**
**తేన ఈశితమ్ కర్మ వివర్తతే ఇహ**
**పృథ్వీ-ఆపః తేజో అనిల ఖాని చింత్యమ్॥**

అటువంటి పరమాత్మ యొక్క ఆలోచనలే క్రియా శీలకంగా మారి జీవుని కర్మబద్ధుని చేస్తున్నాయి. కాబట్టి ఈ కర్మ బంధములను త్రెంచుకొని ఎవరైతే పరమాత్మను ఆశ్రయిస్తారో వారు మోక్షం లేదా ముక్తిని పొందగలుగుతారు.

**ఆరభ్య కర్మాణి గుణాన్వితాని**
**భావాగ్ంశ్చ సర్వాని వినియోజయేద్యః**
**తేషామ్ అభావే కృతకర్మ నాశః**
**కర్మక్షయే యాతి స తత్వతో అన్యః**

అందుచేత విజ్ఞులగువారు ఈశ్వరుని ఈ విధంగా కీర్తిస్తారు.

**న తస్య కశ్చిత్ పతిః అస్తి లోకే?**
**న చ ఈశితా, నైవ చతస్య లింగమ్।**
**న కారణమ్ కరణాధిప అధిపో,**
**న(స) చ అస్య కశ్చిత్ జనితా న చ అధిపః॥**

లోకములన్నింటికి ప్రభువైనట్టి, లింగరహితుడైనటు వంటి, కార్య-కారణ-కారణాధిప రహితుడైనటువంటి ఈశ్వరుని ఉపాసించవలెను. విశ్వమునకు కర్త, విశ్వమును ఎరిగినవాడు, జీవులందరికి సృష్టిస్థానమైనవాడు, జ్ఞాన స్వరూపుడు, సృష్టి-స్థితి-లయకారకుడు అయినటువంటి ఈశ్వరుని చేతనే విశ్వమంతా నిండియున్నది. అందుచేత అతడే సర్వగతుడు, పరిపాలకుడు, నిత్యుడు. ఈ విధమైన జ్ఞానం జీవాత్మను పరమాత్మ వద్దకు చేరుస్తుంది. స్వస్తి !

**ఆచార్య కోదాటి వియ్యన్నరావు**
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
గుంటూరు, చరవాణి : 7093260655

## కమ్మతెమ్మెర

**'మిసిమి'** ముసిముసిగా నవ్వుతూ నెల నెలా ముంగిట ప్రత్యక్షమయ్యే రోజు నాకు పిండివంటలతో నిండిన పండుగ రోజు. నెల నెలా పరుచుకునే ఈ వెన్నెలతో, నెలంతా నాకు పండగ సందడే. పత్రిక రాగానే చూసేది మెరిసే ముఖచిత్రం సొగసులూ, మిగతా మూడు అట్టలపై అలరారే అందాల పద చిత్రాల పదనిసలూను. మరి ఇక చూస్తూ చదివి పులకించే, సూచికల విశేషాలు: కమ్మ తెమ్మెరల కబుర్లు, జీవనమకరందం, మురిపించి మనసును ఆకట్టుకునే అంతులేని ఆనందాన్ని అమోఘమైన సాహిత్య పరిమళాలు అందించే సంభాషణల ఇంటర్వ్యూ పర్వం, గుబాళించే వివిధ సంగీత పరిమళాలు, గతజల సేతు బంధనం లాంటి సాహిత్య విశేషాలు, విజ్ఞాన యాత్రా కథనాలు ఇలా ఎన్నని? రాస్తూంటే మరో **మిసిమి** సూచిక సంచికే అవుతుంది. దశాబ్దంపై నుండి **మిసిమి** సన్నిధి నాకు అంతులేని పెన్నిధిలా మారింది. అప్పట్నుంచీ వన్నె తరగని, వసివాడని **మిసిమి** పరిమళం ఎప్పుడూ నిత్య నూతనం. ఇక్కడ నాకో మీమాంస. ఏ నెల కా నెల **మిసిమి** సౌరభాలు ఆస్వాదించి ఆఘ్రాణించి అనుభవిస్తూ ఆనందించాలా (లేక) ఏటేటా పుస్తక ప్రదర్శనలో వార్షిక సంచిక సముదాయాలు కూడగట్టుకోవాలా? రెండూ చేస్తే పోలా? అని అదే చేస్తున్నాను. తర్వాత, మీ ప్రచురణలో వెలువరించి పంచే సాహిత్య వ్యాసాల, విశేషాల పుస్తక ప్రపంచం మరో అయస్కాంతం. అపుడెపుడో ఎమెస్కో వారి 'ఇంటింటా గ్రంథాలయం' గుర్తుంది, ఇపుడింటింటా '**మిసిమి** మాయాజాలం' మళ్ళీ కమ్ముకొస్తోంది. నేను ఇప్పటి వరకు రాసిందీ లేదు రాయబోయేదీ అనుమానమే. కానీ నాకు చెలి, నెచ్చెలి జీవన సహచరి **మిసిమి** సారస్వత సర్వస్వమే. ఇవన్నీ నావే కదా. ఇవే నాకు దారి దీపికలు, దిశా సూచికలు, నా విజ్ఞానఖని **మిసిమి**. చివరగా నాదో సూచన, సలహా, సందేహం. **మిసిమి** సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ నుండి, నేటి **మిసిమి** గ్రంథాలయ సంభాషణలు, ప్రత్యేక (బెంగళూరు, విజయవాడ వెళ్లి మరీ) సంభాషించిన అపూర్వ సమావేశ కబుర్లు, ఈ మధ్యే జరిగిన బహుముఖబెనారస్ ఆవిష్కరణల దాకా అన్నీ అపురూపమే. వేరే చోట కెళ్ళి ప్రముఖులను పలకరించి ఆ పులకరింతలు పంచుకునే ప్రయాణాలు మీరు మాత్రమే ఉంచుకుని, మీ కార్యాలయంలోనూ ఈ హైదరాబాదు నగరంలోనూ జరిగే, జరగబోయే సమావేశాలూ సంభాషణల వివరాలు ముందుగా తెలియ చేసే అవకాశం, అదృష్టం ఉందా? కనీసం పుస్తక ఆవిష్కరణల సభలకీ కొన్ని సమావేశాలకీ లోకల్‌గా వుండే నాలాంటి వాళ్లకు (పోనీ **మిసిమి** లోకల్ పాఠకులకి) ఇలాంటి అపూర్వ సమావేశాలలో శ్రోతగా, ప్రేక్షకుడిగా పాలు పంచుకునే అవకాశం ఉంటుందా? ఎందుకంటే ఆ ప్రత్యక్ష సమావేశం కబుర్లు మరునాటి **మిసిమి**లో చదువుకున్నప్పుడు చేసే పునశ్చరణ ఊహకే అందని అపురూప సంపద. ఇలాంటి అద్వితీయ సమాగమాలలో నాలాంటి వాళ్ల శ్రోతగా మాత్రమే ఊహించగలను. దానికి మాత్రమే అర్హుడని అనుమానం. ముందుగా తెలిస్తే అది ఒక జాక్ పాట్ అనుకుంటాను. అది కూడా అవకాశం ఉంటేనే స్మీ !!కొంచెం ఎక్కువ చొరవ తీసుకున్నాననిపిస్తే మన్నించగలరు.




***- పులుగుర్త వెంకట కృష్ణారావు, హైదరాబాద్ ఫోన్ : 9000777220***

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

**– డా. ఎమ్. పురుషోత్తమాచార్య**

**17. తెప్పవోలె చంద్రబింబము**

రచన : మల్లవరపు విశ్వేశ్వరరావు

సంగీతం : మహాభాష్యం చిత్తరంజన్

గానం : మహాభాష్యం చిత్తరంజన్



**జంఝూటి–త్రిశ్ర ఏక**

**తెప్పవోలె చంద్రబింబము**
**తేలిపోతూ ఉంది నింగిని ॥తెప్ప॥**
**అందులో నా ముద్దుల ప్రేయసి**
**ఉంది కాబోలు, ప్రేయసి ఉంది కాబోలు ॥తెప్ప॥**

1. లేత చిరునవ్వెందుకో సిగ
   లోన వెన్నెల మల్లెలెందుకో
   చేతి సైగలు చేసి నన్నటు
   చేరరమ్మనుటెందుకో,ఎందుకో ఎందుకో ॥తెప్ప॥
2. గడ్డిపువ్వును నన్ను ప్రేయసి
   గాలి తరగల తేలిపోతూ
   కళ్ళలో అద్దాల మెరుగులు
   చల్లి కలచెదవెందుకో,ఎందుకో ఎందుకో ॥తెప్ప॥
3. ముత్తెములొ రత్నాలొ ఏరుతు
   చిత్రమవునా మబ్బు కదలిని
   అర్ధచంద్రుడి దోనెలోనే
   ఆడుకుంటా వెందుకో,ఎందుకో ఎందుకో॥తెప్ప॥

సైన్సు వేరు, కవిత్వం వేరు. ఈ రెండు పరస్పరం విభేదిస్తాయి. సైన్సు ప్రకారం కవిత్వం ఉండదు, కవిత్వం ప్రకారం సైన్సు జరగదు.'చంద్రుడు ఒక ఉపగ్రహం' వంటి విషయాలు, వివిధాకారాలలో కనిపించేవి పర్వతాలు, గుంటలు అనే వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తరువాత కూడా కవి తన భావకవిత్వంతోనే ఆనందింపజేయడం మానుకోలేదు. అది ఒక కళాధర్మం.

అయితే, శ్రీశ్రీ వంటి మహాకవులు సైన్సును కూడా కవితాధర్మాలలోకి మళ్ళించి చక్కని పాటలు వ్రాశారు. 'ఆకాశంలో చీకటి లేదు,ఆలయాలలో వెలుతురు లేదు' (దేవుడు చేసిన మనుషులు) అంటూ వాస్తవాలను చెబుతూనే చీకటి వెలుగులను అజ్ఞాన, విజ్ఞానాలకు ప్రతీకలుగా, కవితాత్మకంగా వాడుకున్నారు. 'తెప్పవోలె' పాటలో కవి అర్ధచంద్రుడిని భావుకదృష్టితో దర్శిస్తున్నారు. నెలవంకను తెప్పగా, దోనెగా పోలుస్తూ అది ఆకాశమనే సముద్రంలో హాయిగా ప్రయాణిస్తున్నట్లుగా ఊహిస్తున్నారు. అంతేకాదు, ఆ పడవలో తన ప్రేయసి కూడా ఉందని భావిస్తూ ఆనందంగా పాడుకుంటున్నారు.

చిరునవ్వే చిన్న నవ్వు. అది మరీ లేతది యట. అంటే చిరుచిరు నవ్వన్న మాట! ఆమె తనను చూసి నవ్వుతున్నది. ఆమెతోపాటు సిగలోని మల్లెలు కూడా నవ్వుతున్నాయట. "నల్లని జడలో మల్లెపూలు నీ నవ్వున కద్దము చూపేను" (సిరిసంపదలు) పాటలో కూడా ఇదే భావం కనిపిస్తుంది. ఇదొక సాదృశ్యం. అలా ఆమె ఎందుకు నవ్వుతున్నదో ఊహించుకుని భావుకుడు మురిసిపోతున్నాడు. ఇది చాలదన్నట్లు ఆమె చేతి సైగలు కూడా అతన్ని కవ్విస్తున్నాయి. ఇంతటి అతిలోకమైన ప్రేయసికి తాను గడ్డిపూవులాంటి వాడనని వినయంగా చెబుతూ. తన కళ్ళలోకి ఆమె మెరుపులు పంపిస్తున్నదంటే ఇది శుభాహ్వానం కాక మరేమిటి, అని అనుకుంటున్నాడు. అయితే, ఈ చిరుపడవ ప్రయాణిస్తున్నది ఆకాశసముద్రంలో కాదు, మబ్బుకడలిలోనట. చంద్రుడిని కప్పివేస్తున్న మబ్బులనే సముద్రంగా పోలుస్తూ ఆ దోబూచులాటను పడవ ప్రయాణంగా భావించడం గొప్ప అందమైన ఊహ. మబ్బుల కడలిలో ముత్యాలను, రత్నాలను ఆమె ఏరుకుంటున్నదట. అందుకే 'చిత్రమవు' అంటూ మబ్బు కడలిని విచిత్రంగా మలుచుకున్నారు. భావుకుడు తనను తాను గడ్డిపువ్వుగా సంభావించుకోవడం ఒక విశిష్ట నిరాడంబర సౌందర్యం. ప్రేయసిని మాత్రం చందమామ అంత అందమైన, ఉన్నతమైన వ్యక్తిగా వర్ణించడం తనలోని పవిత్రప్రేమభావానికి తార్కాణంగా చెప్పవచ్చు. అటువంటి ప్రేమతత్త్వమంతా రంగరించి ప్రయోగించిన పదం 'ముద్దుల ప్రేయసి'. పల్లవి, చరణాలలో యతిని, ప్రాసయతిని

వీలు ప్రకారం ప్రయోగిస్తూ వచ్చారు. చంద్రబింబం, ప్రేయసి, రత్నాలు, చిత్రం, అర్ధచంద్రుడు అనే పదాలు తప్ప మిగతా పాటంతా తీయని తేటతెలుగు పదాలతో ముచ్చటగా సాగిపోయింది.

మల్లవరపు విశ్వేశ్వరరావుగారు (1906-1986) భీమవరం తాలూకాలోని 'ఉండి' అగ్రహారంలో జన్మించారు. కవిగానే కాక, స్వాతంత్ర్య సమరయోధునిగా, పాత్రికేయునిగా కూడా ప్రసిద్ధి పొందారు. వీరు రవీంద్రనాథ ఠాగూరు నిర్వహించిన 'శాంతినికేతన్' లో విద్యాభ్యాసం చేశారు. వీరి రచనలు "చిత్రాంగద, మధుకీల, కల్యాణ కింకిణి, విశ్వకవి, అరవిందుల కర్మధార, రవీంద్ర వ్యాసావళి" మొదలైనవి. ఈ పాటను స్వరకర్త చక్కని జానపదస్పర్శ కలిగిన జంఝూటి రాగంలో, త్రిశగతిలో బాణీ చేశారు. తన జీవితాన్నంతా లలితసంగీతసేవలోనే గడిపిన చిత్తరంజన్‌గారు ఈ పాటను తానే స్వరపరచుకుని సుమధురంగా గానం చేశారు. వీరు రజని, మంచాల జగన్నాథరావు, పాలగుమ్మి విశ్వనాథం మొదలైన మహనీయుల దగ్గర చేరి సంగీతంలోని మెలకువలు తెలుసుకుంటూ వారి స్వరరచనలను అలవోకగా ఆలపించడం అభ్యసించారు. కులదైవం, స్వర్ణగౌరి వంటి నాలుగైదు సినిమాలలో కూడా తన కమ్మని కంఠాన్ని వినిపించారు. ఆకాశవాణిలో మ్యూజిక్ కంపోజర్‌గా వేలాది పాటలకు బాణీలు,బిట్‌వర్కులు సమకూర్చారు.

పాట ప్రారంభంలో వీణ, వయొలిన్‌లతో మూడు ఆవర్తాల బిట్టునందించి పంచమం దగ్గర వదిలేశారు. పల్లవిని రిషభం నుంచి సమంలో ఎత్తుకున్నారు. ఒకసారి పాడాక వీణపై ఒక ఆవర్తం బిట్టునిచ్చి 'రిగమపా' అని అందించగా పల్లవిని మళ్ళీ పాడారు. వెంటనే వాద్యాలు దాన్ని రిపీట్ చేశాయి. అప్పుడు 'అందులో' అనే పాదాన్ని అందుకుని 'కాబోలు' దాకా పాడారు. తరువాత లయవాద్యం టక్కున ఆగిపోగా 'ప్రేయసి ఉంది కాబోలు' ను సాకీలాగా పాడారు. ఇది పాడుతున్నప్పుడు కూడా అంతర్లయ సాగుతూనే ఉంది. గిటార్ బీటింగ్ లాంటి వీణానినాదాన్ని లీలగా వినిపించాక పల్లవిని అందుకున్నారు. మొదటి చరణానికి ముందు రెండు ఆవర్తాలతో బిట్టునిచ్చి,'రిగమపా' అని వదిలేశారు. ఆ పంచమం నుండి 'లేత చిరునవ్వెందుకో' అంటూ రెండు పాదాలను పాడారు. చిన్న బిట్టును ఇచ్చాక మళ్ళీ ఆ పాదాలనే మార్పు లేకుండా పాడారు. మిగిలిన రెండు పాదాలను రెండుసార్లు పాడుతూ 'చేరరమ్మను' దగ్గర చక్కని సంగతిని వినిపించారు. తరువాత పల్లవిని 'కాబోలు' దాకా మామూలుగానే పాడారు. రెండో చరణానికి ముందు కూడా బిట్‌వర్కును మొదటి చరణంలాగానే ఇచ్చారు. మిగతా భాగమంతా ఏ మార్పూ లేకుండా మొదటి చరణంలాగానే పాడారు. మూడవ చరణానికి ముందు బిట్‌వర్కు యథాతథంగానే ఉంది. 'చిత్రమవునా, ఆడుకుంటూ' పదాల దగ్గర మాత్రం అవరోహణా గమకాన్ని నునులేత స్వరాలతో ఒద్దికగా, సుందరంగా వినిపించారు. చివరకు పల్లవిని 'కాబోలు' దాకా పాడి పాటనంతటిని ముగించారు.

### 18. నల్లనివాడా నే గొల్లకన్నెనోయ్

**రచన : వింజమూరి శివరామారావు**
**సంగీతం : ఎస్.హనుమంతరావు**
**గానం : ఆర్.బాలసరస్వతి**



**కల్యాణి-ఏక**

**నల్లనివాడా నే గొల్లకన్నెనోయ్**
**పిల్లనగ్రోవూదుమోయ్ నా**
**యుల్లము రంజిల్లగా** ॥నల్ల॥

1. నీ తీయని పాటలకై
రేతిరి ఒంటిగ వచ్చితినే
నా మనసు, తనువు
నా మనికే నీదిగదా ॥పిల్లన॥ ॥నల్ల॥

2. ఆకసాన మబ్బులని
చీకటులే మూగేననీ
నేనెరుంగనైతిని
నీ తలపే వెలుంగాయె॥పిల్లన॥ ॥నల్ల॥

3. మెరుపే నీ దూతికయై
వలపే నా నెచ్చెలియై
తోడి తెచ్చె నీ దరికే నాడు
పండె నా నోములు ॥నల్ల॥

నల్లనయ్య శ్రీకృష్ణుని ప్రేమకై వేచియున్న గోపిక పాడుతున్న పాట ఇది. శ్రీకృష్ణుని విరహానలజ్వాలల్ని భరించే ఓపిక లేని ఆ గోపిక పరుగు పరుగున వెళ్ళి మధురాతి

మధురమైన ఆయన మురళీరవళిని ఆస్వాదించడానికి ఆత్రపడుతున్నది. ఆ తీయని పాటను వినాలని వచ్చి తన తన బ్రతుకును ఆయనకు అంకితమిస్తున్న శరణాగతి, మధురభక్తితత్త్వం ఈ పాటలో నిండుగా వినిపిస్తున్నది. మబ్బులు క్రమ్మాయని, చిమ్మచీకటి అని ఏమాత్రం తెలుసుకోలేని ఒక పరాధీన తత్త్వంతో దరిజేరి శ్రీకృష్ణునిపై తలపు కలగడమే తనకు వెలుగుగా దారి చూపిందని గ్రహించింది. మబ్బుల్లోని మెరుపే కృష్ణుని దూతిక అని, అతనిపై తన ప్రేమయే ఒక చెలికత్తె అని, అవే తనను ఇక్కడికి తీసుకువచ్చాయనే పరమార్థాన్ని తెలుసుకుని మురిసిపోతున్నది. పల్లవిలో, మొదటి చరణంలో ప్రాసను చక్కగా పాటించారు. రెండవ చరణంలో కొంత ప్రాసను, కొంత యతిని అనుసరించారు. మూడవ చరణంలో యతి, ప్రాసలేవీ స్వీకరింపక అంత్యప్రాసను,స్వేచ్ఛావిహారాన్ని ప్రదర్శించారు. 'రంజిల్లు మనసు, తనువు, దూతిక' పదాలు తప్ప మిగతా పాటంతా స్వచ్ఛమైన తెలుగు నుడికారాల పోహళింపులతో సుమధురంగా సాగిపోయింది.

పాట ప్రారంభంలో రెండు ఆవర్తాల బిట్‌వర్క్‌ను అందించి ఆధారషడ్జమం దగ్గర వదిలేశారు. అప్పుడు గాయని కల్యాణి రాగంలోని గాంధారం నుండి ఒక అక్షరకాలం వదిలి పల్లవిని ప్రారంభించారు. నాలుగు పంక్తులూ పాడాక చిన్న బిట్టు ఇచ్చారు. వెంటనే పల్లవిని మళ్ళీ పాడగా మరో చిన్న బిట్టు అందించారు. మొదటి చరణానికి ముందు రెండు ఆవర్తాలలో బిట్‌ను అనాహతపద్ధతిలో అందించి ఆధారషడ్జమంలో ముగించగా 'నీ తీయని' ని అదే అనాహతపద్ధతిలో అందుకున్నారు. మూడవ పాదంలోని 'తనువు' దగ్గర 'వు' మీద నుండి 'మపగపదనిస' అనే బిట్టునిచ్చారు. చరణం అంతా ఒక్కసారి మాత్రమే పాడి 'పిల్లనగ్రోవూదుమోయ్' నుంచి పాడారు. తరువాత చిన్న బిట్టు ఇచ్చాక పల్లవి అందుకున్నారు.

రెండవ చరణానికి ముందు బిట్‌వర్క్‌ను కొద్దిగా మార్పు చేసి రెండు ఆవర్తాలలో ఇచ్చి గాంధారం దగ్గర వదిలేశారు. అప్పుడు అదే గాంధారం నుండి 'ఆకసాన' ను ఒక అక్షరం జాగా వదిలి అందుకున్నారు. 'మూగెనసీ' దగ్గర చక్కని గమకాన్ని పొదిగారు. అలాగే 'తలపే వెలుంగాయెను' ను కూడా చక్కని అనుస్వరంతో పాడారు. పాట మొత్తం మీద 'నల్లనివాడా' ను ఎత్తుకోవడానికి 'పగారీసా రిగామాపా' స్వరాలను పదే పదే బిట్టుగా వినిపించి పాటకు మంచి అందాన్ని చేకూర్చారు.

చరణాల బాణీలను, బిట్‌వర్క్‌ను వైవిధ్యంగా చూపడం ఇందులో ప్రముఖంగా వినిపిస్తుంది. మూడవ చరణం ముందు బిట్ ఎత్తుగడను అనాహతంగానే తీసుకుని బాణీ పోకడను మార్చేశారు. మూడు ఆవర్తాల తరువాత మొదటి అక్షరం మీద గాంధారంపై వదిలేలాగా ఆ అక్షరాన్ని వదిలి, 'మెరుపే' ను అక్కడినుంచే అందుకుని గాయని కొంత దీర్ఘంగా పాడే పద్ధతితో చరణాన్ని ప్రారంభించారు. 'నెచ్చెలియై' దగ్గర 'నిదాపా మదపమగరిసా' అనే స్వరాలతో చిన్న బిట్టు ఇచ్చారు. తరువాత 'తోడి తెచ్చె' ను సమంలో అందుకుని, 'పండె నా నోము' ను అక్షరం జాగా వదిలి పాడారు. 'నోములు' దగ్గర చిన్నపాటి సంగతిని వినిపించి పల్లవిని అందుకున్నారు. ఒకసారి పాడాక 'నల్లనివాడా' దగ్గర పాటను ముగించారు.

ఈ పాటలోని కొన్ని ముఖ్యవిశేషాలు చెప్పుకోవాలి.

1. ఏ చరణాన్నీ రిపీట్ చేయకపోవడం.
2. ప్రతి చరణం చివర 'పిల్లనగ్రోవూదుమోయ్' ను అందుకోవడం.
3. మొదటి,రెండు చరణాల చివర 'నల్లనివాడా' వరకే పాడడం.
4. మూడు చరణాల బాణీల్లోనూ, బిట్‌వర్క్‌లోనూ చక్కని వైవిధ్యాన్ని చూపడం.

హనుమంతరావుగారి మనోహరమైన స్వరకల్పనా హృదయాన్ని బాగా అర్థం చేసుకున్న బాలసరస్వతిగారు తన మృదుమధుర కంఠస్వరంతో పాటకు ఎన్నో జిలుగులను, నగిషీలను సమకూర్చారు.

ఈ ఇద్దరి ప్రతిభాసంపదకు దోహదం చేసినది రచన. దాన్ని నిర్వహించినది వింజమూరివారు. ఈ ముగ్గురూ ధన్యమూర్తులు. వీరందరి ప్రావీణ్యాన్ని నిలబెట్టిన వాద్యకళాకారులు గొప్ప అదృష్టవంతులనే చెప్పాలి. పాడి పల్లవిని అందుకున్నారు. ఒకేసారి పల్లవిని పాడి మొత్తం పాటను ముగించారు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

# దేశ గ్రంథాలయ వ్యవస్థ

– వి. వరదరాజు

గొప్ప సాహిత్య సంపద, సంస్కృతిక వారసత్వాలతో పాటు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో గ్రంథాలయాలకు చెదలు పడుతున్నాయి. ఇది విచారకర పరిణామం. దేశావ్యాప్తంగా 54,854 గ్రంథాలయాలు వున్నాయి. వాటిలో అతి తక్కువ మాత్రమే ఆధునికత సంతరించుకొన్నాయి. ప్రభుత్వ గ్రంథాలయాల్లో సగటు పుస్తకాల సంఖ్య 5700 కాగా, అభివృద్ధి చెందిన దేశాల్లో లక్షా 8 వేల పుస్తకాలు వున్నాయి. పన్నెండు శాతం లైబ్రరీల్లో కంప్యూటర్లు ఉన్నాయని, వాటిలో కొన్నింటికి మాత్రమే ఇంటర్నెట్ వసతి వుందని 2018 యూనిస్కో ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టేటస్టిక్స్ రిపోర్ట్ పేర్కొంది. ఈ వ్యవస్థలో 12 లక్షల మంది పని చేస్తున్నారు. కానీ వీరిలో వృత్తి పరమైన అర్హతలు వున్నవారు కేవలం పది శాతం మందే. ఇది మన గ్రంథాలయ వ్యవస్థ పరిస్థితి.

పిల్లల్లో చదివే ఆసక్తి పెంచడానికి కేంద్ర సంస్కృతిక మంత్రిత్వ శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్ సాయంతో ఈ పుస్తకాలయం ఇటీవల ప్రారంభించింది. దీనిలో వెయ్యి పాఠ్య పుస్తకేతర "ఈ" పుస్తకాలను 22 భాషల్లో ప్రారంభించింది. ఇది అమిత ప్రశంసనీయమైన కార్యక్రమం. కానీ ఇదొక చాలా చిన్న కార్యక్రమం. మనకు ఇంకా చాలా భాషలున్నాయి. పైగా పాఠశాలలన్నిటికీ ఇంటర్ నెట్ వసతి లేదు. మనది ప్రపంచంలోనే అత్యధిక యువత వున్న దేశం. వీరి శక్తి యుక్తులు పూర్తి స్థాయిలో దేశానికి అందాలంటే వారికి మంచి శిక్షణ అవసరం. అందుకు గ్రంథాలయాలు అత్యంత ముఖ్యం. పిల్లలు, యువత, పెద్దల విజ్ఞాన అవసరాలు వేరు వేరుగా ఉంటాయి. అంతర్జాతీయ పోటీ ప్రపంచ అవసరాలకు ధీటుగా జ్ఞాన సముపార్జన అవకాశాలను అన్ని తరాల వారికి సుగమం కావించాలి.

భారీ స్థాయిలో తాళపత్ర నిధులు దేశంలో వున్నాయి. వివిధ భాషల్లో, వివిధ అంశాల్లో ఉన్న అమూల్య జ్ఞాన నిధి సేకరించారు. ఇవి మన పురాతన సంస్కృతీ సౌరభాలు. జాతీయ మెన్స్రిప్ట్ సేకరణా బృందాలు దేశం నలు చెరగుల నుండి సేకరించిన వాటిలో 75 లక్షల తాళ పత్రాలను డాక్యుమెంట్ చేశారు. ముప్పై లక్షల పత్రాలను కంప్యూటరీకరించి నేషనల్ మెన్స్రిప్ట్ పోర్టల్లో పొందు పరచారు. వీటిని పరిశోధకులకు, ఔత్సాహికులకు అందుబాటులో ఉంచాలి. అలాగే ప్రఖ్యాత అంతర్జాతీయ రచయితల రచనలు, వాటి అనువాదాలు కూడా పాఠకులకు అందివ్వాలి. విషయం చాలా ముఖ్యం. వివిధ అంశాలు జాగ్రత్తగా ఎంపిక చేయాలి. ఈ బుక్స్, ఆడియోలు, గ్రాఫిక్ నవలలు, మల్టీ మీడియాలకు నేడు ప్రాధాన్యత బాగా పెరిగింది. అదే స్థాయిలో స్థానిక సమాజ సంగతులు ప్రతిబింబించే స్థానిక కథా రచయితల కథలు, మండలికా లను ఆదరించాలి. అంతేకాకుండా సాంకేతిక ఖాళీని పూరించడానికి ఉచిత వైఫై వసతి కల్పించాలి. కంప్యూటర్ ల్యాబ్లో పాఠకులకు శిక్షణ ఇవ్వాలి. అప్పుడే సామాన్యులందరు సాంకేతికత ఉపయోగించగలరు.

లైబ్రరీలల్లో రచయితల, వక్తల ఉపన్యాసాలు, కవితా గోష్టులు నిర్వహించడం వలన పద సౌందర్యం తెలుస్తుంది. సాహిత్య ఆసక్తి అంకురిస్తుంది. దేశ భాషలు బాసిల్లుతాయి. బయటకు చదవడం వలన వచ్చే ఆనందనుభూతి రుచి తెలుస్తుంది. రసజ్ఞత మెల్లగా అందరిలో ఇనుమడిస్తుంది.

2019 జాతీయ శాంపిల్ సర్వే గ్రామీణ మహిళల అక్షరాస్యత 35 శాతం దగ్గరే కొట్టుమిట్టాడుతోందని వెల్లడించింది. వారి అక్షరాస్యత పెంచడానికి గట్టి ప్రయత్నం అవసరం. ఇటీవల గ్రామీణ ప్రజా గ్రంథాలయాలు ఏర్పాటుకు, వీటి ద్వారా స్త్రీ విద్యా వ్యాప్తికి సృజనత్మకంగా

పని చేసిన ఇద్దరి గురించి రవంతైనా తెలుసుకోవాలి. డార్జిలింగ్‌కు చెందిన కళాకారిణి, సామజిక సేవకి ఆక్వి తామి వనితల్లో విద్య, చైతన్యాల వ్యాప్తికి విలక్షణమైన మహిళా గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. ఈమె 'సిస్టర్ లైబ్రరీ'ని 2018లో ముంబయిలో మొదలు పెట్టారు. ఇది గ్రామీణ స్త్రీల కోసం పనిచేసే సంచార గ్రంథాలయం. ఇది పుస్తకాలను నేరుగా పల్లెలల్లోని మహిళల చేతికే చేరవేస్తుంది. తొలుత ఆమె దగ్గర వుండే పుస్తకాలు ఇచ్చి వారిని చదివించారు. ప్రజల నుండి చందాలు పెరిగినాక మహారాష్ట్రలోని చాలా గ్రామాలకు గ్రంథాలయ సేవలు విస్తరింపచేశారు. మహిళల కోసమే రాసిన పుస్తకాలు అందించడం వలన వారిలో వారు చర్చించుకోవడం మొదలయింది. తరువాత మహిళా మండళ్ళు పెట్టారు. మరో అడుగు ముందుకేసి మహిళల కోసం వానాకాలం పాఠశాలలు ప్రారంభం చేశారు.

తెలంగాణాలో గ్రామీణ గ్రంథాలయాల స్థాపనలో "తోపుడు బండి" షాదీక్ గారిది ఒక సాహసోపేత ప్రయత్నం. షేక్ షాదిక్ ఆలీ సీనియర్ పాత్రికేయుడు, వ్యాపారి. 2015 ఫిబ్రవరిలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు నుండి తోపుడు బండిలో పుస్తకాలు నింపుకొని ఇంటింటికి పుస్తకం చేర్చాలనే ఆశయంతో బయలుదేరారు. బండి తోసుకొంటూ జంట నగరాల్లో 350 కిలోమీటర్లు నడచి అందరికి పుస్తకాలు తక్కువ ధరకు అమ్మేవారు. పుస్తకంపై ప్రేమ పెంచడానికే నా ఈ ప్రయాణం అని చెప్పారు. తరువాత గ్రామీణ బాట పట్టింది తోపుడు బండి. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, వరంగల్ జిల్లాల్లోని మారుమూల పల్లెల్లో 150 గ్రామీణ ప్రజా గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రంథాలయాలకు పుస్తకాలు, కుర్చీలు, బల్లలు సమకూర్చారు. గ్రామాల్లో పుస్తక ఆవిష్కరణలు చేశారు. సాహిత్య సభలు పెట్టారు. పుస్తకాలపై ప్రేమ వుండి కొనుక్కోలేని నిరుపేద గిరిజన, గ్రామీణ పిల్లలకు 24 లక్షల రూపాయలు విలువ చేసే పుస్తకాలు ఉచితంగా పంచారు. దీనిలో కుటుంబం, మిత్రులు, మీడియా పాలుపంచుకొవడం ముదావహం. వీరి అకాల మరణం గ్రామీణ గ్రంథాలయ స్థాపనకు తీరని లోటే.

గత కొన్ని సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ లైబ్రరీలు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇక్కడే కాదు దేశమంతటా ఇదే పరిస్థితి వుంది. ప్రభుత్వాలు పరిస్థితి చక్కబరచాలి. ప్రజల భాగస్వామ్యంతో నేటి అవసరాలకు తగ్గట్టు గ్రంథాలయాలు తీర్చి దిద్దాలి. మనో వికాసంలోనే ప్రగతి దాగి వుంది. ప్రతి తరం వికాసానికి గ్రంథాలయాలు అవసరం.



**వి. వరదరాజు**
శ్రీకాకుళం - 532001, ఫోన్ : 94925 42033

## కమ్మతెమ్మెర

**ఆ**గష్టు నెల **మిసిమి**లో డా. సగిలి సుధారాణి గారు ఇళయరసనందల్ సంస్థానం రావెళ్ల వారి వంశీకుల గురించి రాసారు. నాలుగు, అయిదు సంవత్సరాల క్రితం నన్ను తమిళనాడు మిత్రులు ఇళయరసనందల్ సంస్థానులైన రావెళ్ల వారిని నాకు పరిచయం చేయడంతో నేను వారితో కలిసి గంటసేపు ముచ్చటించాను. మన ప్రాంతం గురించి, మన భాషా సంస్కృతుల గురించి ఎన్నో విషయాలు మాట్లాడటం జరిగింది. ఇక్కడే నా జీవితంలో మర్చిపోలేని అనుభవం నాకు కలిగింది. రావెళ్ల వారు మూడంతస్తుల పాఠశాల భవనం నిర్మిస్తున్న సందర్భం అది. నన్ను, నా మిత్రుల్ని వారి కారులో తోడ్కొని వెళ్లి వారింటి నుంచి పళ్లెం నిండా పసుపు తెప్పించి నాతో ఆ పాఠశాల మెట్లని పూజింపచేసారు. అది నా జీవితంలో మిగిలిన గొప్ప సంతృప్తి. నా డైరీలో వారు తమ సంతోషాన్ని తెలుపుతూ తేదీతో సహా సంతకం చేసి నాకిచ్చారు. నా జీవితంలో ఇది అరుదైన సంఘటన.



**– గుడిపూడి సుబ్బారావు**

# అట్లాస్ కథ

– టి.వి. ప్రసాద్




క్లాడియస్ టోలెమీ రూపొందించిన అట్లాస్

**భూ**గోళం మీద వివిధ దేశాలకు చెందిన పటాలను (maps) ను ఒకచోట చేర్చి అట్టలమధ్య బిగించి కుట్టిన పుస్తకాన్ని అట్లాస్ అంటారు. అట్లాస్ భూమిమీది నిర్దేశిత ప్రాంతాలకు చెందిన పటాల కూర్పు. వివిధప్రదేశాల భౌతిక లక్షణాలను, ఆ ప్రాంతాల ప్రకృతి దృశ్యాన్ని, స్థలవర్ణనను (టోపోగ్రఫీ) ప్రాంతాల, దేశాల సరిహద్దుల్ని చూపడంతో పాటు, ఆ ప్రాంతాల వాతావరణాన్ని, సాంఘిక, మత, ఆర్థిక సమాచారం, ఉనికి మొదలైన అనేక విషయాల విజ్ఞానాన్ని అందిస్తుంది. పై సమాచారాన్ని ముద్రించిన కాగితాలనన్నింటినీ గట్టి అట్టల మధ్య బిగించి బైండ్ చేసిన పుస్తకంగా అట్లాస్ పేరుతో అందుబాటులోకి తేవడం సాంప్రదాయకంగా వస్తున్న ఆచారం.

గ్రీక్ పురాణ పురుషుడికి అట్లాస్ అనే పేరు ఉంది. టైటాన్లకు, ఒలంపియన్లకు మధ్య జరిగిన యుద్ధంలో అట్లాస్ టైటాన్ల తరఫున యుద్ధంలో పాల్గొంటాడు. యుద్ధంలో ఒలింపియన్లు గెలిచిన తర్వాత తమకు వ్యతిరేకంగా పోరాడినందుకు గ్రీకు దేవతల రాజు జ్యూస్ (zews) అట్లాస్‌కు ఆకాశాన్ని (ప్రపంచాన్ని) తన భుజాలపై శాశ్వతంగా మోసే శిక్ష విధిస్తాడు. అప్పటినుండి భూగోళాన్ని మోస్తున్న అట్లాస్ రూపం శక్తికి, ఓర్పుకు పర్యాయపదంగా నిలిచిపోయింది. భూభారాన్ని మోస్తున్న అట్లాస్ చిత్రాన్ని ప్రాచీనకాలం నుండి నేటిదాకా పశ్చిమ – తూర్పు దేశాల్లో అట్లాస్ పుస్తకం మొదటి పేజీలో ముద్రించడం పరిపాటి అయింది. జరార్డస్ మెర్కేటర్ (16వ.శ.) తాను ప్రచురించిన అట్లాస్ పుస్తకంపై మొదటి సారిగా అట్లాస్ రూపాన్ని ముద్రించాడు.

మొట్టమొదటి ప్రపంచ అట్లాస్ గ్రీక్– రోమన్ భూగోళ శాస్త్రవేత్త క్లాడియస్ టోలెమీ (Claudius Ptolemy) తయారుచేసిందిగా గుర్తింపు పొందింది. ఇతడు ప్రచురించిన దేశపటాల సంకలనానికి 'జాగ్రాఫియా' అని పేరుపెట్టాడు. జగ్రాఫియా నాటి దేశాల భౌగోళిక స్వరూపానికి చెందిన 2వ శతాబ్దపు విజ్ఞానంపై ఆధార పడింది. ఆ రోజుల్లో దేశపటాల రచనకైనా, ఇతర సమాచార రచనకైనా చేతిరాతే మార్గం. క్రిస్టఫర్ కొలంబస్, జాన్ కేబట్, అమెరిగో వెస్పూచీల సముద్ర యానాలు 1400 చివర్లో భౌగోళిక విజ్ఞానాన్ని మరింత పెంచాయి.

అమెరికా కార్టోగ్రాఫర్ (దేశపట రచనాశాస్త్రం) జోహానిస్ రాష్ (Johannes Ruysch) 1507లో తయారు చేసిన కొత్త ప్రపంచ పటం ఉన్న అట్లాస్ బాగా ఆదరణ పొంది అదే సంవత్సరంలో పునర్ముద్రించబడింది. జగ్రాఫియాకు మరో రూపం (Version) 1513లో ప్రచురించబడింది. కానీ అది ఉత్తర దక్షిణ అమెరికాలకే పరిమిత మయింది. తొలి ఆధునిక అట్లాస్ (1570) ఫ్లెమిష్ కార్టోగ్రాఫర్, భూగోళ శాస్త్రవేత్త అబ్రహాం ఆర్టీలియస్ రచనకు అతడు పెట్టిన పేరు ద థియేటర్ ఆఫ్ ద వరల్డ్‌కు ప్రపంచరంగస్థలం అని అర్థం. ఒకే పరిమాణంలో, డిజైన్‌లో ఉన్న పటాలను కూర్చడం ఇతని ప్రత్యేకత. మొదటి ప్రచురణలో 70 వివిధ దేశల పటాలను సమకూర్చాడు. ఇతడు 'ఫాదర్ ఆఫ్ అట్లాస్' గా గుర్తింపు పొందాడు. ఆర్టీలియన్ అట్లాస్ కూడా జాగ్రఫియాలాగా బాగా ఆదరణ పొంది 1570 – 1724 ల మధ్య అనేక ముద్రణలు పొందింది.



జెరార్డ్ మార్కేటర్ అట్లాస్

మరొక కార్టోగ్రాఫర్ హెన్రికస్ హొండియస్ 1663లో అలంకరణతో అట్లాస్ రూపకల్పన చేశాడు. ఫ్లెమిష్ జియోగ్రాఫర్ (భూగోళ శాస్త్రజ్ఞుడు) జెరార్డ్ మార్కేటర్ 1596లో అట్లాసును కొత్త రూపంలో ప్రచురించాడు. దీనికి మార్కేటర్ ప్రాజెక్షన్ అనిపేరు వచ్చింది. ఇతడే గ్లోబ్‌ను కూడా నిర్మించాడు. ఇతడు నిర్మించిన అట్లాస్ మొట్టమొదటి సంప్రదింపు గ్రంథంగా (reference) పేరుగాంచింది. మెర్కేటర్ చేసిన కృషి వల్ల కార్టోగ్రఫీలో డచ్ స్వర్ణయుగపు తొలి ప్రతినిధిగా గుర్తింపు పొందాడు. అట్లాస్ బాగా ప్రజారణ పొందుతున్న కొద్దీ మరింత ఆధునికతను సంతరించుకుంది.

డచ్ దేశస్థులు 18వ వశతాబ్దంలో అనేక అట్లాస్ సంకలనాలను (వాల్యూమ్‌లను) ఉత్పత్తి చేశారు. అదే సమయంలో ఐరోపాలోని ఇతర దేశాల కార్టోగ్రాఫర్లు తమ తమ కృషి ఫలితాలను (works) ప్రచురించడం మొదలు పెట్టారు. ఈ శతాబ్దపు మలిసగంలో ఫ్రెంచి, బ్రిటిష్‌వారు వర్తక వ్యాపారల్లో సాధించిన ప్రగతివల్ల సముద్రపు వివరాల పటాలతో అట్లాస్‌ను తయారుచేయడం మొదలైంది. 19వ శతాబ్దం నాటికి అట్లాస్ విస్తృతంగా పెరిగిపోయింది. దేశాలతోపాటు నగరాలను, ప్రపంచ మతాలను చూపించే అట్లాస్‌లకు ప్రాధాన్యత హెచ్చింది. ఆధునిక ముద్రణా సాంకేతిక పరిజ్ఞానం అట్లాస్ ముద్రణ అసంఖ్యాకంగా పెరిగిపోవడానికి కారణమైంది. భౌగోళిక విజ్ఞానశాస్త్రం (GIS) అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒకే పటంలో చాలా విషయాలతో ప్రత్యేక అంశాల మీద పటాలు (maps) తయారు చేయడం మొదలయింది.

**వివిధ రకాల అట్లాస్‌లు** (ముఖ్యంగా) సాధారణ అట్లాస్‌గా, అంశాల (Thematic) అట్లాస్‌గా–రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. సాధారణ అట్లాస్‌లు భౌగోళిక, నైసర్గిక విషయాలకు (ఉదా: దేశం, విస్తీర్ణం, సరిహద్దులు) ప్రాధాన్యతనిస్తే అంశాల వారీ అట్లాస్‌లు రోడ్ అట్లాస్‌లు, వాతావరణ సమాచారాన్ని అందించే అట్లాస్‌లు మొదలైనవి ప్రత్యేకాంశాలకు ప్రాధాన్యత నిస్తాయి. వివరంగా చూస్తే 1. సాధారణ అట్లాస్ భూగోళ సమగ్ర స్వరూపాన్ని, దేశపటాలను, నగరాలను, ఇతర భౌగోళిక విశేషాలను గుర్తిస్తుంది. ఉదా: టైమ్స్ ప్రపంచ అట్లాస్, జాతీయ, ప్రాంతీయ అట్లాస్‌లు ఒక ప్రత్యేక దేశాన్ని గానీ, ప్రాంతాన్ని గానీ వివరిస్తాయి.

**2. అంశాలకు సంబంధించిన అట్లాస్** – రోడ్ అట్లాస్ ప్రయాణాలు చేసేవారికి ఉపయుక్తంగా ఉంటుంది. రోడ్లు, నగరాలకు మార్గాలు (routes), విశ్రాంతి మందిరాలు (హొటల్స్) మొదలైన అంశాలకు సాముఖ్యత నిచ్చాయి. పెద్దనగరాలను సందర్శించే వారికి అనుకూలంగా అక్కడి రోడ్లు, వీధులు, షాపింగ్ కాంప్లెక్సులు, హొటళ్ళు, మెట్రోస్టేషన్స్ మొదలైన వివరాలను కలిగి వుంటాయి. ఉదా. A-Z అట్లాస్, లండన్, పారిస్, న్యూయార్క్ లాంటివి.

**చారిత్రక అట్లాస్ :** ఇది చారిత్రక సంఘటనలు జరిగిన ప్రదేశాలను, వాటి ప్రత్యేకతలను, జనాభా వివరాలను తెలియజేస్తుంది. అలాగే వాతావరణ అట్లాస్‌లు, నక్షత్రాల అట్లాస్‌లు, మానవశరీర నిర్మాణ (అనాటమీ) అట్లాస్‌లు మొదలైనవి ఆయా విషయాల సమగ్ర సమాచారాన్ని అందిస్తాయి.

**3. డిజిటల్ అట్లాస్‌లు :** అంతర్జాలంలో జూమ్ చేసి చూడటానికి, పరస్పర చర్యా (interactive) సౌకర్యాన్ని కలిగి ఉంటాయి. వీడియో, ఆడియో లాంటి మల్టీ మీడియా లక్షణాలను కలిగి వుంటాయి.

**4. పాఠశాల అట్లాస్‌లు :** ఇవి విద్యాసంబంధిత అంశాలు, అదనపు సమాచారంతో వివిధ కార్యక్రమాలను ప్రోత్సహించేవిగా ఉంటాయి. ప్రత్యేక అంశాల అట్లాస్‌లు సాంప్రదాయక పుస్తక రూపంలోగానీ, ఎలక్ట్రానిక్ రూపంలోగానీ ఉంటాయి. అట్లాస్ అనేక రకాలుగా అందుబాటులోకి వచ్చి అది భౌతిక, రాజకీయ, అంశాల, చారిత్రక, ప్రపంచ అట్లాస్‌గా దొరుకుతుంది. అట్లాస్ పటాల

కూర్పు మాత్రమే కాదు. ఇది ప్రత్యేక ప్రాంతాలపై దృష్టి సారిస్తుంది. దేశ పటాలను గురించే కాక వాటిని గురించిన అదనపు సమాచారాన్ని అందిస్తుంది. దేశహద్దులు, నదులు, పర్వతాలు, ఎడారులు, అరణ్యాలు, సముద్రాలు, భాష, ముఖ్యపట్టణాలు, పతాకం, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఖనిజాలు లాంటి అనేక విషయాలను తెలుపుతుంది. ఆధునిక అట్లాస్‌లు విశ్వం, గెలక్సీలు, గ్రహాలు, వాటి పరిమాణాలు, దూరాలు వాటిలో భూగోళస్థానం, భూభ్రమణం, చంద్రుడు, చంద్రకళలు, చంద్రభ్రమణం లాంటి ఎన్నెన్నో విషయాల నిధులు.

**ప్రసిద్ధ అట్లాస్‌లు :**

**టైమ్స్ ప్రపంచ అట్లాస్ :** 16వ ముద్రణ (ఎడిషన్) 2023లో విడుదలయింది. 1999లో మిలీనియం అట్లాస్‌ను ప్రచురించింది (10వ ముద్రణ). టైమ్స్ మొదటి సారిగా అట్లాస్‌ను 1895లో వెలువరించింది. ఇది తొలితరం అట్లాస్ 1922లో రెండవతరం అట్లాస్‌ను ముద్రించింది. 112 రెండు పేజీల (double pages) పెద్ద పటాలు దీని ప్రత్యేకత. ఇది రెండు లక్షల పేర్లలో 47 సెం.మీ. X 33 సెం.మీ. కొలతల్లో ఉంటుంది. మూడవ జనరేషన్ అట్లాస్ ఖండాలవారీగా ముద్రించిన 5 వాల్యూముల సెట్టు. 19 "X 12" అడుగున్నర పొడవు అడుగు వెడల్పు అట్లాస్ బాగా ప్రాచుర్యం పొందింది. 120 ఫలకాల (plates) మీద ఎనిమిది రంగుల సంకలనం, 1955 – 1999 ల మధ్య ప్రచురించబడింది. నాలుగవతరం అట్లాస్ అంతకు ముందు వచ్చిన అట్లాస్‌లకు భిన్నంగా పూర్తిగా కంప్యూటర్ సాయంతో తయారైన అట్లాస్ (Cartography).

**1999 నాటి పదవ ముద్రణ** : మధ్యయుగాల నుండి నేటి వరకూ వచ్చిన అట్లాస్‌ల్లో ఇది పూర్తిగా ఆధునీకరించబడిన నూతన ప్రచురణ. డిజిటల్ డాటాతో తయారైన తొలి అట్లాస్. 16వ ఎడిషన్ (2023)లో కొత్త అంశాలు చేర్చబడ్డాయి. దేశాల నుండి విడిపోయి కొత్తగా అవతరించిన దేశాలు స్విట్జర్లాండ్ నుండి ఎవాటిని (Ewatini), యుగోస్లావియా నుండి ఉత్తర మేసిడోనియా మొదలైనవి చేర్చబడ్డాయి. 80 మారిన పేర్లతో కొత్త స్థలాల పేర్లు చేర్చబడినాయి. ఉదా: ఖజకిస్థాన్, ఉక్రెయిన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లోని ప్రాంతాలు పాలనా హద్దులు ఆధునీకరించ (update) బడ్డాయి. రోడ్డు, రైలు, విమాన మార్గాలు, విమానాశ్రయాల అవస్థాపన (infrastructure) చూపించబడ్డాయి. 4కి.మీ డార్డానెల్స్ బ్రిడ్జిని (టర్కీ), ఫెహ్మార్న్ బెల్ట్ రోడ్డు, శాండ్‌బాయ్ సొరంగం (ఫారో ద్వీపాలు) ఇందులో చోటు చేసుకున్నాయి.

**రీడర్స్ డైజెస్ట్ ప్రపంచ అట్లాస్ :** భారీ పటాల ప్రపంచ అవలోకనం నుండి ఖండాల పటాలద్వారా అన్ని దేశాల, ప్రాంతాల వివరణాత్మక చిత్రాలవరకు ఈ అట్లాస్ చూపిస్తుంది. మనిషి తన అవసరాలకోసం భూమిని ఎలా మలుచుకున్నదీ, నగరాలు, పట్టణాలు ఎలా నిర్మించుకున్నది, వాటిని కలిపే రహదార్లు, రోడ్డు, రైల్వేలు మొదలైనవాటి వివరాలు చూపుతుంది. ఇది కూడా అత్యంత ఆదరణ పొందిన, విజయవంతమైన అట్లాస్. ఆర్‌డి అట్లాస్‌లు పెద్ద సైజుతో, దేశాల ఆకృతి వర్ణన (profile), వివిధ ప్రాపంచిక వివరాలతో, వాతావరణ వివరాలను తెలిపే అంశాలతో, వీటన్నిటినీ అందంగా చూపించే పటాలతో కనువిందు చేస్తాయి. వీటిలోని పట్టికలు, ఛార్టులు, పటాలు ఆసక్తి కలిగించే సమాచారంతో అరుదైన అనుభవాన్ని కలిగిస్తాయి.

**నేషనల్ జాగ్రాఫిక్ అట్లాస్ :** ఇది విశిష్టమైన అట్లాస్‌గా పేరుపొంది, అతి పెద్ద, అందమైన, ముఖ్యమైన అట్లాస్‌గా ప్రఖ్యాతి గాంచింది. ప్రపంచ ప్రసిద్ధ పది అట్లాస్‌లలో ఉత్తమమైనది. సమాచారానికి సమగ్రమైనది, ధర కూడా అందుబాటులో ఉంటుంది. ఇది గోడకు వేలాడదీసే అట్లాస్‌లను, ప్రయాణాలకు అనుకూలంగా ఉండే పటాలను ఇంకా 800 రకాల పటాలను తయారు చేస్తుంది. ప్రపంచ పటాల తయారీలో వంద సంవత్సరాల అనుభవం ఉన్న సంస్థ ఇది. 'గొప్ప కావ్యాలకన్నా గొప్పది ప్రపంచపటం. దీనిలోని గీతలు, రంగులు మనం కనే కలలకు నిజరూపాలు' అంటాడు దీని వ్యవస్థాపక సంపాదకుడు.

**ఫిలిప్స్ జాగ్రాఫిక్ (సొసైటీ) వరల్డ్ అట్లాస్ (RGS) :** ఇది రెండువందల పేజీల పూర్తిగా పరిష్కరించబడిన, అత్యంత స్పష్టమైన పటాల కూర్పు. ఉపగ్రహాలు తీసిన ఫోటోలతో భూమి ఉపరితల రూపాన్ని, భూగోళ ఆకారాన్ని స్పష్టంగా చూపించే అట్లాస్. ఇది మిగతా అన్ని అట్లాస్‌లకు ఒరవడి లాంటిది. భూగోళానికి సంబంధించిన విపుల సమాచారాన్ని, జనాభా వివరాలను పుష్కలంగా చిత్ర పటాలను ఉదా: అసాధారణ ఉదాహరణలు వున్న విజ్ఞాన సర్వస్వం (డెమోగ్రఫీ) అని న్యూయార్క్ టైమ్స్ కొనియాడింది.

విపుల భూగోళ సమాచారం, జనాభా వివరాలు, చిత్రపటాలు ఉదాహరణలు పుష్కలంగా ఉన్న ఇది ఒక అసాధారణ విజ్ఞాన సర్వస్వం అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక కొనియాడింది. అట్లాస్‌లకు ఇది మార్గదర్శి, ఆదర్శం.

**ప్రయాణీకులు, పర్యాటకులకు ఉపయోగ కరమైన అట్లాస్‌లు:** ద ట్రావెల్ బుక్, కాలిన్స్ వరల్డ్ అట్లాస్, పెగాసస్. అట్లాస్, ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి అట్లాస్, టైమ్స్ డెస్క్‌టాప్ అట్లాస్, నేషనల్ జాగ్రఫిక్ స్టూడెంట్ అట్లాస్, ద టైమ్స్ మిని అట్లాస్, కాలిన్స్ వరల్డ్ అట్లాస్ లోకప్రియమైనది. కాలిన్స్ అట్లాస్ 128 పేజుల 22.6×31.2 సెం.మీ. గట్టి అట్టలతో అందుబాటు ధరలో దొరికే మంచి అట్లాస్ పూర్తిగా 2022లో ఆధునీకరించబడిన తాజా అట్లాస్ (హార్వర్డ్ కాలిన్స్)

**విద్యార్థి అట్లాస్‌లు** : ఆక్స్ఫర్డ్ స్కూడెంట్ అట్లాస్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ అట్లాస్, ఓరియంట్ బ్లాక్ స్వాచ్ స్కూల్ అట్లాస్‌లు మన దేశ విద్యార్థులకు అనుకూలంగా ఉంటాయి. వివిధ విద్యాస్థాయిల్లో వీటిని ఉపయోగిస్తారు. UPSC పరీక్షలకు కూడా ఇవి ఉపయోగపడ్తాయి.

**ఆక్స్‌ఫర్డ్ స్టూడెంట్ అట్లాస్ 6వ ముద్రణ :** ఇది పోటి పరీక్షల కొరకు జనవరి, 2025లో వెలుగు చూసిన ఉత్తమ అట్లాస్.

**అట్లాస్ తయారు చేయడంలో (నిర్మాణంలో) ఎదురయ్యే సమస్యలు :** అట్లాస్ నిర్మాణం అనేక సమస్యలు, శ్రమతో కూడిన అత్యంత క్లిష్టమైన పని. మూడు తలాల (3D) గుండ్రని భూమిని రెండుతలాల (2D) చదును పేపర్‌మీద చూపించడం, వివరాలలో నిర్దిష్టత, సమతౌల్యంలో స్కేలు పటాలు తయారు చేయడం ప్రధాన సమస్య. భూమిది గోళాకారం. పేపర్‌ది బల్ల పరుపు ఆకారం. దీనివల్ల పట స్వరూపాన్ని చూపేటప్పుడు ఆకారం, సైజు, దూరంలో వక్రత, విరూపత ఏర్పడే అవకాశం ఎక్కువ. పటాన్ని కాగితం మీద ముద్రించడంలో, నిక్షేపించడంలో వివిధ అంశాల నిర్దిష్టత సమతూకం, సమపాళ్లు పాటించడం కష్టం. చిన్న పెద్ద పటాల తయారీలో స్కేలును చిన్నదిగా, పెద్దదిగా చేయడం, వివరాలను చూపించడం, సమాచారం తాజాగా (up-to-date) నిర్దుష్టంగా (accurate) యివ్వడం, రాజకీయ వివాదాల, సున్నిత సమస్యల, మారుమూల ప్రదేశాలను చూపించడంలో నిర్దిష్టత పాటించడం కష్టసాధ్యం. గుర్తులు, వ్యాఖ్యానాలు, వివరణలు (Legends) ఇవ్వడంలో శ్రద్ధ అవసరం. క్లిష్టమైన, అమూర్త, సంక్షిప్త సంకేతాలను అర్థం చేసుకోవడం కష్టం. వీటిని సాధ్యమైనంత సులభంగా అర్థమయ్యేలా చూపడంలో ప్రత్యేక శ్రద్ధ, నేర్పు అవసరం. సంక్లిష్టమైన మార్పులు, తీరప్రాంతాలు; ప్రాంతాలు, దేశాల మధ్య సరిహద్దుల్ని గుర్తించడం, వివాదం లేని సమాచారాన్ని పొందుపరచడం మరొక సమస్య. మారుమూల ప్రాంతాల సమాచారాన్ని సేకరించడమే కష్టమైనవని. ఆ సమాచారాన్ని (హైరిజల్యూషన్ డేటాలో) చూపించడం మరింత కష్టమైన పని. సమాచార సేకరణలో రాజకీయ వివాదాలు, భాషా సమస్యలు ఎదురవుతాయి. వివిధ భాషల స్థానికులతో సమాచారాన్ని రాబట్టడంలో భాషాసమస్య పెద్ద అడ్డంకి.

**టైమ్ అట్లాస్ 16 వ ముద్రణ ప్రత్యేకతలు :** ఇది 528 పేజీల గట్టి అట్టల బౌండ్‌తో జారుడు పెట్టెలో (స్లిప్‌కేస్) లభ్యమయ్యే ఆరు కేజీల బరువున్న ఉద్గ్రంథం. కలర్ ఫోటోలు, చిత్రపటాలు (illustrations) కోకొల్లలు. 320 రంగుల పటాలు (Maps) రెండు లక్షలకు పైగా పేర్లు (దేశాలు, నగరాలు, పట్టణాలు మొ), 263 పేజీల్లో తెంపులేని దేశ పటాలు 223 పేజీల సూచికలు (ఇండెక్స్), వాతావరణ మార్పులు, భూగోళ జనాభా, సౌరకుటుంబ వివరాలతో, నిష్ణాతులు రాసిన వ్యాసాలతో లభ్యమయ్యే అధికారిక, ప్రామాణిక అట్లాస్. ఇది అడుగున్నర పొడవు, అడుగు వెడల్పుతో ఎలిఫెంట్ సైజ్ అట్లాస్. అట్లాస్‌లలో శ్రేష్టమైనది. ఇది అరుదైన శాశ్వతంగా ఉండిపోయే నిధి. అపూర్వమైన బహుమతి. ప్రభుత్వాలకు, మీడియాకు అంతర్జాతీయ సంస్థలకు ఇది నమ్మకమైన అట్లాస్‌గా, ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్థలకు, గృహాలకు ప్రియమైన అట్లాస్‌గా ఖ్యాతి గాంచింది.

**అట్లాస్ ఉపయోగాలు :** భూగోళ విజ్ఞానంతో పాటు ప్రయాణీకులకు, విద్యార్థులకు, పరిశోధకులకు వివిధ రకాలుగా ఉపయోగపడుతుంది. ప్రయాణీకులకు. ప్రత్యేకంగా తయారు చేసిన అట్లాస్‌లు అందుబాటులో కొచ్చాయి. అట్లాస్ సాయంతో ప్రత్యేక ప్రదేశాలు, నగరాలు, చారిత్రక ప్రదేశాలు, కీలకమైన రహదార్ల వివరాలు తెలుసుకోగలుగుతాము. మనం ప్రయాణం చేసే మార్గాన్ని, గమ్యాన్ని తెలుసుకోవడానికి సులభమైన మార్గం అట్లాస్.

**విద్య నేర్చుకోవడం :** భూగోళం, సాంఘికశాస్త్రం చదివే విద్యార్థులకు అట్లాస్ తప్పనిసరి. ప్రపంచ దేశాల, ప్రాంతాల నైసర్గికరూపాన్ని, పర్వతాలు, నదులు, ప్రకృతివనరులు, పంటలు మొదలగు విశేషాలు, వివిధ సంస్కృతులు, ఆర్థిక పరి స్థితులు, మత, రాజకీయ సరిహద్దులు తెలుసుకోవడానికి అట్లాస్‌ను మించిన ఉపకరణం మరొకటి లేదు.

**పరిశోధనకు** : పరిశోధకుడు సేకరించిన సమాచారాన్ని (డేటా) వర్గీకరించడానికి, వివిధ పటాలు, పట్టికల ద్వారా చూపించడానికి, వ్యాఖ్యానించడానికి అవసరపడుతుంది.

చాలా అట్లాస్‌లు వివిధ ప్రాంతాల గణాంక వివరాల్ని విద్యా, ఆరోగ్య, ఆర్థిక సంబంధిత అంశాలను తెలుపుతాయి. తులనాత్మక అధ్యయనానికి అట్లాస్ తప్పనిసరి. విషయసేకరణకు, సంప్రదింపడానికి అట్లాస్ అనివార్యం. పై ఉపయోగాలతో పాటు మరో మంచి ఉపయోగం. పడక కుర్చీ ప్రయాణానికి అనుకూలమైనది. కాలు కదపకుండా, పైసా ఖర్చు లేకుండా ప్రపంచాన్ని చుట్టిరావచ్చు. పిల్లల పట్టినరోజు సందర్భంగా అట్లాస్‌ను బహుమతిగా యివ్వడం మంచి అలవాటు.

**అట్లాస్ గురించిన విశేషాలు కొన్ని :** అట్లాస్ అనే మాటను మొదటిసారిగా ప్రయోగించింది జెరార్డస్ మార్కేటర్. తను తయారుచేసిన పటాల కూర్పుకు అతడు పెట్టిన పేరు అట్లాస్. మనకు తెలిసినంతవరకు అట్లాస్ సృష్టికర్త మేరినస్ ఆఫ్ టైయర్. 120CEలో అట్లాస్ భావనను, అక్షాంశ, రేఖాంశాలను, స్థలాల ఉనికిని గుర్తించాడు. అబ్రహాం ఆర్టీలియస్' 'ప్రపంచరంగస్థలం' ఆధునిక భావనలో నిజమైన తొలి అట్లాస్. ఆధునిక సాంకేతికత సాయంతో అట్లాస్ భౌతిక రూపం నుండి డిజిటల్ రూపంలోకి మారిపోయింది.

**అట్లాస్ కథలోని కొన్ని ముఖ్య ఘట్టాలు :** మనకు తెలిసినంతవరకు మొదటి సారిగా అట్లాస్ 120 సిఇ ప్రాంతాల్లో మేరినస్ ఆఫ్ టైయర్ సృష్టించాడు. అక్షాంశ, రేఖాంశాల భావనను, ప్రదేశాల ఉనికిని నిర్దేశించాడు. పటరచనా శాస్త్రజ్ఞుడు (కార్టోగ్రాఫర్), వేదాంతి, గణిత శాస్త్రవేత్త ఐన జరార్డ్ మెర్కేటర్ జర్మనీ దేశస్తుడు గ్లోబ్‌ను సృజించాడు. అట్లాస్‌కు పితృసమానుడు (ఫాదర్ ఆఫ్ అట్లాస్) అబ్రహాం ఆర్టీలియన్ అట్లాస్‌ను 'ప్రపంచ రంగస్థలం' అని పేరు పెట్టిన పటాల సంకలనం ఆధునిక భావనలో తొలి అట్లాస్‌గా గుర్తింపు పొందింది. దీన్ని ఆర్టీలియస్ 1570 లో ప్రచురించాడు. అట్లాస్ ఆవిష్కర్తగా, కార్టోగ్రఫీ, భూగోళ శాస్త్రాల్లో ముఖ్యమైన వ్యక్తిగా గౌరవం పొందాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల అట్లాస్ భౌతికంగా పుస్తక రూపం నుండి డిజిటల్ రూపాన్ని సంతరించుకుంది. 'ప్రపంచ అట్లాస్' ఆన్‌లైన్ ప్రచురణ, కార్య నిర్వాహక యాజమాన్యం రీయూనియన్ టెక్నాలజీ సంస్థది. భారతీయ అట్లాస్ పటరచనా వ్యవస్థ (NATMO) నాటి ప్రధాని నెహ్రూ అంగీకారంతో మన దేశంలో 1956లో స్థాపించబడింది. ఇది సైన్స్, టెక్నాలజీ విభాగంలో పనిచేస్తుంది. NASA అభివృద్ధి పరిచిన ATLAS అనేది ఒక ఉపగ్రహం. ఇది మేఘాల, భూమి ఎత్తులను కొలిచే ఒక లేజర్ సాధనం. నాసా (NASA) అమెరికా అంతరిక్ష ప్రయోగ పరిశీలనా సంస్థ.

**కొసమెరుపు :** ఇంగ్లండ్‌లో కమ్యూనిటీ గ్రంథాలయాలు ఎక్కువ. ప్రభుత్వసాయం కన్నా దాతలు ఇచ్చే పుస్తకాలతో లైబ్రరీ నిండి పోతుంది. ఎప్పటికప్పుడు పాతపుస్తకాలను ఎక్కువ మంది చదవనివి, పుస్తకాల అరలో వెలుగు చూడని పాతబడ్డ వాటిని తీసివేసి కొత్త పుస్తకాలకు చోటు కల్పిస్తారు. ఇలా అవసరం లేని పుస్తకాలను ఏరివేయడాన్ని 'వీడింగ్' అంటారు. వాటిని ఏదో ధరకు అమ్ముతారు.

లండన్ ప్రిస్టన్ లైబ్రరీ కూడా ఒకసారి పుస్తక వారోత్సవంలో ఉపయోగంలేని పుస్తకాలను అమ్మకానికి పెట్టింది. చాలా పుస్తకాలు అమ్ముడుపోయాయి. కానీ కొన్ని పుస్తకాలు మిగిలిపోయాయి. అప్పటికే నేను పెంగ్విన్ ప్రచురణలు నాలుగైదు పుస్తకాలు, పౌండు, రెండుపౌండ్లకు తీసుకున్నాను. (కొన్నాను). చివరగా ఒక పెద్ద పుస్తకాన్ని అమ్మకానికి పెట్టారు. అది టైమ్స్ వారి 2019 మిలీనియం అట్లాస్ ప్రతి. దాని అసలు ధర 150 పౌండ్లు ఉంటుంది. కొందామంటే అప్పటికే పుస్తకాల కోసం ఖర్చు పెట్టగా పది పౌండ్లే మిగిలిపోయాయి. అక్కడ ఎవరూ ముందుకు రాకపోవడంతో నన్ను అడిగారు. అంత విలువైన పుస్తకాన్ని పది పౌండ్లకు కొనడానికి సిగ్గుతో వెనకాడుతుంటే, నన్ను అడిగారు మీ దగ్గర ఎంత వుంది? అని. చేతిలో వున్న పది పౌండ్లు చూపించాను. వెంటనే నా చేతిలోని పదిపౌండ్లు తీసుకుని పుస్తకాన్ని నా చేతిలో పెట్టారు. నేను ఆశ్చర్యం, ఆనందంతో పుస్తకాన్ని మోసుకుంటూ ఇంటికి వెళ్ళాను. ఇది 2017లో 18న జరిగింది. అంత భారీ విలువైన పుస్తకాన్ని ఇండియాకు తెచ్చుకోవడం యిష్టంలేక మా మనవడు, మనవరాలికి తాతయ్య బహుమతిగా యిచ్చి వచ్చాను. పుస్తకం వివరాలు వ్యాసంలో యిచ్చాను. అది టైమ్స్ వారు 2000 సంవత్సరం రెండో మిలీనియం సందర్భంగా విక్టోరియా రాణికి వారి అనుమతితో అంకితం యిచ్చిన గ్రంథప్రతి. అదీ దాని విశేషం.

(ఒకప్పుడు సైకిల్ అంటే అట్లాస్ సైకిలే. దృఢత్వానికి, మన్నికకు హోదాకు మరోపేరు. అట్లాస్ సైకిళ్ళ ఉత్పత్తి షాహిదాబాద్ యూనిట్ విభాగంలో 2020లో చివరిసారిగా జరిగింది. తగిన నిధులు లేక అది మూలబడి పోవడంతో అట్లాస్ సైకిల్ కనుమరుగైపోయింది).

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), హైదరాబాద్, ఫోన్ నెం. 7981398250

# ప్రాచీన కావ్యాల్లో పల్లె ఆటల ప్రశస్తి



దాగుడుమూతలు ఆట

– ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు

(క్రిందటి సంచిక తరువాయి)

**11. దాగుడుమూతలు :** ఈ ఆటను బాల బాలికలు కలిసిగాని, వేరు వేరుగా గాని ఆడుకొనవచ్చు. కనీసం నలుగురు ఉన్నా ఈ ఆట కొనసాగుతుంది. ఒకరు తల్లి, ఒకరు దొంగగా ఉండటం మాత్రం తప్పనిసరి. తల్లి పాత్ర ఆటను నిర్వహిస్తుంది. ఇక్కడ తల్లి అంటే ప్రత్యేకంగా బాలికే ఉండాల్సిన అవసరం లేదు. బాలుడు కూడా కావచ్చు. ఆటాడే పిల్లలంతా తల్లిపాత్రలోని పెత్తనం కోసం, నేనంటే నేను తల్లిగా ఉంటానని పోట్లాడుకోవడం కన్పిస్తుంది.

**"నేన తల్లిని తల్లిని నేనటంచు పట్టుబట్టు కొనొందరుల్ పంతమాడి, కడకు రాముని తల్లిగా నమర్చి......"** (చిల్కపాటి సీతాంబ– గృహలక్ష్మి – జూన్, 1933) అనే ఒక ఆధునిక పద్యం ఈ మాటనే వివరిస్తుంది. జానపదాల్లోని తల్లులు తీరిక సమయంలో తమ పిల్లలను, ఇరుగు పొరుగు పిల్లలను ఒక దగ్గర చేర్చి ఈ ఆట ఆడించటం, ఆటలో తాము కూడా భాగస్వామ్యం తీసుకొని ఉండడం వల్ల ఆటలోని ఈ పాత్రకు 'తల్లి' అనే పేరు వచ్చి ఉంటుంది. దొంగగా నిర్ణయింపబడిన వ్యక్తి కళ్లను మూసి తల్లి ఈ విధంగా పాటను ప్రారంభిస్తుంది.

**"దాగుడుమూతలు దండాకోర్ – పిల్లీ వచ్చే – ఎలుకా భద్రం – ఎక్కడి దొంగలు అక్కడ్నే – గప్‌చుప్"** అని, పాట పూర్తి చేసేలోపల మిగతా పిల్లలు ఎక్కడైనా దాక్కోవాలి. దాక్కున్న తర్వాత దొంగ ఎటువైపు వస్తున్నదీ, అతనికి కనబడకుండా అతని కదలికలు గమనిస్తూఉండాలి. దొంగకు కనిపించకుండా యుక్తిగా తల్లిని చేరుకుంటే మరీ మంచిది. ఒకవేళ దొంగకు కనిపించినా పరుగెత్తుకొని వచ్చి దొంగకు దొరక్కుండా తల్లిని ముట్టుకోవాలి. తల్లిని చేరుకునే లోపల దొంగ ఎవరిని తాకితే వారు దొంగగా మారిపోతారు. ఈ విధంగా ఆట కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఆటలో వేగంగా పరిగెత్తే శక్తి మాత్రమే కాదు. దొంగ సమీపించినపుడు, ఉన్నకొద్ది స్థలంలోనే మెళకువగా తప్పించుకొనే చురుకుతనం కావాలి. ప్రాచీన కావ్యాల్లో కూడా ఈ ఆట ప్రస్తావింప బడడం వల్ల దీని ప్రాచీనతా, ప్రాముఖ్యం స్పష్టమౌతున్నాయి.

పాల్కురికి సోమన (13వ శతాబ్దం పూర్వార్ధం) పండితారాధ్య చరిత్రలోని సకలేశ్వరుమాది రాజయ్య కథలో ఇది, ''దాగుడు మూతలాట''గా దర్శనమిస్తుంది. (ఎఱ్ఱాప్రగడ క్రీ.శ. 14వ శతాబ్దం మొదటి భాగం) హరివంశంలో "దాగురింతలు/హరితోడ నాడుదురు తద్వన వీధుల యందు గోపికల్" (పూర్వభాగం 8–35) అని, ఈ ఆట 'దాగురింతలు'గా తెల్పబడింది. కృష్ణునితో గోపికల సరస సల్లాపల్లోని ఒక చర్యగా ఈ ఆట ప్రస్తుతింప బడింది. మాయా కృష్ణుడు దాక్కోవడం, గోపికలు అతన్ని వెదికి పట్టుకోవడాలతో ఈ ఆట నిండి ఉండి, కృష్ణునిపై గోపికలకు గల సాన్నిహిత్యానికీ, మక్కువకూ మచ్చుతునకగా ఈ ఆట భావింపబడింది. "పైకి మెట్టిక లెక్కి పైకేగి చేలగట్లందు దాగుడుమూతలాడియాడి" (3–55) అని, దేవయాని ఆడుకొన్న ఆటల్లో ఒక భాగంగా పొన్నిగంటి తెలగన కవి (క్రీ.శ. 15వ శతాబ్దం పూర్వార్ధం) యయాతి చరిత్ర కావ్యం ఈ ఆటను అభివర్ణించింది. బలరామకృష్ణులు గోపబాలకులతో కూడి ఆడిన శైశవ క్రీడల్లో "దాగిలి ముచ్చులు" (7–202) ఉన్నట్లుగా వెన్నెలకంటి సూరన కవి (క్రీ.శ. 16వ శతాబ్దం పూర్వార్ధం) తన విష్ణుపురాణ కావ్యంలో పేర్కొన్నాడు. తిన్నని బాల్య క్రీడా విశేషాల్లో "దాగిలి ముచ్చులు" (3–33) చేర్చి

శ్రీ కాళహస్తి మహాత్మ్య కావ్యానికి, ధూర్జటి కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) వన్నెను చేకూర్చాడు.

ఈవిధంగా ప్రాచీన కవులెందరో తమ కావ్యాలలోని నాయకులూ, నాయికలచే ఈ ఆటను ఆడించి బాల్య దశలోనే కాక బాల్య దశ వీడిన తర్వాత కూడా వారి వ్యక్తిత్వ లక్షణంగా దీనిని పేర్కొన్నారు - ఇందులో సకలేశ్వరు మాది రాజయ్య, తిన్నడు, బలరామకృష్ణులు - పురుషులైతే, దేవయాని - స్త్రీ. ఈ విధంగా ఇది బాలురకూ, బాలికలకూ మక్కువను గొల్పి వేరువేరుగా వారిచేత ఆడుకొనబడే ఆటగా గుర్తింపబడింది. ఎఱ్ఱాప్రగడ కావ్యంలో కృష్ణుడూ, గోపికలూ ఆడడంవల్ల ఇది బాల బాలికలు కలిసి ఆడుకునే ఆటగా కూడా ప్రసిద్ధి పొందింది.

ప్రాచీన కవులు ఈ ఆటను 'దాగుడుమూతలు' అని మాత్రమే కాకుండా 'దాగుడు ముచ్చులు' అని కూడా పేర్కొనడం ఇక్కడ గమనింపదగిన అంశం. కాబట్టి కొంత విషయ వివరణ అవసరమని భావిస్తున్నాను - దాగుడు+ మూతలు = కనులు మూసినపుడు కనబడకుండా దాక్కోవడం, దాగుడు + ముచ్చులు = 'ముచ్చు' అంటే 'దొంగ' కాబట్టి కనబడకుండా దాక్కున్న దొంగలు అనే అర్థం వస్తుంది. నేటికీ 'దాగుడుమూతలు' అని వ్యవహారంలో ఉన్న ఈ ఆటలో దొంగ, ఇతర ఆటగాళ్లను (వీరిని దొరలుగానే భావించాలి) వెదికిపట్టుకోవడం ఉంటుంది. కాని, నిజానికి తప్పించుకొని దొరకకుండా తిరగడమే దొంగ యొక్క స్వభావం. కాబట్టి దాక్కున్న దొంగలనే, దొర వెదికి పట్టుకోవడం ఈ ఆటలోని సరియైన లక్షణంగా భావించాలి. దొర అంటే అధికారి, ప్రజారక్షకుడు అనే అర్థాలను తీసుకొని దొర శబ్దాన్ని ఈ ఆటకు సంబంధించినంతవరకు రక్షక భట పదవికి చిహ్నంగా భావించాలి. కాబట్టి దొరకు సామాన్య ప్రజలకు లేని ఎన్నో ఉత్తమ లక్షణాలు కూడా ఉండాలి. అవి వంశపారం పర్యంగానో లేదా స్వయంకృషి, శిక్షణ ద్వారానో లభించే లక్షణాలు అయి ఉంటాయి. అందువల్ల దాగుడు మూతల ఆటను దొంగలను వెదికే అధికారులకు ఇచ్చే శిక్షణగా భావించాలి. అలా అయినపుడు దాక్కునే వారే దొంగలవుతారు కాని నేడు ప్రచారంలో ఉన్నట్టుగా వెదికే వాడు దొంగ కాకూడదు. ప్రాచీన కవులైన ధూర్జటి, వెన్నెలకంటి సూరనలు తమ కావ్యాలైన శ్రీ కాళహస్తి మహాత్యం, విష్ణు పురాణాలలో ఈ ఆటను 'దాగుడు మూతలు' అని కాకుండా 'దాగిలి ముచ్చులు' అనే మాట ఉపయోగించడంలో ఈ విశేషమే కన్పిస్తుంది.

దాక్కోవటం, పారిపోవటం పిరికితనాన్ని, అపరాధ భావాన్ని సూచించే లక్షణాలు కాబట్టి దాగిలి ముచ్చులు అనే పదానికి దాక్కున్న, కనబడకుండా పారిపోయిన దొంగలు అనే అర్థమే సరియైనది - కాని, ఆటల రూపకల్పనలో అర్థాలు, స్వరూపాలు వ్యవహారంలో మారిపోతాయి. కారణం - ఇలాంటి ఆటల్లో రెండే గుణాలు కనబడతాయి. 1. కష్టపడటం 2. దర్జాగా ఉండడం. అందువల్ల దాక్కోవడం దర్జాను సూచిస్తే, వెదికి పట్టుకోవడం శ్రమ విభాగానికి సంబంధించి న్యూనతా భావాన్ని అంతర్గతంగా కల్గి ఉంటుంది. కాబట్టి దాక్కునే వాడు దొరగా, వెదికేవాడు దొంగగా వ్యవహారంలో తారుమారైనారు. ఈ విషయమే ఒక ఆధునిక పద్యంలో ఇలా సాక్షాత్కరిస్తుంది - "దాతకైనను మరివాని తాతకైన జిక్కువాడనే నీచేత జిక్కితేని" (చిల్కపాటి సీతాంబ - గృహలక్ష్మి పత్రిక - జూన్, 1933) అని, దాగుడు మూతలాటలో శ్రీకృష్ణుడు తన చెలికాడైన శ్రీదామునితో పలికి తన దర్పాన్ని ప్రకటించుకుంటాడు.

ఈ దాగుడు మూతల్లోని దాక్కోవడాలు, అందకుండా తప్పించుకొని తిరగడాలు దొంగలకు, పోలీసులకే కాదు. భక్తునికీ, భగవంతునికీ కూడా అన్వయిస్తాయి. పద సంకీర్తనాచార్యుడైన తాళ్లపాక అన్నమయ్య (క్రీ.శ. 1408-1503) వ్రాసిన "దాగిలి ముచ్చిములాడే దాయగాడవైన నిన్ను" అనే కీర్తన ఈ భావాన్నే తెల్పుతుంది. కన్పించకుండా ఉన్న భగవంతుని అన్వేషణలో భక్తుడు గడపడం కూడా దాగుడు మూతల కిందికే వస్తుంది. ఈవిధంగా జీవితంలోని వివిధ దశల్లో కూడా విభిన్న వ్యక్తులతో ఏర్పడే సంబంధ బాంధవ్యాలను పురస్కరించుకొని దాగుడు మూతలాటను అన్వయించ వచ్చు. ఆటల ద్వారా తనువుకూ, మనసుకు కూడా పని కల్పించి వాటిని సక్రమ మార్గంలో ఉంచి భావి జీవితాన్ని బంగారు బాటలో నడిపించవచ్చు అనేందుకు దాగుడు మూతలాటను కూడా పేర్కొనవచ్చు. ఈ ఆటద్వారా చురుకుదనం, వేగం, పరిశీలన, పరిశోధనాశక్తి సంక్రమిస్తాయి. వీటిని పెంపొందించేందుకు - సాన్నిహిత్యాన్ని, అత్యధిక



కనుమూసి గంతనలు ఆట

అనురాగాన్ని, ప్రేమనూ తన పిల్లలకు అందించగల్గే తల్లిదే ప్రముఖమైన పాత్ర. ఈ విషయాన్నే ఈ ఆటలోని తల్లిపాత్ర ద్వారా జానపదులు సూచ్యప్రాయంగా బోధించారు.

**12. కనుమూసి గంతనలు :** బాలికలైనా, బాలురైనా ఆడుకునే ఈ ఆట, బాలికల పరంగానే ఎక్కువ ప్రచారంలో ఉంది. 'కనుమూసి గంతనలు' అంటే – కనులకు గంతలు కట్టి కళ్లకు చూపు కనబడకుండా చేయడం. గంత కట్టడమంటే చేతి రుమాలు లేదా తుండు గుడ్డను మలచి కళ్లకు అడ్డంగా కట్టడం. మధురలాలస తన చెలికత్తెలతో ఆడిన ఆటల్లో – **"…. కనుమూసి గంతనలు"** (6–202) అనే, ఈ ఆటను పింగళి సూరన కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) తన కళాపూర్ణోదయంలో చేర్చి దీని ప్రాచీనతను తెలియజేశాడు.

ఈ ఆట ఈ విధంగా ఉంటుంది – ముందు 'గుండం' (వృత్తాకారం) నేలపై గీసి అందులో ఆటాడేవారంతా నిలబడి ఉండాలి. దొంగగా నిర్ణయింపబడిన బాలిక కనులకు గంతలు కడ్తారు. ఆటాడే వాళ్లంతా వృత్తాన్ని దాటిపోకూడదు. ఆటాడే వారి సంఖ్య అధికంగా ఉంటే ఈ వృత్త వైశాల్యం అందుకు అనుగుణంగా పెరగాలి. 'రెడీ' అనగానే అందరూ ఆటకు సంసిద్ధం కావాలి. అపుడు గంతలున్న బాలిక మిగతా వారిలో ఎవరిని తాకితే వారు దొంగగా మారుతారు. అందువల్ల దొంగకు అందకుండా, గుండాన్ని దాటకుండా అందులోనే తప్పించుకొని తిరగడం, ఆటాడే వారిలో ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది. ఆటాడే సమయంలో గుండాన్ని దాటినా 'ఔట్' అయినట్లే. ఈ గుండం ఎందుకంటే, దొంగ ఆ గుండం వైశాల్యాన్ని ముందే చూసుకొని ఆ పరిధిలోనే తిరగాలి కాబట్టి. వృత్త పరిధి లేకుండా ఉంటే ఆటాడేవారు దొంగకు మరీ దూరంగా తిరుగుతూ, ఆటకు ఒక హద్దు లేకుండా చేసే అవకాశం ఉంది. దొంగకు దగ్గరగా వస్తూ, అంతలోనే పక్కకు తప్పుకుంటూ, అరుపులు – కూతల వంటి సైగలతో దొంగను ఆట పట్టిస్తారు. ఇలా కొంత సమయం కాగానే తిరగడం వల్ల కల్గిన శ్వాస (దమ్ము)ను ఆపుకోలేకనో, అజాగ్రత్త వల్లనో, ఆటలో మార్పును కావాలని కోరు కోవడం వల్లనో ఎవరో ఒకరు దొరికిపోతారు. ఈ ఆట మొదట్లో, గంతలు కట్టుకున్నప్పుడు చూపు ఆనక కళ్లు తిరుగుతాయి. తర్వాత అభ్యాసం వల్ల కళ్ల తిరుగుడు తొలగిపోతుంది. తద్వారా చీకట్లో సైతం నడవగలం అనే ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. చీకటి అంటే భయం తొలగిపోతుంది. ఆటకోసమైనా కొద్ది సేపు కళ్లకు చూపులేకుండా చేసుకుంటే పుట్టుకతో లేదా కారణాంతరాల వల్ల కనులు లేని గుడ్డి వారి స్థితిని అర్థం చేసుకొనే వీలు కలుగుతుంది. వారిపట్ల సానుభూతి కల్గి, వారికి సహాయ సహకారాలు అందించాలనే ప్రేరేపణను కూడా ఈ ఆట పెంపొందింప జేస్తుంది. ఈ విధంగా బాల్యదశలోనే పిల్లల మనస్తత్వాన్ని ఉన్నత స్థితికి ఈ ఆట చేకూరుస్తుంది, అని భావించవచ్చు.

**13. గచ్చకాయలు :** బాలురు కూడా ఆడగల్గినా బాలికలకే ఎక్కువ ప్రీతి పాత్రమైన ఆట గచ్చకాయలు. కాయలను ఎగరేస్తూ తిరిగి వాటిని అందుకోవడంలో ముడివడి ఎన్నో వైవిధ్యాలు, నైపుణ్యాలతో కూడుకొని ఉన్న ఆట ఇది. ఆటలోని అవసరాన్ని బట్టి కాయలను ఎంత ఎత్తుకు ఎగరేస్తే తిరిగి వాటిని అందుకొనగల్గుతాము, అనే విషయాన్ని ముందే గణనకు తీసుకోవాలి – 'ఒక వ్యక్తి ఇంత దూరాన్ని ఇంత సమయంలో చేరుకోవాలంటే ఎంత వేగంతో నడవాలి' అనేది 'దూరం–వేగం' అనే గణితశాస్త్ర సూత్రానికి సంబంధించిన అంశం. ఈ సూత్రమే కాయలను ఎగరేసి అందుకొనేటప్పుడు వర్తిస్తుంది. దీన్ని సక్రమంగా పాటిస్తే తప్ప ఆటలో విజయం చేకూరదు. సరదాగానే కన్పించినా సహనం, సాధన అధికంగా ఉంటే తప్ప ఒంటబట్టని ఆట ఇది. నేడు దీనిని బాలికలే ఎక్కువగా ఆడుతున్నా, పూర్వం బాలురు అందులో సాహసవంతులైనవారు ఈ ఆటపట్ల అధికమైన వ్యామోహాన్ని కల్గి ఉండేవారనే విషయం విదితమౌతోంది



ఓమనగుంటలు ఆట

– అందుకే శ్రీనాథ కవిసార్వభౌముడు (క్రీ.శ. 1370–1450) సైతం, పల్నాటి వీర చరిత్ర కావ్యంలో "గచ్చకాయలు చాల గలిగిన యట్టి / తిత్తులు చిరుతలు తీరైన గొడెలు" అని, బాలచంద్రుడు తన స్నేహితులతో కలిసి ఆడిన ఆటల వరుసల్లో దీనిని పేర్చి ఈ ఆట ప్రాముఖ్యతను పేర్కొన్నాడు. తిన్నడు బాల్యంలో చెంచు కుమారులతో ఆడిన ఆటల్లో – "గ్రచ్చకాయలు" (3–33) ఉంచి, ధూర్జటి కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) కూడా ఈ ఆటకు బలాన్ని చేకూర్చాడు. శతాబ్దాల తదనంతరం నేటికి కూడా తెలుగునాట జానపదాల్లోని బాలబాలికలు ఈ ఆటద్వారా – ఏకాగ్రత, జాగ్రత్త, నైపుణ్యం అనే సంపన్నమైన లక్షణాలను తమ స్వంతం చేసుకుంటున్నారు.

**14. ఓమనగుంటలు :** ఓమన గుంటలు, వామన గుంటలు అనే పేర్లతో ఈ ఆట నేటికీ జానపదాల్లో ప్రాచుర్యంలో ఉంది. చింతగింజలు లేదా గులక రాళ్లనే నాణాలుగా చేసుకొని ఆడే ఓమన గుంటలాట, "కుచ్చిల్, గీరనగింజ లో / మన గుంటల్" (6–202) అని, పింగళి సూరన (క్రీ.శ. 16వ శతాబ్దం) కళాపూర్ణోదయ కావ్యంలో; "తిరమగు నోమన గుంటలు" (5–72) అని, అనంతా మాత్యుని (క్రీ.శ. 15వ శతాబ్దం పూర్వార్ధం) భోజ రాజీయంలోనూ ప్రస్తుతింపబడి తన ప్రాచీనతనే గాక, తన విలువనూ చాటుకొంది. ఈ ఆటలో గుంతలకున్న ప్రాధాన్యత వల్లనే దీనికి ఓమన గుంటలు అనే వ్యవహార రూపం ఏర్పడి ఉంటుంది. దీర్ఘ చతురస్రాకారంగా ఉండే చెక్కపీటకు రెండు పక్కలా నిలువునా ఏడేసి గుంతలు (గుంటలు) తొలచబడి ఉంటాయి. చెక్కపీటను చేయించుకొనే స్తోమత లేనివాళ్లూ, సమయానికి చెక్కపీట దొరకని వాళ్లూ తమకు ఆటపై ఉన్న మక్కువనూ, ఉత్సాహాన్నీ ఆపుకోలేక చదునుగా ఉన్న నేలపైనే గుంతలు చేసుకొని ఆడతారు. చెక్కపీట కూడా వ్యక్తుల అభిరుచికీ, ఆర్థికస్తోమతకూ చిహ్నంగా ఉండి కళాత్మకతను ఉట్టిపడజేస్తుంది. పొన్నిగంటి తెలగన (క్రీ.పూ. 16వ శతాబ్దం పూర్వార్ధం) యయాతి చరిత్రలో దేవయాని "....తామరకెంపు పీటపై / ఓమన గుంటల నుజ్జగించి" (3–151) అని, తామర కెంపులతో చేసిన ఓమన గుంటల పీటను అభివర్ణించాడు.

ఇద్దరు వ్యక్తులు గుంతలకు చెరొక వక్క ఎదురెదురుగా కూర్చొని తమకున్న ఏడుగుంతల్లోనూ పదమూడు గింజలను వేసి ఆట ప్రారంభిస్తారు. ఒక గుంట నుండి తీసిన గింజలను ఒక్కొక్కటి చొప్పున మిగతా గుంతల్లో వేసి, ఆ గుంతకు పక్కగా ఎదురుగా ఉన్న గుంతల్లోని గింజలను తమ స్వంతం చేసుకుంటారు. రెండవ వ్యక్తి తనవంతు వచ్చినపుడు ఇదే విధానాన్ని అనుసరిస్తాడు. ఈ విధంగా గింజలు పూర్తి అయేంత వరకూ ఆటకొనసాగుతుంది.

**"ముత్యాల వామన గుంటలు పీటలుంచుకునీ**
**ముగుద సీతా మనమిద్దర మాడుదామటే"** (కృష్ణశ్రీ– స్త్రీల రామాయణపు పాటలు) అని, గుంతల్లో గింజలకు బదులు ముత్యాలను పోసి ఆడిన వైనం సీతాదేవి ఓమనగుంటల ఆటలో వర్ణింపబడింది – ఈ విధంగా పోటీ స్వభావాన్నీ, అన్యోన్యతనూ, కాలక్షేపాన్ని ఈ ఆట ఇరువురి వ్యక్తుల మధ్య పెంపొందింపజేస్తుంది.

**15. ఉప్పన బట్టెలు :** ఉప్పన బట్టెలు, ఉప్పుపట్టీలు, ఉప్పు బందర్, చెర్ పట్టీ అని, ప్రాంతీయ భేదాలతో, పలుపేర్లతో పిలువబడే ఈ ఆట జానపదాల్లో పిల్లల ఆటగా ప్రసిద్ధి పొందింది. రెండుజట్ల మధ్య నడిచే ఈ ఆటలో – ఒక జట్టు ఉప్పును దొంగిలిస్తే రెండో జట్టు పట్టుకోవడంతో ఈ ఆట సాగుతుంది, కాబట్టి దీనికి 'ఉప్పన బట్టెలు' అనే పేరు సార్థకమైంది. సముద్రపు ఒడ్డున పట్టీలను (మడుల వంటి చతురస్రాలు) నిర్మించి అందులో సముద్రపు నీటిని నిలువ ఉంచి ఉప్పును తయారు చేస్తారు. కాబట్టి ఉప్పు పట్టీలు (ఉప్పు గడులు) అంటారు. ఉప్పు పట్టీల నుండి ఉప్పును దొంగిలించి తీసుకుపోయే ఆటగా దీనికి ఈ పేరు వచ్చి ఉంటుంది.

పొడవైన మూడు నిలువు గీతలు, దాదాపు అందులో సగభాగంగా ఉండే 5,6 అడ్డ గీతలు రెండు జట్లను చీల్చే సరిహద్దు రేఖలాంటి నిలువుగా ఉండే మధ్య గీతతో ఈ ఆట స్వరూపం ఒక కిటికీ ఆకారాన్ని పోలి ఉంటుంది. ఈ ఆటలోని మొదటి జట్టు - ఉప్పు దొంగలది. రెండో జట్టు వారు అడ్డ గీతల మీద నిలబడి ఉంటారు. పెద్ద పోలీసు (జట్టుపెద్ద) మధ్యగీతపై నిల్చొని దొంగలు గళ్లలోపలికి ప్రవేశించకుండా అటకాయిస్తుంటాడు. ఆట ప్రారంభం కాగానే దొంగలు గీత తొక్కకుండా మొదటి గడిలోకి దుముకుతారు. ఆ తర్వాత రెండో గడి, అందులో నుండి మూడోగడి, ఈ విధంగా మిగతా గళ్లలోకి దూకే ప్రయత్నాన్ని చేస్తుంటారు. అపుడు ఆడ్డగీతల మీద ఉన్న పోలీసులు గానీ, మధ్యగీతపై ఉండే పెద్ద పోలీసు గానీ, వీరిలో ఎవరిని తాకినా వారు ఔట్ అవుతారు. ఈ విధంగా తమ పక్షపు అన్ని గళ్లూ దాటి ఉప్పును దొంగిలించి మళ్లీ ఇంటికి (మొదటి గడి) చేరుకోవాలి. తిరిగి తమ గడికి చేరుకొనేటపుడు తమతోపాటు గళ్లను దాటలేక అందులోనే చిక్కుకు పోయిన తమ వాళ్లకు ఉప్పు అందిస్తూ తమతో తీసుకుపోవాలి. అప్పుడే ఆ పక్షానికి గెలుపు లభిస్తుంది.

అడ్డగీతలపై ఉన్నపోలీసులను, నిలువుగీతపై నిలుచుండి పహరాకాసే పెద్ద పోలీసును తప్పుకుంటూ గీతలను తొక్కకుండా దుముక్కుంటూ, గళ్లు దాటుతూ ఇల్లు చేరుకోవాలి. ఇది అంత సులభమైన విషయం కాదు. అందుకు చురుకుతనం, జాగ్రత్త, అవతలి వ్యక్తి కదలికలను గమనించే సూక్ష్మ పరిశీలన వంటి విషయాలకు ప్రాధాన్యం ఉంటుంది. అందువల్లనే ప్రాచీన కవులు సైతం ఈ ఆటకు ఉన్నతమైన పీట వేసి తమ కావ్యాల్లో కూర్చుండ జేశారు.

ఆటవిక వీరుడూ, అమిత భక్తి సంపన్నుడూ అయిన తిన్నడు బాల్యంలో చెంచు పిల్లలతో ఆడిన ఆటల్లో ఒక దానిగా ధూర్జటి కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) "యల్లి యుప్పెన బట్టె లప్పళాలు" (3-33) అంటూ, ఈ ఉప్పన బట్టెలు ఆటకు చోటిచ్చాడు. బలరామకృష్ణులు గొల్ల పిల్లలతో ఆడిన ఆటల్లో "పుట్ట చెండ్లుప్పన బట్టె, లాలంకులు" (7-202) అని, విష్ణు పురాణ కావ్యంలో వెన్నెలకంటి సూరన (క్రీ.శ. 16వ శతాబ్దం పూర్వార్థం) ఉప్పన బట్టెలను తన కాలపు ఆటగా పేర్కొన్నాడు. ధూర్జటి, వెన్నెలకంటి సూరనలు ఈ ఆటను ఒక ఆటగా మాత్రమే పేర్కొంటే, పొన్నికంటి తెలగన కవి ఈ ఆట స్వరూపాన్ని కొంతవరకు తెలియజేశాడు.

పొన్నికంటి తెలగన (క్రీ.శ. 15వ శతాబ్దం పూర్వార్థం) యయాతి చరిత్ర కావ్యంలో దేవయాని ఆటలను వివరిస్తూ - **"పరువంపు దొంగల వెంకబడి గేరి యుప్పన / పట్టె లాడెదు తేటి పట్టికదుపు"** (3-56) అంటూ, ఉప్పన బట్టెల ఆట దొంగలను పట్టుకునే అంశంతో కూడుకొని ఉంటుంది, అనే విషయాన్ని తెలియజేస్తాడు. నాచన సోమన కవి తన ఉత్తర హరివంశ కావ్యంలో ఈ ఆటను పేర్కొనడమే కాదు, ఈ ఆట ద్వారా తన కాలంలో ఉప్పును కప్పంగా చెల్లించడం అనే ఆచారం ఉన్నట్లుగా తెలియజేస్తాడు. కప్పం ఏదైనా చెల్లించేది సామంతులు. గ్రహించేది సార్వభౌములు. కప్పాన్ని అవతలి వ్యక్తి నుండి స్వీకరించడం తన ఔన్నత్యానికి, ఆధిపత్యానికి చిహ్నం అని భావించాలి. విలువైన ధన, కనక, వస్తు, వాహనాల కంటే అతి తక్కువ విలువచేసే ఉప్పును కప్పంగా స్వీకరించడమే ఇంకా గొప్ప విషయం. కారణం - ఉప్పును కప్పంగా చెల్లించడమంటే 'మేము తమ దయ వల్లనే తమ ఉప్పు తిని బతికే వాళ్లం' అనే సందేశాన్ని సూత్రప్రాయంగా తెలియజేయడమే!

ఇదే అంశం - నాచన సోమనాధుని (క్రీ.శ. 1334-90) ఉత్తర హరివంశ కావ్యంలో చోటు చేసుకుంది. హంస డిభకులు వాసుదేవుని వద్ద నుండి లవణాన్ని కప్పంగా గ్రహించేందుకై జనార్ధనుని రాయబారిగా పంపుతారు. అందుకు సమాధానంగా వాసుదేవుడు కోపంతో "నుప్పులు దెత్తురే సమరయోగ్య తలంబున వైరి కోటితో / నుప్పన బట్టె లాడునెడ నుప్పులు దెత్తురు గాక యాదవుల్" (4-155) అని పలుకుతాడు. 'యాదవ వీరులు - యుద్ధరంగం అనే ఆట మైదానంలో శతృసమూహం అనే అవతలి జట్టుతో, ఉప్పనబట్టె లాట ఆడేటపుడు ఉప్పును తీసుకు వస్తారు గాని, కప్పంగా ఉప్పును తీసుకు వస్తారా' అనే భావం వాసుదేవుని సమాధానంలో కన్పిస్తుంది. దీనివల్ల క్రీ.శ. 14వ శతాబ్దంలోనే ఉప్పన బట్టెలాట అమితంగా ప్రచారంలో ఉన్న విషయమే గాక, ఉప్పును పట్టుకు రావడం అనే అంశంతో ఆ ఆట కొనసాగుతుందనే సంగతి కూడా స్పష్టమై, ఆ ఆట స్వరూపం కూడా మనకు అవగత

మౌతుంది. ఈవిధంగా నిత్యావసర వస్తువైన ఉప్పును ప్రధానం చేస్తూ పుట్టిన ఉప్పన బట్టేలాట, ప్రాచీనంగా తెలుగు జాతిలో ప్రచారంలో ఉన్న విషయం విదితమైంది. ఉప్పు విలువను సూచిస్తూ, ఉప్పు లేని వంటకాలను వస్తువుగా కలిగి ఎన్నో జానపద కథలు అంతర్జాతీయ సాహిత్యంలో సైతం చోటుచేసుకొన్నాయి. 'వస్తువు ఏదైనా ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు, వస్తువుకు విలువ అధికమై, అది నల్లబజారు (బ్లాక్ మార్కెట్)లో చేరి, సామాన్య జనానికి అందుబాటులో ఉండదు' అనే విషయం వ్యాపార శాస్త్రానికి సంబంధించిన మౌలిక సూత్రం. ఇదే సమస్య అంత స్స్సూత్రంగా ఈ ఆటలో పొదగబడింది అనే అంశం, సామాజికశాస్త్ర పరిశోధకుల అభిప్రాయాన్ని తరచి చూసినప్పుడు కూడా కల్గుతుంది. "ఉప్పు సముద్ర తీరం నుండి లోభాగాలకు అందు వరకు దొంగల నుండి, పర రాజ్యముల సుంకాల నుండి, దౌర్జన్యపరుల నుండి తప్పించుకొని వచ్చుటలో ఉండు కష్టాలను ఆటగా చేసుకొని ఆడిరేమో?" అని, ఈ ఆటను గూర్చి కీ.శే. సురవరం ప్రతాపరెడ్డి గారు తమ 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' అనే గ్రంథం ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

పంట పండటం ఒక ఎత్తయితే, ఆ పంట ఆహారంగా మారి నోటికి అందేంత వరకూ, నేటి రైతు కూడా ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నాడు. అలాంటప్పుడు ప్రాచీన కాలంలో సముద్రపు ఉప్పు ఇంటికి చేరడం వెనుక ఎన్నో ఇక్కట్లు ఉండే ఉంటాయి. ఏ సంఘటనకైనా, లేదా ఏ సమస్యకైనా జానపద హృదయం స్పందిస్తూనే ఉంటుంది – అలాంటి సందర్భాల్లో ఆ సంఘటన లేదా ఆ సమస్యను కవిత్వం ద్వారానో కళారూపాల ద్వారానో మాత్రమే కాకుండా, ఆటల ద్వారా కూడా రూపకల్పన చేసి, దానికి స్థిరత్వాన్ని ఆపాదిస్తుంది అనేందుకు ఉప్పన బట్టె లాటను మంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

**జానపదుల ఆటలు ఇంకా ఎన్నో ఉన్నాయి :** ఆటలు – బాలురు, బాలికలు, స్త్రీలు, పురుషులు అనే లింగ, వయో భేదాలను పాటించేవి కొన్ని. ఏ భేదమూ లేక అందరికీ వర్తించేవి కొన్ని. పలు ప్రాచీన కావ్యాల్లో ప్రజా జీవన విధానంలో భాగంగా వర్ణించబడిన ఈ ఆటలు – నేటికీ శతాబ్దాల తదనంతరం కూడా గ్రామాల్లో నిలదొక్కుకొని జానపదుల ఆటలుగా ప్రసిద్ధి చెంది ఉన్నాయి. పైన వివరించబడిన ఆటలతోపాటు – చిట్ల పొట్లకాయ, సిరి సింగణావత్తి, గుడుగుడు గుంచాలు, కుందెన గుడి, తూరన తుంకాలు, గీరన గింజలు, పిల్ల దీపాలంకి, అప్పళాలు, అందలాలు, కుందికాళ్లు, ఆలంకులు, గుంటచాళ్లు, వెన్నెల కుప్పలు, చీకటి మొటికిళ్లు, బొట్టన గోలలు, కుప్పి గంతులు, పిడిగ్రుద్దులాటలు, పిల్లదీవులు, గూవనాలు, గుళ్లు, గోడిపట్టెలు, ఏలపాటలు, సరిబేసులు, ఈల కూతలు, హరిణక్రీడలు, అచ్చనగండ్లు, పింపిళులు, కుచ్చిళ్లు, రాగుంజు పోగుంజులాట, అప్పల విందులు, చప్పట్లు పెట్టుట, సేర బొంతలాట వంటి మరెన్నో ఆటలు కూడా నామమాత్రంగా ప్రాచీన కావ్యాల్లో ప్రస్తుతింప బడినాయి. ఏది ఎట్లున్నా– పైన తెల్పబడిన ఆటలన్నీ నేడు ప్రచారంలో మనకు కన్పించక పోవచ్చు. కానీ, ఈ వసుధైక ప్రపంచంలో ఏదో ఒక ప్రాంతంలో ఏదో ఒక రూపంలో బతికి బట్టకట్టే ఉంటాయని మాత్రం చెప్పవచ్చు. అందుకు కారణం – జానపద విజ్ఞానం కాలానుగుణమైన మార్పులకు లోనవుతుంది. అభివృద్ధి నంతరించు కుంటుంది. మానవాళికి ప్రయోజనకారిగా ఉంటుంది. అంతే తప్ప ఏవిధమైన వినాశనానికి దారితీయకపోవడమే అని భావించవచ్చు.

**జానపదుల ఆటలు – ప్రయోజనాలు :** ప్రాచీన కవులు కూడా జానపదుల ఆటలను తమ కావ్యాల్లోని ప్రధాన పాత్రల పరంగా చెప్పి, ఆ పాత్రల ఔన్నత్యాన్ని ఆటల పరంగా ప్రస్తుతించి తద్వారా ఆ ఆటలకు ఒక ప్రాశస్త్యాన్ని సమకూర్చి పెట్టారు. అందువల్ల జానపదుల ఆటల పద్ధతిని, గుణాలను సూక్ష్మంగా పరిశీలించినప్పుడు ఆ ఆటల ద్వారా ఈ ప్రయోజనాలు చేకూరుతాయనిపించింది. అవి : 1. ఆటలు–శారీరక ఆరోగ్యాన్ని సమకూరుస్తాయి. 2. ఆటలు–వినోదాన్ని, కాలక్షేపాన్ని కల్గించి మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి. మనసులో అణగారి ఉన్న భావోద్వేగాలుఆటల ద్వారా బహిర్గతమై మనసుకు ప్రశాంతత చేకూరి వికాసం కలుగుతుంది. 3. ఆటల వల్ల ఆలోచనా శక్తి పెంపొంది దానివల్ల విజ్ఞానాభివృద్ధి, వ్యక్తిత్వపు పెంపుదల కలుగుతాయి. 4. ఆటలలోని సామూహికత వల్ల మనిషిలోని బిడియం, భయం తొలగిపోయి వ్యక్తుల మధ్య పరిచయాలు, మంచి సంబంధాలు పెరుగుతాయి. మానవ మనస్తత్వ పరిశీలనకు ఇవి బాగా దోహదం చేసి, సమాజంపట్ల అవగాహనకు బాల్యదశలోనే మార్గాన్ని ఏర్పరుస్తాయి. 5. ఆట అనేది




ఒక సమాజం వంటిది – ఒక వ్యక్తికి ఇంట్లో వాళ్లూ, బయటి వాళ్లూ ఉన్నట్లే ఆటలో తమ జట్టులోని వాళ్లూ, ఎదుటి జట్టులోని వాళ్లూ (ప్రత్యర్థులు) ఉంటారు. ప్రత్యర్థి జట్టుపై గెలవాలని కోరుకోవడం మాత్రమే ఆటకాదు. తమ జట్టు సభ్యులతో ఎలా మెలగాలీ అనేది కూడా ముఖ్యమైన అంశమే. ఈ అంశమే గెలుపులో ప్రధానపాత్ర వహిస్తుంది. స్వంత జట్టుతో ఐక్యతను పాటిస్తూ, ఒకే తాటిపై నిలబడటం ముఖ్యమైన విషయం. ప్రతిభావంతమైన ఆటగాళ్ల జట్టు కూడా అనూహ్యంగా ఓడిపోయి, సాధారణ ఆటగాళ్లకు విజయాన్ని చేకూర్చి పెడుతుంది. దీనికి కారణం – తమ జట్టులోని మౌలిక లోపాలే. సహకరించుకోవటం, సర్దుబాటు చేసుకోవటం అనేవి అత్యంత సహజమైన అంశాలని గుర్తించుకోవాలి. 'ఇంట గెల్చి రచ్చ గెలువు' అనే సామెత దీనినే సూచింప జేస్తుంది. 6. ఆటల వల్ల పెంపొందిన సామూహిక శక్తి, అవసరమైనపుడు సామాజికసేవ చేయాలనే తత్వాన్ని ప్రబోధిస్తుంది. 7. ముఖ్యంగా పిల్లల ఆటలు పాటల రూపంలో ఉంటాయి. ఆటాపాటలు కవల పిల్లల్లా కలిసిపోతాయి. పాట రూపంలో ఆట ఉండటం వల్ల ఆటలో ఉత్సాహం పెంపొందుతుంది. తద్వారా పాట కంఠతా వస్తుంది. ఈ జ్ఞాపక శక్తి విద్యాభ్యాసంలో అమితంగా తోడ్పడుతుంది.

ఈ విధంగా జానపదుల ఆటలు–శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, జ్ఞాపకశక్తి, ఆలోచనా శక్తి, పట్టుదల, ఏకాగ్రత, ఉత్తేజం, కార్యదీక్ష, ఐక్యత, సమయస్ఫూర్తి, లోకజ్ఞానం, సామూహిక తత్వం మొదలైన విభిన్నమైన అంశాలకు ప్రతిరూపాలుగా నిలుస్తాయి. అందుకే – జానపదులకు ఆటలోని గెలుపూ, ఓటములు ప్రధానం కాదు. ఆటను స్థిరచిత్తంతో ఆడటమే వారికి కావల్సింది. వారి దృష్టిలో ఆట ఆడక పోవడం పిరికితనానికి, ఆడి ఓడిపోవడం ధైర్యానికీ సంబంధించిన అంశాలు. ఆటను కేవలం ఆట దృష్టితోకాక, ఆటలో జీవితాన్నే దర్శించగల విశాల భావన వారిది. నేడు ఆధునిక క్రీడలుగా విలసిల్లుతున్న ఎన్నో ఆటలకు వాటి జానపదుల ఆటలే పునాది రాళ్లుగా నిల్చి తోడ్పడినాయనేది కాదనలేని నిజం. క్రీడా నిపుణులు బాధ్యతగా తీసుకొని పనిచేస్తే ఇంకా ఎన్నో కొత్త క్రీడలకు రూపకల్పన జరుగుతుంది. ప్రభుత్వాలు కూడా ఈ ఆటల విలువలను ఇంకా గుర్తించి ఈ ప్రయత్నంలో మంచి ఫలితాలను సాధించేందుకు పూనుకోవాలి. ఉదా : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ సంస్థలు ప్రత్యేకమైన క్రీడా పథకం కింద – గిరిజన ప్రాంతాల నుంచి విలుకాళ్లను ఏరి వారికి శిక్షణనిస్తే – శిక్షణ పొందిన తర్వాత వారు క్రీడా పండితులకే ఆశ్చర్యం కల్గించేంతగా రాటుదేలి జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి విలుకాళ్లుగా తీర్చిదిద్దబడతారు, అని భావించడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అడవి–అడవిలో తాము–తాము కాకుండా తమతోపాటు జంతువులు– ఇదే ప్రపంచం అనుకుంటూ ప్రకృతి గుణంతో జీవించే గిరిజనులు – మట్టిలో మాణిక్యాలు. వారి ఆలోచనలు ఆహారాన్వేషణకే పరిమితం. అందుకే వారు విల్లు పడతారు. చిన్నా, పెద్దా జంతువులను వేటాడుతారు. ఆ విల్లునే తమ ఆత్మరక్షణకు ఉపయోగిస్తారు. అందుకే విలువిద్య వారి రక్తంలోనే ఉంది. ఆ విద్యకు ప్రోత్సాహం లభిస్తే అది అంతర్జాతీయ స్థాయిలో మన జాతీయ జెండాను సులభంగా రెపరెపలాడిస్తుంది. విలువిద్యను మనం ఆటగా భావిస్తే గిరిజనులు దానిని వృత్తిపరంగా పేర్కొని అదే తమ జీవిత ప్రధానం అంటారు. అదేవిధంగా –గ్రామాల్లోని వృత్తి కళాకారుల ఉనికిలో కూడా ఎన్నో ఆటల సమూహాలు కన్పిస్తాయి. అందుకే 'జానపదాలు అంటేనే.... ఆట – జీవితాల కలగలుపు' అని భావించాలి. అందువల్లనే–జాతి ఆలోచనల ఔన్నత్యాన్ని ప్రతిబింపజేస్తూ, ఒక జాతి సంస్కృతికి గీటురాళ్లుగా, ఒక జాతి విజ్ఞానానికి ప్రతీకలుగా ఆటలు ప్రాధాన్యం వహిస్తున్నాయి.

**ఆచార్య తంగెడ కిషన్ రావు**
పూర్వ వైస్ ఛాన్సలర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100

# వయొలిన్ విద్వాన్ ద్వారం దుర్గా ప్రసాద రావు

**– ఋసిఋ**




ద్వారం దుర్గా ప్రసాద రావు

*(క్రిందటి సంచిక తరువాయి)*

**ఋసిఋ :** **మళ్లీ వర్తమానానికి వద్దాం. ఇప్పుడు చాలామంది ఆన్‌లైన్ క్లాసెస్‌లో సంగీతం నేర్పిస్తారు. సంవత్సరంలో మీచేత కన్సెర్ట్ చేయిస్తాము అంటున్నారు.. ఇది ఎంతవరకు కరెక్ట్?**

**ద్వారం :** చాలెంజ్ చేయించిన వాళ్ళు కనిపిస్తున్నారు. ఆ ఛాలెంజ్ ఒప్పుకుని కన్సెర్ట్ చేసినవాళ్ళు ఎవరు మనకు కనిపించరు.. అలా దొరకరు కాబట్టే ఇవన్నీ జరుగుతున్నాయి.

**ఋసిఋ :** **ఏ వయసు వారైనా సంగీతం నేర్చుకోవచ్చా?**

**ద్వారం :** నేర్చుకోవడానికి వయసు అంటే ఏమీ లేదండి.. ఇంట్రెస్ట్ ఉండాలి అంతే. ఇప్పుడు మా విజయనగరం మ్యూజిక్ కాలేజీలో నేర్పే వాళ్ళకి పదేళ్లు సీనియర్లు అయిన వాళ్ళు సంగీతం నేర్చుకుంటున్నారు. ఇదొక విజయనగరం కాలేజీ మాత్రమే కాదు. అన్ని కాలేజీల్లోనూ అలాగే ఉంది పరిస్థితి. కొంతమందికి సంగీతంలో కావలసిన మేర జ్ఞానం ఉంటుంది. వాళ్లు కొత్త కంపోజిషన్ నేర్చుకోవాలి అన్నా, కొత్త రాగం నేర్చుకోవాలన్నా అది ఒక మాస్టర్ దగ్గర నుంచి నేర్చుకోవటం ద్వారానే సాధ్యం అవుతుంది..

**ఋసిఋ :** **మన సంగీతానికి భక్తి ప్రేరణ ఎక్కువ ప్రకృతి ప్రేరణ ఎక్కువ లేకపోతే గణిత శాస్త్రమా చెప్పండి?**

**ద్వారం :** మీరు గణితశాస్త్రం ప్రస్తావన తెచ్చారు కానీ, నొటేషను అసలు ప్రేరణ కాదు.. నొటేషన్ వలన గురువు దగ్గర ఏ గొప్పతనం ఉందో అది మనకు అందదు..ఒకే నొటేషన్ ఇద్దరు ఎక్స్పర్ట్స్ కిచ్చి చేయమన్నారనుకోండి.. రెండింటిలో తేడా ఉంటుంది. నొటేషన్స్‌లో కూడా తేడా ఉంటుంది.. ఒక్కో పుస్తకంలో ఒకోలా ఉంటుంది.. It can represent sound.. ఇందులో అక్షరాలు లేవు కదా!

**ఋసిఋ :** **మరి రాగాలు ఏ విధంగా రూపొందుతాయి లేదా గుర్తిస్తారు?**

**ద్వారం :** 12 స్వరాలుంటాయి 22, లేదా 24 శ్రుతులు ఉంటాయి. అసలు మీరు ప్రశ్న వేసింది జానపద సంగీతంలో శుద్ధంగా పాడటం గురించి. ఒకేపాట ఇద్దరూ పాడితే తేడా ఎలా ఉంటుంది. ఎందుకు ఉంటుంది అనేది పక్కన పెడితే తేడా ఉండాలి అంటుంది ఈస్థటిక్స్ it is not regimented. దీనికే ప్రత్యేకంగా పేర్లు పెట్టారు. దీన్నే మనం సంగీత జ్ఞానం ఇండివిడ్యువల్‌గా ఉంటుందండీ, సోషల్‌గా ఉంటుంది, పాకెట్స్‌లో ఉంటుంది, ప్రాంతీయంగా ఉంటుందని చెబుతాం.

**ఋసిఋ :** **అంటే సంగీతానికి ప్రేరణ ప్రకృతే..చెట్లూ మేఘాలు..**

**ద్వారం :** కాదూ అనలేం, అవును అనలేం

**ఋసిఋ :** **కర్నాటక సంగీతానికి భక్తి ప్రేరణ ఎక్కువ కదా?**

**ద్వారం :** సరే భక్తి అనుకుందాం. ఎవరి గురించి ఆ భక్తి. త్యాగరాజ స్వామి గారు ఉన్నారు. అమ్మవారి గురించి రాశారు.. శివుడు గురించి రాశారు. రాముడు గురించి రాశారు.. భక్తి అనేది స్క్రిప్ట్‌లో ఉండటం వేరు.. కబీరు తులసీదాసు ఇద్దరూ భక్తి గురించి రాశారు కదా. ఎవరు ఎలా రాశారో చూడండి.. కబీరు దోహాలే రాసాడు, కానీ ఎవరి గురించి రాశాడు? సంఘం గురించి రాశాడా? సామాజిక అంశాల గురించి రాశాడా? బతుకులో ఉండే విలువల గురించి రాశాడా లేదా కొన్ని మతపరమైన కట్టుబాట్లు గురించి రాశాడా? అని విశ్లేషించి చూశారు.. అవి నిలిచిపోయాయి

**మిసిమి : కర్నాటక సంగీతంలో కీర్తన కారుడు భక్తి భావంతో తనను తాను సమర్పించుకోవటం ఉంటుంది కదా?**

**ద్వారం :** భక్తి భావన త్యాగరాజస్వామి వారి అన్ని కీర్తనల్లో కనిపిస్తుంది.. రాముడు గురించి పాడినప్పుడు కొంతమందికి రాముడు ఎదురుగా ఉన్నట్లు కనిపిస్తుంది.. కొంతమందికి రాముడు విగ్రహం కనిపించవచ్చు.. ఆ క్షణంలో రామాయణాన్ని re-live చేసే వారుంటారు. కొంతమందికి ఆ కాన్సెప్టే కనిపిస్తుంది.. త్యాగరాజస్వామి వారికి మాత్రం రాముడి గురించి పాడే తన మనస్థితి కనిపిస్తుంది..

**మిసిమి : మీరు చెప్పే దాని ప్రకారం.. స్వయం ప్రకృతి భావం లేదా బయట ప్రకృతి ప్రేరణ అవునా?**

**ద్వారం :** కొన్ని ఐడియాస్‌ని పాటిస్తూ ఉంటాం కదా! మనం ఒక పరంపరగా, ఆ ఐడియాలు ఏమిటంటే .. మొదటగా గురువు గురించి.. గురువంటే మూడు అర్థాలున్నాయి.. అంటే విద్య నేర్పించేవాడు, అలాగే పెద్ద అన్నగారు, తండ్రి అని కూడా భావిస్తాం.. గురువు అంటే ఈ మూడు అర్థాలు చెప్తారు మా వాళ్ళు.

**మిసిమి : గురువు దగ్గర నేర్చుకునే క్రమంలో మీరెక్కడ ప్రాజెక్టు అవుతారు. గురువు చెప్పినట్లు చేయటమే సరిపోతుంటే..**

**ద్వారం :** గురువు చెప్పినట్లు చేయొద్దంటారు మావాళ్ళు. ద్వారం స్కూలు ఏమిటంటే కాపీ చేయకండి... మేం చేసినట్టు చేయకండి అని చెప్తారు.. నేను వాయించినట్టు వాయించకండి అని చెబుతారు.. ఇప్పటి గురువులు దీనికి భిన్నంగా ఉంటారు. నేను వాయించిన విధంగానే వాయించు అని చెప్తారు.. శృతి పత్రిక తెలుసు కదా... సంగీతంపై వచ్చే మంచి పత్రిక. ఆ పత్రిక ఇప్పుడూ వస్తోంది. 20 ఏళ్ల నాటి విషయం చెప్తాను.. డి.కె.పట్టమ్మాళ్ గారు ఆ పత్రికలో ఏం రాశారంటే, మా చిన్నప్పుడు మేం నేర్చుకుంటున్నప్పుడు, పదిమంది గొప్ప విద్వాంసులు పదిరకాలుగా పాడుతుండేవాళ్ళు.. ఇప్పుడు మా మనవరాలే నాలా పాడటం లేదు అందావిడ.. తన మనవరాలు తన దగ్గర బేసిక్స్ నేర్చుకున్నా, తన స్టైల్ అలవాటు చేసుకోగలిగింది.. అలా ఆ రోజుల్లో ఒక వెరైటీ పదిమంది దగ్గర వినేవాళ్ళం.. ఇప్పుడు నా స్టైలే మా ఇంట్లో లేదంటే, మరో స్టైల్ డెవలప్ చేసుకోగలిగింది అన్నదావిడ.. పదిమంది ఒకేలా పాడుతుంటే పదకొండోవాడు వాడు కూడా అలాగే పాడతాడు.. దీన్ని డామినెన్స్ ఆఫ్ కామనాలిటీ అనొచ్చేమో.

**మిసిమి : ఆవిడ మనవరాలు వింటూ వింటూ నేర్చుకుందా.. గురువుల దగ్గర నేర్చుకుందా?**

**ద్వారం :** ఒక గురువుకు, పరిణితి సాధించిన శిష్యుడికి వయస్సులో ఇరవై, పాతికేళ్ల తేడా ఉంటుంది.. టైములో తేడా ఉంటుంది.. ఒక్కొక్కప్పుడు ప్లేస్‌లో కూడా తేడా ఉంటుంది.. అందుకని ఈ శిష్యుడు గురువునే కాకుండా, మిగిలిన వాళ్ళని వింటూ ఉంటాడు కదా.. ఒక కామనాలిటీని రుద్దే విధంగా సమాజంలో ఏదో జరుగుతోందని నేను అనుకుంటాను. అమెరికాలో పనిచేసేచోట కార్మికులు వేసుకునే జీన్స్ కమర్షియలైజేషన్, మార్కెట్ ట్రెండ్‌తో తర్వాత జీన్స్ ధరించటం ఫేషన్‌గా మారిపోయింది కదా.. Mc Luhan ఏమన్నాడు. Hair style is the fashion of the poor.

**మిసిమి : కర్నాటక సంగీతంలో ఫ్యూజన్ మ్యూజిక్ కలవటం ఈ కామనాలిటీలోంచి వచ్చిందా?**

**ద్వారం :** పూర్వకాలంలో అమెరికాలో జాజ్ మ్యూజిక్ ఉందంటే, అమెరికాలోనే ఉండేది. దానివలన ఒకరకమైన ఈస్థటిక్స్ డెవలప్ అయ్యాయి. అందులో ఒక సఫరింగ్ ఉంటుంది. హైలీ స్పిరుచ్యుయల్‌గా ఉంటుంది.. మన దగ్గర సఫరింగ్ లేదు.. ఒక religious intent మాత్రమే ఉంది.. రాముడి కోసం కన్నీరు కార్చడం అనేది లోకకళ్యాణం కోసమని భావించారు.. దానికీనీ, ఈ భక్తికి ముడిపెడతారు.. మీడియా వలన అన్నింటికీ ఒక ఎక్స్పోజర్ వచ్చింది.. కొత్త శక్తి పెరుగుతుంది..దాన్నే new energies అంటున్నారు.

**మిసిమి :** **మానవ చరిత్రలో ఇదో కొత్త స్థితి.ఇది సంగీతమే కాదు.. అన్ని విషయాలకు.. దీని వలన పాత పద్ధతిలోని విలక్షణత సమస్యలోకి వచ్చిందని మీరు కూడా అంటున్నారు.. మీ తరం వారు ఎలా తీసుకుంటారు. ఇంకొంచెం సింప్లిఫైడ్‌గా అడుగుతాను. మీరు వయొలిన్ అక్కడినుంచి తీసుకొచ్చారు. దానిలా ఈ కొత్త ట్రెండ్ తీసుకోగలరా న్యూ స్టైల్‌లోని న్యూ ఎనర్జీని.**

ద్వారం : తీసుకోలేం.. ఎందుకంటే నేను మొట్టమొదట చెప్పాను.. హార్మోనిక్ మ్యూజిక్ అనేది ఒకటుంటుందని, ఈస్టర్న్ మ్యూజిక్‌కి ఒక కామనాలిటీ ఉంది.. అది ఇండియన్, చైనీస్, బాలినీస్ ఏదైనా కానివ్వండి.. కామన్ ఈస్థటిక్ ప్రిన్సిపుల్స్ ఏవో ఉన్నాయి.

**మిసిమి :** **మరి ఈ న్యూ స్టైల్, న్యూ ఎనర్జీని ఒప్పుకోగలమా?**

ద్వారం : అవి వచ్చేశాయి మన జీవితంలోకి.. ఇప్పుడేమీ చేయలేం..

**మిసిమి :** **టాలరేట్ చేయగలుగుతున్నారా?**

ద్వారం : టాలరేషన్ కొన్నింటికే ఉంటుందండీ.. కొంతమంది కర్నాటక సంగీతం పాడితే నాకు నచ్చదు. అలాగే కొంతమంది వయొలిన్ వాయిస్తే నాకు నచ్చదు. వాళ్ళు మాస్టర్సే.. ఒకరి విద్యను ఇంకొకరితో పోల్చినా నేను మెచ్చలేను.. అది ఇండివిద్యుయాలిటీ అనుకుందాం.. అదొక్కటే చాలదు కదా.. బేసిక్ ప్రిన్సిపుల్స్ కొన్నుంటాయి.. మన ప్రాంతమో, మన ఈస్థటిక్సో..

**మిసిమి :** **కర్నాటక సంగీతంలో వచ్చిన మార్పులు హిందూస్తానీ సంగీతంలో ఎందుకు రావటం లేదు?**

ద్వారం : కార్నివాల్ సెలబ్రేషన్ సౌత్ ఇండియాలో ఎక్కువ.. నార్త్ ఇండియాలో ఈస్థటిక్ బేలన్స్ ఎక్కువ అనిపిస్తుంది.. "మీరు అమృతం తాగారయ్యా" అని నాయుడు గారు హిందూస్తానీ విద్వాంసులతో అంటుండేవారు.. అంటే ఆ సుఖభావం వారికి తెలుసునండీ..

**మిసిమి :** **ఐరోపా సింఫనీస్ మీరూ వినే ఉంటారు.. నేనూ విన్నాను.. వీణ లాంటి భారతీయ వాయిద్యం అందులో లేదు.. మనమేమో అన్నీ అడాప్ట్ చేసుకున్నాం..**

ద్వారం : సంగీతంలో ఒకటి స్వర సమ్మేళనం, మరొకటి రాగ పద్ధతి.. ఈ రాగ పద్ధతి ఏమిటంటే లీనియర్ ప్రజెంటేషన్ ఆఫ్ స్వరాస్.. ఒకదాని తర్వాత ఒకటి వస్తుంటాయి.. ఆ కంటిన్యూటీ కోసం మనం గమకాలు వాడుతూ ఉంటాం.. ఇది వాళ్లకు లేదు. వాళ్లకు నచ్చలేదు..ఇది ఇండివిద్యువల్ కాన్సెప్ట్.. కానీ వాళ్ళలో మన అందరం కలిసి మ్యూజిక్ చేయాలి అనేటువంటి భావన వచ్చింది.. ఇది ఎప్పుడు వచ్చింది- రినైజాన్స్ టైంలో వచ్చింది.. ఇక్కడ వాయిస్‌కు అనుకూలంగా ఉండేటువంటి ఇన్‌స్ట్రుమెంట్స్ కొన్ని ఉంటాయి. వాటికి కీస్ ఉండవు, అంటే మెట్లు ఉండవు.. మనకి స్వర సప్తకం ఉంది అంటే ఈ ఏడు స్వరాలే మళ్లీ మళ్లీ రిపీట్ అవుతుంటాయి.. మంద్రస్థాయి అంటాం .. తారాస్థాయంటాం.. అతి తారాస్థాయి అంటాం... ఇలా మన దగ్గర మైక్రోటోన్స్ ఉంటాయి. ఈ మైక్రోటోన్స్ వాళ్ళు వాడరు.. వీణ, సితార్, తబలా వంటి వాయిద్యాలు ఇండియన్ సెన్సిబిలిటీస్ కోసం అభివృద్ధి పరచబడ్డాయి. వీటిని facile instruments అంటారు. ఇవి ఆ మ్యూజిక్‌కు మేచ్ కావు.. వాళ్ళ ఈస్థటిక్స్‌కి అవి పడవు..

**మిసిమి :** **మ్యూజిక్ థెరపీ నమ్ముతారా?**

ద్వారం : నమ్మను కానీ, ఎవరికి వారు పాడుకున్నప్పుడు మ్యూజిక్ థెరపీలా పనిచేయవచ్చేమో.. నేను పాడతాను. రిలీఫ్ పొందుతాను అని ఎవరూ చెప్పరు అని నేననుకుంటాను..

**మిసిమి :** **సంగీతం కూడా ఒకవిధమైన టెక్నికల్ కోర్సేనా?**

ద్వారం : సర్టైన్లీ.. అన్ని కళారూపాలు టెక్నికలే కదండీ..

**మిసిమి :** **సైకిల్ బాగుచేయడం, సంగీతం నేర్చుకోవడం రెండు సాంకేతిక విద్యలేనా?**

ద్వారం : if I can speak my mind frankly. For a human being, the highest technical education that is reflected in performance is Sex ..How you use your body for your own pleasure,

how you use another person, for your pleasure and her/his pleasure .. That the highest technique, we have developed all our aesthetics..All our sense of beauty.. You have started learning that right from sulking age.. That should happen in every activity we take up.

**మిసిమి :** **ద్వారం వెంకటస్వామి నాయుడు గారు ఒక సభలో ఒక మాటన్నారు.. మ్యూజిక్ నేర్చుకునేవారు ఒక మూసలో చిక్కుకూడదు.. నవనవోన్మేషంగా ఉండాలన్నారు..**

**ద్వారం :** ఆయన జీవనసూత్రమే అదండీ..ఈ సూత్రం పూర్వగ్రంథాల నుండి మనకు వస్తూనే ఉంది.. ఎక్కడైతే నవనవోన్మేష, శాలిని, ప్రజ్ఞ ఉంటుందో, అది ప్రతిభ అని చెబుతున్నారు వాళ్ళు.. అది చివరిది.. ముందేం కావాలంటే ప్రజ్ఞ కావాలి.. కౌశలం కావాలి.. అప్పుడు చివరన నీకు తట్టనిదేదో తడుతుంది.. అది నవనవోన్మేషణ..శాలిత్వం.. దాని గురించి వెతుకుతూ ఉండాలి. అది వచ్చినప్పుడు ప్రతిభ వెలుగుతూ ఉంటుంది.

**మిసిమి :** **బాగా చెప్పారు.. మీరు అంట్యాకుల పైడిరాజు దగ్గర చిత్రకళ నేర్చుకున్నారు.. ఎంతవరకు సాధించగలిగారు?**

**ద్వారం :** నాకు తృప్తి కలిగించినంతవరకు..

**మిసిమి :** **ఐరోపా సాహిత్యమంతా ఆంగ్లంలో వచ్చింది.. చదివారా.. బాల్జాక్ చదివారా..**

**ద్వారం :** కొంతమంది ఇష్టమైన రచయితలున్నారు.. అందులో బాల్జాక్ గూడా ఉన్నాడు.. మరీ ఎక్కువగా చదవలేదు..

**మిసిమి :** **నేను బైరన్, షెల్లీ, కీట్స్ జీవితచరిత్రలను తెలుగులో అనువాదం చేశాను. అలాగే రాజారావు Serpent and the Rope ని కూడా. చదివే ఓపిక ఉందా?**

**ద్వారం :** ఆ పుస్తకాలు మీ గ్రంథాలయంలో చూశాను. ఇవ్వండి.. ప్రయత్నం చేస్తాను..ఈ వయసులో కంటిన్యుయస్‌గా చదవటం కష్టమే.. నాకన్నా మా ఆవిడ పుస్తకాలు బాగా చదువుతుంది.. బాగా విశ్లేషిస్తుంది.. ఇవాళ మీతో సంభాషణ నాకు చాలా నచ్చింది.. ఇది కూడా ఒక పెర్ఫార్మెన్సే నాకు.. I have been talking to my student like this for the past four decades…ఇది భరించలేకే నా దగ్గరకు చాలా మంది రారు.. కబుర్లు చెబుతాడాయన.. వెళ్ళకండంటారు.. నేనోదో నేర్పిస్తున్నాను వాళ్ళకి.. దాని బ్యాక్ గ్రౌండ్ చెప్పాలి కదా..

**మిసిమి :** ***మిసిమి* ఎప్పటినుంచో చదువుతున్నాను అన్నారు. ఏం నచ్చిందో చెప్పండి?**

**ద్వారం :** కొన్ని ఆర్ట్ వర్క్స్ నచ్చవండీ.. అవన్నీ లిమిటెడ్‌గా మా లైబ్రరీలో ఉన్నాయి.. జనం కోసం వేస్తున్నారు.. వాళ్ళకి జ్ఞానం ఇస్తున్నారు.. సంతోషం.. కానీ నాకు నచ్చాలి కదా.. ఇదివరకు రాయించారు కదా, పెద్దవారిచేత.. కాలంతో వచ్చిన మార్పులతో అవి తగ్గాయి.. ఆ మార్పు నాకు నచ్చదు..

**మిసిమి :** **ఎందుకు మారుస్తున్నామంటే.. వర్తమానంలో ఉంచడం కోసం.. గతంలో ఉండటం ఇష్టం లేక..**

**ద్వారం :** ఏమైనా ***మిసిమి*** ఒక్కటే.. ఇంకోటి లేదు. నాకు సాహిత్యం చదవటంలోను, రాయటంలోను ఈ రకమైన ధోరణి ఎలా అలవడిందంటే పురిపండా అప్పలస్వామి మాస్టారు వంటి పెద్దల సాంగత్యం.. అప్పలస్వామి మాస్టారు లైబ్రరీలో లిటరరీ క్రిటిసిజం మీద ఎన్ని పుస్తకాలో..

**మిసిమి :** **దుర్గా ప్రసాద్ గారు..మన శాస్త్రీయ సంగీతం మధ్యతరగతి సమాజాన్ని చేరకపోవటానికి ముఖ్య కారణం ఏమిటి?**

**ద్వారం :** హఠాత్తుగా మీరు ఈ ప్రశ్న వేశారు.. కళలు పోషించేవారిపైనే మా దృష్టి ఉంటుంది కానీ ఏవర్గం వారికి ఇది చేరుతోంది అనే అంశాన్ని మేం ఆలోచించం. విద్వాంసులలో ఉండదది. ఇది ఎవరిలో ఉంటుందంటే ఒక సామాజిక స్పృహ ఉన్నవారిలోనో.. లేదా మనతోపాటు వాళ్లు కూడా వింటే బాగుంటుంది కదా అన్న సహృదయులుంటారే వారిలో ఉంటుంది..

**మిసిమి :** **మీ పెర్ఫార్మెన్స్ పదిమందికి చేరాలన్న తపన మీలో ఉందదా?**

**ద్వారం :** ఎందుకు ఉండదు తప్పకుండా ఉంటుంది. అయితే కొన్ని కళలు అనుభవ తీవ్రతతో అనుభవించవలసినవి ఉంటాయి.. అందులో సంగీతం ముఖ్యమైన విద్య లేదా కళ…దాని తీవ్రతకు, ఆ లోతైన ఆ గాంభీర్యానికి,

ఆ సౌందర్య భావన విస్తృతికి.. వీటికి ఒక స్కేల్ అంటూ ఏమీలేదు.. మేమేదయితే కర్నాటక శాస్త్రీయ సంగీతం అంటున్నామో, అలాగే జానపద సంగీతం అని మరొకటుంది కదా..ఈ రెంటికీ సౌందర్య తీవ్రతలో తేడాలేదు.. సౌందర్య విలువలో కూడా తేడా లేదని నా భావన.. అయితే సాంఘికంగా, ఒకే సమూహంగా ఒకే గుణంతో బతుకుతున్నామా లేదా అనేది ఆలోచిస్తే మాకు తడుతుంది. ఎవరికైనా సౌందర్య దృష్టి ఉంటుంది. వారికున్న పరిమితుల్లో దాన్ని వెతుక్కుంటారు. ఎందుకంటే గ్రామాలకు, అటవీ ప్రాంతాలకు వెళ్ళి వారి సంగీతం విన్నప్పుడు కలిగిన అనుభవం ఇది .. నిజం చెప్పాలంటే మన సంగీతం వినటానికి వీళ్ళు రారే అని వాళ్ళకూ ఉంటుంది.. మా సంగీతం వీళ్ళు వింటే బావుంటుందని మాకూ ఉంటుంది.. అందుకొని సాంఘిక స్థితి మారితే అన్ని కళలు అందరికీ చేరతాయి.

**మిసిమి : సాంఘిక స్థితి మారటం అంటే ఏమిటి?**

ద్వారం : మీ ప్రశ్నలోనే ఉంది కదా.. మధ్య తరగతి వాళ్ళు అంటున్నారు. ఎవరీ మధ్యతరగతి వాళ్ళు?

**మిసిమి : మధ్యతరగతి వాళ్లు ఎవరో నేను చెప్తాను. వాళ్లు ఎంత సంపాదిస్తారో అంత దాచుకోలేదు. అంత ఖర్చు పెట్టేయాల్సి వస్తుంది. వాళ్లకి సినిమా చూడాలని, బయట హొటల్‌లో టీ తాగాలని ఉంటుంది, కానీ వీలు కాదు.. ఇలాంటి చిన్న చిన్న ఆనందాలు వాళ్లకి ఉంటాయి కానీ తీర్చుకోడానికి వీలుండదు. కానీ ఆ మధ్యతరగతి ఇప్పుడు చాలా మారిపోయింది. 20 రూపాయలు పెట్టి టీ తాగే వాళ్ళు ఇప్పుడు నీలోఫర్‌కి వెళ్లి 200 రూపాయలు టీ తాగుతున్నారు.. వందల రూపాయలు పైగా ఖర్చు పెట్టి సినిమా చూస్తున్నారు కానీ మీరో వంద రూపాయలు సంగీత కార్యక్రమానికి పెడితే రావటం లేదు.. అలాగే నాటకం లాంటిది కూడా చూడటం లేదు.. ఇలా అతన్ని చేరలేకపోతున్నాం మనం..**

ద్వారం : మీరు చెప్పిన దాంట్లో అతని జీవన శైలి అర్థమవుతుంది. కళకు అవసరమైన విలువల పట్ల అతను ఎంత అభిమానంతో ఉన్నాడో తెలియట్లేదు.మా సంగీత కళాకారులను పరిశీలిస్తే వీళ్ళు మధ్యతరగతి కన్నా దిగువ స్థాయిలో ఉన్నారు.

**మిసిమి : ఒకసారి సంగీత కళాకారులకు ఆ విద్వత్తు వచ్చిన తర్వాత ఇక ఆ లైన్ దాటి పోతారు వాళ్ళు.. ఒక గ్రూప్‌లో చేరిపోతారు వాళ్ళు.. ఒక సాంఘిక పరిమితి లేదు.**

ద్వారం : ఏ గ్రూపులో చేరిపోతున్నారు! అది కూడా చూడాలి కదా..

**మిసిమి : నేను మరోలా చెప్తాను ..సంగీత కళాకారులు లేదంటే కర్ణాటక సంగీతం వైడర్ గ్రూప్ ఆఫ్ ఆడియన్స్‌ని ఎందుకు చేరలేకపోతోంది? ఒక సెక్షన్‌కే ఎందుకు పరిమితం అయిపోతున్నారు.. అంటే మిగిలిన వాళ్ళు ఎంజాయ్ చేయలేకపోతున్నారు.. ఆ సంగీతాన్ని ఆస్వాదించలేకపోతున్నారు అని నా అభిప్రాయం!**

ద్వారం : ఎందుకు ఈ సంగీతం ఒక సెక్షన్‌కే పరిమితం అయిపోతోంది అనేది కాస్త ఆలోచిస్తే అర్థమయిపోతుంది.. సాంఘిక విలువలు గురించే చెబుతున్నాను.. చదువు సమగ్రంగా ఉండాలి.. విలువలు సమగ్రంగా ఉండాలి.. అంటే అందులో అన్నీ ఉండాలి..

**మిసిమి : మన చదువులో సంగీతం లేదు కదా అంటే సిలబస్‌లో ప్రత్యేకించి సంగీతం లేదు కదా..?**

ద్వారం : ఇప్పుడు లేదు కానీ.. ఎవరికైనా వారి చదువులో ఒకప్పుడు సంగీతం ఉండేది.. సంగీతం కానీ శిల్పం కానీ ఎవరు వదిలేయలేదండి.. వారి స్థాయిలో వారు ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు.. ఒకటే ఏమిటంటే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నప్పుడు ఒకస్థాయిలోకి వెళ్లాలంటే ఒక రకమైన క్రమశిక్షణ ఉండాలి.. అప్పుడు దాంట్లో ఉండే ఆనందం వేరుగా ఉంటుంది.

**మిసిమి : మీరన్న దానికి అడ్డు వస్తున్నాను. కర్ణాటక శాస్త్రీయ సంగీతంతో పోలిస్తే హిందుస్తానీ సంగీతం ప్రజల్లోకి బాగా వెళ్ళింది.**

ద్వారం : ఇక్కడ ఒకటి గమనించాలి. ఏ పరిస్థితుల్లో ఆ సంగీతం మీరన్నట్టు ప్రజల్లోకి వెళ్ళింది, ఎలా పెరిగింది ఈ అంశాలను పరిశీలించాలి.. దీనికైనా సామ్యం ఉందా లేదా చూడాలి..

***మిసిమి* : ఒక కంపారిటివ్ స్టడీ వంటిది జరగాలి అంతేనా!**

**ద్వారం :** మా కుటుంబం గురించి చెప్తాను. మా తాతగారు వెంకటస్వామి నాయుడు గారు ఈ రెండు కలిసిపోతే బాగుంటుందేమో అనేవారు. ఆయన్ని ఇదే ప్రశ్న శ్రీరంగం నారాయణబాబు, ఆరుద్ర ఒక ఇంటర్వ్యూలో అడిగారు.. అది ఆంధ్రప్రభ. దాంట్లో వచ్చింది.. నారాయణ బాబు ఏం అడిగాడంటే హిందుస్తానీ సంగీతం ఉంది! కర్నాటక సంగీతం ఉంది! ఇలా రెండు సంగీతాలు ఎందుకు ఉండాలి అన్నాడు.. రెండు ఎలా ఏర్పడ్డాయి అని అడుగుతూనే ఈ రెండు సంగీతాలు కలపటానికి ఏమన్నా వీలుందా అని నారాయణ బాబు అడిగాడు.. దానికి నాయుడు గారు ఏమన్నారు అంటే ఈ రెండు సంగీతాలు కలిసిపోతే నాకు చాలా సంతోషంగా ఉంటుంది అన్నారు.. కానీ ఎవరు చేస్తారు..ఆయనకీ ఈ సందేహం ఉండేది.. మొదట్లో ఈరెండు విధాలు కలిపిన భారతీయ సంగీతం ఉండేది. తర్వాత్తర్వాత అవి ప్రత్యేకతలను సంతరించుకున్నాయి.. దానికున్న చారిత్రక, భౌగోళిక కారణాలను పరిశీలిస్తే అదో పెద్ద అధ్యయనం అవుతుంది.

***మిసిమి* : కర్నాటక శాస్త్రీయ సంగీతం అన్ని తరగతులకు చేరటం లేదు. హిందుస్తానీ సంగీతం మాత్రం అందరికీ చేరుతోందని మీరంగీకరించారు.**

**ద్వారం :** దానికి చాలా కారణాలుంటాయండీ. వాటి జోలికి వెళితే చాలా వివరంగా చెప్పుకోవాలి.. కారణాలంటే ఒక ఆర్ట్ ఫాం పెరగటానికి అనువైన పరిస్థితులు.. అది ప్రజలతో ఎలా సంబంధం ఏర్పరుచుకుంది.. ఇందులో ఏమన్నా శాఖలున్నాయా .. ఇలాంటి టెక్నికల్ అంశాలుంటాయి..

***మిసిమి* : మన శాస్త్రీయ సంగీతం భక్తికీ, రక్తికీ పరిమితమయిపోయిందా.. వాగ్గేయకారులు భక్తి గురించి చెప్పారు..కానీ జావళీలన్నీ రక్తికే కదా..**

**ద్వారం :** అవన్నీ నేటి ప్రత్యేకతలు, వాటికున్న విషయాలు కావనుకుంటాను. రక్తి అంటే ఒక రంగు.. ఆ రంగు మనసులో ఏర్పడాలి ఈ విద్యవలనో, కళవలనో.. అందుకని భక్తికి, రక్తికీ పెద్ద తేడా లేదు..

***మిసిమి* : భక్తి కూడా రంగేనా?**

**ద్వారం :** రక్తి దేనివలన వస్తుందంటే, ఆ మీడియం వలన.. అంటే నాటకం, సాహిత్యం ఏదైనా కావొచ్చు..

***మిసిమి* : రక్తి కట్టించమంటారు.. అదేనన్నమాట**

**ద్వారం :** అదేనండి..అయితే భక్తి దేనివలన వస్తుందంటే, అది నాలుగైదు రకాలుగా పాత సంప్రదాయంలో ఉండేది. ఇప్పుడు భక్తి అంటే దేవునియందో, ఇష్టదైవంమీదో మనసు లగ్నం చేయమంటారు.. ఒక విరహాన్ని ఏర్పాటు చేసుకొని దాన్ని వర్ణిస్తూ ఉంటారు. దాని ద్వారా ఒక తన్మయత్వాన్ని తెచ్చుకోవడం. అది ఎవరి వలన ఏర్పడుతుందంటే మనిషి వల్లే ఏర్పడుతుంది. రక్తి మీడియం వల్ల ఏర్పడుతుంది..

***మిసిమి* : ఇప్పుడు సంగీత రత్నాకరం ఉంది.. అందులో భక్తి గురించి ఉందా?.**

**ద్వారం :** నేనైతే ఎక్కువ చదువుకోలేదు దాని గురించి.. సంగీత రత్నాకరం వచ్చి 400 ఏళ్లకు పైనే అయింది.. అయితే ఏ శాస్త్రంలో కూడా అలా చెప్పరు కానీ ఫిలాసఫికల్‌గా చెప్తారు.. అందులో మీడియం గురించే ఎక్కువ చెబుతారు.. అది ఆధ్యాత్మికంగా కూడా అని చెప్పలేను ఒక తాత్విక దృష్టితో చెప్తారు. జీవం గురించి చెప్తారు సంగీతంలో ..మనిషి గర్భంలో ఎలా ఉండేవాడు తర్వాత ఎలా మారాడు ఇలాంటి అంశాలు .. మనిషి పుట్టిన తర్వాత పరిసరాలు వ్యక్తులు అతన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో, ఆ సౌందర్యాన్ని కూడా అతను సహజంగా గ్రహిస్తాడు. ఈ సౌందర్య దృష్టి నుంచే అన్ని మొదలవుతాయండి. మీరు సంగీత రత్నాకరం గురించి అడిగారు. సంగీతరత్నాకరంలో ఈ మీడియం నుంచి వచ్చిన అంశాలే ప్రస్తావనకు వచ్చాయి. సంగీతం అంటే స్వరమే కదా.. మాటలో కూడా స్వరం ఉంది. మీరు ఏ గ్రంథం తీసుకున్నా కూడా “స్వతో రంజయతి స్వరం” అంటారు.. స్వరం నుంచి రాగం పుడుతుంది..ఇక రాగం అంటే అనేక అర్థాలు ఉన్నాయి కదా.. అనురాగం కావచ్చు.. ఇంకేదైనా కావచ్చు. రాగానికి ఒక శ్లోకము ఉంది ఈ శ్లోకాన్ని అందరూ కోట్ చేస్తారు ఆ శ్లోకము ఏమిటంటే.. **జియసౌ ధ్వని విశేషస్తు.. స్వర వర్ణ**

**విభూషితం.. రంజకౌచిత్తానాం.. సరాగా కలితౌ బుధైత్..** స్వర సమూహం మనిషికి ఆనందాన్ని ఇస్తుంది.. అది ఎలాంటి ఆనందం ఇంకెక్కడా దొరకని ఆనందం అన్నమాట. రంజకౌ చిత్తానం అంటున్నారు..మనసు, మేధ అనటం లేదు.. చిత్తం అంటున్నారు.. అలా మీడియంని తాత్వికంగా వర్ణించారు లేదా వివరించారు. అందుకని మనిషి యొక్క తపన అనేక రకాలుగా ఉంటుంది. సౌందర్యం నుంచి లౌకికం వరకు అనేక రకాలుగా సాగుతుంది. తనకుండే భయాలకు ఆందోళనలకు ఒక మూర్తిని వెతుక్కుంటాడు.. మనశ్శాంతి కోసం పూజిస్తాడు దానివల్ల భక్తి వస్తుంది..

మిసిమి : **శాస్త్రీయ సంగీతంలో భావవ్యక్తీకరణకు అవకాశం లేకుండా పోయిందా? ఒక కచేరి జరిగినప్పుడు అందులో టెక్నికల్ అంశాల మీదే దృష్టి పోతుంది గాని అందులోని భావాన్ని ఆస్వాదించలేకపోతున్నాను.. ఇది నా అభిప్రాయం. అదే ఒక జానపద గీతం లోనూ ఒక లలిత గీతంలోను ఉన్న భావ సౌందర్యాన్ని ఇక్కడ నేను ఆస్వాదించలేకపోతున్నాను మీరేమంటారు?**

ద్వారం : కొంచెం వివరంగా చెప్తాను.. అసలు సంగీతం అంటే శాస్త్రకారులు చెప్పేటువంటి డెఫినేషన్ వేరు.. పాడటం, వాయిద్యం, నృత్యం ఇది సంగీతం చెప్పి వాళ్లొక వివరణ చెప్పారు.. వాళ్ల ఉద్దేశం ఏమిటంటే ఈ మూడు కలిసినప్పుడు సామాన్య జనం కూడా ఆ ప్రదర్శనలో ఒక రసస్పందన పొందుతారు అని.. అయితే ఎక్కడుంది రసం..నటుడిలోనా.. పాత్రలో ఉందా, సామాజికుడిలో ఉందా.. అయితే కొంతమంది రసస్పందన సామాజికుల్లో ఉంటుందంటున్నారు.అంటే సామాన్యుడు ఒక ప్రదర్శన చూసినప్పుడు , అందులో చిత్రితమైన ఏ భావం ఆ నటుడిలో కనిపిస్తుందో దాన్ని తన అనుభవంతో జోడించుకుని సహృదయుడవుతాడు అని.. అంటే తాదాత్మ్యం చెంది సంస్కారం పొందుతాడని..

మిసిమి : **మనం దాన్ని ఆధునిక భాషలో కనెక్ట్ అవ్వటం అంటున్నాం..**

ద్వారం : అయితే ఇది ఆ పరిస్థితి కాదు..నటన వేరు, రచన వేరు, సంగీతం వేరు అనే దశలో ఉన్నాం.. పూర్వం ఒక గ్రూప్ అయినా ఇది కలిసి చేసేవారు. ఒక కుటుంబం కలిసి చేసేది. ఇది రష్యన్ మోడరన్ సంప్రదాయంలో ఉందని స్టాన్‌స్లావ్‌స్కీ (Stanslavski) వాళ్ళు చెబుతారు.. మాస్కో థియేటర్ గ్రూప్ ఉంది. చెహోవ్ లాంటి రచయితను తెచ్చుకుంటారు. ఒక ఫ్యామిలీ కనెక్షన్‌లా ఆయన ఫీల్ అవుతాడు. మీరడిగిన ప్రశ్నలో ఎందుకు సంగీతం వేరుగా ఉంది.. ఎందుకు అంటే ఇది స్వరాల మీద ఆధారపడి ఉంది. స్వరాలకి సాహిత్యం జోడిస్తే కానీ భావం అనేది రాదు. ఒక భావంలో ఒక ఆలోచన ఉంటుంది. అది మనుషులందరికీ సహజమే అయితే దాన్ని వ్యక్తీకరించడం ఎలాగా. ఒక పిల్లవాడు ఉన్నాడు ఆకలేసింది.. నాకు ఆకలేస్తుంది అని ఎలా చెప్తాడు..ఆ చెప్పటం అతని భావ వ్యక్తీకరణ.. అది ధ్వని రూపంలో ఉంటుంది.. జంతువులు కూడా ఎక్స్‌ప్రెస్ చేస్తాయి. మనిషికి ఒక తృప్తితో ఒక శబ్దం వస్తుంది.. బ్రేవ్ మని త్రేన్పుతాడు. దానర్థం ఒక ఆనందాన్ని పొందటం.. అలాగే సంగీతంలో శబ్దాన్ని systematize చేశారు.. **స రి గ మ ప ద ని** అని.. స్వరాలు ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచమంతటా ఉంది. స రి గ మ ప అనేవి విచిత్రమైన ధ్వనులు. ఒక సంగీతంతో కూడినవి.. వాటికి, భావానికి ఎక్కడో ఒక దగ్గర సంబంధం ఉంది. పిల్లవాడి దగ్గరనుంచి కుక్క పిల్ల వరకు ఇంకా సముద్రంలో ఉండే చేపలు కూడా ఈ రకంగా వ్యక్తీకరణ చేస్తాయి.

మిసిమి : **ఇవన్నీ ప్రకృతిలోంచి తీసుకున్నారా.. కోయిల పలికేపాటలో అనేక మూడ్స్ కనిపిస్తాయి. నేను నిశితంగా పరిశీలించాను..**

ద్వారం : అన్ని ప్రకృతిలోంచే వస్తాయి. స్త్రీ తత్వం సామూహికమైంది..పురుషుడిది వ్యక్తిగతమైనది.. కోరిక అనేది మగవాడిలో ఎక్కువ. అది మనకు అన్ని మగ జంతువులలో కనిపిస్తుంది..

మిసిమి : **నేను అనేది ఏంటంటే ఈ భావవ్యక్తీకరణ అనేది ఈ టెక్నిక్ మోజులో పడి కొంత రిస్ట్రిక్షన్స్ ఏర్పరుస్తుందా అని అనిపిస్తుంది.**

ద్వారం : లేదండి టెక్నిక్ ఉండాలి..

**మిసిమి** : **నా అనుభవంలో ఈ టెక్నిక్‌లో సంగీతం పడిపోయి భావవ్యక్తీకరణ తగ్గిపోయిందా అనిపిస్తుంది. టెక్నిక్ భావాన్ని మింగేస్తోందా..**

**ద్వారం** : ఒక మహా విద్వాంసుడు ఉన్నాడు..ఈ టెక్నిక్‌తోనే సంపూర్ణంగా భావాన్ని ప్రకటిస్తున్నాడు. అయితే ఎంతమంది టెక్నిక్ కోసం వస్తున్నారు, ఎంతమంది సామాన్య జనం కేవలం ఆనందం కోసం వస్తున్నారో గమనిస్తాడు. అతనికి ఈ రెండింటినీ సమన్వయం చేసుకునే అవసరం ఉంటుంది. ఏ ఆర్టిస్ట్‌కైనా తను నేర్చుకున్నటువంటి సంగీతం కానివ్వండి, సంగీతంలోని టెక్నిక్స్ కానివ్వండి వాటిని చూపించాలి వచ్చిన వారికి అని భావిస్తాడు. దానికి ఆధారం టెక్నిక్కే కదా. ఏ కళకైనా మూలకారణమైన అంశం ఒకటుంటుంది.. అది ప్రదర్శిస్తేనే ఈ కళారూపం ఏర్పడుతుంది. ఈ కళారూపం అందరికీ అర్థం అవాలని లేదు. మా ఉద్దేశం ఏమిటంటే కొంతైనా టెక్నిక్ నేర్చుకోవాలి.. క్రికెట్ అందరం చూస్తాం.. కొంతయినా ఆ టెక్నికాలిటీస్ తెలిస్తేనే కదా, ఆ గేమ్‌ని ఎంజాయ్ చేసేది.. సంగీతం కూడా అంతే.. అన్ని విద్యలకు అదే వర్తిస్తుంది..

**మిసిమి** : **మీరన్న టెక్నిక్‌నే ఒప్పుకుంటాను కానీ మెలోడీ ఉండాలి. అది ఉండట్లేదు కదా?**

**ద్వారం** : భారతీయ సంగీతాన్ని రాగ్ ధారి సంగీతం అంటారు ఉత్తరాది వాళ్ళు.. మనం రాగసంగీతం అంటాం.. రాగం అంటే ఒక స్వరం తర్వాత ఒక స్వరం రావటం. దాంతోటి ఒక అందాన్నో..ఒక సౌందర్యాన్నో క్రియేట్ చేస్తాం.. మీరు మెలోడీ అన్నారు. మెలోడియస్ అంటే ఇంకో అర్థం సుఖంగా ఉండటం. స్వరసంబంధాల్లో ఉండేటువంటి ఒక అందాన్ని, ఒక బంధాన్ని చూడగలిగి ఉండాలి..అప్పుడే ఆ సౌందర్యాన్ని చూడగలుగుతాడు. ఇక్కడ అది వినికిడి విద్యగా గుర్తించాలి.. "సరిగమలు" లేకుండా స్వరం ఉండదు. అలాగే కోకిల తన స్వరం ద్వారా బాధ చెప్తుండొచ్చు.. ఇంకేదో చెప్తుండొచ్చు అది మనకు తెలియదు.. కానీ అవి లేకుండా అరవదు.. అందుకే మన శాస్త్రాలలో అన్ని ధ్వనులను జంతువుల ధ్వనులతో, పక్షి ధ్వనులతో పోల్చారు.. షడ్జమాన్ని మయూరంతో పోల్చారు.. రిషభం వృషభం అన్నారు.. రజినీకాంత్ రావు గారు దీనికి చక్కటి వివరణ చెప్పేవారు ఏ సభలోనైనా.. ఈ సరిగమల్లో "స" తర్వాత "రి" తర్వాత "గ" తర్వాత "మ" అనేది వైబ్రేషన్ ద్వారా వస్తుందని ప్రయోగాలు చేసి నిరూపించారు. అయినా ప్రతిదీ వివరించలేం కాబట్టి భగవత్ కృపతో పోలుస్తారు.. అందుకని భావం ఎక్కడుందంటే, అనుభవంలోనూ, ఆ రంగుల్ని చూడటంలోనూ ఉంటుంది.. గవాస్కర్ ఆడుతున్నాడనుకోండి.. మనకు అనుభవం లేకపోయినా అలా భావించుకుని ఆనందిస్తుంటాం.. అలాగే కర్నాటక సంగీతం అయినా, హిందూస్తానీ సంగీతం అయినా ఎంత టెక్నికల్‌గా ధ్వనించినా, కొంతయినా మనం ఆనందిస్తాం.. ఇరవై ఐదు శాతం మందికి టోన్ డెఫ్ నెస్ ఉంటుందిట.. వాళ్ళు సరిగమలు పోల్చుకోలేరు.. శబ్దం మాత్రమే గ్రహిస్తారు.. అలాగే కొంతమంది మృదువుగా మాట్లాడతారు. కొంతమంది హార్ష్‌గా మాట్లాడతారు.. రెండూ ఉండాలి.. ఇది ఒక స్టాండర్డ్ అని చెప్పటానికి లేదు.. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఏ కళయినా ఆనందం కలిగించాలి. దాన్ని చూడగలిగే సౌందర్య దృష్టి మనకుండాలి.. అలాగే మాధుర్యం ఉండాలి. మిరపకాయలో కూడా మాధుర్యం ఉంటుందిట. విశ్వనాథ సత్యనారాయణ గారు ఆవకాయలో పచ్చిమిరపకాయ నంచుకుని తినేవారుట.. అందులో మాధుర్యం కనిపించింది వారికి..

**మిసిమి** : **మీరు సౌందర్యం గురించి ప్రస్తావించారు కదా మాకో ఉత్తరం వచ్చింది.. ఆ ఉత్తరం రాసిన ఆయన ముంబైలో ఉంటారు.. అక్కడ ఓ హాస్పిటల్‌లోని నర్సుచెప్పిందిట..మా డాక్టర్ గారు సర్జరీ చేసి కట్టు కడితే ఎంత సుకుమారంగా కనిపిస్తుందో ఆ కట్టు అంటుంది.. ఒక చక్కని పువ్వుని చూసినట్టు ఉంటుంది.. ఇదెందుకు చెబుతున్నానంటే అందులో కూడా సౌందర్యం చూడగలిగింది ఆవిడ.. సౌందర్యం గురించి రాసిన వ్యాసంపై స్పందిస్తు ఆయన రాశారు.. మళ్ళీ మీరు చెప్పినదానికి వస్తే ఆర్టిస్ట్ పెర్ఫార్మెన్స్ ఎంత ముఖ్యమో, ప్రేక్షకులు దాన్ని ఆస్వాదిస్తూ ఆనందించటం ఇంకా ముఖ్యం..**

**ద్వారం** : కన్యాశుల్కం నాటకం గురించి శ్రీ శ్రీ మాట్లాడుతూ అదొక భీభత్సం కలుగచేసే నాటకం అంటాడు. అందులోంచే కదా సానుభూతి ఏర్పడుతుంది.. ఒక దారుణం జరిగినప్పుడు మన కళ్ళవెంట కన్నీరు

చిమ్ముతుంది.. అంటే ఒక సానుభూతి ఏర్పడుతుంది.. స్పందించగలిగే కల్చర్ మనలో ఉండాలి.. అప్పుడు అది సానుభూతి కింద మారుతుంది

**మిసిమి :** **నాకర్థమయిందేమిటంటే పెర్ఫార్మెన్స్ ఇచ్చేవారెంత ముఖ్యమో, చూసి ఆనందించి, స్పందించే వాళ్ళు అంత ముఖ్యం..**

**ద్వారం :** వాళ్ళు ఉండటం అనేది అంతకన్నా ముఖ్యం.. మన సంఘం ఉన్నతి చెందాలి. అప్పుడు ఆ ఆనందం అందరికీ చేరుతుంది.. అలాగే ఆర్టిస్ట్ పాడుతున్నప్పుడు ఎంతమంది తలలూపుతూ ఆ సంగీతాన్ని వింటే, ఆర్టిస్ట్‌కు అంత ఉద్రేకం వస్తుంది. అంటే అలాంటి ఒక తాదాత్మ్య స్థితికి ఆర్టిస్ట్ వెళతాడు. అది ఎవరి వలన సాధ్యం అంటే రసికులు వలనే కదా.

**మిసిమి :** **మెలొడీ కూడా it depends కదా..**

**ద్వారం :** yes… everything depends on what? మనసులో వీడికి ఒక అభిప్రాయం అంటూ ఏర్పడాలి.. జీవితాంతం ఒక అభిప్రాయం ఏర్పడాలంటే, పూర్వం తపస్సు చేసేవారు. వాళ్ళకో శుద్ధి ఉండేది. ఏం చెబితే అది జరగటం, అవసరమైతే అన్వయం చేసుకోవటం ఉండేదని చెబుతారు. ఇదికూడా అంతే.. తంజావూరు బృహదీశ్వరాలయంలో ఒక మహా విద్వాంసుడు ఉంటాడు.. అతనికి శిష్యులుంటారు. అతనికో శైలి ఉంటుంది. ఆ ఆలయం కట్టిన రాజుకో ఊహ ఉంటుంది.. నాలుగైదు వందల సంవత్సరాలుండేలా కట్టిస్తాడు..ఆ ఆర్కిటెక్చర్ ఎంత గొప్పదో, పల్లెటూరిలో ఉండే గుడిసె అంత గొప్పది. ఇవన్నీ ఒక సారూప్యత, ఒక సాపేక్షత కలిగి ఉంటాయి..

**మిసిమి :** **మన తెలుగు సినిమా సంగీతం జానపద సంగీతం, హిందూస్తానీ సంగీతం పై ఆధారపడి ఉంది.. అవునా?**

**ద్వారం :** జానపద సంగీతం ఒక భాగమండీ..మన సినిమా సంగీతం, అంతకు ముందు నాటక సంగీతం.. మరాఠీ నాటకం సంగీతంపై చాలా ఆధారపడుతూ వచ్చింది.. ముఖ్యంగా నాటకంలో అనేక రకాల ఫార్మ్‌ను వాడుకున్నారు..అదే సినిమాలో అయితే నౌషాద్,ఎస్.డి.బర్మన్ ఫోక్ ట్యూన్స్ వాడుకున్నారు.. ఓ.పి.నయ్యర్ వీళ్ళకంటే ఎక్కువగా హిందూస్తానీ సంగీతంలోని రాగాలు వాడుకున్నాడు.

**మిసిమి :** **ఇవన్నీ తెలుగు సినిమాలో మనవాళ్ళు తీసుకున్నారు కదా?**

**ద్వారం :** ముందు నాటకంలో మనవాళ్ళు ఆ సంగీతం వాడుకున్నారు.. తర్వాత సినిమాల్లో కూడా ఆ నటులే నటించారు కదా.. అలా ఆ హిందుస్తానీ సంగీతమే..ఆ ట్యూన్సే వాడుకోవటం మొదలెట్టారు..

**మిసిమి :** **ఒక ముప్పైఏళ్ల పాటు ఆ ట్రెండ్ నడిచింది. ఇప్పుడు మారిపోయింది.. ఫ్రాంక్ సినాత్రా ఒక పాట పాడాడు.. ఆ పాట "మై వే.". అతనే మళ్ళీ యాభై ఏళ్ల తర్వాత పాడాడు.. ఎల్విస్ ప్రెస్లీ కూడా పాడాడు.. చాలా మంది పాడారు ఎవరి పద్ధతిలో వాళ్ళు పాడారు.. ఇక్కడ త్యాగరాజస్వామి కృతిని ఒకే పద్ధతిలో పాడుతుంటారు..**

**ద్వారం :** జానర్స్ (genres) అంటారు కదా. అవి వివిధ రకాలుగా ఉంటాయి. డిఫరెంట్ జానర్స్‌ని మనం పోల్చి చూడకూడదు.. ఫ్రాంక్ సినాత్రా, ఎల్విస్ ప్రెస్లీ లేకపోతే బాబ్ డిలాన్ వాళ్ళు లిరిక్స్ కోసం పాడుకుంటారు.. మీరు పోల్చి చూడాలనుకుంటే "అవే మేరియా" అనే పాటను చూడండి.. మేరీ మాతను గురించిన పాట అది.. ఇటాలియన్ భాషలో ఉంటుంది. ఆ పాటను హష్షు బట్ ముందు కంపోజ్ చేశాడు. చాలామంది కంపోజర్స్ ఆ పాటను డీల్ చేశారు. అది చాలా ప్రసిద్ధమైన పాట. అలా జానర్ (genre) ఏమీ మారకుండా, సంప్రదాయం మారకుండా వివిధ రకాలైన ట్యూన్స్‌తో కంపోజ్ చేస్తారు. ఈ గాయకులేంచేస్తారంటే, వాళ్ళకి హృద్యంగా అనిపించిన ట్యూన్‌తో పాడతారు. కొన్ని పాటలు అలా ఉంటాయి. మరికొన్ని పాటల్లో మరోలా ఉంటుంది ఓపెరాను తీసుకుందాం ..ఓపెరా ట్యూన్స్ వినే ఉంటారు కదా..అవి ఎవరు పాడినా కొద్దిగా కూడా మార్చరు.. ఓపెరా కంపోజర్ వేగ్నర్ ఉన్నాడు. అతని పాటను కొద్దిగా కూడా మార్చరు.. మ్యూజికల్ బేలన్స్,పొయిటికల్ బేలన్స్ పోకుండా చూస్తారు.కంపోజర్ మారితే ట్యూన్ మారుతుంది.అది మేం కూడా గమనించాం.. మనకు కూడా క్షేత్రయ్య పదం పాడే పద్ధతి వేరు. ఆ తర్వాత వచ్చిన కృష్ణ లీలా తరంగాలు పాడటంలో ఉండే టెక్నిక్స్ వేరు. తర్వాత వచ్చిన త్యాగరాజస్వామి కీర్తనలు వేరు. అలాగే ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి కృతుల ట్రీట్మెంట్ వేరు. నౌషాద్ కంపోజ్ చేసే పద్ధతి

వేరుగా ఉంటుంది. అదే సలీల్ చౌదరి ఆ పాటను చేస్తే ఆ పాట విధానం మరోలా ఉంటుంది. ఒక్కోసారి గాయకుల కోసం కంపోజ్ చేస్తారు.. జబ్ దిల్ హీ టూట్ గయా .. అని సైగల్ పాడితే దాని ట్రీట్మెంట్ వేరు..

మిసిమి : **సైగల్ పాట మామూలు మనిషి కూడా ఎంజాయ్ చేయగలుగుతున్నాడు.. మీ సంగీతం అలా ఎందుకు లేదనేదే ప్రశ్న..**

ద్వారం : మామూలు మనిషంటే వెంకటస్వామి నాయుడు గారికి బాగా తెలుసండీ. సోజా రాజకుమారి పాటను ఆయన కచ్చేరీలలో వాయించే వారండీ. ఆయనకు తన కచేరీకి వచ్చినవారిని ఎలా మెప్పించాలో తెలుసు. మిగితావారిలో అది లేదు.

మిసిమి : **సింఫనీలో వయొలిన్ ముఖ్య వాయిద్యం.. కొరియన్ ఆర్టిస్ట్ సారాజంగ్ తన సింఫనీలో వయొలిన్‌తోనే లీడ్ చేస్తుంది.**

ద్వారం : మీరు టెక్నికల్ పాయింట్లు చెబుతున్నారు. ప్రతి సింఫనీలోనూ ఇరవై వయొలిన్లు, పదో, పదిహేనో శెల్లోలు, వయోలాలు ఉంటాయి. ఇలా స్ట్రింగ్ ఇన్స్ట్రుమెంట్స్ ఉంటాయి.ఫ్లూట్, క్లారినెట్ లాంటి విండ్ ఇన్స్ట్రుమెంట్స్ ఉంటాయి.వోకల్ పాడేవారుండరు.ఒక్క బీతోవెన్ తన సింఫనీ లో పెట్టుకున్నాడాయన.కోరల్ ఆర్కెస్ట్రా, సింఫనీ కలిసి ఎక్కువగా ఓపెరాలో మనకు కనిపిస్తుంది. మీరు వేగనర్ ఓపెరా చూస్తే గొప్ప ఫిలాసఫీ కనిపిస్తుంది. ట్యునీషియన్ ఫిలాసఫీ, వేగనర్ ఫిలాసఫీ ఒకటే అని చెబుతారు. వయొలిన్ వాయిద్యంలో ఒక హార్మొనీ ఉంటుంది. అది ఫ్లూట్‌లో ఉండదు. అందుకే సింఫనీలో వయొలిన్ కో కండక్టర్ ఉంటాడు.. మెయిన్ కండక్టర్ కాకుండా.. వెస్ట్రన్ ఆర్కెస్ట్రాలో ఫార్మ్స్ ఉంటాయి. సింఫనీ ఆర్కెస్ట్రా ఒక టైప్.. కాన్సెర్ట్ ఆర్కెస్ట్రా మరో టైప్.. సోలో వయొలిన్ విత్ ఎకంపనీడ్ సొనాటా వేరు.. అందులో వయొలిన్ వాయిస్తుంటే, పియానో ఫాలో అవుతూ ఉంటుంది. ఒక్క వయొలినే కాదు, ఫ్లూట్ సొనాటా ఉంది.. క్లారినెట్ సొనాటా ఉంటుంది..

మిసిమి : **జాజ్ గురించి చెప్పండి..**

ద్వారం : జాజ్ సంగీతం నల్లవారి నుంచి వచ్చింది.. తర్వాత వైట్ జాజ్ అని కూడా వచ్చింది.. అమెరికాలో నల్లవారి బాధలను తెలియజేయడానికి వారెంచుకున్న పద్ధతి జాజ్ సంగీతం..నల్లవారు బానిసలుగా వచ్చి చాలా బాధలు అనుభవించారు కదా.. ఆడా మగా తేడాలేకుండా.. వారి ఒరిజినల్ సంగీతం ఆఫ్రికా సంగీతం.. బేసిక్‌గా వారిది రిథమిక్ ఎక్స్‌ప్రెషన్ ఉన్న సంగీతం వారిది. ఆ సంగీతాన్ని ఆధునిక వాద్యాలయిన క్లారినెట్, ట్రంపెట్ శాక్సోఫోన్‌తో జత చేశారు. ఆఫ్రికన్ నృత్యాన్ని చాలా అభినయం కలిగినదిగా భావిస్తారు. ఇవన్నీ జానపద సంగీతం, నృత్యంలోంచి రూపుదిద్దుకున్నవే.. పాల్ రాబ్సన్ జాజ్ సింగరే.. ఇందులో పాడేవారు మళ్ళీ ఆఫ్రికన్స్ కాకుండా పాడేది ముస్లిములు.. ఇంకా వాళ్ళ సంగీతంలో అనేక ఫార్మ్స్ వచ్చాయి.. రెగ్గే అని వచ్చింది.. రాక్ మ్యూజిక్ వచ్చింది..

మిసిమి : **బీటిల్స్, బ్యాక్ స్ట్రీట్ బాయ్స్ వంటి గ్రూప్స్ రిలీజ్ చేసిన ఆల్బమ్స్ ప్రపంచవ్యాప్తంగా వెళ్ళాయి. మన సంగీతంలో అది వీలు కాలేదు ఎందుకు?**

ద్వారం : అలా గ్రూప్స్‌గా పాడటం మన పద్ధతి కాదు. అయినా కూడా కొన్ని కాన్సెప్ట్స్ వచ్చాయి. అందులో గజల్, ఖవ్వాలీ ముఖ్యమైనవి. ఖవ్వాలీ గ్రూప్‌గా ఎందుకు పాడతారు అంటే అది రిథం బేస్డ్ అవ్వటం.. దానితోపాటు పాడటంలో ఒక రిపిటీషన్ ఉంటుంది.. ఒకళ్ళు పాడుతుంటే వెనక చప్పట్లు కొడుతుంటారు..ఆ పార్టిసిపేషన్ కాన్సెప్ట్ ఎందుకొచ్చిందంటే వాళ్ళకి సంగీతం నిషిద్ధం అవటం వలన అలా evolve అయింది. అదే గజల్ సూఫీ సంగీతంలోంచి పుట్టుకొచ్చింది. కానీ గజల్ గ్రూప్ యాక్టివిటీ కాదు.. మానవ సంబంధాల గురించి, ప్రేమ గురించి అందులో నర్మగర్భంగా రాస్తారు. ఎందుకంటే నేరుగా రాయటం నిషేధం.

మిసిమి : **హిందుస్తానీ సంగీతంలో భక్తి ఉందా?**

ద్వారం : ఎందుకు లేదు.. భక్తి తప్పకుండా ఉంటుంది. ముస్లిమ్స్ కూడా పాడారు కదా.. చాలా సోషియల్ నార్మ్స్ ఉంటాయండీ.. అయినా తెగించేవాళ్ళు కొందరుంటారు.. దాక్షిణాత్య సంగీతంలో కూడా ఈ గ్రూప్

సింగింగ్ కాన్సెప్ట్ ఉన్నది. దాన్నే భజన సంప్రదాయం అంటున్నాం. ఇది ముఖ్యంగా కింది కులాల్లో ఉంటుంది. ఇది అందరిలోనూ ఉంటుంది. మధ్వులకు భజనం సంప్రదాయం ముఖ్యం. అయితే వ్యవహార జ్ఞానంలో కొట్టుకుపోయే వారూ ఉంటారు..

***మిసిమి :*** **చైనీస్ సంగీతం గురించి చెప్పండి .. చైనీస్ స్ట్రింగ్ మ్యూజిక్ చాలా బావుంటుంది. ఆ సంగీతం మనకు రాలేదు. ఒక్క ఇన్‌స్ట్రుమెంట్ మనకు రాలేదు.**

**ద్వారం :** చైనీస్, జపనీస్, కొరియన్, ఇండొనేషియన్ సంగీతాలు ఒక కేటగిరీ.. ఈ రకంగా ఇక్కడ సంగీతం విస్తరించడానికి కారణం బుద్ధిజం..

***మిసిమి :*** **దీన్ని ఈస్టరన్ మ్యూజిక్ అనొచ్చా?**

**ద్వారం :** అనొచ్చు.. కానీ ఎంత బుద్ధిజం వెళ్ళినా కూడా వాళ్ళ కన్ఫ్యూషియనిజం వొదులుకోరు వాళ్ళు.. వాళ్ళకి మనలా ఇన్ని శ్రుతులు, ఇన్ని స్వరాలు నచ్చలేదు.

***మిసిమి :*** **వాళ్ళ సంగీతంలో చాలా విచారం ఉంటుంది.**

**ద్వారం :** విచారం ఎందుకంటే వాళ్ళ సంగీతంలో ఐదు స్వరాలే ఉంటాయి. స రి గ మ ద స లుంటాయి. దూరం దూరంగా ఉంటాయి. మధ్యలో స్వరాలు తీసేశారు కదా.. దూరం ఎప్పుడైతే ఉందో, వాటిని కనెక్ట్ చేయాలి.. అంటే సాగదీయాలి. నవ్వులో నాలుగైదు స్వరాలు పడతాయి.. ఏడ్చినప్పుడు రాగం తీసినట్టు ఉంటుంది. వాళ్ళ వయొలిన్‌కి ఒకటో, రెండో తీగలుంటాయి.. ఐదు స్వరాలే ఉండటం వలన పెంటా టోన్ మ్యూజిక్ అంటారు.

***మిసిమి :*** **నాకు పావురెట్టీ గురించి చెప్పండి. అతని లిరిక్స్ నేను విన్నాను. అంతా ప్రేమ విషాదమే..**

**ద్వారం :** అతను రచిస్తాడని నాకు తెలియదు. అతను ప్రధానంగా ఓపెరా గాయకుడు.

***మిసిమి :*** **అతను బయట రికార్డులిచ్చాడు..**

**ద్వారం :** వాళ్ళు ఇస్తారండీ.. పావురెట్టీ ఓపెరా పాటలు కూడా బయట పాడాడు.

***మిసిమి :*** **మన సంగీతం మొత్తాన్ని భారతీయ సంగీతం అనే సంబోధించాలా.. దీని భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?**

**ద్వారం :** గతం నుంచి వర్తమానం వరకు ఈ సంగీతం ఎలా మారుతూ వచ్చిందో గమనిస్తే భవిష్యత్తు మనకు అర్థమవుతుంది. మాతరం నుంచి ఈతరం వరకూ తీసుకుంటే చాలా మంచిమార్పులొచ్చాయి. ఇప్పుడు చాలామంది నేర్చుకుంటున్నారు. చాలా క్రమశిక్షణతో నేర్చుకుంటున్నారు. దానికి కారణం ఇప్పుడు అందరూ చదువుకుంటున్నారు.. అందరూ ఖోంచేయగలుగుతున్నారు. నా పుస్తకంలో రాశాను కూడా..మా కాలంలో క్లాస్ లో ముగ్గురో, నలుగురో శూద్రులుండేవారు. మిగిలినవారంతా బ్రాహ్మణ అబ్బాయిలు, అమ్మాయిలు ఉండేవారు. అందువలన వారికి నేర్చుకోవచ్చు అనే అవగాహన వచ్చింది. రిజర్వేషన్ విధానం వచ్చింది. మా మ్యూజిక్ కాలేజీలో కూడా ఆ పాలసీ వచ్చింది. స్పెషల్ స్కాలర్‌షిప్‌లు లభించాయి. దానివలన ఎక్కువ మంది నేర్చుకోగలిగారు. భక్తిపాటలు ప్రచారం చేసినవారు ఎక్కువగా దాసరి వాళ్ళేకదా. వాళ్ళు బాగా శ్రమపడతారండీ.. అందువలన వారికి మంచి గొంతుకలుంటాయి..

***మిసిమి :*** **మంచి గొంతుకలున్నవారు పాడటం కాకుండా వాయిద్యం ఎందుకు నేర్చుకుంటున్నారు ?**

**ద్వారం :** కర్నాటక సంగీతం అంతా గానమేనండీ.. అదే మన అదృష్టం.. దౌర్భాగ్యం కూడాను. మేం వాయించేవన్నీ పాటలే.. వర్ణమో, త్యాగరాజస్వామి కీర్తనో, క్షేత్రయ్య పదమో ఏదైనా కావొచ్చు. నేను వాయించేది, వాళ్ళు పాడేది ఒకటే.. స్వరకట్టు గానీ, మట్టుగానీ అన్నీ ఒక్కటే. దానివలన అతను ఏ వాయిద్యం వాయిస్తున్నాడో, దాని గొప్పతనం తెలిసే అవకాశం తక్కువ. హిందుస్తానీ అలాకాదు. ఆ సంగీతం నేర్చుకునేవాడు గీతం, స్వరపల్లవి నేర్చుకోడు. తుమ్రీ నేర్చుకోడు. గురువు వీడికి నేర్పే గ్రంథం వేరు. హరిప్రసాద్ చౌరాషియా తన శిష్యులకు నేర్పేది, సితార్ నేర్చుకునేవారు వాయించదు. వీళ్ళు ప్రాక్టీస్ చేసేది వాళ్ళ సంప్రదాయం, వాళ్ళ given text.అలా వాళ్ళు ఏర్పాటు చేసుకుంటారు. దీన్నే వాళ్ళు "ఘరానా" అంటున్నారు. ఉదాహరణకు చౌరాషియా, అన్నపూర్ణ దేవి శిష్యుడు. ఆవిడ ఫ్లూట్‌లో తన జ్ఞానాన్ని అతనికి ధారపోసింది.

**మిసిమి : మీరు వాయించే వయొలిన్ సోలో ప్రదర్శనకేనా, పక్క వాయిద్యమేనా?**

**ద్వారం :** చాలా వరకు పక్క వాయిద్యమే.. మా ప్రొఫెషన్ ఎక్కువగా పక్కవాయిద్యంగానే ఉండిపోయింది. మనం ఎక్కువ గౌరవించింది.. ఎక్కువ గౌరవం తెచ్చుకున్నది వీణ.. దాని నిర్మాణం కానీ, సౌండ్ కానీ చాలా ప్రత్యేకమైనది.పక్కవాయిద్యం మృదంగం లేకుండా స్వయంగా రంజకత్వం ఇస్తుంది. అందుకని వీణను ప్రత్యేక దృష్టితో చూస్తారు.కచ్చేరీలిస్తారు. ఇంట్లోకూడా భార్య వీణవాయిస్తే సంతోషిస్తారు. అలా అది చాలాకాలం అందరి అంగీకారాన్ని పొందింది. వీణకు ఇంతకుముందు కాలంలో మెట్లు ఉండేవి కావు. తంజావూర్ రాజు రఘునాథ నాయకుడు ఈమెట్లు పెట్టించాడని చెబుతారు.

**మిసిమి : వీణ, సితార్ ఒకే కుటుంబానికి చెందినవా?**

**ద్వారం :** నిజం చెప్పాలంటే ఆరెంటిదీ ఒకే కుటుంబం. తీగ వాయిద్యం ఏదైనా వీణ అనే చెబుతాము. మాది ధనుర్వీణ అని శాస్త్రాల్లో చెబుతారు. bow తోటి వాయిస్తాము .. ఈ వీణ తరువాత వయొలిన్‌కు ఎందుకు ఒక ప్రాముఖ్యత వచ్చిందంటే, గాత్రం యొక్క కొనసాగింపు లేదా కంటిన్యుటీ ఇందులో ఉంది. అంటే వయొలిన్‌లో ఉంది. అలా గాత్రానికి చాలా అనుకూలంగా, సపోర్ట్ చేసే వాయిద్యం ఏదన్నా ఉందంటే అది వయొలిన్. అది వీణ చేయలేదు.. వేణువు చేయలేదు.. ఒక్క వయొలిన్‌కే ఆ సౌకర్యం వచ్చింది. అలాగే ఎడమచేతిలో గమకం వచ్చింది. నాలుగు వేళ్ళతో వాయిస్తారు కాబట్టి వివరంగా ఉంటుంది. నాలుగు ఆక్టేవ్స్ ఉంటాయి. అందువలన గాత్రానికి చాలా అనుకూలంగా ఉండే వాయిద్యంగా మారింది. వయొలిన్ త్యాగరాజస్వామి కాలంలో కూడా లేదు. ఆ రోజుల్లో వీణే పక్క వాయిద్యంగా కాలక్షేపం చేసేవారు. ఆదిభట్ల నారాయణదాసు గారి అన్నగారు కూడా వీణ వాయించేవారు పక్క వాయిద్యంగా. దాసుగారు ఒప్పుకునేవారు కాదు వయొలిన్‌ని. బాగా వయసు వచ్చిన తరవాత కొంతమందిని ఒప్పుకున్నారనుకోండి. కళావంతుల్లోనే వయొలిన్ వాయించే వారుండేవారు. వారిలోని ఆర్ట్‌ని గుర్తించారు. అవసరాన్ని గుర్తించారు. ఆకాలం వేరు. అప్పుడు మైకులు, స్పీకర్లు లేవు కదా. కానీ నాయుడు గారు లాంటి వారు, అంతకుముందు ఇద్దరు, ముగ్గురు వయొలిన్ ప్రధాన వాయిద్యం ప్రతిపత్తి తీసుకొచ్చారు. ఈ వాద్యంలో ఉండే ఒకరకమైన మర్మాన్ని వారు పసిగట్టారు. టోనల్ క్వాలిటీని గుర్తించారు. వాళ్ళు మొదటినుంచీ సోలో ఇన్స్ట్రుమెంట్‌గానే గుర్తించారు. అందరూ గుర్తించటానికి టైం పట్టింది. దక్షిణాది కళాకారులు మద్రాసు మ్యూజిక్ అకాడెమీ ఇచ్చే "సంగీత కళానిధి" బిరుదు పొందడమే ఒక ఫైనల్ గుర్తింపుగా భావిస్తారు. ఆయన ఆ బిరుదు పొందిన మొదటి తెలుగువాడే కాదు, మొదటి వయొలినిస్ట్ .. తమిళులలో  కూడా ఎవరికీ రాలేదు. 1941లో నాయుడు గారికి సంగీత కళానిధి పురస్కారం ఇచ్చారు. ఆ ఫెస్టివల్‌లో కూడా ఆయనకు సోలో ప్రదర్శన ఇవ్వలేదు. ముడికున్నార్ వెంకటరామయ్యర్‌కు పక్క వాయిద్యంగా వేశారు. మూడేళ్ళ తర్వాత కొంత మార్పు వచ్చింది.. వాస్తవం అర్థమయింది. ఒక సంఘటన జరిగింది. ఆ తర్వాత ఆయన పక్క వాయిద్యంగా వాయించననేశారు. ఆ సంఘటనను ఆన్‌లైన్‌లోను, మిగిలిన చోట్ల తప్పుగా రాస్తున్నారు.. కోట్ చేస్తున్నారు.. నలభై రెండులోనో, నలభై మూడులోనో సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ కచేరీ చేశారు. నాయుడుగారు పక్క వాయిద్యం. సాధారణంగా ఏం చేస్తారంటే, ఒక పదిహేను నిమిషాలు పాడి పక్క వాయిద్యానికి అవకాశమిస్తారు, దాన్ని టర్న్ అని అంటారు. కచేరీ ధర్మమేమిటంటే వీళ్ళు ఓ పదినిమిషాల పాటు వాయిస్తారు. అదొక మర్యాద. కానీ దాని ప్రభావం ఎలా ఉంటుందంటే దీన్ని మించిపోతుంది. కచేరీ అయిన తర్వాత కలిసినప్పుడు, నాయుడు గారు మీరు అలా వాయిస్తే ఎలా అని సెమ్మంగుడి అంటే అంటే పోన్లెండి.. ఇక వాయించను అన్నారు నాయుడు గారు.. అంటే వయొలిన్ ప్రతిభావంతంగా వాయిస్తే మెయిన్ ఆర్టిస్ట్‌కు కోపం వస్తుంది.. వాయించకుండా ఉంటే ఆడియెన్స్‌కు కోపం వస్తుంది. అందుకని బేలన్స్ చేసుకోవాలని అందరికీ చెప్పేవారాయన.

**మిసిమి : బాలమురళీకృష్ణ గారితో అనుభవం ఎలా ఉండేది?**

ద్వారం : ఆయన జీనియస్ కదా.. ఒక్కోసారి ఒక్కో శక్తి ఆయనిది.. ఆయన లైట్ మ్యూజిక్ పాడించి ప్రొడ్యూస్ చేసేవారు కదా.. ఒకసారి తంబూర తీగపై, పిచ్ పైప్ ఉంచి అద్భుతమైన రాగం వాయించారు ఆయన. అలాంటి ప్రతిభ అతనిది.. ఆయన వయోలా, ఫ్లూట్ వాయించే వారు. మృదంగం తెలుసు. అవన్నీ ఆయన స్వాధీనంలో ఉండేవి. ఆ రకమైన ప్రతిభ కలిగినవారు చాలామంది ఉండేవారు కానీ బాలమురళి వేరు... మీకు బోంబే ఆర్కెస్ట్రాలో ఒకవ్యక్తి అనేక వాయిద్యాలు ప్లే చేయగలిగిన ప్రతిభ ఉంటుంది. అవసరమైతే ఎవరినైనా రీప్లేస్ చేయగల నైపుణ్యం ఉండేది వారిలో. అదొక ప్రజ్ఞ.. నవనవోన్మేషశాలినిత్వం ఉండటం క్రియేటివిటీ. అది బాలమురళి గారిలో పుష్కలంగా ఉండేది.

**సిరి : ఆయన సంప్రదాయంలోంచి బయటకు వచ్చిన వ్యక్తిగా చెప్పుకోవచ్చా?**

ద్వారం : లేదు..ఆయన సంప్రదాయంలో ఉంటూనే అనేక ప్రయోగాలు చేశారు.. షార్ప్‌నెస్ ఆఫ్ సెన్స్ ఆయనలో చాలా ఎక్కువ. ఆయనకు మృదంగం, కంజీరలో ప్రవేశముంది. అలాగే నాయుడు గారు కూడా కంజీర వాయించేవారు. దాంట్లో కొన్ని వరసలుంటాయి.కంజీరకో భాష ఉంటుంది. అది తెలుసుకొని స్వరకల్పనకు ఉపయోగించేవారని చెబుతారు. మళ్ళీ బాలమురళి దగ్గరకు వస్తే ఆ ఫార్మ్‌లో ఆయన మార్పులు తెచ్చారు. తిల్లానాలు ఆయన ఎంత మార్చారో , అందరికీ తెలిసిందే కదా. నాయుడుగారి టైంలో తిల్లానాకు ఇప్పటి తిల్లానాకు ఎంతో తేడా ఉంది. అది బాలమురళి వలనే. ఆయన సంప్రదాయంలోంచి బయటకు రాలేదు.. కానీ మార్పులు చేశారు. నేను ఆయన దగ్గర పనిచేశాను. ఐదారుసార్లు ఆయనకు పక్క వాయిద్యంగా ఉన్నాను.ఆయన జుగల్బందీలు చేశారు. ఆయనలో వైవిధ్యం ఎక్కువ. ఆయన షో మ్యాన్..

**సిరి : మీరు దేశం బయటకు వెళ్ళలేదు. చాలామంది బయట దేశాల్లో ప్రదర్శనలిచ్చారు. దానికి కారణం ప్రతిభ కన్నా మార్కెటింగ్**

ద్వారం : ఆ లౌకిక జ్ఞానం ఉండాలండీ..రవిశంకర్, అలీఅక్బర్ ఖాన్‌తో పోలిస్తే షో మ్యాన్. అలీఅక్బర్ ఖాన్ కున్న ప్రతిభ ఇతనికి లేదంటారు.రవిశంకర్ ను భార్య అన్నపూర్ణతో, బావ అలీ అక్బర్ ఖాన్‌తో పోల్చుతారు.కానీ ఇతనికి ఉన్న పరిమితుల్లో అద్భుతమైన ప్రొడక్షన్స్ చేశాడతను.అది వీళ్ళు చేయలేరు. ట్రూ సితార్ బాజ్ అతని దగ్గర ఉందంటారు. బాజ్ అంటే ఆ సితార్ వాయించే పద్ధతి..

**సిరి : నాతో చాలా సమయం వెచ్చించి, చాలా విషయాలు చెప్పారు.. ఇంకేమైనా చెప్పదలుచుకున్నారా?**

ద్వారం : నాకే మీరు అవకాశం ఇచ్చారు. అడిగేవారే ఉండరు. వాయించమని అడిగేవారు అసలుండరు. మీరు మొదట్లో ఒక ప్రశ్న వేశారు. అది నా మనసులో ఉండిపోయింది. మీరు ఎందుకు ఇలా ఉండిపోయారు అని.. అది మీరు వేసిన ప్రశ్న. నేనేమి అవ్వాలని మీరు అనుకున్నారో తెలియలేదు.

**సిరి : ఇంత ప్రతిభ ఉండి ఊర్లోనే ఎందుకు ఉండిపోయారు ఈయన అని నా సందేహం.. కనీసం దేశం దాటి వెళ్ళలేదు. వెళ్ళినవాళ్ళు ఈయనకన్నా ప్రతిభావంతులా అని అనుకున్నాను.**

ద్వారం : ఆ ప్రశ్న నాకు కూడా ఉంటుంది కదండీ.. నాకు కావాల్సింది "సమానానాం ఉత్తమ శ్లోకే అస్తు.." ఉత్తమ శ్లోకంలో అంటే గొప్ప పొగడ్త.. అది ఎవరి నుంచి రావాలంటే సమానులనుంచి రావాలని. నాగురించి మిగిలిన వయొలినిస్టులను అడిగారనుకోండి..అమ్మో..మంచి వయొలినిస్టు అంటారు. దానికితోడు నలభై ఏళ్ళ పాటు ఒకచోటే ఉన్నాను..

**సిరి : గట్టి ప్రయత్నం చేయలేదు మీరు.. అంటే బయటకు వెళ్లేందుకు..**

ద్వారం : ప్రయత్నం అంటే ఏం చేయాలండి.. సౌత్‌కి వెళ్లాలి అంటే మద్రాస్ వెళ్లాలి. అక్కడ ఎలా ఉంటుందంటే పేరు వచ్చిన వాళ్ళకే వాళ్ళు స్థానం ఇస్తారు. బాల మురళి గాని ఈమని శంకరశాస్త్రి గాని, చిట్టిబాబు గాని ..శంకరశాస్త్రి గారు రేడియోలో ఆయన పని చేశారు అప్పటికే.. శాస్త్రి గారు మద్రాసులో పనిచేశారు అదొక కారణం. నాయుడు గారిని వాళ్లు మద్రాసు వచ్చేయమన్నారు ..అందుకోసం ఒక ముప్పైఆరువేల రూపాయలు కలెక్ట్ చేసి ఆయన కోసం ఇల్లు కొనిపెట్టారు వాళ్ళు. అదే చిట్టిబాబు దగ్గర అద్భుతమైన నాదం ఉంది.. సినిమా ఫీల్డ్ కూడా అతన్ని ఆదరించింది. కానీ సినిమాలకు వాయించినందుకు ఆయనలో కొంత బాధ కూడా ఉండేది.

**సిరి : రవిశంకర్ కూడా సినిమాలకు వాయించాడు కదా..**

**ద్వారం :** రవిశంకర్ సినిమాలకు వాయించలేదు ఆయన సినిమాలకు కంపోజ్ చేశాడు. సత్యజిత్ రాయ్ సినిమాలు చేశాడు తర్వాత హృషికేష్ ముఖర్జీ సినిమా చేసాడు..

**మిసిమి :** **మీరెందుకు ఆ సినిమా ఫీల్డ్‌కి వెళ్ళలేదు మీకున్న ప్రతిభకు..?**

**ద్వారం :** నన్నుకూడా చాలా మంది మీరు సినిమా ఫీల్డ్‌కు వెళితే బావుంటుందని అన్నారు.. అది నాకు ఇష్టం లేదు.. అన్ని కష్టాలు పడటం ఇష్టం లేదు (నవ్వు).. మీకు సంగీతంతో చాలా పరిచయం ఉంది. చాలా సంతోషించాల్సిన విషయం..

**మిసిమి :** **పాశ్చాత్య సంగీతం ఫాలో అయినంతగా మన కర్నాటక సంగీతం నా చెవికి ఎక్కటం లేదే అని బాధపడుతుంటాను. నాకు పరిచయం లేకపోవటం ఒక కారణం.. నేర్చుకుంటే బావుండేదని అనిపిస్తుంది.**

**ద్వారం :** మీరు కొంచెం ఆసక్తి పెంచుకుంటే అదేమంత కష్టమైన విషయం కాదు..

***"నాలుగు గంటల పాటు రెండు విడతల్లో ఆయనతో సంభాషించారు అశ్వినీ కుమార్.. ద్వారం వారిని మిసిమి ద్వారం వద్దకు తీసుకొచ్చినవారు ఆకాశవాణి పూర్వ సహాయ సంచాలకులు సుమనస్పతిరెడ్డి.. అంతకు మునుపు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జీవాళి పుస్తక పరిచయ సభను కూడా నిర్వహించారు.. ఈ సంభాషణ సజావుగా సాగటానికి వారి తోడ్పాటు ఎంతో ఉంది.. వారికి కృతజ్ఞతలు.. వారితో ఇంతసేపు మాట్లాడాక, వెనక్కి తిరిగిచూస్తే కర్నాటక, హిందుస్తానీ సంగీతాల పట్ల ఆయనకున్న స్పష్టత ఆశ్చర్యపరిచింది.. మీకూ అదే అభిప్రాయం కలిగిందనుకుంటాను..***

---

**సంభాషణ : అశ్వినీకుమార్**

*ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్), హైదరాబాద్.*

**ఆ**గస్టు రెండవ తేదీ శనివారం సాయంత్రం సప్తపర్ణి ఆడిటోరియమంతా ద్వారం దుర్గా ప్రసాదరావు గారి మెత్తని మాట.. సుతిమెత్తని వయొలిన్‌తో పులకించిపోయింది. దాదాపు మూడుగంటలపాటు ఒక తన్మయత్వపు వేడుక జరిగిందక్కడ.. ఇటీవలే విడుదలైన వారి వ్యాస సంపుటి "జీవాళి" కి కొనసాగింపుగా ఏర్పాటయిన ఈ కార్యక్రమంలో ద్వారం "వయొలిన్ సంప్రదాయం"పై సోదాహరణ ప్రసంగం చేశారు వారు. తమ తాతగారు ద్వారం వెంకట కృష్ణయ్య గారు, చిన తాతయ్య ద్వారం వెంకటస్వామి నాయుడు గారు, తండ్రి నరసింహారావు గారు గురువులుగా మొదలైన వారి సంగీత ప్రయాణంలోని ఒడిదుడుకులను, ఎత్తుపల్లాలను పంచుకునే ప్రయత్నం చేశారు వారు. తమ తాతగారు వెంకట కృష్ణయ్య గారు తమ్ముడు వెంకటస్వామి నాయుడుకి వేసిన బాటతో పాటు తనకు, తన సోదరి రమణమ్మ గారికి ఎలాంటి మెళకువలు నేర్పారో ఆర్ద్రంగా వివరించారు.. దుర్గా ప్రసాదరావు గారు తన జీవితం మొత్తాన్ని ప్రభుత్వ సంగీత కళాశాలకు అంకితం చేయటం మూలంగా, ఆశించినంతగా సంగీత సభల్లో పాల్గొనలేకపోయారా అన్న అనుమానం వస్తుంది.. అందుకే వారి మాట జీవననాదమై ప్రకాశించింది ఆరోజున.. వయొలిన్, వయోలా రెండు వాయిద్యాలను ప్రేక్షకులకు పరిచయం చేసి, నాదంలోని తేడా తెలియచెప్పి, ద్వారం కుటుంబం సంగీతానికి అంకితమైన విధానాన్ని విప్పి చెప్పారారోజున.. వారి సోదరులు ద్వారం సత్యనారాయణరావు గారు కూడా ఆకాశవాణి నిలయ విద్వాంసులుగా పనిచేసిన వారే.. ఆనాటి కార్యక్రమం వారి సంగీత ప్రదర్శనతోనే మొదలయింది. వారికి మృదంగంపై సహకరించారు మరో ఆకాశవాణి నిలయ విద్వాంసులు పెరవలి జయభాస్కర్ గారు.. ఇక ద్వారం దుర్గా ప్రసాదరావు గారి ఛలోక్తులతో కూడిన ప్రసంగం, మధ్య మధ్యలో వయొలిన్‌పై కురిపించిన చమక్కులు ఎడారిలో డస్సిపోయిన వారికి అందివచ్చిన నీటిచెలమలా ఆరోజక్కడ చేరిన రసికుల దాహార్తిని సంపూర్ణంగా తీర్చింది.. వయొలిన్ వాయిద్యం ఏవిధంగా ద్వారం కుటుంబాన్ని తీర్చిదిద్దిందో ఆ వైనాన్ని తెలియ చెప్పింది..



ద్వారం సత్యనారాయణ రావు

# ఆరుద్ర నాటికలు- ప్రాసంగికత, ప్రయోగాత్మకత

– డా. జె. నీరజ

ఆరుద్ర బహుముఖ ప్రక్రియాసృజనశీలి. గాఢమైన పఠనాభిరుచి ఆరుద్రను సాహిత్యకారుడిగా తీర్చిదిద్దింది. జీవిక కోసం భిన్నమైన ఉద్యోగాలు చేసినా, వామపక్ష భావజాల ప్రభావంతో ఉద్యమకారుడుగా మారినా చివరకు ఒక గొప్ప సాహిత్యకారుడిగా, ప్రామాణిక పరిశోధకుడిగా సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. రచయితగా నమ్మిన విలువల కోసం తన రచనలను ఒక వాహికగా మలుచుకున్నాడు. ఆరుద్ర రచనల్లో వారి ప్రాపంచిక దృక్పథం ప్రతిబింబిస్తుంది. దాంతోపాటు ప్రయోగాత్మక శైలి మీదున్న ప్రీతి కూడా అభివ్యక్త మవుతుంది. ఆరుద్ర నాటికలను పరిశీలిస్తే స్పష్టంగా ఈ విశేషాలన్నీ ఆవిష్కృతమవుతాయి. ఆ విషయాలను ఇక్కడ చర్చించుకుందాం.

'ఆరుద్ర పన్నెండు దృశ్య నాటికల్ని, తొమ్మిది శ్రవ్య రూపకాల్ని రచించాడు. ఇక్కడ పరిశీలిస్తున్న'ఆరుద్ర నాటికలు' సంకలనంలోని ఏడు నాటికలలో రెండు శ్రవ్య నాటికలు. 1958లో ముద్రితమైన ఈ సంకలనంలోని నాటికల రచనా కాలం 1950. 'నాటికా రచనకు ప్రేరణము నాలుగు విధములుగా కలుగవచ్చును. విశిష్టమైన సన్నివేశము లేదా కథ, విలక్షణమైన పాత్ర, క్లిష్టమైన సమస్య, ఉత్తేజకరమైన వాతావరణము' అని డా.పి.ఎస్.ఆర్ అప్పారావు పేర్కొన్నారు. ఆరుద్ర నాటికల రచనకు ప్రేరణకూడా సంక్షోభిత సమాజ సమస్యలు, మానవ భిన్న ప్రవృత్తులను చిత్రించే పాత్రల సృష్టి, వైవిధ్యమైన ఇతివృత్తాలని నాటికలలోని ఇతివృత్తాలను గమనిస్తే బోధపడుతుంది. సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను వస్తువులుగా తీసుకుని భౌతికవాద దృక్పథంతో ఆరుద్ర చేసిన వ్యాఖ్యానం, ఆయా ఇతివృత్తాల ప్రాసంగికత, ఆరుద్ర ప్రయోగ శిల్పం పాఠకులను, ప్రేక్షకులను, శ్రోతలను విభ్రాంతికి గురిచేస్తుంది. శ్రమ దోపిడీ, వ్యవస్థల అసంబద్ధ విధానం, వృత్తిధర్మానికి నిబద్ధుడైన న్యాయాధికారి, మూఢాచారాలను బద్దలు కొట్టిన ఆధునికత, జీవ–జడ సంబంధాలు–మానవ భావోద్వేగాలు, చిరుద్యోగి అంతస్సంఘర్షణ,స్త్రీ సంస్కరణ మొదలైన భిన్నమైన ఇతివృత్తాలతో సాగుతాయి ఈ నాటికలు.

మొదటి నాటిక "విషప్రయోగం" పానకాలు అనే కార్మికుడి చుట్టూ తిరుగుతుంది. 'పని చేసేవాడు అనుభవించటం లేదు కనకనే ప్రపంచకం ఇట్లా ఏడుస్తోంది' అంటూ కర్మాగారంలో యజమాని అన్యాయాలకు విసిగిపోయిన కార్మికుడు యజమానిని విషప్రయోగంతో చంపాలని అనుకుంటాడు. యజమాని చనిపోతాడనుకుని, తానే యజమానిలా ప్రవర్తిస్తాడు. మరో వ్యాపారి పెట్టుబడి పెడుతున్నాడు కనుక తాను పని మానేస్తానంటాడు. భయపడిన యజమాని పానకాలుకు లాభాల్లో వాటా ఇవ్వడానికి సిద్ధపడతాడు. కానీ పానకాలు కోరిన ఇతర షరతులను అంగీకరించడు. యజమాని వెంట ఉంటే బాబాజీ, పదింతలు ఎక్కువ తన మతానికి సమర్పించు కుంటానన్న హామీ మీద పానకాలుకు అబద్ధం చెప్పి, భయపెట్టి అతడు తిరిగి యజమాని వద్దకు వచ్చేలా చేస్తాడు. చివరికి పానకాలు మళ్లీ యజమానిని ఆశ్రయించాల్సి వస్తుంది.

ఈ నాటిక శ్రమదోపిడీ, కార్మికుల నిరసన, పెట్టుబడిదారుల అహం, ప్రజలలో మతాలు,మఠాధిపతుల ఉండే భయభక్తులు,మఠాధిపతులతో నాయకుల వ్యాపార సంబంధాలు మొదలైన అంశాలపై గాఢమైన విమర్శ చేస్తుంది. పానకాలు వంటి సాధారణ కార్మికుడి అగచాట్లను, తిరుగుబాటును, తరువాతి మలుపుల్లో అతని విచారదైన్య స్థితిని చూపిస్తూ, యథార్థ సంఘటనలను నాటకీయంగా హృదయాలను కలిచివేసే విధంగా చిత్రీకరిస్తాడు నాటక కర్త. ఒక శ్రీమంతుణ్ణో, పారిశ్రామిక వేత్తన్నో చంపడం వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ నాశనం కాదు. కార్మికులు, పారిశ్రామికవేత్తలను, వారికి మద్దతిచ్చే బాబాజీలను అమితంగా నమ్ముతున్నంత కాలం, వారు మోసపోతూనే ఉంటారు, వారి జీవితాలు మెరుగుపడవు. ముఖ్యంగా ఆవేశం ఫలితాన్నివ్వదని, కార్మికుల హక్కుల

కోసం చేసే పోరాటం వ్యూహాత్మకంగా సాగాలని, తగిన మార్గదర్శకత లేకపోతే తిరుగుబాట్లు వైఫల్యం చెందుతాయని స్పష్టం చేస్తుంది. వ్యవస్థను మార్చడానికి, వర్గంలోని వ్యక్తుల మనస్తత్వాలను అర్థం చేసుకుని, వ్యూహాత్మకంగా, సిద్ధాంతపరంగా ముందడుగు వేసి సరైన మార్పు వచ్చేవరకు సహనంతో వేచి ఉండాలనిఈ నాటిక ద్వారా సూచన చేస్తారు. ఆధునిక సమాజంలో కూడా ఇదే పరిస్థితులు కొనసాగుతుండటం వల్ల "విషప్రయోగం" నాటిక ప్రాసంగికతతో వెక్కిరిస్తుంది.

'మీరు వీళ్ళలాంటి వాళ్ళను భయభక్తులతో అట్టే పెడతారని ఎక్కడలేని డబ్బు మీ ముఖాన కొడుతున్నా. మీరు నిద్రపోతూవుంటే వీడు ధైర్యం చెయ్యడాయేం?' అంటూ పానకాలు తిరుగుబాటుకు బాబాజీల ఉదాసీనతే కారణమని పారిశ్రామికవేత్త అన్న మాటలు నేటి సమాజంలో స్వామీజీలు, మఠాధిపతులు ఆధ్యాత్మిక నాయకులుగా తమ ప్రాభవాన్ని, రాజకీయ బలాన్ని పెంచుకుంటున్న తీరును ప్రతిఫలిస్తుంది. నెల జీతం పది రోజులకు కూడా సరిపోవటం లేదని దిగులుపడే గుమాస్తా 'దరిద్రం తెలివితేటల్ని చంపేస్తుంది. ఆకలి మానాభిమానాల్ని తినేస్తుందని'వాస్తవిక పరిస్థితి పట్ల అవగాహనతో మాట్లాడతాడు. కానీ ఈ పరిస్థితులను అధిగమించడం ఎలా అనే ఆలోచన చేయడు. తిరుగుబాటు ప్రయత్నాలు చేయక అశక్తుడిగా మారిపోతాడు. శ్రామిక వర్గ మనస్తత్వంలోనాటికీ, నేటికీ మార్పులేకపోవటం గమనార్హం.

'దేవుని ఎదుట' నాటిక సమాజంలోని అన్యాయాలు, అసమానతలను వ్యంగ్యాత్మకంగా చిత్రించే ప్రతీకాత్మక రచన. ఈ నాటికలో ప్రపంచమే ఒక అన్యాయస్థానంగా, అసమానత్వమే న్యాయంగా చిత్రితమవుతుంది. దేవుడు పాత ఫ్యూడల్–బూర్జువా వ్యవస్థకు ప్రతీకగా, నాటికలోని పాత్రలు సమాజంలోని వివిధ వర్గాలను ప్రతిబింబిస్తాయి. న్యాయాధికారి, శ్రీమంతుడు, కార్మికుడు, కవి, శాస్త్రజ్ఞుడు, విద్యార్థి, దరిద్రుడు, న్యాయవాది మొదలైన పాత్రలు సమాజంలోని అధికారులు, ధనికులు, శ్రామికులు, జ్ఞాన వర్గాలను సూచిస్తాయి. నాటికలోని న్యాయస్థానం అన్యాయానికి ప్రతిరూపంగా కనబడుతుంది. న్యాయమూర్తి దేవునికి ప్రతినిధిగా అతడి అనుమతితో న్యాయ విచారణ చేస్తాడు. శ్రీమంతుడికి న్యాయం అనుకూలంగా ఉండగా, పేదవాడు, విద్యార్థి, కార్మికుడు, కవి వంటి వారు అణచివేతకు గురవుతారు. దరిద్రుడు దానయ్య పిడికెడు అన్నం దానం చేసినందుకు నేరస్థుడవుతాడు, కానీ శ్రీమంతుడు అదే నేరంతో విడుదలవ్వటమే కాకుండా అందుకు ప్రతిగా జన్మజన్మలకు ధన కనక వస్తు వాహనాదులుండాలని జడ్జి చేత సిఫారసు అందుకుంటాడు. శాశ్వత శాసనసభ్యుడు 'ఇంట గెలిచి రచ్చ గెలవాలనే' తాను ముందుగా తన బంధు మిత్రులకు సేవ చేస్తున్నానని, అది పూర్తయ్యాక ప్రజాసేవ చేస్తానని అంటాడు. విద్యార్థి, కవి, శాస్త్రజ్ఞుడు ఒకే వ్యక్తిగా చిత్రితమై, వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినందుకు బంధిస్తారు. చివర్లో కవి 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినదిస్తూ విప్లవ ఆశావాదాన్ని వ్యక్తం చేస్తాడు.

ఈ నాటిక సమాజంలోని వర్గ విభజన, అధికార దుర్వినియోగం, న్యాయవ్యవస్థలో అవినీతిని వ్యంగ్యాత్మకంగా విమర్శిస్తుంది. లెనిన్ ఆలోచనకు అనుగుణంగా, మన చైతన్యం సమాజ ప్రతిబింబమని, విప్లవం అనివార్యమని రచయిత సూచిస్తారు. కవి, విద్యార్థి పాత్రలు విప్లవ భావాలకు ప్రతీకలు, కానీ అధికారం చేపట్టిన తర్వాత వారు పాత వ్యవస్థమార్గంలోనే కొనసాగితే న్యాయం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తారు. అధిక్షేప ధోరణిలో, అభ్యుదయ భావాలతో ప్రకటితమైన ఈ నాటిక సమకాలీన సమాజానికి ఆదర్శదృక్పథ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. సమాంతరంగా ఆత్మవిమర్శకు పురికొల్పుతుంది.

ఆరంభం నుండి ఆసక్తికర సన్నివేశాలతో సాగిన నాటిక 'న్యాయాధికారి'. అవినీతి, లంచగొండితనాన్ని వ్యతిరేకిస్తూ వ్యక్తిగత నిజాయితీ ప్రధాన విషయంగా సాగుతుంది. జడ్జి జగన్నాథం రిటైరైన తెల్లవారి తమ ఇంట్లోని నేరస్థుడిని పోలీసులకు అప్పగించాలని చెప్పి పోలీసులను పిలిపిస్తాడు. జగన్నాథం కూతురు ప్రమీలను పెళ్లి చేసుకోబోయే బంధువు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వస్తాడు. జగన్నాథం తానే నేరస్థుడినని, తన నేరాలను దాచానని వెల్లడి చేస్తాడు. ఇన్‌స్పెక్టర్ నమ్మలేక, ఆధారాలు అడిగితే, జగన్నాథం తాను జడ్జిగా తప్పుడు శిక్షలు వేశానని, మిత్రుడు రంగనాథాన్ని లంచం కేసులో శిక్షించానని, ఇప్పుడు తాను కూడా కూతురు పెళ్లి కోసం లంచం తీసుకున్నానని, డబ్బు చూపిస్తాడు. అయినా ఇన్‌స్పెక్టర్ నమ్మడు. జడ్జిగారిని చూడటానికి డాక్టర్ రామనాథం వచ్చి ఒక టాబ్లెట్ ఇస్తాడు. తనను అరెస్ట్ చేయమని జడ్జి ఒత్తిడి చేస్తాడు. అంతలో లోకనాథం, విశ్వనాథం అనే ఇద్దరు వ్యక్తులు లంచం ఇవ్వడానికి వస్తారు. జగన్నాథం డబ్బు తీసుకోనని అరిచినా,

వారు తీర్పు తమకు అనుకూలంగా వచ్చింది కనుక డబ్బు తీసుకోమని ఒత్తిడి చేస్తారు. ఇన్‌స్పెక్టర్, డాక్టర్ బయటకు వచ్చి, లంచం ఆఫర్‌ను గమనిస్తారు. జగన్నాథం తనను, లంచం ఇవ్వజూపుతున్న లోకనాథం, విశ్వనాథాలను అరెస్ట్ చేయమంటాడు. వారిరువురూ తమని అరెస్టు చేయవద్దని ఇన్‌స్పెక్టర్‌కి కూడా లంచం ఇవ్వ చూపుతారు. చివరలో, ఇన్‌స్పెక్టర్‌కి పై అధికారి ఫోన్ చేసి, ఇదంతా నాటకమని, జగన్నాథం తన కూతురు పెళ్లి కోసం ప్రసాద్ నిజాయితీని పరీక్షించడానికి ఈ నాటకం ఆడారని వెల్లడిస్తాడు. జగన్నాథం, ప్రసాదుల నీతి, నిజాయితీకి, విధ్యుక్తధర్మాలకు పరీక్షగా నిలుస్తుంది ఈ నాటిక. ఈ నాటిక అసలు ఇతివృత్తం వృత్తి ధర్మం, విధ్యుక్త ధర్మం చుట్టూ తిరుగుతుంది. రిటైరైన జడ్జి జగన్నాథం తన కూతురికి పెళ్లి చేయబోయే ముందు పోలీస్ అధికారి ప్రసాద్ నిజాయితీని పరీక్షించడమే కాక, సమాజంలోని అవినీతి, న్యాయ వ్యవస్థపైన అశ్రద్ధ పట్ల స్పష్టమైన వ్యాఖ్యానంగా నిలుస్తుంది.

భారతీయ ప్రజాస్వామ్యానికి ఒక మూలస్తంభం న్యాయ వ్యవస్థ. అయితే, తీర్పుల ఆలస్యం, కేసుల పెండింగ్, ఇటీవల కాలంలో న్యాయాధికారులపై తరచుగా వినిపిస్తున్న అవినీతి ఆరోపణలు, కొన్ని సందర్భాల్లో ధనవంతులు, రాజకీయంగా బలమైన వారికి అనుకూలంగా తీర్పులు వెలువడుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా చిత్రించి సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షకులపై కేసులు నమోదు చేసి శిక్షలు వేయటం ప్రజాస్వామ్యానికి హానికరం. విమర్శను సహించడమే ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు ఆధారం. భావ ప్రకటన స్వేచ్ఛ, న్యాయ విచారణ హక్కు లాంటివి మౌలిక హక్కులు. విమర్శనాత్మక స్వరం కంటే శత్రువు లేదు అన్న భావనను ప్రభుత్వాలు, సమాజం తిరస్కరించాలి. న్యాయ వ్యవస్థలో పారదర్శకత, వేగవంతమైన తీర్పులు, బాధ్యతాయుత తీరు పెరిగితే ప్రజలకు మరింత నమ్మకం కలుగుతుంది. జగన్నాథం లాంటి వ్యక్తులు నేటి సమాజంలో కూడా ఉన్నారు కానీ ప్రభుత్వాలకు వత్తాసు పలికే న్యాయమూర్తులకే పదవులు. వారు అనుసరించే మార్గమే ప్రజాస్వామ్యానికి, వ్యక్తి స్వేచ్ఛకి గొడ్డలిపెట్టు. ఈ నాటిక నిజాయితీకి పరీక్షగా, సమాజ లోపాలను గుర్తించే ఒక లిట్మస్‌టెస్ట్‌గా నిలుస్తుంది.

జాతీయోద్యమ కాలంలో ఆంగ్ల విద్యావ్యాప్తి, స్త్రీలు కూడా చదువరులవుతున్న కాలంలో ఛాందసభావాలకు, ఆధునికతకు మధ్య సంఘర్షణ, కొత్తవెలుగులవైపు సాగిన యువత ఆలోచనలను ప్రకటించిన నాటిక 'దరఖాస్తు ఫారం'. అతిగా మడి, ఆచారాలూ పాటిస్తూ, ఉద్యోగాల కోసం ఊరు దాటితే అనర్థమనే మూఢనమ్మకాలతో సంకుచిత మనస్కురాలైన సీతారామమ్మ, ఇంగ్లీషు విద్య చదువుకుని ఉద్యోగం చేయాలని ఆలోచించే ఆధునిక తరం యువతి విశాలాక్షిల మధ్య సంవాదం ప్రధానంగా సాగిన నాటిక. ఆనాటి గ్రామీణ ప్రజల జీవితాలపై కులవర్గ ప్రభావాలను కూడా చర్చిస్తుంది. డిగ్రీ పట్టా పొందిన కొడుకుని ఊరొదిలి ఉద్యోగాల కోసం వెళ్లడానికి అంగీకరించదు సీతారామమ్మ. దరఖాస్తు ఫారం తెప్పించుకుని కూడా తల్లి వద్దన్నదని రాజు ఫారం పక్కన పెడితే, విశాలాక్షి దరఖాస్తు చేసుకుని టీచరు ఉద్యోగం సాధిస్తుంది. ఉద్యోగస్తురాలైన భార్యకు భర్తగా ఉండడం ఇష్టం లేదా అని రాజుని అడిగితే వెళ్ళి పెళ్లిళ్ల రిజిస్ట్రార్ దగ్గర పేర్లు నమోదు చేయించుకుందామంటాడు.

'తక్కిన ఇంగిలీషు చదువుతున్న రంగేలీ అమ్మాయిల మల్లే కాక కుదురుగా ఉన్నావని మీ అమ్మానాన్నా చెప్తే ఏమిటో అనుకున్నా. నువ్వూ ఇంతేనన్న మాట ...','మీ నాన్న వింటేనా! ఒద్దు, ఒద్దంటే ఈ ఇంగిలీషు చదువు పెట్టాడు. ఆడవాళ్ళకి, అందులో మనలాంటి సంసార్లకి' అంటూ సీతారామమ్మ విశాలాక్షిని ఉద్దేశిస్తూ అన్న మాటలు ఆనాటి సమాజంలో స్త్రీ విద్య పట్ల, ముఖ్యంగా స్త్రీలకు ఆంగ్ల విద్యను అందించటంపట్ల ఉన్న భావనకు సూచిక. మరో వైపు విశాలాక్షి ఆధునిక విద్యావంతురాలిగా ఆంగ్ల విద్య వల్ల తాను చెడిపోలేదని, సంప్రదాయ నైపుణ్యాలు లేకపోవడం చెడిపోవడం కాదని కాబోయే అత్తతో వాదిస్తుంది. రాజుతో తన వివాహం, తమ భవిష్యత్ జీవితం గురించి మాట్లాడుతుంది. తన ఆలోచనలపట్ల, ఆచరణ పట్ల స్పష్టత ఉన్న యువతకి ప్రతినిధిగా కనిపిస్తుంది. సీతారామమ్మ, విశాలాక్షి మధ్య జరిగే సంభాషణ, సంవాదాలు, తరాల మధ్య అంతరాన్ని, ఆధునికతను స్వీకరించడంలోని సంధియుగపు సవాళ్లను చిత్రిస్తుంది. గ్రామంలో కలిగిన కుటుంబాల పిల్లలకు మాత్రమే విద్యావకాశాలుండేవని టెలిగ్రామ్ చదివించు కోవడానికి వచ్చిన సూరయ్య, చలపతి పాత్రల ద్వారా అర్థమవుతుంది. అందుకే 'పాత సంప్రదాయపు గోడలు

పదర్రోసెద వెలుతురు కోసమని' అన్నట్లు ఆరుద్ర అభ్యుదయ దృక్పథం, మహిళాచైతన్యం పట్ల ఉన్న విశ్వాసం ఈ నాటికలో వ్యక్తమవుతుంది. ఆ రోజుల్లో ఆధునిక స్త్రీవాద ధోరణులకు తొలి ఆనవాళ్ళుగా ఈ నాటికను చూపవచ్చు.

'నన్ను గురించే' నాటిక సామాన్య ఉద్యోగియైన శివరామయ్య చుట్టూ తిరుగుతుంది. బంగారం పట్ల మోజుతో భార్యకు బంగారం కొంటాడు. కూతుర్లు దీనిని నిష్ఠూరంగా ప్రశ్నిస్తారు. ఆఫీసుకు బస్సులో వెళ్తూ బంగారం కొనాలనుకుంటాడు. మిత్రుడు రాజారాం, శ్రీనివాసమ్మ కలుస్తారు. శ్రీనివాసమ్మ రెండు వందల రూపాయల రుణం గుర్తుచేస్తుంది. సహోద్యోగి రామారావు జ్వరంతో ఉన్న శివరామయ్యను ఇంటికి చేర్చుతాడు. చివరికి సహోద్యోగి రామారావుకి చెక్కు ఇచ్చి కూతుళ్లకు బంగారు గాజులు తెమ్మంటాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ ఒత్తిడి చేత అతడి అంతరంగం నిరంతరం అతడిని ప్రశ్నిస్తూ ఉంటుంది. శివరామయ్య తనలోని రాముడితో స్వగతం కాకుండా సంభాషణ రూపంలో సంవాదం చేయడం ఆనాటికి వినూత్న ప్రయోగం. పాత్రల చిత్రణలో, సన్నివేశ కల్పనలో స్పష్టత లోపించడంతో పాఠకులు గందరగోళానికి గురవుతారు. నాటిక సృజనలో రచయిత ఆంతర్యం బోధపడదు. 'పార్కు బెంచీ' నాటిక రచయిత పతాకస్థాయి ఊహాకల్పనకు నిదర్శనం. చలనం లేని వస్తువైన రాతికి జీవలక్షణాలు అందిస్తూ అల్లిన కథనం ఆసక్తికరం. ఒక పార్కులోని రాతి బెంచి రోజూ ఒక యువకుడితో మాట్లాడుతుంది. ఐదేళ్ల పాటు ఎనమండుగురు పెన్షనర్లు రోజూ సాయంత్రం బెంచిపై, చుట్టూ కూర్చుని మాట్లాడుకుంటారు. ఆ మాటలన్నీ యుద్ధం, జ్యోతిష్యం, సాహిత్యం, పురాణం, వేదాంతం విషయాలలో మూస రకమైన సంభాషణలతో బెంచికి విసుగు పుడుతుంది. ఇతర బెంచీల వైవిధ్యాన్ని చూసి అసూయపడుతుంది. అలా ఒక రోజు వచ్చి కూర్చొన్న ఒక యువకవి, బెంచీపై విశ్రమించి, మహాకావ్యం రాశాడు. ఆ పార్కుకి వచ్చిన యువతితో యువకవి పరిచయం ప్రేమగా మారుతుంది. ఆర్థికాంతరాల వల్ల యువకుడు బెంచీ పక్కన చెట్టుకు ఉరి వేసుకుంటాడు. యువతి శవం చెలియలి కట్ట వద్ద తేలుతుంది. బెంచీ దుఃఖంతో కరిగిపోతుంది. చివరికి వారిరువురూ, కరిగి ఇసుకలో కలసిపోయిన పార్కు బెంచీ ఓదార్పు కోసం అక్కడికి వస్తుంటారని యువకుడు చెప్తాడు. 'ఆ రోజు ఆ యువతి ఆహ్వానించినప్పుడు తమ ఇంటికి వచ్చి ఉంటే అల్లుడివయ్యేవాడివని, నా కూతురు బతికి ఉండేదని' అప్పుడక్కడ వినిపించిన గొంతు కోపంగా చెప్పటం విషాదపు కొసమెరుపు.

ఈ నాటికలో మానవుడిలాగే ఆలోచించగల, మాట్లాడగల శక్తిని రచయిత ఆ రాతిబెంచీకి ఇచ్చాడు. మానవుడు రాయిని దేవుడిగా పూజించే స్థాయికి చేరుకోవడంతో, రాయి ఆలోచించగలదన్న వాదనను సమర్థించేందుకు తర్కాన్ని వినిపిస్తాడు. జీవులు, జడ పదార్థాల మధ్య తేడా చూపుతూ, ఒకనాడు జీవంగా ఉన్న వస్తువులు ఇప్పుడు చలించని పదార్థాలుగా మారినా, వాటిలో మిగిలిన శక్తిని మనమే గుర్తించాల్సిన అవసరముందని చెబుతాడు. విభిన్న యుగాల్లో, విభిన్న సంస్కృతుల ప్రభావంలో రాళ్లు మాట్లాడే భాషా శైలిలో మార్పులు చూపిస్తూ, ఈ రాతిబెంచీ మన కాలం ప్రకారం మనభాషలో మన భావాలకే స్పందిస్తోందన్న ఊహాత్మక కథనంగా వినిపిస్తాడు ఆరుద్ర. వాస్తవానికి వస్తే సమాజంలో చోటు చేసుకుంటున్న నిర్లిప్తత, నిరాసక్తత, యాంత్రికత, పోరాటరాహిత్యం, జీవన త్యాగం లేని మనుషులు, దిగువ మధ్యతరగతి జీవితాల్లో చోటు చేసుకుంటున్న ప్రేమలు, వాటిని నిలబెట్టుకోవాలనే తాపత్రయం ఈ నాటికలో సూచితమైంది. కథాకాలం నాటి స్వభావాన్ని డిసెక్షన్ చేయడం ఈ నాటిక ప్రత్యేకత.

మరో పార్శ్వంలోంచి ఈ నాటికను పరిశీలిస్తే జీవ-జడ సంబంధాన్ని ప్రశ్నిస్తూ, మానవ భావోద్వేగాలకు జడవస్తువుల స్పందనను తాత్వికంగా చిత్రిస్తుంది. రాతి బెంచిని జీవంతో చైతన్యవంతంగా చిత్రించడంతో నాటక కర్త శిల్ప సౌందర్యాన్ని, ఊహాశక్తిని సమన్వయం చేశారు. పెన్షనర్ల అతి సాధారణ మూస సంభాషణలతో విసిగిన బెంచి, యువకుడి ప్రేమకథ ద్వారా ఉల్లాసం పొందడం ద్వారా మానవ జీవితంలోని ఆనందం, ఆవేదనలను అనుభవిస్తుంది. యువకుడి కవిత్వం, ప్రేమ, విఫలమైన ముగింపు, మృత్యువుకు బెంచీ స్పందించినట్లు-బెంచిని మానవీకరణ స్థాయికి తీసుకెళ్లాడు రచయిత. భాషలోని సౌందర్యం, భావాల లోతు, ఊహాత్మక నేపథ్యం నాటికకు ప్రత్యేకతనిస్తాయి. జడవస్తువు కూడా భావోద్వేగాలను అనుభవించగలదన్న తాత్విక సందేశం ఆలోచనాత్మకంగా ఉంది. నాటక రూపంలో చైతన్యాన్ని వ్యక్తీకరించడం ఈ రచనలోని బలం. సామాన్య వస్తువును కథా కేంద్రంగా మలచి, మానవ జీవన గాఢతను చిత్రించిన ఈ నాటిక

శిల్పావైవిధ్యానికి నిదర్శనం. బాధలకు రాళ్ళైనా కరుగుతాయంటారు. సజీవంగా ఉన్నప్పుడు ఎవరూ పట్టించుకోరు కానీ మరణించిన తరువాత మాత్రం ఓదార్పు వచనాలు ఎన్నైనా మాట్లాడతారన్న వ్యంగ్య చిత్రణ ఈ నాటికలో కనిపిస్తుంది. కుటుంబాల్లో స్త్రీల మధ్య ఉండాల్సిన సహానుభూతిని, సౌహార్ద్రతను‘ అక్కయ్య్య ప్రమోషన్’ నాటికలో చర్చించారు ఆరుద్ర. కథ చిన్నదైనా, స్త్రీల స్వభావాలను, కుటుంబంలో అత్తా కోడళ్ళ సంబంధాలను, సామాజిక కారణాలను విశ్లేషిస్తుంది ఈ నాటిక. కథ సుందరమ్మ చుట్టూ తిరుగుతుంది, ఆమె ఆడబిడ్డగా పుట్టింట్లో వదిన (సుశీల)పై ఆధిపత్యం చూపాలని, అత్తగారింట్లో కోడలిగా అధికారం చెలాయించాలని ఆశిస్తుంది.

వివాహం జరిగి అత్తగారింటికి వెళ్ళిన తరువాత మూడేండ్లకు పుట్టింటికి వస్తుంది సుందరమ్మ. వచ్చిన దగ్గర నుండి తన అన్న భార్య మీద అధికారం చెలాయించాలని చూస్తుంది. తాను తన అత్తగారింట్లో అనుభవించిన చిత్రహింసలను ఇక్కడ తమ ఇంటి కోడలిపై చూపించాలనుకుంటుంది సుందరమ్మ. తన తల్లి, చెల్లి వదినతో సఖ్యంగా ఉండటం ఆమెకి ఆశ్చర్యంగా, అసంతృప్తిగా ఉంటుంది. తన పిలుపుకు సుశీల స్పందించలేదని, తనకు ఇంట్లో గౌరవం లేదని ఆమె తల్లి రత్తమ్మను నిందిస్తుంది. రత్తమ్మ సౌమ్యంగా సుందరమ్మను శాంతింపజేయడానికి ప్రయత్నిస్తుంది, కానీ సుందరమ్మ ఆగ్రహంతో తన అత్తగారింటికి వెళ్లిపోతానని బెదిరిస్తుంది. ఈ సమయంలో విద్యావంతురాలైన సుందరమ్మ చెల్లెలు సరోజ పరిణతితో సుందరమ్మ మాటలను అంచనా వేసి, ఆమెలో దాగివున్న మనస్తత్వాన్ని అర్థం చేసుకుంటుంది. సరోజ సుందరమ్మతో చతురతతో సంభాషిస్తూ, ఆమె కుటుంబ బాధలను వివరించేలా చేస్తుంది. సుందరమ్మ తన అత్తగారి ఒత్తిడిని, భర్త రాత్రిపూట చూపే సానుభూతిని, మరిది వివాహమైతే తనకు పెద్ద కోడలుగా ‘ప్రమోషన్’ వస్తుందనే ఆశను వ్యక్తపరుస్తుంది. సుందరమ్మ తల్లి ‘అత్తా ఒకింటి కోడలేనని’, తాను కోడలిగా ఎన్ని బాధలు పడిందో, తన అత్తగారు, ఆడపడుచు తనను ఎన్ని విధాలుగా శారీరకంగా, మానసికంగా హింసించారో కూతురికి చెబుతుంది. “మా అత్తగారు తప్పు చేశారనే కారణంగా నేనూ అదే తప్పు చేయను” అనే వాక్యం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. తల్లి మాటలు, చెల్లి మాటలు విని తన తప్పు గ్రహిస్తుంది సుందరమ్మ. తన మరిది పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడటం లేదని, స్వతంత్రంగా బ్రతకగల ఉద్యోగం వచ్చిన తరువాతే పెళ్లి మాట తలపెడతానన్నాడని తెలుసుకుంటుంది. మరిదికి పెళ్లయితే తోటికోడలిని ఆరళ్ళు పెట్టే ప్రమోషన్ అక్కయ్యకు రాకుండా పోయిందని సరోజ అక్కను ఆటపట్టిస్తుంది. ఇవన్నీ పునరాలోచనం చేయవలసిన జీవన దృశ్యాలు. నేటికీ మారని సంకుచిత మనస్తత్వాలు కనిపిస్తుండటం విషాదం.

ఈ నాటిక స్త్రీల మనస్తత్వాన్ని సూక్ష్మంగా చిత్రీకరిస్తూ, స్త్రీలు తమ అనుభవాల నుండి నేర్చుకుని, అధికార ధోరణులను విడనాడి, సమానత్వం, స్వతంత్రత వైపు పయనించాలనే సందేశాన్ని అందిస్తుంది. సుందరమ్మ అజ్ఞానం, సరోజ విజ్ఞానం ద్వారా విద్య ప్రాముఖ్యతను సూచిస్తారు ఆరుద్ర. స్త్రీల స్వభావాలను సహానుభూతితో చూడాలని, ద్వేషించకూడదని సందేశం ఇస్తారు. సుందరమ్మలోని పరివర్తన, సామాజిక సంస్కరణకు నాటిక దోహదపడుతుందని చూపిస్తుంది. ఆర్థిక స్వాతంత్ర్యం, స్వయం సమృద్ధి ప్రాధాన్యతను తెలియచేస్తుంది. మరిది స్వతంత్ర వైఖరి సంప్రదాయ బంధనాల నుండి విముక్తి కోరుకున్న ఆనాటి యువత ఆలోచనను సూచిస్తుంది. నాటికలోని సంభాషణలు సహజంగా, పాత్రల మనస్తత్వాన్ని స్పష్టంగా వెల్లడిస్తాయి. ఆరుద్ర భాషా చమత్కారం, సన్నివేశాల సహజత్వం, పద ప్రయోగ చమత్కారం నాటికను ఆకర్షణీయంగా చేస్తాయి.

నాటక సాహిత్యంలో ఆరుద్ర రచనలు ఒక అమూల్య నిధి. ‘కావ్యాలలో ఏ విధమైన సాహిత్య దృక్పథాన్ని ఆరుద్ర ప్రతిపాదించారో ఈ ఏడు నాటికల్లో కూడా అదే చేశార’ని వారి రచనలపై పరిశోధన చేసిన ఆచార్య మేడిపల్లి రవి కుమార్ ఆరుద్ర దృక్పథాన్ని విశ్లేషిస్తారు. ఆరుద్ర నాటికలు సమాజంలోని వివిధ సమస్యలను నిశిత పరిశీలనతో, విమర్శనాత్మకంగా చిత్రీకరిస్తూ పఠితలను ఆలోచింపజేస్తాయి. కార్మిక సమస్యల నుండి స్త్రీ స్వాతంత్ర్యం, అవినీతి వ్యతిరేకత నుండి మానవీయ భావోద్వేగాల వరకు విస్తృతమైన ఇతివృత్తాలతో, ఆధునిక దృక్పథంతో రచించిన ఈ నాటికలు కాలాతీతమైన ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆరుద్ర సృజనాత్మక శైలి, దార్శనిక దృష్టి, వినూత్న శిల్ప ప్రయోగాలు, సామాజిక చైతన్యంతో నాటక సాహిత్య చరిత్రలో శాశ్వత అధ్యయనంగా నిలుస్తాయి.

**డా. జె. నీరజ**
అసోసియేట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ సిటీ కాలేజి,
హైదరాబాద్ ఫోన్ : 9848370018

# ఓ బుల్లి దేశం - లిక్టెన్‌స్టైన్

ఆంగ్లం - డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు - శ్రీమతి అట్లూరి జయశ్రీ



లిక్టెన్‌స్టైన్ దేశం

ఆల్ప్స్ పర్వతాల అందాలన్నీ మీకేనా? అని స్విట్జర్లాండ్, ఆస్ట్రియా దేశాలతో వంతుకు పోయి, వాటి మధ్య దూరి, ఉత్తర ఆల్ప్స్ పర్వతాలలో, రైన్ లోయలో భాగంగా, ఒదిగి కూర్చున్నట్లు కనిపించే, ఒక బుల్లి దేశం, 'లిక్టెన్ స్టైన్'. అంతా కలిపి 160 చ. కి. మీ.లు. కుడీ ఎడమగా, మన కాకినాడంత. లండన్ మహా నగరంలో పదోవంతు. చిన్నసైజు ఇంగ్లండ్ ఆకారంలో కనపడే ఈ దేశం పొడవు 25 కి.మీ., వెడల్పు 6.25 కి.మీ. ప్రపంచపు అతి చిన్న దేశాల పట్టికలో, ఆరవ స్థానంలోనూ, అతి చిన్న ఐరోపా దేశాలలో, వాటికన్ సిటీ, శాన్ మారినో, మొనాకోల తరువాత, నాలుగవ దానిగా లిక్టెన్ స్టైన్ నిలుస్తుంది. జన సంఖ్య 38000. రాజధాని వడూట్జ్‌లో 5000 నివాసితులు ఉన్నారు. ఐరోపాలో పూర్తి రాచరికపు పాలన కొనసాగిన చిట్ట చివరిదేశం ఇది. ఇక్కడ మాట్లాడేది జర్మన్ భాష, అధికారికంగా వాడబడే ద్రవ్యమేమో స్విస్ ఫ్రాంక్. ప్రపంచం మొత్తంలో రెండే రెండు దేశాలకు ఒక ప్రత్యేకత ఉంది. 71% నీరు, 29% భూమి ఉన్న మన భూగ్రహం మీద, అసలు ఏ ప్రక్కనా సముద్ర తీరం లేని దేశాలు కొన్ని ఉన్నాయి. ఇవి భూపరివేష్టిత దేశాలు. కానీ లిక్టెన్ స్టైన్‌తో పాటు, ఉజ్బెకిస్తాన్‌ల సరిహద్దు దేశాలన్నీ కూడా భూపరివేష్టిత దేశాలే. అంటే రెండింతల భూ పరివేష్టిత దేశాలన్న మాట.

2024, మే నెలలో ఉద్యోగరీత్యా, ఇటలీలోని మిలాన్ నగరంలో జరగబోతున్న ఒక సమావేశానికి వెళ్ళాను. ఆపాటికి ఐరోపా ఖండంలో నేను ఇంకా చూడని దేశాలు రెండున్నాయి. ఒకటి రష్యా, రెండవది లిక్టెన్ స్టైన్. మిలాన్ నుండి లిక్టెన్ స్టైన్ రాజధాని అయిన 'వడూట్జ్' 160 కి.మీ. దూరంలో ఉంది. అక్కడికి వెళ్ళడానికి బస్ సదుపాయం కూడా ఉంది. లిక్టెన్ స్టైన్ కూడా చూడటానికి ఇది నాకు మంచి అవకాశం. సమావేశం పూర్తి అయిన తరువాత శని, ఆది వారాలు కూడా ఉండి, లిక్టెన్ స్టైన్ చూసే వెళ్ళాలనుకున్నాను. వడూట్జ్ వెళ్ళే బస్, మిలాన్ బస్ స్టేషన్ నుండి ఉదయం 8.30 కు ఉంది. నా హొటల్ నుండి బస్ స్టేషన్‌కు టాక్సీలో 15 నిముషాల ప్రయాణం. మూడు కి.మీ.ల దూరం. 15 యూరోల ఖర్చు. మిలాన్‌లో టాక్సీ ఖర్చు సాధారణంగా ఇలాగే ఉంటుంది. ఒకే ఒక్క మనిషి ప్రయాణం చేస్తే ఇలా. మరదే..వడూట్జ్‌కి వెళ్ళే బస్‌లో, నలుగురితో 250 కి.మీ.లు ప్రయాణం చేస్తే, 20 యూరోల ఖర్చు. వీలైనంత వరకు నలుగురితో కలసి ప్రయాణం చేస్తేనే మంచిది. యూరోప్‌లో బస్ ప్రయాణం చాలా సుఖం, సులభం కూడా. ఇట్లా వచ్చినప్పుడు నేను, ఫ్లిక్స్ బస్ అనే కంపెనీ సర్వీసులను వాడతాను. ఈ బస్‌లు యూరోప్ అంతా తిరుగుతూ ఉంటాయి.

ఈ బస్ స్టేషన్ చాలా పెద్దది. నేను ముందుగా వెళ్ళటంతో, బస్ బయలుదేరటానికి ఇంకా కొంచెం సమయం ఉంది. అక్కడి నుండి చుట్టుపక్కల చాలా ఊళ్ళకు వెళ్ళే బస్‌లు చాలా ఉన్నాయి. వాటి కోసం అక్కడకు చేరిన రకరకాల మనుష్యులతో స్టేషన్ క్రిక్కిరిసి ఉంది. చాలా మంది వయసులో పెద్దవాళ్ళలా కనపడుతున్నారు. వాళ్ళతో పాటు విద్యార్థులు. అక్కడ, ఐరోపా తెల్లజాతి వారి కంటే వివిధ వర్ణాల ప్రవాసీలు ఎక్కువగా ఉండటం నాకు కొట్టొచ్చినట్లు కనపడిన విషయం. బస్ స్టేషన్ సందడిగా ఉంది. ఎక్కడికో వెళ్లాలనే కోరిక, వెళ్ళాలనుకున్న చోటికి ఎంత త్వరగా చేరతామా అన్న ఆతృత, అక్కడి గాలిలో నిండి పోయిన ఉత్కంఠ వాతావరణం నన్ను కూడా ఆవరించింది.

ఈలోగా టాయిలెట్ పని పూర్తి చేసుకుందామనుకున్నాను. అక్కడ పెద్ద క్యూ ఉంది. ఆ సదుపాయం ఉచితం కాదు. 50 సెంట్లు కట్టాలి. యూరోప్‌లో చాలా చోట్ల ఇంతే. ఇది కూడా ఒక విధంగా మంచిదే. ఎందుకంటే, వాటిని శుభ్రంగా ఉంచటానికి అయ్యే ఖర్చు తలా కొంచెం ఇస్తారు కాబట్టి, సాధారణంగా పరిశుభ్రంగా ఉంటాయి. ఇక్కడున్న టాయ్‌లెట్లు, వాటంతట అవే శుభ్రం చేసేసుకునేవి. ఒక్కొక్కరు వాడిన తరువాత, అవి శుభ్రం అవటానికి రెండు నిముషాలు పడుతోంది. ఇప్పుడు నా వరకు నాకు సమస్య ఏమీ లేదు కానీ, ఈ పద్ధతిలో ఇంతింత సేపు ఆగలేని వారికి, ఆగే వ్యవధి లేని వాళ్ళకు, యిదంతా చాలా ఇబ్బందికరం. ప్రపంచం మొత్తంలో, ఎక్కడ చూసినా బస్ ప్రయాణీకులకు, విమాన ప్రయాణీకులకు సౌకర్యాలలో చాలా వ్యత్యాసం ఉంటుంది. రైలు ప్రయాణీకులకు ఉండే సౌకర్యాలు మధ్యస్థంగా ఉంటాయి. ఐతే, తోటి ప్రయాణీకులతో మమేకమవ్వాలంటే బస్ ప్రయాణానికి మించినది లేదు. వద్దనుకున్నా, వారి జీవిత సమస్యలు, సంతోషాలు, దినసరి వ్యవహారాలు, ఆచారాలు.. వగైరా అన్నీ మన చెవుల ద్వారా మన మనసుల్లోకి చొరబడి పోతాయి. కొత్త చోటు చూడాలనుకునే వారి పని, సగం బస్‌లోనే అయిపోతుంది.

మిలాన్ వదిలి పొలిమేరల్లోకి రాగానే, దూరాన మంచు శిఖరాలు దిగంతాలలో కట్టని ప్రహరీగా కనిపించాయి. అవన్నీ ఇటలీ, స్విట్జర్లాండ్ దేశాల సరిహద్దుగా నిలిచిన ఆల్ప్స్ పర్వతశ్రేణిలో భాగం. కొద్ది సేపట్లోనే, విఖ్యాత విహార కేంద్రంగా వినిపించే 'లేక్ కోమో' ప్రక్కనే వెళుతూ, కోమో పట్టణం దాటేశాము. ఇంకో అరగంటలో స్విస్ సరిహద్దు వచ్చేసింది. సరిహద్దు పరిరక్షణ యంత్రాంగం చాలా మెలకువగా ఉన్నారు. అందరి పాస్‌పోర్టుల తనిఖీ జరగ వలసి ఉంది. ఇందుకోసం బస్‌లను, నియమిత ప్రదేశంలో ఆపమని నిర్దేశించారు. అధికారులు బస్‌లోకి వచ్చి, చాకచక్యంగా బస్‌లో అందరి పాస్ పోర్టులు తనిఖీ చేశారు. నా పాస్ పోర్టులో ప్రతి పేజీ వివరంగా చూశారు. ఈ పని కోసం వచ్చిన ఇద్దరు ఆఫీసర్లలో ఒకరు లోపలకు వస్తే, మరొకరు బస్ తలుపు దగ్గర కాపలా కాస్తూ నిలబడ్డారు. రోడ్డు మీద కూడా, ఎవరూ దిగి పారిపోకుండా అడ్డు కట్టేశారు. సరిహద్దు వద్ద కాపలా చాలా గట్టిగా ఉంది. చివరకు మా బస్ డ్రైవరు (టర్కీ దేశస్థుడు) గుర్తింపు కార్డు, పాస్ పోర్టును కూడా వాళ్ళు పట్టి పట్టి చూశారు.

మా తరువాత మజిలీ, 'లేక్ లుగానో'. ఆల్ప్స్ పర్వతాల మీద నుండి జాలువారిన నిర్మల నీటి కొలను ఇది. స్విస్, ఇటలీ దేశాల సరిహద్దు రేఖ మీద ఉన్న ఈ లేక్, లేక్ కోమో అంత పెద్దది కాదు కాని, చాలా మనోహరంగా ఉంది. రెండు దేశాలలోనూ ఈ లేక్ చుట్టు ప్రక్కల నివాస గృహాలు ఏర్పరచుకోవటం, ఉన్నత స్థాయి వారి లక్ష్యంగా కనపడుతుంది. అక్కడ కనపడే 'లేక్ వ్యూ' గృహాలన్నీ గొప్ప గొప్ప వారివేనట. లేక్ లుగానో వద్ద కొంత మంది దిగిపోయారు. మరి కొంత మంది ఎక్కారు. నా పక్క సీటులో ఎవరూ లేరు. నా బాగ్ వగైరాలను పక్క సీటులో పెట్టుకుని విశ్రాంతిగా కూర్చున్నాను. నా సీటుకు అవతలివైపున ఒక వృద్ధ దంపతులు కూర్చుని ఉన్నారు. ఆయన అప్పుడప్పుడూ, ఆమెను మాటలలోకి దింపాలని చూస్తున్నాడు కానీ ఆమె మాత్రం తాను చేస్తున్న పదబంధ ప్రహేళికలో పూర్తిగా లీనమైపోయి ఉంది. తనకు కావలిసిన పదం దొరికినప్పుడు మాత్రం.. పట్టలేక, సంతోషం నవ్వుతో వెలిబుచ్చుతోంది.

ఉదయాన్నే లేచి బయలుదేరటంతో, బస్సు ఊపుకు శరీరం తూగుతూ, నా కళ్ళు మూతలు పడుతున్నాయి. కాస్సేపు నిద్రపోతే, గమ్యం చేరేసరికి, బడలిక తీరిపోతుందనిపిస్తోంది. కానీ కళ్ళ ముందు కదలి పోతూ కనపడుతున్న దృశ్యాలు నన్ను నిద్ర పోనివ్వటం లేదు. డ్రైవరు వెనుక ఎత్తులో ఉన్న నా సీటు నుండి, ముందున్న కిటికీ మీద దృశ్యాలన్నీ ఒక సినిమా రీలులా కనపడుతున్నాయి. మిలన్ నగర దృశ్యాలతో మొదలై, లేక్ కోమో, లేక్ లుగానోలతో పాటు అమరిన ఆల్ప్స్ పర్వతాల అద్భుత అందాలు రెప్పమూస్తే కనపడవుగా!! ఇంకెలా నిద్రపోవటం? ఈ ప్రయాణం అనంతంగా సాగిపోయినా, కళ్ళ ముందు కనబడే ప్రకృతి సౌందర్యం నాడీ మండలానికి నిరంతరంగా మేల్కొలుపులు పాడుతూనే ఉంది.

మా బస్ డ్రైవర్, బారిస్ 'నేను కేవలం డ్రైవరునే కదా', అనుకోకుండా ప్రయాణీకులంతా చాలా వరకు ఆ ప్రాంతానికి కొత్త అనే అవగాహనతో, దోవ పొడవునా, బస్ స్పీకర్ ఉపయోగించుకుంటూ, కనపడుతున్న దృశ్యాలను మాకు పరిచయం చేస్తూ పోతున్నాడు. ఫలానా దృశ్యం చూడబోతున్నారు, కెమెరా రెడీ చేసుకోండి అని

కూడా చెప్పటంతో, పరుగెత్తే బస్‌లో నుండి, సుందర దృశ్యాలను కెమెరాలో బంధించుకోవటానికి వీలయింది. అక్కడ బస్ వేగం కొంచెం తగ్గించాడని కూడా నాకనిపించింది. లేక్ లుగానో దాటిన తరువాత, ఎత్తైన పర్వత ప్రాంతంలోకి ప్రవేశించాము. ఆ కొండల మధ్య అక్కడక్కడా అందమైన ఇళ్ళతో పల్లెలు, ముదురు ఆకు పచ్చని కొండ చరియలలో చుక్కల్లా ఆవులు...సరిహద్దుకు అవతలి వైపు స్విట్జర్లాండ్లో కూడా ఇలాంటి దృశ్యాలే కనిపిస్తాయి. ఆల్ప్స్ పర్వతాలు ఆభరణంగా ఉన్న దేశాలన్నిటిలో, అంటే ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, ఛెక్ రిపబ్లిక్ మొదలైన దేశాలలో, రోడ్డు మార్గాలు చాలా బాగుంటాయి. మంచి రోడ్డు వేయటానికి, కొండలేమీ అడ్డు కావని చూపించటానికన్నట్లు, ఇక్కడ రోడ్లు నిర్మించారు. ఒక దేశాభివృద్ధికి మంచి రవాణా సౌకర్యం మౌలికం. కొండల చుట్టూ వెలసిన ఐరోపా దేశాలు, రవాణా సౌలభ్యం మీద దృష్టి సారించక పోయినట్లైతే, ఈ రోజుకు అవన్నీ ఇంత అభివృద్ధి చెంది ఉండేవి కావు. ముఖ్యంగా, స్విట్జర్లాండ్‌లో. చలికాలంలో స్విట్జర్లాండ్ గడ్డ కట్టి పోతుంది. ఎడ తెగని హిమపాతం జన జీవనాన్ని స్థంబింపచేస్తుంది. ప్రకృతి ప్రసాదించిన ప్రతికూల పరిస్థితులను చక్క బెట్టుకోవటంలో భాగంగా, కొండలు త్రవ్వి రోడ్లు, రైలు మార్గాలు వేయటమనే ప్రక్రియను, స్విట్జర్లాండ్ మొట్ట మొదటగా ప్రయోగించింది. ఇక్కడ ఈ రోజు కూడా రోడ్డు, రైలు ప్రయాణాలు చాలా సులభం. ఈ సారి నేను బెర్నార్డినో పర్వత మార్గం క్రింద నిర్మించబడిన బెర్నార్డినో సొరంగమార్గంలో ప్రయాణం చేశాను. దీని నిర్మాణం 1967లో పూర్తయిందట. 6.6 కి. మీ. ల పొడవున్న ఈ సొరంగ మార్గం కంటే పొడవైనవి ఇక్కడ ఇంకా చాలా ఉన్నాయి. గోథార్డ్ రైల్ టన్నెల్ పొడవు 57 కి.మీ.లు. ఇది స్విట్జర్లాండ్‌లోనే కాక ప్రపంచం మొత్తం లోనే పొడవైన రైల్వే టన్నెల్. మా బస్సు ప్రయాణం చేస్తున్న మార్గం కూడా, ఈ అద్భుతమైన రహదారి వ్యూహంలో భాగమే కాబట్టి, నా ప్రయాణం సుఖంగా సాగి పోతోంది. కొంత దూరం ఒక నది ప్రక్కగా సాగిన మా బస్, స్విట్జర్లాండ్‌లోని బెల్లిజోన పట్టణంలో కొంచెం సేపు ఆగి, జర్మనీలోని మ్యూనిక్ వైపు సాగారింది. ఉదయం 8.30కు మిలాన్‌లో బయలుదేరిన బస్, మ్యూనిక్ చేరేసరికి సాయంత్రం 4.30 అవుతుంది. మొత్తం ఎనిమిది గంటల ప్రయాణం.

ఆ ప్రాంతంలో కొండ మేకలు కనపడతాయని బారిస్ చెపుతున్నాడు. ఆల్ప్స్ పర్వత దృశ్యం... హిమ వన్నెగ శోభితమైన శిఖరాలతో, జలపాతాలతో, గల గల పారే సెలయేళ్లతో హృద్యంగా ఉంది. మరి కాసేపట్లో రైన్ నది మీద ఉన్న 'చుర్' పట్టణానికి చేరుకున్నాము. ఇక్కడ 45 నిముషాల మజిలీ. ఈ ఊరు నాకు పరిచయమే. స్విట్జర్లాండ్‌లో ప్రఖ్యాతి పొందిన రెండు రైలు ప్రయాణాలు. గ్లేసియర్ ఎక్స్ప్రెస్, బెర్నినా ఎక్స్ప్రెస్‌లు. రెండు మార్గాలలోనూ చుర్ ఒక ముఖ్యమైన మజిలీ. దాదాపు ఇరవై సంవత్సరాల క్రిందట, నా భార్యతో కలసి చేసిన ప్రయాణాలలో ఇది మరపు రానిది. ఆ నాటి ప్రయాణం గుర్తొచ్చి, బస్ దిగి, రైలు స్టేషన్‌కు వెళ్ళి, చుర్ పట్టణ ప్రధాన వీధుల వరకు చుట్టి వచ్చాను. వారాంతం కావటంతో వాతావరణం సందడిగా ఉంది. అక్కడి చర్చ్, భవనాలు, భవంతులు అన్నీ అప్పటిలానే అలరిస్తూ ఉన్నాయి. చరిత్రకందని కాలం నుండీ, స్విట్జర్లాండ్‌లో నిరంతర మానవ అవాసకేంద్రంగా చుర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అక్కడ ఒక శాండ్ విచ్ కొనుక్కుని, మా బస్ బయలుదేరే సమయానికి అక్కడకు తిరిగి వచ్చేశాను.

రైన్ నది వెంబడే మరో గంట ప్రయాణం తరువాత, వడూట్జ్ చేరుకున్నాము. ఇది లిక్టెన్ స్టైన్ రాజధాని. లిక్టెన్ స్టైన్ సరిహద్దులు గిరి గీసి ఉండవు. పాస్ పోర్ట్ తనిఖీలు ఏమీ లేవు. బస్ స్టేషన్ ఊరి బయట ఉంది. అక్కడ దిగింది నేను ఒక్కడినే. అక్కడ నేను తప్ప, మరో ప్రాణి లేదు. ఇక టాక్సీ మాటెందుకులెండి. చేసేదేమీ లేక, ఊరి వైపు నడవటం మొదలెట్టాను. 10 నిముషాలు నడిచిన తరువాత, కాస్త జన సంచారం, ఇళ్ళూ అవీ కనిపించాయి. కొంత దూరంలో ఒక కొండ మీద ఒక చక్కని కోట కనపడింది. ఒక ఇంట్లో దాని ముందు, గార్డెన్‌లో పని చేసుకుంటున్న ఒక వృద్ధుడు కనిపించాడు. అక్కడ ఆగి, అతని దృష్టిని ఆకర్షించటానికి నేను చేసిన ప్రయత్నం ఫలించి, అతను నాకు పట్టణంలోకి వెళ్లాలంటే మరో 20 నిముషాలు నడవాలని చెప్పాడు.

అతను చెప్పిన వైపే నడుస్తూ వెళ్ళి పట్టణకేంద్రం చేరుకున్నాను. అక్కడ ఒక సమాచార కేంద్రం కనిపించింది. అందులో పని చేస్తున్న టూరిస్ట్ అడ్వయిసర్ (పేరు కాథరిన్) స్నేహపూర్వకంగా మాట్లాడింది. అక్కడికి అయిదు నిముషాల దూరంలో ఉన్న ఒక బస్ స్టేషన్‌లో నా



ట్రెజరీ మ్యూజియం, వడూట్జ్

సామాన్లను భద్రపరచుకోవచ్చని ఆమె చెప్పింది. ఆమె సలహా మేరకు, అక్కడకు వెళ్ళి, ముందు నా సామాన్ల బరువు దించుకోవాలనుకున్నాను. అక్కడ మాంఛి గట్టిగా ఉన్న లాకర్లు ఉన్నాయి. రెండు యూరోలు కడితే 24 గంటల పాటు, వాటిలో పట్టినన్ని సామాన్లను అక్కడ భద్ర పరచుకోవచ్చు. అది నాకు అన్నిటి కంటే అవసరమైన సౌకర్యం అనిపించింది. మొదట నేను ఎంచుకున్న లాకర్‌లో రెండు యూరోలు వేసిన తరువాత, అది పనిచేయలేదు. అట్లా ఇంకొన్ని లాకర్లు ఉపయోగించుకోవాలని చూశాను. నా దురదృష్టం కొద్దీ అవీ పనిచేయలేదు. ప్రతి ప్రయత్నానికి రెండు యూరోల చొప్పున పోగొట్టుకున్నాను. ఇక లాభం లేదని మళ్ళీ టూరిస్ట్ సమాచార కేంద్రానికి వెళ్ళాను. జరిగిన విషయం తెలుసుకుని కాథరిన్ చాలా నొచ్చుకుంది. క్షమాపణలు చెప్పటంతో ఊరుకోకుండా, నా సామాన్లు, తన ఆఫీసులోనే ఉంచుకోవచ్చని చెప్పింది. 'బ్రతుకు జీవుడా' అనుకుని, నా బరువు, అక్కడ దించేసుకుని, వడూట్జ్ మాప్ దొరకబుచ్చుకుని, ఊరు చూడటానికి బయలుదేరి పోయాను.

మొదట చూసిన విశేషం, ట్రెజరీ మ్యూజియం. ఇక్కడ రారాజుల పట్టాభిషేక మహోత్సవాలకు ఉపయోగించే, విలువైన కిరీటాలు, భుజ కీర్తులు మొదలైన ఆభరణాలు ఉన్నాయి. వజ్ర వైఢూర్యాలు పొదిగి చేసిన ఈ ఆభరణాలన్నీ, అతిశయంగా, అందంగా కూడా ఉన్నాయి. ఇక్కడున్న రాజ కిరీటం, అసలు కిరీటపు నమూనా అట. గత 400 సంవత్సరాలలో రాజవంశీకులు సేకరించిన చిత్రపటాలు, ఈస్టర్ పండుగను సూచించే గ్రుడ్డు ఆకారపు వస్తువులకు విలువైన రత్నాలు పొదిగి, కార్ల్ ఫేబర్జె రూపొందించిన ప్రఖ్యాత కళాకృతులూ చూడదగినవి. వీటన్నిటినీ మించి, నాకు బాగా నచ్చినది, చంద్ర శిల. 1969లో, చంద్రుని మీద దిగిన తొలి మానవులు నీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్ రిన్‌లు ప్రయాణం చేసిన అపోలో 11 తయారీ కోసం, లిక్టెన్ స్టైన్‌లో ఉన్న బాల్జర్స్ ఎ. జి. ముఖ్యమైన విడి భాగాలను అందించింది. వాతావరణ వత్తిడి లేని పరిస్థితిని కృత్రిమంగా సృష్టించటానికి, వ్యోమ నౌకలు శూన్యంలో వెలువడే ప్రమాదకర కిరణాల బారిన పడకుండా, సురక్షితం చేయటంలో ఈ సంస్థ కృత్యకృత్య మయింది. అందుకు గుర్తింపుగా యూ. ఎస్. ఎ. తరపున, ప్రెసిడెంట్ నిక్సన్, వీరికి ఒక జ్ఞాపికను, కొన్ని గ్రాముల చంద్ర శిలలను బహుకరించారు. చంద్ర శిల, చూడటానికి ఏమంత ప్రత్యేకంగా లేకపోయినా, దాని ప్రాముఖ్యత తెలిసిన తరువాత దానిని చూడటం ఒక అనుభవం.

లిక్టెన్ స్టైయిన్, ఫిలెటెలిస్ట్ (స్టాంపుల సేకరణాసక్తి ఉన్నవారు)లను ఆకర్షిస్తుంది. ఇక్కడ వడూట్జ్ ప్రధాన వీధిలో ఉన్న పోస్టల్ మ్యూజియం, వివిధ కాలాలలో లిక్టెన్ స్టైయిన్లో విడుదల చేయబడిన స్టాంపులను భద్రపరచి, ప్రదర్శిస్తుంది కూడా. దీన్ని కూడా చూసిన తరువాత, నేను దర్శించిన మరో విశేషం, నేషనల్ మ్యూజియం.

15 వ శతాబ్దానికి చెందినా చెక్కుచెదరని ఈ భవనం, గతంలో ఒక ప్రయాణీకుల విశ్రాంతి భవనమట. ఇక్కడ 1:10,000 స్కేలులో రూపొందించబడిన లిక్టెన్ స్టైన్ రాజ్యపు నమూనా, నన్ను బాగా ఆకట్టుకుంది. ఈ రాజ్యపు గతవైభవాన్ని పట్టి చూపించే వస్తువులెన్నో ఇక్కడ ఉన్నాయి. వడూట్జ్ వీధులలో, ప్రపంచ విఖ్యాత శిల్పుల రూపకల్పన లెన్నో మనల్ని పలకరిస్తూ కనిపించాయి. ముఖ్యంగా నన్ను ఆకట్టుకున్నది, కొలంబియాకు చెందిన ఫెర్నాండో బొటరో శిల్పం,'రిక్లెనింగ్ ఉమన్'. ఇక్కడ తిరుగుతున్నప్పుడు, నేను చూస్తున్న ప్రదేశాల ప్రాముఖ్యతను పూర్తిగా అర్థం



నేషనల్ మ్యూజియం, లిక్టెన్‌స్టైన్



లిక్టెన్ స్టైన్ కోట

చేసుకోవటానికి, ఈ ప్రాంతాన్ని గురించి కొంత తెలుసుకుని వెళ్ళటం సహాయ పడింది. లిక్టెన్ స్టైన్ రాజ వంశస్థులు, 12 శతాబ్దం నాటి నుండీ, ఆస్ట్రియా దేశపు రాజ వంశీకులతో.. సైన్యాధికారులుగా, దౌత్యవేత్తలుగా దగ్గర సంబంధాలు కలిగి ఉండే వారట. ఆస్ట్రియా దక్షిణ ప్రాంతంలో లిక్టెన్ స్టైన్ కోట కూడా వీరిదే. 1699వ సంవత్సరంలో ఆ కాలపు ఆస్ట్రో-హంగేరియన్ చక్రవర్తి, హాన్స్-ఆడమ్**I**, (1657-1712) అని తరువాత కాలంలో పిలువబడిన, జోహాన్ ఆడమ్ ఆండ్రియాస్ అనే ఛెచ్చియా దేశపు రాకుమారుడిని, 1684లో లిక్టెన్ స్టైన్, వంశ పారంపర్య రాజ్యాధిపతిగా ప్రకటించాడు. అతడు 18వ శతాబ్దంలో, షెల్లెన్ బర్గ్, వడూట్జ్ ప్రాంతాలను కొనుగోలు చేసి, తన వంశమైన 'లిక్టెన్ స్టైన్' పేరిట రాజ్య స్థాపన చేశాడట. కానీ అటు తరువాత కూడా, వీరంతా ఆస్ట్రియా రాజధాని వియన్నాలోనే, విలాసంగా నివసిస్తూ, అక్కడి నుండే పరిపాలన సాగించేవారట. ఎటొచ్చీ, రెండవ ప్రపంచ యుద్ధం తరువాతనే ఈ రాజ వంశస్థులు, లిక్టెన్ స్టైన్‌కు మకాం మార్చారట.

నాకు తెలిసిన అధికారిక సమాచారం ప్రకారం, లిక్టెన్ స్టైన్ రాజ్యాధిపతులు, నామమాత్రంగా ఉండే రాజ్యాధిపతులు కాదు. ఈ రాజ్యపరిపాలనలో సర్వాధికారాలు వీరివే. లిక్టెన్ స్టైన్ రాజ్యాధిపత్యం, రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామిక విలువలకు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలకు అనుగుణంగా నడపటానికి, ఈ రాజవంశీయులకు ఇవ్వబడిన ఏకఛత్రాధిపత్యం. ఇక్కడ రాజుకు ఎంత బలమో, ప్రజాభిప్రాయానికీ అంతే బలం. 25 మంది సభ్యులుగా ఉండే ప్రజాప్రతినిధుల సభ (పార్లమెంట్), శాసనాలను రూపొందిస్తే, వాటిలో ప్రతి ఒక్క శాసనం మీద ప్రజాభిప్రాయ సేకరణ (రిఫెరెండం) జరుగుతుంది. వీటన్నిటితో పాటు, రాజు కూడా ఈ నిర్ణయాలను త్రోసి రాజనవచ్చు. ప్రజాభిప్రాయానికి తావివ్వకుండా, రాజు కూడా కొన్ని స్వయం నిర్ణయాలు తీసుకోవచ్చు. రాజు ప్రతిపాదించిన మంత్రుల కూటమి, ప్రధాన మంత్రి నాయకత్వంలో రాజ్య పాలనా వ్యవహారాలు నిర్వహిస్తుంది. రాజు, ప్రధాన మంత్రి సలహా మీదట ప్రజా ప్రతినిధుల, మంత్రుల కూటమిని రద్దు చేయవచ్చు. న్యాయాధిపతుల నియామకాలు కూడా రాజు పరిధి లోవే. ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే, 2012లో రాజు అధికారాలను పరిమితం చేయాలనే ప్రతిపాదన మీద ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పుడు, 73% లిక్టెన్ స్టైన్ ప్రజలు దీనిని వ్యతిరేకించారు.

రాజ్యాంగపరమైన బాధ్యతల నిర్వహణలో మాత్రమే కాకుండా, లిక్టెన్ స్టైన్ ప్రిన్స్, మంచి వ్యాపారవేత్త కూడా. అతని ఆస్తిపాస్తుల నికర విలువ, 7 బిలియన్ల అమెరికన్ డాలర్లకు మించే. బ్రిటిష్ రాజు సంపద కంటే ఇది ఎక్కువ. అతని ఆస్తులు.. బ్యాంకింగ్, స్థిరాస్తులు, పండ్ల తోటలు, విలువైన కళాఖండాల సేకరణల రూపంలో, లిక్టెన్ స్టైన్‌తో పాటు అనేక దేశాలలో కూడా ఉన్నాయట. ప్రస్తుతపు రాకుమారుడు నివసించే కోట, వడూట్జ్ కాజెల్, ఒక ఎత్తైన కొండ మీద నుండి, నగరాని పర్యవేక్షిస్తున్నట్లుగా కనపడుతుంది. నేనున్నచోటు నుండి, ఈ రాజగృహాన్ని కాలినడకన చేరటానికి ముప్ఫై నిముషాలు పడుతుంది. ఊర్లో, ఈ దోవ పొడుగునా, దేశ చరిత్ర గురించిన సమాచారంతో చాలా బోర్డులు కనిపించాయి. తీరికగా, వీటన్నిటినీ చదువుతూ, చుట్టూ చూస్తూ రాజ ప్రాసాదం వైపు సాగాను. వీటిలో కొన్ని, 1719లో లిక్టెన్ స్టైన్ స్థాపన గురించి, 1806లో ఒక స్వతంత్ర దేశంగా గుర్తించ బడటం గురించి ప్రముఖంగా కనిపించాయి. 1868లో లిక్టెన్ స్టైన్ సైన్యం రద్దు కావించబడింది. శాశ్వతంగా తటస్థ దేశంగా దీనిని ప్రకటించటం, సైన్య నిర్వహణకు అయ్యే ఖర్చు తగ్గించటం.. దీనికి కారణాలట. లిక్టెన్ స్టెయిన్, 160వ దేశంగా ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందింది. నార్వే దేశంలానే, ఆర్థిక ప్రయోజనాల వరకు ఐరోపా ప్రాంతంలో భాగమైనా, ఐరోపా కూటమిలో సభ్యత్వం మాత్రం తీసుకోలేదు. అప్పుడే వీపుకు ఒక సంచి మాత్రమే తగిలించుకుని నడుస్తున్న ఒక యువతి కలిసింది. ఆమె కొలంబియాలో మేడెలిన్ నగరం నుండి వచ్చిందట.

యూనివర్సిటీ చదువు పూర్తిచేసుకుని, ఐరోపా చూడటానికి వచ్చిందట. ఈ సంవత్సరమే నేను కొలంబియా వెళ్ళి ఉండటంతో, ఆమెతో వెంటనే మాటలు కలిశాయి. కొలంబియా గురించి మాటలు కలవగానే పెరిగిన ఉత్సాహంతో కలసి నడవటం మొదలుపెట్టాము. తన దేశం గురించి, తన నగరం గురించి నేను వివరంగా మాట్లాడుతున్నందుకు ఆమె సంతోష పడింది. అంతకు ముందే చూసిన ఫెర్నాండో బోటెరో శిల్పం గురించి, నేను చెప్పగానే, ఆమె కూడా ఆశ్చర్యపడి, తను కూడా చూడాలనటంతో, అదెక్కడుందో ఆమెకు చెప్పాను. మేమిద్దరం కలసి నడచింది కొద్దిసేపే అయినా, ఆ అనుభవం నాకు ప్రత్యేకంగా గుర్తుండిపోయింది. ప్రయాణం ప్రవృత్తిగా మలచుకున్న వారి మధ్య బంధం ఏర్పడటానికి ఎక్కువసేపు పట్టదు మరి. దోవలో అక్కడక్కడా వడూట్జ్ నగరాన్ని మొత్తంగా చూడగలిగే ప్రదేశాలు కొన్ని ఉన్నాయి. నగరం క్రమేపీ, మెలికలు తిరుగుతూ ప్రవహిస్తున్న రైన్ నది పరీవాహక ప్రాంతంలో ఏర్పడిన విశాలమైన లోయ వైపుకు వాలిపోతున్నట్టు కనిపించింది. నదికి ఆవలి వైపున దూరంగా స్విస్ పట్టణాలు ఛాయా మాత్రంగా కనిపిస్తున్నాయి. పరచుకున్న ద్రాక్ష తోటలు, మంచు కప్పిన పర్వత శిఖరాల మధ్య ముచ్చటైన ఇళ్ళతో, ఆల్ప్స్ పర్వత ప్రాంతం అందంగా సాక్షాత్కరించింది.

సుందరమైన ఐరోపా ఖండం, దురదృష్టవశాత్తూ రెండో ప్రపంచ యుద్ధ కాలం వరకూ, రక్తంతో తడిసిన నిరంతర యుద్ధభూమిగా చరిత్రలో మిగిలిన శాపగ్రస్త. అటువంటి చోట సైన్యం అనేదే లేకుండా మనగలమను కోవటమే ఒక సాహసం. పొరుగు దేశాలతో సత్సంబంధాలు, తటస్థ దౌత్య విధానాలతో, ప్రిన్స్ ఆఫ్ లిక్టెన్ స్టైన్ దీనిని సాధించాడు. ఒక విధంగా ఈ విషయంలో, వీరిని చూసి ప్రపంచం నేర్చుకోవలసినది చాలా ఉంది అనిపిస్తుంది. సైన్యాన్ని తయారుగా ఉంచుకోవటమంటేనే, ఆత్మ రక్షణ కోసం యుద్ధానికి సన్నద్ధమని తెలపటం. ఒక చిన్న దేశం, ఎంత సన్నద్ధమయినా, బలవంతమైన పొరుగుదేశాల శక్తికి దాసోహమనవలసిందే. దాని బదులు, ముందే.. సైనిక బలాలను ఏర్పరచుకోనట్లయితే, లిక్టెన్ స్టైన్‌ను ఒక ప్రత్యర్థి దేశంగా ఎవరూ చూడరు. సైన్యమే లేని దేశం పొరుగు దేశాలకు ఏ రకంగా ప్రమాదకారి అవుతుంది? ఇటువంటి ఆలోచన సరికొత్తది. హిట్లర్, నెపోలియన్ లాంటి నియంతల దృష్టిలో పడకుండా, రెండు ప్రపంచ యుద్ధాలను దాటుకుని, గండు రాజ్యాల మధ్య ఒక బుల్లి దేశం దాని స్వతంత్రతను కాపాడుకోవటంతో, ఈ సరికొత్త పంథా వ్యూహాత్మకంగా ఎంత గొప్పదో ప్రపంచానికి తెలియ చేసుకుంది. ఇక్కడ ఒక తమాషా కథ ఒకటి వినవస్తుంది. లిక్టెన్ స్టైన్ చివరిసారిగా యుద్ధానికి దిగినప్పుడు, ఆస్ట్రో-పర్షియన్ యుద్ధంలో, చనిపోయిన వారి సంఖ్య నెగెటివ్‌గా ఉన్నదట. అంటే 80 మంది సైన్యంతో యుద్ధానికి వెళ్ళితే, 81 మంది తిరిగివచ్చారట. అక్కడ ఒక మిత్రుడిని కూడా కలుపుకుని తిరిగి వచ్చారన్నమాట!!

రాజభవనం, రాజ వంశీకుల నివాస గృహం కాబట్టి, అనుకున్నట్లే.. ప్రజలకు ప్రవేశము లేదు. కానీ ఆగస్టు 15, లిక్టెన్ స్టైన్ జాతీయ దినోత్సవం కాబట్టి ఆరోజు మాత్రం పౌరులందరినీ రాజుగారు రాజ భవనంలో స్వయంగా ఏర్పాటు చేసే గార్డెన్ పార్టీకి రమ్మని ఆహ్వానిస్తారట. దానికయ్యే ఖర్చంతా కూడా రాజుగారే భరిస్తారట. ఇట్లా ఏదేశంలో జరుగుతుంది? కానీ, పౌరులు కాని వారికి మాత్రం ఆహ్వానం ఉండదట.

కాథరిన్‌తో మాట్లాడినప్పుడు, ఆమె ఎంగెల్ రెస్టారెంట్‌కు వెళ్ళమని సలహా ఇచ్చింది. దాని ప్రకారమే, ఆ సాయంత్రం ఏడు గంటలకల్లా అక్కడికి భోజనానికి వెళ్ళాను. వేసవికాలం కాబట్టి, ఏడయినా ఇంకా వెలుతురు ఉంది. అది చాలా పెద్ద రెస్టారెంట్. కానీ చాలా ఖాళీగా ఉంది. అక్కడి సర్వరు, ఆంద్రియాస్ నాతో పాటు మరొక జంటకు మాత్రమే సేవలు అందిస్తున్నాడు. ఇరవై యేళ్లు ఉంటాయేమో! చలాకీగా ఉన్నాడు. ఇక్కడ స్థానిక ఆహారం, 'కాస్కనోఫుల్' అట. దానినే తేవటానికి ఆంద్రియాస్‌ను పురామాయించాను. కాస్కనోఫుల్ అంటే ఛీస్ బిళ్ళలని అర్థమని ఆంద్రియాస్ చెప్పాడు. చూడటానికి మన కుడుముల్లాగా ఉన్న వాటిని, ఛీజ్‌తో నింపి వండినట్లున్నారు. వీటిని కూరగాయల ముక్కలు (సలాడ్), కర కరా వేయించిన ఉల్లిపాయ వాలికలు, ఆపిల్ సాస్‌లతోపాటు అందిస్తారు.

కాస్సేపట్లోనే, మిగిలిన ఇద్దరూ, భోజనం పూర్తి చేసుకుని, బిల్లు చెల్లించి వెళ్లిపోయారు. ఇక మిగిలింది నేనొక్కడినే. ఆంద్రియాస్ సేవలన్నీ ఇక నా ఒక్కడికే. స్థానికుల జీవన విధానం గురించి తెలుసుకోవటం యాత్రలలో ప్రధానమైన భాగమనుకునే నాలాంటి వారికి ఇది మంచి అవకాశం. అతనికి లిక్టెన్ స్టైన్ పౌరసత్వం

ఉందా? అని ఆరా తీయటంతో సంభాషణ మొదలు పెట్టాను.  నా ఆరాటాన్ని గమనించిన ఆంద్రియాస్, తన స్వస్థలం, హాలీవుడ్ నటుడు, ఆర్నాల్డ్ శ్వార్జ్‌నెగ్గర్ స్వస్థలం ఒక్కటే అని నవ్వుతూ చెప్పాడు. ఆర్నాల్డ్ శ్వార్జ్‌నెగ్గర్ స్వస్థలం ఆస్ట్రియాలోని గ్రాజ్. ఆంద్రియాస్, స్విట్జర్లాండ్‌లో ఉంటూ, వడూట్జ్‌లో పని చేయటానికి రోజూ అక్కడి నుండి వస్తాడట. ఇట్లా చేయటం వలన అతనికి మూడు రెట్ల ఆదాయం లభిస్తుందట. అతను చెప్పిన దాని ప్రకారం, వడూట్జ్‌లో పనిచేయటానికి బయటి నుండి దాదాపు 40000 మంది రోజువారీ వస్తారట. అంటే ఇక్కడున్న ప్రతి మనిషికి, మరొకరు చొప్పున స్విట్జర్లాండ్, ఆస్ట్రియా దేశాలనుండి కేవలం పని చేయటం కోసమే ఇక్కడికి వస్తారన్నమాట.

ఆంద్రియాస్ చెప్పిన దాని ప్రకారం, లిక్టెన్ స్టెయిన్లో జీవన వ్యయం చాలా ఎక్కువ. పైగా, లిక్టెన్ స్టెన్ ప్రభుత్వం విదేశస్థులను ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఇక్కడ ఉండనీయదట. అతనుండేది, రైన్ నదికి అవతలి ప్రక్కన స్విట్జర్లాండ్లో ఉన్న చిన్నపట్టణమనీ చెపుతూ, స్విట్జర్లాండ్‌లో అద్దె చాలా తక్కువ అని కూడా ఆంద్రియాస్ చెప్పాడు. నాకు తెలిసినంత వరకు, పాశ్చాత్య ఐరోపా.. ముఖ్యంగా స్విట్జర్లాండ్, స్కాండినేవియన్ దేశాలు నివసించటానికి చాలా ప్రియమైనవి. స్విట్జర్లాండ్లో జీవించడమే చవక అని ఆంద్రియాస్ చెప్పిన దాని బట్టి, లిక్టెన్‌స్టైన్ ఇంకెంత ఖరీదైన దేశామో ఊహించుకోవచ్చు. తనలాంటి వాళ్ళు ఇక్కడకు వచ్చి, ఒకటి/రెండు సంవత్సరాలు  ఉద్యోగం చేసి, కొంత డబ్బు వెనకేసుకుని, స్వస్థలానికి తిరిగి వెళ్లిపోతారని ఆంద్రియాస్ చెప్పాడు. అంతలోనే నవ్వుకుంటూ, ఇక్కడి వారినెవరినైనా పెళ్లి చేసుకుంటే మాత్రం ఇక్కడే ఉండి పోతానన్నాడు.

ఆ రాత్రి ఉండటానికి హొటల్‌ను  నేను మిలాన్‌లో ఉండగానే బుక్ చేసుకున్నాను. వడూట్జ్‌లో హొటళ్లు చాలా ఖరీదుగా ఉండటంతో, నేను దానికి 6 కి. మీ.ల దూరంలో ఉన్న 'బుక్స్'లో తీసుకున్నాను. వడూట్జ్‌తో పోల్చితే, అక్కడ హొటల్ ఖర్చు సగమే. కానీ అయితే అది, రైన్ నదికి అవతలి వైపు, స్విట్జర్లాండ్‌లో ఉందని అప్పుడే తెలిసింది. అక్కడికి వెళ్ళటానికి టాక్సీ 50-60 యూరోలు అవుతుందని, అదే పబ్లిక్ బస్లో వెళితే 5 యూరోలతో వెళ్ళవచ్చని ఆంద్రియాస్ సూచించాడు.

ఇక్కడ నుండి చుట్టూ ప్రక్కల ప్రాంతాలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ చాలా బాగుంది. ప్రతి 2/3 గంటలకు, దగ్గరలో ఉన్న స్విట్జర్లాండ్, ఆస్ట్రియా దేశాల పట్టణాలకు బస్ సౌకర్యం ఉంది. కొంత సమాచారం సేకరించిన తరువాత బుక్స్‌కు వెళ్ళే బస్ కనుక్కుని, 20 నిముషాలలో అక్కడికి చేరిపోయాను. మరో 10 నిముషాల నడకతో నా హొటల్ 'ఫ్లెక్సి' చేరిపోయాను. ఫ్లెక్సి హొటల్ మోడర్న్‌గా ఉంది. అక్కడ అన్నీ యంత్రాల సహాయంతోనే నడుస్తున్నాయి. నా రిజర్వేషన్ నంబరు, నా పాస్‌పోర్ట్ వివరాలు అక్కడున్న ఒక మెషీన్‌లోకి ఎక్కించగానే, అది ఒక కార్డ్ ప్రింటు చేసింది. దానితో నాకు హొటల్ రూమ్ లోకి వెళ్ళటానికి ప్రవేశం దొరికింది. హొటల్ గది సామాన్యంగా ఉంది కానీ శుభ్రంగా ఉంది. ఖర్చు తక్కువగా ఉండాలని చూసే నాలాంటి యాత్రికులకు ఇది వీలుగా ఉంది. స్విట్జర్లాండ్లో, తక్కువ అంటే, ఒక రాత్రి బస కోసం సుమారు 80 యూరోల ఖర్చు.

ఆ రోజు నాకు చాలా సుదీర్ఘంగా ఉన్నట్లనిపించింది. ఇటలీలో నిద్ర లేచి, లిక్టెన్ స్టెన్‌లో పగలంతా తిరిగి, స్విట్జర్లాండ్‌లో నిద్రపోవటం విచిత్రంగా అనిపించింది. ఆ హొటల్‌లో నేను మరొక నరమానవుడిని చూసింది లేదు. ఇక్కడ నిద్ర పోవాలంటే, ఒక విధమైన గుబులుగా, బాగా ఒంటరిగా ఫీల్ అయ్యాను. ఎప్పటికో నిద్ర పట్టింది. మరునాడు పెందరాళే లేచి, ఉదయం 7.30 కల్లా బయలుదేరి పోయాను. అప్పుడు కూడా, యంత్రాలు తప్ప మనిషనేవాడు లేడు. బుక్స్, మిగతా అన్ని స్విస్ పట్టణాల మాదిరిగానే ఉంది. అవే కొండలు, వాటి మధ్య అందమైన అల్ఫైన్ ప్రకృతి సౌందర్యం. వడూట్జ్ కంటే కూడా పెద్ద పట్టణమిది. ఈ రెండు పట్టణాల మధ్య రైలు సదుపాయం ఉంది. ఇక్కడ ప్రధాన వీధిలో తిరుగుతున్నప్పుడు, అక్కడి గాలి చక్కని కాఫీ సువాసనను మోసుకొచ్చింది. అక్కడున్న ఒక కెఫేలో దూరి, మంచి కాఫీతో పాటు, మాంసంతో పాటు బ్రెడ్ కలిపి తయారుచేసే షెంట్జెల్ సాండ్ విచ్ కూడా కొనుక్కున్నాను. ఉదయపు ఉపాహార బాధ కూడా తీరిపోయిన తరువాత, పట్టణం ఇంకాస్త అందంగా కనపడింది. పోస్టు కార్డులలో చూసే స్విస్ పట్టణాలకు ఇది ఏమీ తీసిపోదు.  అక్కడి నుండి, 18 వ నంబరు బస్ ఎక్కి, 20 నిముషాలలో వడూట్జ్ చేరి పోయాను. బస్ టికెట్ ఖరీదు 5 యూరోలు. ఫరావాలేదనిపించినా,

సీజను టిక్కెట్టుతో పోల్చితే ఈ దినసరి టికెట్ ఖరీదు చాలా ఎక్కువ. సీజను టిక్కెట్టు ఉన్నవాళ్ళు, ఎక్కవలసిన ద్వారం బస్ మధ్యలో ఉంది. నాలాంటి వాళ్ళు, బస్ ముందు నుండి ఎక్కి అక్కడ టికెట్ కొనుక్కోవాలి. ఆ రోజు, ఆదివారమనో ఏమో కానీ బస్ చాలా నిండుగా ఉంది. నా ప్రక్కనే కూర్చున్న మహిళ నన్నేదో అడిగింది. నాకు అర్థమవలేదు. నా వెనుక సీటులో కూర్చున్నతను, ఆమెకు చెప్పినది మాత్రం అర్థమయింది. అక్కడ మంచు శిఖరాలతో కనపడుతున్న కొండలు, 'త్రీ సిస్టర్స్' అని పిలవబడే కొండలు కావని, అవి అవతలివైపున ఉంటాయని చెపుతున్నాడు. త్రీ సిస్టర్స్, చూడగానే గుర్తు పట్టగలిగే విధంగా, ప్రత్యేకమైన ఆకారంతో ఉంటాయి. కానీ అవి మంచు కప్పిన శిఖరాలు కావు. ఇట్లా కొండలకు గుట్టలకు, వాటి ఆకారాన్నో, మరోదాన్నో బట్టి, వాటికి సహ-మానవత్వం అపాదించి పేర్లు పెట్టడం నేను చాలా దేశాలలో చూశాను. నాకు మరో ప్రక్కన కూర్చున్న, విక్టర్‌తో మాటలు కలిపాను. అతను హంగరి దేశస్థుడు. ఫైనాన్షియల్ సర్వీసులకు సంబంధించి చట్టపరమైన సర్వీసులను అందించే వృత్తిలో ఉన్నాడట.

లిక్టెన్ స్టైన్, బాంకులు మొదలైన ఆర్థిక సంస్థలకు నెలవు. ప్రతి పౌరుడి పేరిట కనీసం మూడు సంస్థలన్నా రిజిస్టరై ఉంటాయట. కానీ, టాక్సుల పరంగా, వైవిధ్యమైన ఆర్థిక సేవలందించే కొన్ని దేశాలలో మాదిరిగా ఇక్కడ ఎక్కువ ఆదాయం సముపార్జించేది ఆర్థిక రంగం కాదు. లిక్టెన్ స్టైన్‌కు గట్టి పారిశ్రామిక పునాది ఉంది. ఎక్కువ జాతీయ ఆదాయం ఉత్పత్తి రంగం నుండి. దాని తరువాతే, ఆర్థిక రంగం. చాలా మంది లానే విక్టర్, స్విట్జర్లాండ్‌లో నివసిస్తూ, లిక్టెన్ స్టైన్‌లో పని చేస్తాడట. అతనికి ముగ్గురు పిల్లలు. అందరూ స్విట్జర్లాండ్‌లోనే పుట్టారట. అతను, మాతృ భాష..హంగేరియన్ కంటే, జర్మన్ భాష బాగా మాట్లాడుతాడట. ప్రస్తుతం తను చేస్తున్న ఉద్యోగంలో చాలా తృప్తిగా ఉన్నానని చెపుతూ, ఆ రోజు ఎట్లా గడపవచ్చో, నాకు సూచించాడు. అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు చూడటానికి, ట్రీసెన్ బెర్గ్ వెళ్ళమని చెప్పాడు. సరే ఇక ఆ రోజుకు నా కార్యక్రమం నిర్ణయమై పోయింది.

ట్రీసెన్ బెర్గ్, వడూట్జ్‌కు 6 కి.మీ. దూరంలో ఉంది. ఇది ఈ దేశంలో మరొక పెద్ద మున్సిపాలిటీ. ఆల్ప్సు పర్వతాల మధ్య, అందమైన లోయ నడిబొడ్డున ఉన్న పట్టణం ఇది. వడూట్జ్‌లో దిగి, ట్రీసెన్ బెర్గ్‌కు వెళ్ళే బస్ ఎక్కాలనుకున్నాను. ఆ బస్‌కు ఇంకో 20 నిముషాల వ్యవధి ఉండటంతో, ఆ దగ్గరలో ఉన్న ఒక కథీడ్రల్ వైపుకు వెళ్ళాను. లిక్టెన్ స్టైన్ ఒక సాంప్రదాయిక కేథలిక్ దేశం. ఆదివారం అవటం వలన అక్కడ జరుగుతున్న ప్రార్థన (సర్వీసు) చూస్తూ అక్కడ కొంత సమయం గడిపాను.

బస్ స్టాండులో మరొక నడివయస్కుడితో మాటలు కలిశాయి. లిక్టెన్ స్టైన్ ఎందుకు వచ్చానని అతను ఆరా తీశాడు. రెండు పెద్ద దేశాల మధ్య, సామరస్యంగా మనగలుగుతున్న ఈ బుల్లి దేశాన్ని చూడటం కోసమే ఇంత దూరం వచ్చానని నేను చెప్పగానే, అతను నాతో స్నేహం కలిపాడు. చాలా మంది యూరోపియన్లకే ఈ దేశం గురించి తెలియదని అతను వాపోయాడు. ఇండియా గురించి చాలా విన్నానని, జీవితంలో ఒక్క సారైనా అక్కడికి వెళ్లాలనుకుంటున్నానని కూడా చెప్పాడు. భారతదేశం గురించి, అనుకోని ప్రదేశాలలోని వ్యక్తుల నుండి కూడా చాలా మంచి అభిప్రాయాలు వినటం కూడా నాకు కొత్తేమీ కాదు. కానీ ప్రతిసారి ఇటువంటి సన్నివేశాలు ఎదురైనప్పుడు నేను చాలా సంతోష పడతాను. మన దేశం గురించి మనమేమీ చెప్పుకోకుండానే సదభిప్రాయం ఏర్పరచుకోవటం, అరమరికలు లేకుండా దానిని వ్యక్తం చేయటం, ఆ వ్యక్తుల వ్యక్తిత్వాన్ని పట్టి ఇస్తుంది.

ఎప్పుడైనా జాతీయ దినోత్సవం రోజున రాజుగారు (ప్రిన్స్) ఇచ్చే గార్డెన్ పార్టీకి వెళ్లారా? అని అతనిని అడిగాను. నా ఉత్సుకత చూసి అతను నవ్వుకుంటూ, సకుటుంబ సమేతంగా కొన్నిసార్లు వెళ్లానని, కొన్నిసార్లు రాజుగారిని కూడా కలిశానని, అది చాలా ఉత్సాహ భరితంగా ఉంటుందని చెప్పాడు. రాజు, అతని కుటుంబం కూడా ఆ నగరంలో తిరుగుతూనే ఉంటారని, పౌరులందరితో కలివిడిగా ఉంటారని, అందరితో కలసి లోకల్ సుపర్ మార్కెట్లలో కొనుగోళ్లు చేస్తుంటారని కూడా అతను చెప్పాడు. సమాజంలో అంతస్థులు ఉండటం, లేకపోవటం, రెంటినీ ఒకే చోట చూస్తున్నానని నాకనిపించింది. ట్రీసెన్ బెర్గ్ వెళ్ళినప్పుడు, మంచి దృశ్యాలు చూడాలంటే 'రిజ్లినా' వెళ్ళమని అతను సలహా చెప్పాడు. అంతలో దూరాన ఉన్న నా బస్‌ను చూపిస్తూ నాకు వీడ్కోలు చెప్పాడు. ఆరోజు అతని ప్రయాణం వేరే వైపు. అతనితో ఇంకొంచెం సేపు కలసి ఉంటే బాగుండేదనిపించింది. ప్రయాణాలలో నాకు

బాధ కలిగించేది.. ఇటువంటి బంధాల క్షణికత్వమే. కానీ అదే క్షణికత్వం.. ఎప్పటికీ గుర్తుండిపోయే బాంధవ్యంగా కూడా మిగిలిపోతుంది కొన్నిసార్లు.

బస్, ట్రీసెన్ బెర్గ్ చేరుకునే దోవలో చాలా చిన్న చిన్న పల్లెలు దాటింది. ఈ ఊరు కూడా ఒక చిన్న గ్రామం. 'షాలే' అని పిలవబడే స్విస్ గృహాలు, హొటళ్లతో, కొండ వాలులో అందంగా ఉన్న ఊరు ఇది. చుట్టూ కొండలు, లోయలతో మనోజ్ఞంగా ఉన్న ప్రకృతి ఒడిలో ఒదగటానికి వీలుగా, ఇక్కడి ఇళ్ళన్నిటికీ బాల్కనీలు, టెర్రేసులు ఉన్నాయి. అక్కడ దిగి రిజ్లినా వెళ్లటానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరం, కొండ దారిలో పైకి ఎక్కాలి. నాకు 40 నిముషాలు పట్టింది. అక్కడ నుండి చూస్తే అడవి పూల బయలు ఒక వైపు, రైన్ నది హొయలు మరొక వైపు. ఇటువంటి సుందరదృశ్యాలను ఒక్క సారిగా చూడటానికి ఇంతకంటే అనువైన చోటు ఇంకేముంటుంది? ఇక్కడకు వెళ్ళమని సూచించిన నా బస్ స్టేషన్ మిత్రుడిని మరోసారి తలచుకున్నాను. అక్కడ ఒకరిద్దరు అడవి పూలను ఏరుకుంటుంటే, మరొక జంట మోటార్ సైకిల్ మీద అటుగా వెళుతూ, అక్కడి దృశ్య సౌందర్యానికి బందీలయి నట్లున్నారు. చూడటానికి, ఒకరోజు ఇక్కడ తిరిగి చూడటానికి వచ్చిన ఆస్ట్రియా వారిలాగా ఉన్నారు.

ఆల్పైన్ అంటే.. ఆల్ప్సు పర్వతాలతో కూడిన ప్రాంతమంతా ప్రధానంగా, కనుచూపుమేరా ప్రత్యేకమైన కొండ పూల రాసులతో నిండి ఉన్న బయళ్ళు, లోయలు, మంచు కప్పిన పర్వత శిఖరాలు, నిర్మలమైన నీటితో పారే వెండి నదులూ.. ఎక్కడ చూసినా ఇదే మైమరపించే వాతావరణం. వీటి మధ్యలో... వీటిలో భాగంగా... మెల్లగా, మందంగా సాగిపోయే ఆలమందలు, ప్రకృతిని కాలరాయకుండా జీవితం సాగించే మనుషులు, వారి జీవన శైలి.. ఇవన్నీ అక్కడకు చూడటానికి వెళ్ళిన వారి, మనసులను చల్లబరచి, నరాల వత్తిడి తగ్గించుతాయనటం అతిశయోక్తి కాదు. ఇక్కడ నాకు కూడా అదే జరిగింది. మే నెల, సూర్యుడి బాల కిరణాల కాంతిలో, ఆల్ప్సు వాతావరణపు వశీకరణకు తలొగ్గి, అక్కడే కూర్చుండి పోయాను. తిరిగి నా మామూలు లోకంలోకి రావటానికి కొంచెంసేపు పట్టింది. మెల్లగా దిగి ట్రీసెన్ బెర్గ్ వైపు దారి తీశాను. దిగటానికి, ఎక్కటానికి పట్టిన సమయంలో సగమే పట్టింది. రోజూవారీ జీవితంలో.. ఇది కూడా ఒక గమనించుకోవలసిన విషయమే అనుకున్నాను. నేను చూసినంతలో... అనుకున్నది సాధించటానికి పట్టినంత సేపు, దిగజారటానికి పట్టదు మరి.

ట్రీసెన్ బెర్గ్ నుండి వడూట్జ్‌కు బస్ తీసుకున్నాను. అక్కడి నుండి మిలాన్ వెళ్ళే బస్‌కు ఇంకా చాలా టైమ్ ఉంది. వడూట్జ్‌లో ఇంకా చూడవలసినది, 'రెడ్ హౌస్'. అక్కడకు వెళ్ళే దోవలో..చాలా ఇళ్ళలో ద్రాక్ష పండిస్తున్నారు. వాటి నుండి వైన్ తయారు చేసుకుంటారట. రెడ్ హౌస్, వడూట్జ్‌లో ఒక విలక్షణమైన భవనం. ఎత్తైన 'కోణాకారపు పైకప్పు' ఈ ఇంటి నిర్మాణ ప్రత్యేకత. ఇదొక ద్రాక్షతోట మధ్యలో ఉంది. 1338లో నిర్మించబడిన ఈ హౌస్‌కు వేసిన ఎర్ర రంగు వలన ఇది మిగిలిన ఇళ్ళకు భిన్నంగా కనపడుతుంది. ప్రస్తుతం ఇది నివాస గృహం కనుక, దూరం నుండి చూసి రావలసిందే. అక్కడక్కడే ఇంకో గంట సేపు తిరిగి చూసి మళ్ళీ టౌను సెంటర్‌కు వచ్చి, ఇంకా చూడటానికి మిగిలిపోయినవి ఏమన్నా ఉన్నాయా అని చూస్తే, కుంస్ట్ మ్యూజియం కనిపించింది. ఇది నలుపు రంగు వేసి ఉన్న మోడర్న్ ఆర్ట్ మ్యూజియం. మోడర్న్ ఆర్ట్ నాకెప్పుడూ కొరుకుడు పడదు. అక్కడ ఎంత తిరిగినా, ఎన్నికళాఖండాలు చూసినా, నాకు పెద్దగా ఏమీ అనిపించ లేదు. అక్కడున్న ఒక కెఫేలో ఒక సాండ్విచ్ కొనుక్కుని, బయట వేసి ఉన్న టేబుల్ మీద కూర్చున్నాను. నా చుట్టూ హడావుడి లేని జీవితాలు మెల్లగా సాగిపోవటం చూస్తుంటే.. ప్రపంచంలో చాలా చోట్ల నాకు పరిచయం ఉన్న 'రణగొణ' నిజమని, ఇదొక 'కల' అనీ అనిపించింది. మరచిపోకుండా, మళ్ళీ సమాచార కేంద్రానికి వెళ్ళి నా సామాన్లు తీసుకున్నాను. కాథరిన్ అదే మర్యాదతో నవ్వుతూ పలకరించింది. కావాలంటే ఆ రోజు కూడా అక్కడే నా సామాన్లు పెట్టుకోవచ్చని చెప్పింది. ఆ రోజు, ఆదివారం కావటంతో ఎక్కువ మంది యాత్రికులు లేరు. కాథరిన్‌తో పాటు అక్కడున్న మరి కొంత మంది ఉద్యోగులతో నా రెండు రోజుల అనుభవాలు పంచుకున్నాను. ఆ సంభాషణలో నాకు, లిక్టెన్ స్టైన్‌లో అక్షరాశ్యత 100% అని తెలిసింది. ఆదాయం ఎక్కువ, ఆదాయపు పన్ను తక్కువ. ఈ పౌరులు ప్రపంచంలో ఎక్కడున్నా ఉచిత వైద్య సేవలు లభిస్తాయట. స్థానికంగా విద్య కూడా ఉచితమే. వారి ఉత్పత్తి రంగం చాలా పటిష్టంగా ఉంది. ఖరీదైన వస్తువులు, ముఖ్యంగా దంత వైద్య పరికరాలు, కంటి

చూపుకు సంబంధించిన ఉపకరణాలు, ఎలక్ట్రానిక్స్ మొదలైన అధునాతన ఉపకరణాల తయారీ కూడా ఇక్కడ జరుగుతుందట. అక్కడ కొన్ని జ్ఞాపికలు కొంటుంటే, కాథరిన్, ఒక లిక్టెన్‌స్టైన్ స్టాంపు కొనమని సలహా చెప్పింది. ఆ స్టాంపు, నేను ఆ దేశం వెళ్లానని చూపిస్తుంది. అంతే కానీ అది అధికారిక స్టాంపు కాదు. లిక్టెన్ స్టైన్‌కు ఎయిర్ పోర్టు కానీ, సరిహద్దు నియంత్రణ కానీ లేకపోవటంతో, ఈ స్టాంపు లేక పోతే, నేను అక్కడికి వెళ్ళినట్టు ఋజువేమీ ఉండదు. కొద్ది పాటి ఖర్చుతో ఈ స్టాంపు కొనుక్కోవటమే మంచి పని. నేను చూసినంతలో అంత మంచి టూరిస్ట్ సమాచార కేంద్రం నాకు ఇంకెక్కడా కనపడలేదని నిజాయితీగా వారికి చెప్పి, అక్కడున్న వారందరికీ మనసారా కృతజ్ఞతలు తెలుపుకుని బయటకు వచ్చాను. బస్ స్టేషన్‌కు అవతలి వైపు కొంచెం దూరంలో, రైన్ నది మీద పూర్తిగా పై కప్పుతో, చెక్కలతో నిర్మించిన బ్రిడ్జ్ ఉంది. వడూట్జ్ నుండి అరగంట నడవాలి. ఇటువంటి బ్రిడ్జీలలో ఇప్పటికీ మిగిలున్నది ఇదొకటి. 135 మీటర్ల పొడవున్న దీనిని 1901లో నిర్మించారట. వంతెన నిర్మాణానికి వాడిన చెక్క పాడై పోకుండా, దానికి రక్షణగా, కోసుగా ఉండే ఒక పైకప్పును నిర్మించారట. పై కప్పు లేని వంతెన ఆయుర్ధాయం 20 సంవత్సరాలైతే, ఇట్లా పై కప్పు వేయటం వలన 100 సంవత్సరాల వరకు అది చెక్కు చెదరదని అంచనా. మంచి ఆలోచనే అయినా, కాల క్రమేణా వంతెనలు నిర్మించటానికి చెక్క కంటే మన్నికగా ఉండే పదార్థాలు వినియోగంలోకి రావటంతో ఇటువంటి బ్రిడ్జీలు క్రమంగా అంతరించి పోయాయి. ఏమైనా చూడటానికి మాత్రం ఈ బ్రిడ్జ్ చాలా అద్భుతంగా ఉంది. పైగా ఒకానొక కాలంలో, ఒక సమస్య, దాని పరిష్కారం.. దాని వెనుక ఉన్న ఆలోచన.. వీటన్నిటికీ గుర్తుగా నిలిచేది ఇటువంటివే. అందుకే సాంకేతికంగా కాలం చెల్లినా, వీటిని సాంస్కృతిక సంపదగా రక్షించుకుంటూ ఉంటారు. ఈ బ్రిడ్జీ ఇంకా పాదచారుల వాడుకలో ఉంది. దీని మీద నడచి అవతలివైపుకు వెళ్ళి, స్విట్జర్లాండ్‌లో కాలు పెట్టి రావటం నాకొక ప్రత్యేకమైన అనుభవం.

అక్కడి నుండి, వచ్చిన దారినే పట్టుకుని, బస్ స్టేషన్ చేరాను. పది నిముషాలలో బస్ రావటం, నేను ఎక్కేసి కూర్చోవటం కూడా జరిగిపోయింది. ఇప్పుడు కూడా బస్ డ్రైవరుగా బారిస్ కనపడటంతో, నాకు పాత మిత్రుడిని కలిసినంత సంతోషమనిపించింది. మొన్న నన్ను వడూట్జ్‌లో దింపిన తరువాత, మ్యూనిక్ వెళ్ళి ఒక రోజు విశ్రాంతి తరువాత మళ్ళీ తిరుగు ప్రయాణమయ్యాడట. ఇంతకు ముందులానే, డ్రైవ్ చేస్తూనే ఆయా ప్రాంతాలను, ప్రదేశాలను పరిచయం చేస్తూ, బారిస్ సాగిపోవటం చూసి, అది అతని సహజ ధోరణి అని తెలిసింది. బస్‌లో నా ప్రక్కన కూర్చున్న 20 యేళ్ళ యువతి, ఫోన్ చూసుకుంటూ కూర్చుంది. నేను కూడా కిటికీలో నుండి బయటకు చూస్తూ కూర్చున్నాను. కాస్సేపటికి ఆమె, తన బాగ్ నుండి కొన్ని బిస్కెట్లను తీసి, 'వీటిని రుచి చూస్తారా?' అంటూ మాటలు కలిపింది. మొహమాటానికి ఒక బిస్కట్ తీసుకున్నాను. ఆమె చేసిన ఈ చిన్న పనితో మా ఇద్దరి మధ్య దూరం తగ్గింది. ఆమె మిలాన్ టెక్నికల్ యూనివర్సిటీలో వాస్తు శాస్త్రం చదువుకుంటోందట. పేరు లోరా. జర్మన్ అమ్మాయి. మరి ఇటలీలో చదవటానికి, భాష సమస్య అవలేదా అని అడిగితే, ఆ కోర్సు ఇటాలియన్, ఇంగ్లీషు రెంటిలోనూ చేయవచ్చుని, తనకు జర్మన్‌తో పాటు ఈ రెండు భాషలు కూడా వచ్చుని చెప్పింది. సాధారణంగా నేను, ఎదుటివారు మాట్లాడుతుంటే వింటూ ఉంటాను. లోరా మాత్రం తను మాట్లాడుతూ, ప్రశ్నలు వేస్తూ, నన్ను కూడా మాట్లాడించింది. నా ప్రయాణాలు, నా వృత్తి, నా జీవితం గురించి, నా వృత్తి ప్రవృత్తుల మధ్య సామరస్యాన్ని గురించి మామూలు ప్రశ్నలు వేసింది. సమాధానాలు చెప్పే క్రమంలో, నా వైపు నేనే చూసుకునే అవసరం కలిగింది. మాటలలో ఆమె కూడా ఒకసారి తన వృత్తి, కుటుంబ జీవితంలో అనుకున్నది సాధించిన తరువాత ప్రపంచం తిరిగి చూడాలనుకుంటోందని తెలిపింది. మిలాన్ చేరే సరికి రాత్రి 9 గంటలయింది. మెట్రోలో నా హొటల్ చేరుకోవటానికి లోరా చెప్పినట్లు వెళ్ళాను. చాలా తక్కువ వ్యవధిలో, ఒక బుల్లి దేశం వెళ్ళొచ్చాను. ఈ ప్రయాణం నా మనసులో నింపిన దృశ్యాలు, అనుభవం అసాధారణం, అజరామరం, అద్భుతం.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)
e-mail: jayasreeatluri@hotmail.com

# హృదయపుటాకలి - పైనాపిల్ జామ్

**– డా. కె. శ్రీనివాసులు రెడ్డి**

ఓ చల్లని సాయంత్రాన ఇద్దరు మనసెరిగిన స్నేహితులు కూర్చొని ఒకరిలోకొకరు ప్రవహించే సందర్భం అద్భుతమైనది. ఆ ప్రవాహం ఎటువంటి అరమరికలూ లేక సాగుతున్నపుడు గుండె పొరల్లోంచీ పెల్లుబికి వచ్చే ఆ సంగతులన్నీ సాహిత్య స్థాయిని అందుకుంటాయి. ఈ కథలన్నీ వాస్తవంగా మన జీవితాల్లో జరిగేవే. ఐనా అవి ఆశ్చర్యం కలిగిస్తాయి. పంచుకోకుండా ఓ పట్టాన ఉండనీవు. అవి విన్నవీ, కన్నవీ, ఊసులు, జ్ఞాపకాలు ఇలా.. ఆ జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మనుషులు. ఆ మనుషుల వ్యథలు, బాధలూ, కన్నీళ్ళూ, ఆశ్చర్యాలూ, అలకలూ, పశ్చాత్తాపాలూ, మనల్ని కదిలించిన సంఘటనలూ, సన్నివేశాలూ, నోస్టాల్జియా ఇలా ఎన్నో... ఏ ఆటంకాలూ లేకుండా ఒకరి నుండీ ఇంకొకరిలోకి ప్రవహిస్తాయి. వాటన్నిటినీ కథలుగా మలిస్తే, నిజంగా ఓ స్నేహితుడు మన పక్కన ఉన్నట్టే. అలా స్నేహితులు కలుసుకున్నప్పుడు ఆ అనంతమైన సంభాషణలో అనేకాంశాలు అలవోకగా దొర్లుకుంటూ వారి మధ్యలోకి అత్యంత సహజంగా వస్తే ఎలా ఉంటాదో అదే పైనాపిల్ జామ్ కథలు. రచయిత విజయ్ కోగంటి.

తనకు తన చుట్టూ ఉన్న సమాజంతో జరిగే పరిచర్యలో భాగంగా అనేక సంఘటనలు, సన్నివేశాలు ఎదురవుతూ ఉంటాయి. తనలో ఒక ఆలోచనను, అంతర్మథనాన్ని, ప్రశ్నలను, ఆశ్చర్యాలను, ఉద్వేగాలను కలగజేస్తూ ఉంటాయి. అలా ఈ కథలో తనకు ఎదురైనా అనుభవాలను కథలుగా మలిచి పిట్టగోడపై మన పక్కన కూర్చుని ఆశ్చర్యంతో బాధతో సంతోషంతో తనని తాను మన ముందు పరుచుకున్న స్నేహితుడిలా ఈ కథలు మనతో మాట్లాడుతాయి. మొత్తం ముప్పైరెండు కథలు. ఈ కథలు విన్నాక 'సింహాసన ద్వాత్రింశిక'లో భోజరాజుకు 32 సాలభంజికలు చెప్పిన కథలు గుర్తుకు వచ్చాయి. అన్నీ మనకు అత్యంత పరిచితమైన అంశాలే. ఏ కథాంశము మనకు కొత్త కాదు. చాలా కథల్లో మనం కూడా ఉంటాము. మన స్నేహితులూ ఉండొచ్చు. ఇలా మన సమాజాన్ని, మన కుటుంబాల్ని, మన స్నేహితులని, ఇరుగుపొరుగు వారినే చూసినా వారిలోని ఇంకో కోణం మనకు ఈ కథల్లో కనిపిస్తుంది.

కథ ఒక సృజన వ్యాపారం. సృజన అంటే గాల్లోంచి అద్భుతాలను సృష్టించడం కాదు. మన చుట్టూ ఉన్న సమాజంలోనే మనకు పైకి కనిపించే జీవితాల వెనుక జీవితాన్నీ, మనకు వినిపించే మాటల వెనుక మర్మాన్ని వెలికి తీసి మన ముందు ఉంచడమే. సృజన నూతనత్వాన్ని నిరంతరం కోరుకుంటూ ఉంటుంది. కథ పాతదే అందులోని జీవితాలు పాతవే అయినా అందులోని మనుషులు మనకు తెలిసిన వారైనా మనకు స్ఫురించని మనకు కనిపించని కొత్తదేదో వారి జీవితాల్లో నుంచి మనకు పట్టివ్వడమే సృజనకు గీటురాయి. కథానిక కొత్త కాదు. కానీ చెప్పే కథనమే కాస్త కొత్తగా ఉండాలి. ఎలా చెప్తే బాగుంటుందో అలా చెప్పడానికి చేసే ప్రయత్నం ఆ అంశానికి రంగు రుచి చిక్కదనాన్ని అందిస్తుంది. ఆ ప్రయత్నం కొట్టొచ్చినట్టు కనిపించేవి 'పైనాపిల్ జామ్' కథలు. కథ చెప్పడమైనా పాఠం చెప్పడమైనా ఒకలాంటి వ్యవహారమే. సిలబస్లోని ఒక పాఠాన్ని ఐదేళ్ల పాటు కొన్ని వందలసార్లు అధ్యాపకుడు బోధించి ఉంటాడు. పాఠం ఒకటే ఐనా ఆ పాఠాన్ని చెప్పే విధానంలోనూ, దాన్ని విశ్లేషించడంలోనూ, విద్యార్థులకు చేరవేయడంలోనూ, వ్యాఖ్యానించడంలోనూ అన్ని వందల విధానాలు అతను కనుగొని ఉంటాడు. అలా పాఠం చెప్పడం కూడా ఒక కళ. పాఠాన్ని కొత్తగా చెప్పే ప్రయత్నం అధ్యాపకుడిగా చేసినట్లే సాహిత్యకారుడిగానూ కథను కొత్తగా చెప్పే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. అసాధారణ పాత్రలు,

కొత్త వస్తువు వంటివి ఈ కథల్లో ఏమీ ఉండవు. దైనందిన జీవితంలో మనకు ఎదురుపడే పాత్రలే 'నీవైపే చూస్తూ ఉంటాయ్! తమ లోతు కనుక్కోమంటాయ్!. దాదాపు కథలన్నీ చాలా చిన్నవి. ఋక్కులు కవితలానే. కానీ వాటి విస్తృతీ, లోతూ జీవితమంత. కథ చదవడం ఐదు నిమిషాల్లో పూర్తయితే, పాత్ర మాత్రం ఐదు రోజులైనా మనల్ని వదలదు. 'నన్నే వెతుక్కుంటూ' కథలో విజయ్ కోగంటిని వెదుక్కుంటూ ఆయన పాత్రలే వస్తాయి. పైనాపిల్ జామ్ ని పూర్తి చేసిన తర్వాత మన చుట్టూ ఉన్న మనుషుల్లో అనేక మంది ఈ కథల్లోని పాత్రల్లా అగుపిస్తూ ఉంటారు.

భర్తల బయట సంబంధాలను మౌనంగా భరిస్తూనే బిడ్డల జీవితాల కోసం నిలబడి సంసారాలను నెట్టుకొస్తున్న స్త్రీలు ఎందరో ఉన్నారు. వారికి ప్రతీక 'ట్రాన్సఫర్' కథలోని కల్పన. ట్రాన్సఫర్ కథ మొత్తం ఒకటిన్నర పేజీ కంటే తక్కువే. చదవడానికి నిమిష కాల నిడివి ఉన్న ఈ కథ కల్పన జీవితంలోని దాదాపు ఒక్క గంటనే మన కళ్ళ ముందు దృశ్యమానం చేస్తుంది. కానీ నిమిషం సేపు ఈ కథను చదివిన తర్వాత ఈ కథకు ముందు చాలా కథ ఉందని ఈ కథకు తరువాత కూడా చాలా కథ ఉందని మనకనిపిస్తుంది. ఆమె మొత్తం జీవితం ఒకచలనచిత్రంగా మన మస్తిష్కంలో ఆవిష్కృతమౌతుంది. అలా ఆ కథనంతా పాఠకుడికి వదలడం రచయిత శిల్ప చాతుర్యానికి, పాఠకుడిపై ఉన్న గౌరవానికి చిహ్నం. కథా గతంలోకి, కథా భవిష్యత్తులోకి కూడా పాఠకుడికి తీసుకెళ్లడంతో రచయితగా విజయ్ కోగంటి విజయం సాధించారు. అంతే కాదు ఈ కథలో కల్పన భర్తకు పేరు ఉండదు. రచయిత ఆ పాత్రకు ఏదో ఒక పేరు పెట్టొచ్చు. కానీ ఉద్దేశపూర్వకంగానో లేదా కథే సహజంగా పేరుని నిరాకరించిందో తెలియదు కానీ ఆ పాత్రకు పేరు పెట్టకపోవడంలో రచయితకు అట్లాంటి వారి పట్ల ఉన్న నిరసనను తెలియజేస్తోంది. ఈ కథ ద్వారా మానవ సంబంధాల్లో కనిపించని ఒక శూన్యహింస వాస్తవిక రూపాన్ని మనకు యెరుకు పరచడమే కాక దాని పట్ల రచయిత నిరసనను కూడా తెలియజేస్తున్నాడు.

'నాన్న వస్తే' కథ ఇంకాస్త పెద్దది. నాన్న ఊసులతో, అందమైన ఊహలతో కల్పన పాత్ర మనకు పరిచయమవుతుంది. అలా మొదలైన కథ మన కళ్ళముందే ఇలా అయిపోతోందేంటి అనిపించేలోగానే కథ ముందుకెళ్ళి పోతూ ఉంటుంది. మన కళ్ళ ముందే యేటి వరదలో కొట్టుకుపోతున్న మనిషిలా కల్పన నాన్న నాశనం అయిపోతుంటే మనం ప్రేక్షక పాత్ర వహిస్తాం. బాధపడతాం. తండ్రుల తాగుడు వ్యసనం కల్పన లాంటి బాలల జీవితాల్ని ఎలా సంక్షుభితం చేస్తున్నదో ఈ కథ కళ్ళముందుంచుతుంది. 'ఏది మా ఊరు' కథ ఎంతకీ వదలని ఒక నోస్టాల్జియా. మానవ సంబంధాల సామాజిక అల్లిక పిగిలిపోయి, రంగు వెలిసిన గుడ్డల్లా వేలాడుతున్న పల్లెను మన కళ్ళ ముందు పెడతాడు రచయిత. ఆనాటి ఆటలు, కబుర్లు, అంగడి కేంద్రంగా అల్లుకున్న మమతానురాగాలు, మానవ కలయికలు, టూరింగు టాకీసు వినోదాలు, రచ్చబండ కబుర్లు, 60 ఏళ్ళు అయినా గట్టిగా ఉన్న బాల్య స్నేహాలు, స్నేహితుడి మరణం మిగిల్చిన విషాదాలు ఇలా అనేక జీవిత మూలాలను చిన్న కథలో ఇమిడ్చి మొత్తం గ్రామ జీవితాన్నీ, ఆ జీవితంలో వ్యక్తి స్థానాన్ని మనకు యెరుక పరుస్తాడు విజయ్. సామాజిక సంక్షోభాన్ని, దానితో పాటు వ్యక్తి అస్తిత్వ సంక్షోభాన్ని దుఃఖంతో కండ్లనీరు కమ్మిన వ్యక్తికి బ్లర్‌గా మసకగా ప్రపంచం కనబడినట్లు గ్రామ విధ్వంస దృశ్యం మన కళ్ళలో ఆవిష్కృతమౌతుంది.

ఇద్దరు జొమాటీల మధ్య నడిచే రొమాన్స్ కథ చాలా 'జొమాన్స్'. చిన్న కథ ఐనా అనంతమైన ముగింపుని ఇచ్చాడు రచయిత. జొమాటి అయిన మిథున్ ప్రేమకు 'ఎస్' చెప్పాలా 'నో' చెప్పాలా అని కథని ముగిస్తూ.. యస్ ఆర్ నో ఆర్ నో ఆర్ యస్ అని అతను ముగిస్తాడు పాఠకుడికి కాస్త ఊరటనిస్తూ. కథాంతంలో ఎస్ అనే కదా ఉంది.

నవల వ్యక్తి జీవితాన్ని కేంద్రంగా చేసుకొని మొత్తం సమాజాన్ని చెప్తే కథానిక వ్యక్తి జీవితంలోని చిన్న శకలాన్ని ఆధారం చేసుకుని మొత్తం జీవితాన్ని చెప్తుందని అంటారు. 'ఒక్క ఆశ' అనే చిన్న కథానిక శంకరయ్య జీవితంలోని ఒక్క చిన్న సంఘటనను మన కళ్ళ ముందుంచి మొత్తం శంకరయ్య జీవితాన్నే కాదు అతని కుటుంబాన్ని కూడా మన ముందుకు తీసుకువస్తుంది. శంకరయ్య కొడుకు శీను గాడు తన స్నేహితుడికి ఇచ్చిన మాట కోసం తన తండ్రిని ఒక్క పుచ్చకాయని అడుగుతాడు. శంకరయ్య

పుచ్చకాయలు అమ్ముకొని పొట్ట పోసుకునేవాడు తనకే కాదు తన మొత్తం కుటుంబానికి ఆ పుచ్చకాయలు అమ్ముకోవడం ద్వారానే జీవితం గడుస్తుంది. ఈ కథ నేపథ్యంలో నుంచి మనం శంకరయ్య కుటుంబంలోకి ప్రవేశిస్తాం. శంకరయ్య కొడుకు శీను పాఠశాల జీవితం, శంకరయ్య భార్యను, శంకరయ్యను మొత్తంగా అర్థం చేసుకుంటాం. శంకరయ్యనే కాదు శంకరయ్య లాంటి చిన్నాచితక వ్యాపారాలు చేసుకుని జీవితంలో చిన్న చిన్న ఆనందాలు కూడా నోచుకోకుండా అడుగడుగునా రాజీ పడుతూ ప్రతి రోజునూ నెట్టుకుంటూ ఈడ్చుకుంటూ బతికే జీవుల యథార్థ దృశ్యాలు మనకు అవగతం అవుతాయి. బ్యాంకులో ఉద్యోగం, తాగి తాగి మరణించిన భర్త, అమెరికాలో స్థిరపడి ఎప్పుడో కానీ రాని కొడుకు కోడలు, ప్రమాదంలో కాలు విరిగి మంచానపడ్డ ఇంకో కొడుకు, ఇలా అందరినీ భరిస్తూ అన్నింటినీ మోస్తూ కూడా స్థిరంగా సాగే స్త్రీ జీవితాన్ని చెప్పే కథ 'ఆగని పాట'. కథా సమయం మెడికల్ షాపు దగ్గర కలుసుకున్న పాత పరిచయస్తులు. మాట్లాడుకున్నది ఐదు నిముషాలే. ఒక నిండు స్త్రీ జీవితాన్ని రెండు నిముషాల నిడివి కథలో ఇమిడ్చిన విధానం అల్లిక జిగి బిగికి ఒక ఉదాహరణ. కథకు ఆగని పాట అని పేరు పెట్టి నడి సముద్రంలో ఎన్ని తుఫానులు వచ్చినా భయపడని నావలాగా ఆమె బయలుదేరింది అని కథను ముగించడం ద్వారా కథాశీర్షిక, కథా ముగింపులో రెండు భిన్నమైన ఉపమానాలతో కథను చెప్పి ఆమె జీవితపు లోతులను, తత్వాన్ని తెలియజేస్తాడు రచయిత.

మ్యాజిక్ రియలిజం శిల్పంతో నేటి రాజకీయ వ్యవస్థపై ఎక్కుపెట్టిన ఒక వ్యంగ్యాస్త్రం 'కుంక బొంకుడి గుడ్లు' కథ. రచయితకు కలలో గుడ్లు కనిపిస్తాయి. అవి ఐదేళ్లకోసారి పిల్లలు పెట్టే గుడ్లు. ఆ పిల్లలు అనకొండలు, కొండచిలువలు. పెద్ద నోళ్లు గలవి. అవి నేలను భోంచేస్తాయి. ప్రజలను భయపెడతాయి. డబ్బులు తెచ్చిస్తాయి. అవన్నీ బాగా పొదిగి ఒక్క వారంలో పిల్లలు బయటికి రాగలిగే స్థితిలో ఉన్న గుడ్లు. మెలకువలోకి వచ్చిన రచయిత ఒక వారంలో ఎన్నికల కౌంటింగ్ డ్యూటీ ఉందని చెప్పడంతో కథ మొత్తం మ్యాజిక్ రియలిజంలో నుండీ వాస్తవంలోకి వస్తుంది. వాస్తవం చెప్పడం కోసం అనేక ప్రతీకలతో ఈ కథ వ్యవస్థీకృతమైన దోపిడీని మనకు యెరుకలోకి తీసుకు వస్తుంది. ఊరేగింపు దేవతలు కథ 'యత్రనార్యంతు పూజ్యంతే' వాక్యాన్ని గుర్తుచేస్తుంది. భూషయ్య జన్యు లోపం వల్ల ఐదు కాళ్లతో పుట్టిన ఆవుని గోవుమాలక్ష్మి గా ఊరేగిస్తూ జీవించేవాడు. జీవనాధారమైన ఆవుని, జీవితంలో తోడుగా నిలిచిన భార్యను భూషయ్య చూసే విధానాన్ని కథలో వాస్తవికంగా చెప్పి ఆవుని కాశవ్వను ఊరేగింపు దేవతలు అని శీర్షిక పెట్టి స్త్రీ వాస్తవ వ్యథాభరిత జీవితాన్ని కథలోకి తీసుకొస్తాడు రచయిత.

విజయ్ కోగంటి ప్రధానంగా కవి. కాబట్టి కవిత్వంలోని క్లుప్తత కథల్లో సహజంగా పొదిగిపోయింది. అందుకే రచయిత "వైవిధ్యభరితమైన సమాజ ప్రతిఫలనం కథారచనలో జరిగినంత, పొదిగినంత కవిత్వంలో జరగదని నేను అనుకుంటాను" అంటాడు.(సంచిక. కాం ఇంటర్వ్యూ) అలా తాను చూసిన తన అనుభవంలోకి వచ్చిన సామాజిక వైవిధ్యాన్ని, స్థితి గతులను కథలలో చక్కని శిల్పంలో పొదిగింపజేసి కథా రచనలో వైవిధ్యానికి అవకాశం కల్పించాడు. 'పైనాపిల్ జామ్' కథా సంపుటిలో అధిక కథలు 'ఫ్లాష్ ఫిక్షన్' కోవకు చెందినవిగా అనిపిస్తాయి. ఫ్లాష్ ఫిక్షన్ అనేది చాలా ఆకర్షణీయమైన సృజనాత్మక రచనా విధానం. ఇదొక సంక్షిప్త కథన పద్ధతి. వంద పదాల కథను ' మైక్రో ఫిక్షన్' అనీ, ఏడు వందలా యాభై పదాలుంటే 'సడెన్ ఫిక్షన్' అనీ, వెయ్యి పదాల వరకూ ఉంటే 'ఫ్లాష్ ఫిక్షన్' అనీ అంటారు.

ఈ ఫ్లాష్ ఫిక్షన్ కథనం ప్రాచీన భారతీయ కథల్లోనూ మనకు కనిపిస్తుంది. పంచతంత్ర కథలు, జాతక కథలు వంటి వాటిలో ఈ ఛాయలు మనకు గోచరిస్తాయి. జెన్ కథలు కూడా ఈ కోవకు చెందుతాయి. చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడం దీని ముఖ్య లక్ష్యం. ఇందులో విజయ్ కోగంటి కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. ఈ ప్రయాణంలో పైనాపిల్ జామ్ ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.



డా. కె. శ్రీనివాసులు రెడ్డి
అధ్యాపకులు, పీలేరు, ఫోన్ : 9493212454

# బాలారిష్టాలు

**– జూకంటి జగన్నాథం**

ఎటువంటి పరిస్థితులలో నన్ను మా అమ్మమ్మ ఊరికి తీసుకుపోయారో చెప్పాను. అదే విధంగానే నేను రోజూ తొడుక్కునే రెండు జతల బట్టలను ఒక ఇనుప ట్రంకు పెట్టెలో సర్ది మా మేనమామ అంటే మా అమ్మ అన్న వెంట "ఎటువంటి స్థితులు దాపురించెరా మనకు" మా అమ్మ హృదయ విదారకంగా ఏడుస్తూ పంపించింది. అప్పటికే మా అమ్మమ్మ ఊరు గురించి చుట్టుపక్కల ఊర్లలో ఒక సామెత వినిపించేది. అది పలుగు రాళ్ల వ్యవసాయ భూములున్న గుండారెడ్డి పల్లెకు ఎడ్లను అమ్మవద్దు నీళ్ల కరువు ఉండే తంగళ్ళపల్లికి ఆడపిల్లలను ఇవ్వ వద్దనే సామెత ప్రజల నోళ్లలో నానుతుండేది. అదిగో అటువంటి ఊరిలోకి వచ్చి నేను పడ్డాను. తెలవని ఊరిలో మొరగని కుక్కలా నా పరిస్థితి ఆ రోజుల్లో ఉండేది. కొత్త వాతావరణం, కొత్త ఊరు, అప్పుడప్పుడే అవుతున్న కొత్త మిత్రులు. నేను మా ఊరిలో మెదిలిన నా ప్రవర్తనకు ఇక్కడి పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఇక్కడ మిళితమై నేను సర్దుబాటు కావడానికి కొంచెం ఆలస్యం అయ్యిందని చెప్పాలి. మా మామ పులిజాల రాజయ్య ఊర్లో పెద్దమనిషి. ఆ ఊరిలో అడుగుపెట్టిన తెల్లారి నన్ను ప్రభుత్వ పాఠశాలకు స్వయంగా వచ్చి మూడవ తరగతిలో చేర్పించాడు. ఆయన చెప్పడం వల్ల సార్లు నాకు ఎలాంటి మౌఖిక పరీక్ష కూడా పెట్టకుండా బడిలో చేర్చుకున్నారు.

నాకేమో సరిగ్గా "అ ఆ" లు కూడా రావు. ఎక్కాలు సరే సరి. మొదటి త్రైమాసిక పరీక్షలలో అత్తెసరు మార్కులు వచ్చినయ్. మా క్లాస్ సార్లు నిలబెట్టి ప్రశ్నలు అడిగేవారు రాకుంటే జవాబు చెప్పిన వారితో ముక్కు చెంప దెబ్బలు కొట్టించేవారు. ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలూ ఉండేవారు. వారు సరి అయిన సమాధానం చెప్పినప్పుడు మగ పిల్లలను వారితో కూడా కొట్టించేవారు. నాకు అవమానంగా అనిపించేది. అంతా కొత్త కొత్తగా ఎవరితో పంచుకోరాదు. వేరే వారితో చెప్పుకోరాదు. నాలో నేనే మధనపడి అతికష్టం మీద చదవడం రాయడం నేర్చుకున్నాను. ఇంటికి పోతేనేమో మామది ఊర్లో పేరు ఉన్న కుటుంబం. ఆయన కావాలని నాతో ఉత్తరాలు వాళ్ళ బావా అక్క చెల్లెల్లకు రాయించేవాడు. రాసిన తరువాత కార్డును చూసి తప్పులు ఉంటే ఇష్టం వచ్చినట్టు కొప్పడే వాడు. నేను మౌనం వహించి కోపం రేషం ఎంత వచ్చినా నాలోనే కుక్కుకొని తలకిందుకి వేసుకొని కాళ్లను నేలకు నిరసనగా నేలకు కొట్టుకుంటూ బయటకు నడిచే వాడిని. బహుశా ఆ రేషమే, కోపమే నేలకు కొట్టిన బంతిలా పట్టుదలగా మారి నాలుగో తరగతిలోకి వచ్చే సరికి చదువుకునే పిల్లల్లో నేనొక్కడిగా పేరు తెచ్చుకున్నాను. అంటే, నా వయస్సు అప్పటికి తొమ్మిది సంవత్సరాలు . ఉదయం బడి వేళ నీళ్ళ కరువు వలన పొద్దున లేసి బిందెలు బొక్కెన శాంతాడు పట్టుకొని నేనూ మా మేనత్త అన్నవ్వ బామాండ్ల జానకిరామయ్య సార్ బాయి కాడికో, కోమట్ల పవిత్రపు లచ్చయ్య చేద బావి దగ్గరికో పోయే వాళ్ళం. అప్పటికే అక్కడ ఉన్న వాళ్లు నీళ్లు చేదుకొని వెళ్లిపోయాక, నేను సిత పాతాళం లోతుల్లో నుంచి ఎగిరెగిరి బొక్కెనతో నీళ్లు చేది బిందెలు నింపేవాడిని. మా అత్త నేను పిలిచే అన్నక్క బిందెలెత్తుకొని ఇంట్లో పోసి వచ్చేది. ఇంటికి బాయి దగ్గరకి దాదాపు రెండు ఫర్లాంగుల దూరం ఉండేది.. బావిలో నుంచి నీళ్లు చేది చేది నా అరచేతులు ఎర్రబారి పొక్కులు వచ్చేవి. నీళ్లు సరిపోయాక ఇంటికి పోయి స్నానం చేసి రాత్రి గిన్నెలో మిగిలిన అడుగు బొడుగు అన్నం మామిడికాయ తొక్కుతో కలిపి తిని బడికి ప్రార్థనకు అందబోయేవాడిని. సాయంత్రం ఇంటికి రాగానే ఎడ్లకు తౌడు పల్లి పిండి కలిపి చేసిన ముద్దల అంచెను తీసుకొని దూరంగా దొడ్డిలో ఉన్న పశువుల నోటికి ఒక్కటొక్కటిగా తినిపించి చీకటి పడుతుండడంతో భయంతో పరిగెత్తుకు వచ్చేవాడిని. ఇంటికి రాగానే మా మామ ఇంకా అవి చేయలేదు ఇది చేయలేదు అని ఏదో ఒకటి అనేవాడు. పొద్దుకి ఎక్క దీపం వెలుతురులో రాసుకుని చదువుకునే వాడిని. ఇది మా అమ్మమ్మ ఇంటి లో నా రోజువారీ దినచర్య. ఇలా కాలం దొర్లిపోతుండగానే ఆరో

తరగతిలోకి వచ్చాను. నా ప్రాథమిక ఉన్నత పాఠశాల క్లాస్ మెట్లు జానకి రామయ్య సార్ చిన్న బిడ్డ రాజ్యలక్ష్మి, అవుసులొల్ల అన్నయ్యా చారి, బండమీది వీరయ్య బావ రాధక్క ఏకైక కొడుకు రాజమౌళి, బుర్ర సత్తయ్య గౌడ్ తదితరులు ఉండేవారు.

ప్రతీ ఎండాకాలం సెలవుల్లో మా ఇంటి నుంచి ఎవరో ఒకరు వచ్చి నన్ను తీసుకుపోయేవారు. మళ్లీ బడి తెరిచే సమయానికి సిరిసిల్లలో తరగతి పుస్తకాలు కొన్ని కాపీలు చార్ నంబర్ అశోక పెన్ను సిరా బుడ్డి కొనిచ్చి మా అమ్మ బాపులు బాధపడుతూ, మా మామ ఊరికి తోలేసేవారు. కర్కశంగా కాలం కొనసాగుతుండగానే, సాయంత్రం బడి నుంచి వచ్చి పుస్తకాలు ఇంటి ముందున్న సిమెంట్ అరుగులపై పెట్టి, అలాగే నిద్రపోయే వాన్ని. ఇలా కొన్ని రోజుల తర్వాత మా అమ్మమ్మ రోజూ వీడు ఎందుకిలా పడుకుంటున్నాడని, నన్ను ముట్టి చూసింది. అగ్గోలె జ్వరంతో శరీరం కాలిపోతుంది. రెండు మూడు రోజుల్లో జ్వరం మరింత పెరిగింది. ఏవేవో కలవరిస్తున్నాను. మా అన్నక్క ఆర్ఎంపీ డాక్టర్ని తీసుకుని వచ్చింది. ఆయన చూసి జ్వరం గోళీలు ఇచ్చిపోయాడు. ఎట్లుంది అని డాక్టర్ను మా అమ్మమ్మ ఆందోళనతో అడిగితే తగ్గిపోతుందమ్మా అని చెప్పి పోయాడు. మూడు రోజులు మూడు పూటలా ఇచ్చిన గోళీలు వేసుకున్నా జరం ఏమాత్రం తగ్గకపోవడం అటుంచి మరింత పెరిగిపోయింది. అన్నం తినడం లేదు, నీళ్లు కూడా సరిగ్గా తాగడం లేదు. మూత్రం బంద్ అయి పోయింది. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ఈ పిల్లగాని వాళ్ళ ఇంటికి తోలెయ్యిండ్రి. అక్కడ సిరిసిల్ల సర్కార్ దవాఖానలో చూయించుకుంటారు పంపించండి, పిల్లగాడు ఆగమై పోతడు అని సలహా ఇచ్చారు. ఇదంతా చూస్తూ మా మామ నిమ్మకు నీరెత్తినట్లు నిశ్శబ్దంగా ఉన్నాడు. నీళ్లు తాగడం కూడా బంద్ అయి పోయింది. మళ్లీ మా మేనత్త అన్నక్క ఆ ఊరి ఆర్ఎంపి డాక్టర్ను తీసుకు వచ్చింది. ఆయన జ్వరమానితో చూసి 103, 104 డిగ్రీల జ్వరం ఉంది ఇక ఇక్కడ తగ్గది. నా తోటి కాదు. కరీంనగర్‌కు తీసుకు పొమ్మన్నాడు. మా మామ యధావిధిగా అస్సలు పట్టించు కోవడంలేదు. ఊర్లో అంతా చూసి పిల్లగాడిని ఎందుకు సాదుకోని తీసుకొచ్చుకున్నారు మీకు పిల్లగాని మీద కొంచెమన్నా ప్రేమ లేరు. తెచ్చుకున్న పిల్లగాన్ని తెర్లు చేస్తున్నరు అంటూ లోపల లోపల తిట్టుకుంటూ, తక్కువ కులపోళ్లు పైకే అంటూ పోయేవారు. ఒకరోజు రాత్రి నా చూపూ, లోతుల్లోంచి మెల్లగా మాట్లాడే నోటిమాట బంద్ అయి పోయినయ్. మా అమ్మమ్మ, అత్త ఏడుస్తుంటే, అయ్యో అంటూ మంచం లోంచి నన్ను తీసి ఎవరో పరచిన ఎండు గడ్డిలో వేశారు. అరే ఏం మనుషులు ఉన్నారు. పిల్లగానికి జెర కొరి పానం ఉన్నట్టుంది. వాళ్ళింటికి చెప్పి పంపుండ్రి అని ఊరంతా వచ్చి కోప్పడుతున్నారు. కొందరు తిడుతున్నారు. పెద్ద మనుషులు వచ్చి మా మామ మీదికి ఒక్కసారి గయ్యిన లేచారు. ఆయన విధి లేని పక్షంలో జీతగానికి ఐదు రూపాయలు ఇచ్చి మా ఊరికి పంపించాడు. అతను పోయి మా ఇంట్లో మా అమ్మకు బాపుకు జ్వరం వచ్చి నేను బాగా లేనని చెప్పాడు. వాళ్లు బాధపడితే ఏం కాదని వచ్చినతను చెప్పి మా అమ్మను వెంట తీసుకొని వచ్చాడు. గడ్డిలో వేసివున్న నన్ను చూసి మా అమ్మ కడుపు అవిసిపోయేలా ఏడ్చింది. కొంచెం పానం ఉందని తెలిసి మా అమ్మ నన్ను మంచం మీదకి చేర్చింది. మా అమ్మ మనసులో ఏమనుకుందో కానీ సిరిసిల్ల నుండి వెంట తెచ్చిన గ్లూకోజ్ పొడిని గ్లాసులో కలిపి నాలుగు ఐదు చెంచాల నీళ్లు తాగించింది. కొంచెం సేపటికి కళ్ళు తెరిచి అమ్మను చూశాను. నా తల వెంట్రుకలన్నీ మొత్తం రాలిపోయాయి. ఆకారం కట్టెపుల్ల లెక్క అయింది. రాత్రి అంతా మా అమ్మ నా దగ్గర కూర్చొని గ్లూకోజు నీళ్లు అప్పుడప్పుడు పెదవుల తడి ఆరకుండా తాగించింది. తల్లి ప్రేమ ముందు మృత్యువు కూడా తలవొగ్గాల్సిందే అని చెప్పడానికి నేనే ఒక ఉదాహరణ. తెల్లారి నన్ను మెల్లగా గోడకు కూర్చో పెట్టింది. తెల్లారి చుట్టుపక్కల ఉన్న అమ్మలక్కలంతా వచ్చి సుశీలక్కా నీ కొడుకును మీ ఇంటికి తీసుకుపో వీళ్లు చూడరు. అది కాదు ఇది పోదు. పిల్లగానికి ఇంకా ఆవుసు గట్టిగుంది జెర్రల చచ్చి పోతుండేది. మనిషికో మాట మా అమ్మతో అన్నారు. మర్నాడు మా అమ్మ ఉదయం లేచి మా ఇంటికి తీసుకుపోతా నా కొడుకుని అని చెప్పింది. మా అమ్మమ్మ మామ అత్త ఉంచమని గానీ తీసుకుపొమ్మని గానీ ఒక్క మాట మాట్లాడలేదు.

ఎడ్ల బండి మీద నన్ను తీసుకొని మా అమ్మ శనిగరం స్టేజి దగ్గర కరీంనగర్కు నన్ను తీసుకొని బస్సు ఎక్కింది.

మళ్లీ కరీంనగర్లో సిరిసిల్ల బస్సు ఎక్కించింది. ఆ రోజుల్లో రూపాయి ఇరువై అయిదు పైసలు కరీంనగర్కు. కరీంనగర్ నుంచి సిరిసిల్లకు మరొక రూపాయి ఇరవై ఐదు పైసలు బస్సు ఛార్జీ ఉండేది. చివరికి పగటి పూట వరకు మా అమ్మ సిరిసిల్ల బస్టాండ్లో నన్ను దించుకొని తంగళ్ళపల్లికి సంకకు ఎత్తుకొని వాగు దగ్గర దాకా వచ్చింది. తంగళ్ళపల్లికి చెందిన బాల గౌరమ్మ సుశీలవ్వా ఎటునుంచి వస్తున్నవ్ కొడుక్కు ఏమైంది అని కుశల ప్రశ్నలు అడిగి నేను ఇంటిదాకా నీ కొడుకుని ఎత్తుకొని వస్తానని చంకకు ఎత్తుకుంది. నట్టనడి ఎండల్లో వాగు ఇసుకలో నడిచి ఇంటికి చేరాము. నన్ను చూసి మా బాపు నాయనమ్మా చిన్నబాపులు దుక్కించారు. కొడుకు చచ్చి మల్లా పుట్టిండని బాధపడ్డారు. మా ఊరి వైద్యుడు గాజుల భూపతి ఆర్.ఎం.పి ని మా బాపు తీసుకువచ్చి నన్ను చూపించాడు. ఎల్లిపాయకారం కలిపి ప్రతి దినం అన్నం పెట్టమని, పొద్దు మాపు వచ్చి ఐదు రోజులు ఇంజక్షన్లు ఇచ్చాడు. టైఫాయిడ్ (మదన) జ్వరం వచ్చింది గంతే తగ్గిపోతుంది. నేను మెల్ల మెల్లగా కోలుకుంటున్నాను. మా బాపు ఎక్కడి నుంచో తీసుకువచ్చి పది రూపాయల నోటు భూపతి డాక్టర్ చేతుల్లో పెట్టాడు. మా బాపు సరిపోతాయా భూపతి అని అడిగాడు. చాలు తియ్యే దుర్గన్నా బహారాల్ నీ కొడుకు అయితే బతికిండు పో అన్నడు.

నెల రోజులు తర్వాత మా అన్నక్క నన్ను చూడడానికి వచ్చింది. పైగా మా మేనత్త మా ఇంటి ఆడబిడ్డ అయితే మా అమ్మ వాళ్ళ ఇంటికి ఆడబిడ్డ. ఆ రోజుల్లో పరిమిత సంఖ్యలో ఉన్న మా దేవ గాండ్ల కులంలో ఆడపిల్లల కొరత తీవ్రంగా ఉండడం వలన అదలుబదులు పెళ్లిళ్లు జరిగాయి. మా నలుగురు బాపులకు చిన్న చెల్లి మా మేనత్త. అందుకని ఒక పల్లెత్తు మాట కూడా ఆమెను అనలేదు. పైగా చెల్లె వచ్చిందని ఉన్నన్ని రోజులు మంచిగా చూసుకునేవారు. నేను కొంచెం నడుసస్తూ మంచిగా అవుతున్నాను. ఏమనుకుందో ఏమో గాని వచ్చిన పది రోజుల తర్వాత మా అన్నక్క జగన్నాథమును మా ఇంటికి తీసుకుపోత వదినా ఏమంటావ్ అని అడిగింది. ముందు మా అమ్మ మాతో వాడు అందరం చస్తే చస్తాం బతికితే బతుకుతం ఆఖరికి బిచ్చం ఎత్తి అయినా నా పిల్లలను సాదుకుంట తప్ప ఇక తోలియ్యనని కరాకండిగా చెప్పింది. మా అన్నక్క నాకు పిల్లగాళ్లు లేరనే కదా అంటూ శోకం పెట్టింది. చిన్న చెల్లి ఏడ్చేసరికి మా బాపుల మనసు కరిగి, రెండు రోజులు ఆగు తీసుకపోదువు గానీ అని ఏడుపును తాత్కాలికంగా ఆపించారు. రాంగా ఎన్ని పైసలు తెచ్చుకుందో కానీ సిరిసిల్లకు పోయి దక్కు పాయింటు తెల్లంగి పాలిస్టర్ బట్ట కొనుకొచ్చి సలాకల భూమయ్య పెద్ద కొడుకు నరసయ్య దగ్గరకు నన్ను తీసుకుపోయి కొలతలు ఇచ్చి కుట్టించింది. ఇంట్లో అందరికీ మా మేనత్త మీద జెర నమ్మకం కుదిరింది.

మా అమ్మ కూడా ఆడబిడ్డ ఏడుపు ఇంటికి మంచిది కాదని అయిష్టంగానే సరే అన్నది. అదిగో అట్లా దాదాపు నాలుగు నెలల తర్వాత మా అమ్మమ్మ ఇంటికి నా ప్రయాణం నాప్రమేయం లేకుండానే మళ్లీ కొనసాగింది.

జాకంటి జగన్నాథం
సిరిసిల్ల, ఫోన్ : 9441078095

## కమ్మతెమ్మెర

గత మార్చి నెలాఖరు నుండి జులై 10వతేదీ వరకు నేను పశ్చిమబెంగాలులో మా అబ్బాయి దగ్గర ఉన్నాను. వచ్చిన వెంటనే **మిసిమి** పత్రికలకోసం వెదికాను. ఒక్క మే నెలది తప్పా ఆగష్టు సంచిక వరకు దొరికాయి. అన్నీ ఏకబిగిన చదివేశాను. ఒకొక్క సంచిక కొత్తపుంతలు తొక్కి విభిన్నమైన, విశిష్టమైన అంశాలతో మనసుకెంతో ఆనందదాయకం కలిగించాయి. ప్రముఖుల పరిచయాలు వారితో సంభాషణలు మరింత విస్తృత సమాచారాన్ని అందించాయి. షడ్రుషోపేతమైన భోజనంలా మెదడుకు మేత దొరికింది. జ్ఞాన పరిధిని మరింత విశాలంగా మార్చుకొనెలా చేసింది. **మిసిమి** మరింత విశిష్టంగా అలరించగలదని ఆశిస్తూ **మిసిమి** నిర్వాహకవర్గానికి అభినందనలు తెలియజేస్తున్నాను. వీలైతే మే సంచికను పంపగలరు.




*- దోసపాటి వేంకటరామచంద్రరావు, విజయనగరం, ఫోన్ : 7780594995*

# అజంతా - శూన్యలిపి

**– జాని తక్కెడశిల**

నది పారుతుంది. పరవశమైన ప్రయాణంలా కనిపించినా, అంతర్లీనంగా మార్గాన్ని అనుసరిస్తుంది. చిన్న జలధారగా పుట్టి, పర్వతాలను దాటి, లోయల్ని పలకరించి, పొలాల్ని దున్ని, ప్రవాహాన్ని కొనసాగిస్తుంది. ప్రవాహం అనేక కాలాల్ని మోసుకుపోతుంది చరిత్రను, సంస్కృతిని, సమాజాన్ని. సముద్రంలో కలిసే వరకూ నది ప్రయాణం ఆగదు. కానీ, నది గమ్యం సముద్రం మాత్రమే కాదు. ఈ సుందర విశాల ప్రపంచానికి జీవనాధారంగా నిలవడమే దాని అసలైన ధ్యేయం. నదికి అడ్డుకట్టలు ఉంటాయి. మనిషి తన ప్రయోజనాల కోసం వాటిని కడతాడు. నీటిని నిలిపి వేసేందుకు, అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నిస్తాడు. నదికి అడ్డుకట్టలు ఉన్నట్లే మనిషి జీవితంలో అనేక ఆటుపోట్లు కలగడం సహజం. నదికి అడ్డుకట్ట కట్టినప్పుడు నీరు ఆగిపోయినట్లుగా కనపడినా.. అది శాశ్వతం కాదు. నిలిచిన చోటు నుండి ఉరకలేసేందుకు శక్తిని కూడగట్టుతుంది. అడ్డుకట్టను దాటి, ఉవ్వెత్తున ఎగిరి.. పారుతుంది. తన సహజ ధర్మాన్ని, గుణాన్ని మరువదు. ప్రవాహం ఆగినంత మాత్రాన.. నది తన లక్ష్యాన్ని కోల్పోదు. అలాగే మనిషికి చావు ఓ అడ్డుకట్టే కానీ, జీవన ప్రయాణానికి శాశ్వత ముగింపు కాదని తెలుసుకున్న వారే 'అజంతా'. జీవితం కూడా ఓ నదిలా, మార్గంలో ఎన్నో అడ్డుకట్టలు ఎదురైనా, వాటిని దాటి గమ్యాన్ని చేరడమే మనిషి బాధ్యత. అడ్డుకట్టలు విరామాలు మాత్రమే, ముగింపులు కావు. జీవిత ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది జ్ఞానంలో, ప్రేమలో, సేవలో, స్మృతిలో. జీవితం నదిలా పారుతుంది, మనుషులు ప్రయాణికులు మాత్రమే. బ్రతికి ఉండే గమ్యమే మహత్తరమైనది.

**"చెప్పలేదా నేను చెప్పలేదా అంతా ఒకే శబ్దం"**
**"ఆకు రాలుతున్న కాలం ఒక ఆహ్వానం మాత్రమే అని"**
**"నేను, నా శరీరం ఒకేసారి నిలువునా బద్దలై రెండు ముఖాలతో**
**నేను మరో గవాక్షంలో అడుగు పెడుతున్నప్పుడు**
**అంత ఒక కదలిక మాత్రమే"**

మనిషి మరణానికి అతీతుడు కాదు. అది ప్రతి జీవికి అనివార్యమైన దశ. కానీ, మరణం జీవనయాత్రకు చివరి స్టేషన్ కాదు, అదొక మార్గాంతర స్థానం మాత్రమే. మరణాన్ని వేరుగా చూస్తే భయం, విచారం ఏర్పడతాయి. మరణాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకున్నప్పుడే శాంతి, పరిపక్వత కలుగుతాయి. మరణం శరీరానికి మాత్రమే వర్తించేది. మనిషిలోని శబ్దానికి – అంటే ఆలోచనకు, చైతన్యానికి, ఆత్మ స్వరూపానికి –మరణం లేదు. మాటలు, భావనలు, ఆశయాలు ఈ ప్రపంచంలో అలాగే ఉండిపోతాయి. మనిషి చనిపోయిన తర్వాత కూడా.. వారి తాలుకూ ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలు, కోరికలు సమాజంలో ఏదో రూపంలో నిశ్శబ్దంగా శ్వాసిస్తూనే ఉంటాయి. అజంతా రాసిన పద్యం, పలికిన మాట, నడిచిన మార్గం అవి నేటి కవులకు మార్గదర్శకంగా నిలుస్తాయి. "మరణం అంటే మరో గవాక్షంలో అడుగు పెట్టడం" అంటే.. మరణం ద్వారా ఒక మార్గం ముగిసి, మరో కొత్త మార్గం ప్రారంభమవుతుందన్న భావనను సూచించడమే. ఇది పరమార్థబోధకమైన మాట. శరీరం మాయం అయినా, జీవన స్ఫూర్తి నశించదు. "కాలం మరెవరో కాదు నేనే" అన్న వాక్యంలో ఉన్న అంతరార్థం మరింత లోతైనది. కాలం అనే ప్రక్రియలో మనిషి కొనసాగుతాడు. మనిషి చేసే పని, ప్రభావం, శబ్దం.. కాలంలో విలీనం కాకుండా, కాలంతో పాటు ప్రయాణిస్తాయి. మనిషి బ్రతికినంతకాలం మాత్రమే కాదు–తన జీవిత ప్రభావం ఉన్నంతవరకూ బ్రతికే ఉంటాడు. అందుకే మరణాన్ని ఒక విరామంగా చూడాలి, ముగింపుగా కాదు. అసలైన జీవితం, శబ్దం, ఆశయాల పరంపర–అవే మనిషి నిజమైన అజంతా గారి గవాక్షాలు. అవే కాలాన్ని దాటి నిలిచే శాశ్వత గుర్తులు.



కవి అజంతా
(విశ్వనాథ శాస్త్రి)

**"భయ విభ్రమాల మధ్య విషాద వాక్యం వలె సాగే జీవితంలో**
**మృత్యువు ఒక్కటే నిజం**
**హఠాత్తుగా తలుపు తెరుచుకోవడం మృత్యువు"**

మనిషి అంతరంగంలో కలిగే రెండు బలమైన భావాలు–భయం, భ్రమ. అవి ఒకసారి మనిషిలోకి ప్రవేశించాక.. జ్ఞానం, ఆత్మస్థైర్యం, స్వేచ్ఛ అన్నింటినీ మెల్లగా మింగేస్తాయి. బ్రతికే అవకాశం లేకుండా చేస్తాయి. "ఏదో ఉంది, అదే నన్ను నడిపిస్తోంది" అనుకోవడం భ్రమ.

అది నిజం అనిపించే అబద్ధం. అర్థం కాని అసత్యాన్ని నిజం అనుకొని జీవించటం. ఆ భ్రమలో ఒక అడుగు ముందుకేస్తే, దాని అడుగుజాడల్లో జీవితాన్ని విస్మరిస్తాము. భ్రమ దృష్టిని మూసివేస్తుంది, ఆలోచనల్ని పరిమితం చేస్తుంది. "చెప్పినట్టు నడవకపోతే చనిపోతాను, శాశ్వత శిక్ష అనుభవిస్తాను" అనే భావనను కలిగిస్తుంది. ఆ భయం మనలో నిరంతరం ఉంటూ నిశబ్దంలా మారుతుంది– మనం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని దెబ్బతీస్తుంది. మన కదలికల్ని జాగ్రత్తగా గమనించి, వాటిని నియంత్రించడానికి ప్రయత్నిస్తుంది. మొత్తానికి బ్రతకకుండా చేస్తుంది.

భయం, భ్రమ కలిసి విషాదాన్ని కలిగిస్తాయి. మనిషి మరొకరి నియమాలకో, ఊహలకో బానిసగా మారిపోయి నప్పుడు, స్వేచ్ఛను కోల్పోతాడు. ఆ తర్వాత జీవితంలో ఆనందానికి తలుపు మూసివేస్తాడు. మనిషి స్వతంత్రుడిగా ఉండాలి. ఆలోచించాల్సిన విషయాలపై అన్వేషణ సాగించాలి, భయాందోళనలు తొలగించు కోవాలి. ఒక తప్పుడు చక్రంలో పడిపోతే, అది జీవితాన్ని నలిపేస్తుంది. మనిషికి స్వేచ్ఛ లేదంటే, నిజమైన జీవితం లేదనే అర్థం. ఆత్మస్వేచ్ఛ కలిగి ఉన్నప్పుడు మాత్రమే మనిషి నిజంగా బ్రతుకుతాడు. ఆ స్వేచ్ఛలోనే సృజన శక్తి ఉంది. ప్రశాంతత ఉంది. ఆనందానికి మార్గం ఉంది. అందుకే, భయాన్ని జయించాలి, భ్రమను తొలగించాలి. అప్పుడే మనిషి నిజమైన జీవితాన్ని స్వేచ్ఛగా ఆస్వాదించగలడు.

పుట్టుక నుండి మరణం వరకు జరిగేదంతా మనకు తెలిసిన జీవితం. కానీ ఆ జీవితం అనేక మాయలతో నిండిపోయి ఉంటుంది. అనుభవాలు, కోరికలు, ఆకాంక్షలు, లాలసలు all these create a veil of illusion around us. నిజమైన జీవితం జననమరణాల మధ్య మాత్రమే కాదు మరణించిన తర్వాత కూడా ఉంటుంది. మనిషి జననం–మరణం అనే నిజాల మధ్య మాయలో బ్రతుకుతాడు. పుట్టుక నుంచి మరణం వరకు జరిగే ఆటను నిజం అనుకుంటాడు. ధనం, ఖ్యాతి, పదవి, సంబంధాలు all seem real, but they are impermanent. మాయ అనేది స్థిరమైనదిగా కనబడే అస్థిరత. నిజం ఎప్పుడూ ముసుగు ధరించదు. అది నిశ్శబ్దంగా, నిర్భయంగా, నిశ్చలంగా వస్తుంది. అట్టి నిజం మృత్యువు రూపంలో ఒక ఉదాత్త సందర్భంలా ఎదురవుతుంది. దాని రాకని గుర్తుపట్టినవాడు, భయపడకుండా ఆహ్వానించినవాడే నిజమైన జీవన ప్రమాణాన్ని చేరుకున్నవాడు. అప్పుడే జన్మ సార్థకం అవుతుంది. అయితే మృత్యువు నిజమని, తథ్యమని తెలుసుకుని, దానికోసం ఎదురుచూడటం జీవితం పట్ల నిర్లిప్తతకు దారి తీస్తుంది. పనిని వదిలేసి మృత్యువు రాకకై కూర్చోవడం మనిషి ధర్మం కాదు. అది నిరాశ, అప్రయోజకత. మనిషి చేయవలసిన పని ఈ మాయల మధ్య నిజాన్ని వెతికే ప్రయత్నం చేయడం. మృత్యువు ఒక ఆఖరి పేజీ మాత్రమే, కానీ జీవితం ఓ సంపుటి కావాలి. ప్రతి పుటను మనం రాసుకోవాలి–స్పష్టంగా, అర్థవంతంగా, సంతృప్తిగా. నిజాన్ని తెలుసుకునే ప్రయత్నంలో మాయ ఏమిటో కనుక్కోవాలి, కానీ దానిలో మునిగిపోవద్దు. నిజాన్ని ఒప్పుకోవాలి, మృత్యువును గౌరవించాలి కానీ జీవితాన్ని పనితో, ప్రేమతో, ప్రయోజనంతో నింపాలి. అదే మనిషి లక్ష్యం. శబ్దం కేవలం గాలిలో ఉత్పన్నమయ్యే తరంగం కాదు. అది జీవించి ఉన్నామని చెప్పడానికి ఒక ప్రతీక, సాక్ష్యం. మనిషి బ్రతికే ఉన్నాడని చెప్పే అక్షరమే శబ్దం. శబ్దం అంటే ప్రయాణం. శబ్దం అంటే అభివ్యక్తి. శబ్దం అంటే ప్రశ్నించడం, స్పందించడం, ఎదగడం. శబ్దం అంటే చలనానికి రూపం, సృజనకు పునాది. అలాంటి శబ్దాన్ని విడిచి నిశ్శబ్దాన్ని ఆశ్రయించడమంటే, మనిషి తన స్వరూపాన్ని విస్మరించినట్టే. మౌనం ప్రతి సందర్భంలో గొప్పది కాదు. అది అన్ని చోట్ల ఖరీదైన ఆభరణం కాలేదు. కొన్నిసార్లు భయానికి సంకేతం అవుతుంది, మరికొన్ని సార్లు బలహీనతకి.

మనిషి శరీరంలో అణువణువు శబ్దమే. కనురెప్పల సవ్వడిలో సంగీతం ఉంది. గుండెచప్పుడు ఒక లయ. శ్వాస ఒక శబ్ద నాట్యం. ఇవన్నీ మనిషి బ్రతికే ఉన్నాడని తెలియజేసే మహా శబ్దాలు. ఆ శబ్దాలను గ్రహించలేని మనిషి.. బ్రతికే ఉన్నాడని ఎలా నిర్ధారించగలము? అతను శరీరంతో ఉన్నా, మనస్సుతో లేకపోవడం వల్ల శూన్యంగా మారిపోతాడు. కాబట్టి.. శబ్దం ఒక జీవనరేఖ-ఒడిసి పట్టుకోవాలి. అందులో జీవితం ఉంది. అందులోనే మానవత్వం కూడా ఉంది.

**"రాక్షసులు, రాజకీయవేత్తలు, మంత్రులు, రాజ్యాధినేతలు**
**సామాన్యులు, సజ్జనులు అంతా నిద్రపోతున్నారు**
**చీకటి శరణాలయంలో అందరూ తలదాచుకున్నారు**
**జెండాలు ఎగరవు ఇప్పుడు**
**శాసనాలు చెల్లవు ఇప్పుడు**
**గడియారాలు ఆడవు ఇప్పుడు"**

నిద్రపోవడమంటే శరీరానికి విశ్రాంతి ఇవ్వడం మాత్రమే కాదు. జీవితంలో ఏమీ చేయకుండా, చేయలేక ఉండిపోవడమూ నిద్రే. అది కేవలం శారీరక స్థితి కాదు



–చైతన్య రాహిత్యానికి ప్రతీక కూడా. మనిషి చైతన్యాన్ని కోల్పోయినప్పుడు, జీవితమే క్రమంగా నిశ్శబ్ద నిద్రగా మారుతుంది. నిద్రను ప్రశాంతతగా భావించడం అర్థరహితమైన మాయ. ఏమీ చేయకపోవడం ఒక విషాద సంకేతం. ఎవ్వరూ దేన్నీ పట్టించుకోకపోతే, ఎవ్వరూ స్పందించకపోతే, సమాజం స్థిరమవుతుంది. చలనాన్ని కోల్పోతుంది. జీవితం తన ధర్మాన్ని విడిచిపెడుతుంది. కాలమే ఆగిపోయినట్లు అనిపిస్తుంది. అది మనిషి అసలైన రూపం కాదు. మానవుని లక్ష్యం–చైతన్యంతో ముందుకు సాగడం. పోరాటమే జీవితం. ప్రతి శ్వాసలో ఉత్సాహం ఉండాలి. ప్రతి అడుగులో ప్రశ్న లేవనెత్తాలి. మనిషి పిడికిలి బిగించి నిలబడాలి. కళ్ళలో ధైర్యాన్ని నింపుకోవాలి. అలాకాకుండా, ఎక్కడ ఉన్నవారు.. అక్కడే ఉండిపోతే: చుట్టూ విరిగిన ఆశలే, నిలిచిపోయిన ప్రయాణాలే, కన్నీళ్లతో నిండిన రాత్రులే మిగులుతాయి.

“బాధ నా ముఖచిత్రం” అని అజంతా గారి మాటను నిజం చేయడం మనిషి బాధ్యత కాకూడదు. బాధను గౌరవించాలి–కాని దానిలో మునిగి జీవితం అయిపోయిందని అంగీకరించకూడదు. బాధను భరించాలి, దాన్ని జీవనబోధగా మార్చుకోవాలి. బాధపై నిలబడే శక్తి ఉండాలి. అదే నిజమైన చైతన్యం. అదే జీవితానికి ఉనికి. నిద్రలో మునిగిపోకండి–లేచి నిలవండి. విశ్రాంతి అవసరమే కానీ అది స్థిరత్వం కాకూడదు. నిశ్శబ్దం అవసరమే కానీ జీవితాన్ని ముగించకూడదు. ప్రతి కన్నీటికి శబ్దం ఇవ్వాలి. ప్రతి ప్రశ్నకు గొంతు అవ్వాలి. ప్రతి నిద్రలోని కలను నిజం చేయాలంటే లేచి నిలబడాలి.

మనిషి మౌనంగా ఉంటే, మిగిలేది చీకటే. నిద్రపోతే, మిగిలేది శూన్యతే. చైతన్యంతో బతికితే, పోరాడితే–మిగిలేది మార్పు, శాశ్వతత్వమే. అందుకే–బాధను జీవితం అనుకోకూడదు. చైతన్యాన్ని జీవితం చేయండి. నిశ్శబ్దాన్ని కాదు–శబ్దాన్ని ఎంపిక చేసుకోండి. నిద్రను కాదు– నడకను ముందుకు సాగించండి. అదే జీవన లక్ష్యం. మనిషి జీవితంలో వెలుగు మాత్రమే కాదు, చీకటికి కూడా స్థానం ఉంది. చెడు లేకపోతే మంచికి విలువ ఉండదు. చీకటి లేకపోతే వెలుగు గొప్పదనం ఎలా తెలుస్తుంది? అదే తత్త్వం మనిషి అంతఃకరణానికీ వర్తిస్తుంది. మనసులో ఆశలు, అసూయలు, నిరాశలు, నిటూర్పులు, ద్వేషాలు, కష్టాలు, కన్నీళ్లు లాంటి ప్రతికూల భావోద్వేగాలు లేకపోతే, త్యాగం, సహాయం, సత్యనిష్ఠ, నిజాయితీ, దయ, వినయం, ధైర్యం, శాంతి, సహనం, నీతి వంటి మంచిగుణాల విలువ అర్థం కాకపోవడమే కాదు, వాటి అవసరాన్ని కూడా గుర్తించలేరు. “మనిషిలో సకల గుణాలు ఉండాలి, ఏది లేకపోయినా అంతటా నిశ్శబ్దమే తాండవిస్తుంది.” ప్రతి గుణానికి, బలహీనతకైనా మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తి ఉంది. ఏదో ఒక భావన లేకపోతే, మనిషి అంతర్గత జీవితం అసంపూర్ణంగా మారుతుంది. Not the peaceful kind, but a disturbing, hollow kind. చెడును అవసరంగా భావించి, దానికే ఆధిపత్యం ఇవ్వడం ప్రమాదకరం. అజంతా గారు స్పష్టంగా చెప్పింది ఏమిటంటే–మంచి చెడును జయించాలి కానీ చెడు మంచిని కాదు. చెడు అనేది పరీక్షించే సాధనం మాత్రమే. అది దారిగా మారకూడదు. మనిషి చెడుతో తళుక్కున మెరిసే మంచిని తీర్చిదిద్దాలి. అదే ధర్మపథం.

మనిషిలో అన్ని గుణాల సమతుల్యత అవసరం. ఒక్కటి లేకపోయినా.. మనిషి అంతరంగిక విశ్వాన్ని నిశ్శబ్దంగా మార్చే ప్రమాదం ఉంది. శబ్దాన్ని, చైతన్యాన్ని నిరంతరం మనిషి రక్షించుకోవాలి. మనుషుల్ని మరింత మెరుగైన మనుషులుగా మార్చడానికే చెడు ఉపయోగపడాలి.

అజంతా గారు నగర జీవనాన్ని అంగీకరించలేదు. నగరాన్ని ఒక విపరీతమైన ఖైదుగా చూసారు. అది ఏకపక్షత కాదు వారికి నగరంపై వ్యతిరేకత మాత్రమే కాదు, వ్యతిరేకత వెనుక ఉన్న కారణాలను కవిత్వం ద్వారా వెల్లడించారు. అయితే నగరం చెడుతో నిండిపోయిందని తేల్చేయడం వారి లక్ష్యం కాదు. నగరాల్లో మంచితో పాటు చెడు కూడా ఉంటుంది. అదే రీతిలో పల్లెలోను మంచితో పాటు అనేక చెడు కార్యాలు పాతుకుపోతూ వచ్చాయి. సతీసహగమనం, కన్యాశుల్కం, అంటరానితనం, వివక్ష ఇలాంటి అన్యాయ వ్యవస్థలు పల్లెల్లోనే జన్మించాయి. అవి కొన్ని తరాల పాటు మనిషిని పీడించాయి. పీడిస్తూనే ఉన్నాయి. అజంతా గారు.. ఆ చీకటిని గమనించారు, కాని పల్లెను పట్టణంతో పోల్చి దేన్నీ తక్కువ చేయలేదు. వారి కవిత్వం ద్వారా పట్టణ జీవనంలోని అన్యాయంపై గళమెత్తారు. పట్టణ అభివృద్ధి పేరుతో జరుగుతున్న మానవ హననాన్ని, ఆర్థిక దోపిడీని, సాంస్కృతిక సంకుచితత్వాన్ని ప్రశ్నించారు.

“రోడ్లు నా ప్రాణం, రోడ్లు నా ఇతివృత్తం, రోడ్లు నా ఛందస్సు” అని చెప్పుకోవడంలో కవి.. ప్రజల పక్షమై

నిలబడ్డారని అర్థం చేసుకోవాలి. వారు రాసింది రోడ్ల గురించి కాదు ఆ రోడ్లపై నడిచే జీవితాల గురించి, కష్టపడే కార్మికుల గురించి, శ్రమజీవుల గురించి. "రోడ్లు నా నిఘంటువు" అన్నప్పుడు వారి జీవనాన్ని, విలువల్ని ఆ రోడ్లలోనే సందర్శించారు. అంతే కాదు రోడ్లకు నమస్కారం చేయడం ద్వారా కృత్జ్ఞతను వ్యక్తపరిచారు. అది ఆధ్యాత్మికత కాదు, సమాజంపై ఉన్న బాధ్యతా భావం. పట్టణాల అభివృద్ధి పేరుతో జరుగుతున్న నిష్ఠూరతను నిలదీయడం వారుకున్న స్పష్టమైన అభిప్రాయం మాత్రమే కాదు, అదే వారి సాహిత్య ధర్మం కూడా. అజంతా గారు నగర ద్వేషి అనిపించవచ్చు కానీ వారి వ్యతిరేకత నగర రూపానికి కాదు నగర జీవనంలో తలదాల్చిన అన్యాయ వ్యవస్థపై. పట్టణంలోని మానవతా రాహిత్యాన్ని భరించలేకపోయారు.

అజంతా గారు ఆలోచనలకు, అక్షరాలకు ముసుగు వేసుకుని తిరుగుతున్న మనిషి స్వభావాన్ని తీవ్రంగా తిరస్కరించారు. మనిషి ముఖం వెనుక మరో ముఖం ఉండటం వంటి మాయాజాలాన్ని భూస్థాపితం చేయాలన్నారు. మనిషి తన అసలు స్వరూపాన్ని కోల్పోతూ ఉంటే, జీవన సౌందర్యాన్ని ఎలా గ్రహించగలడని ప్రశ్నించారు. ఈ విమర్శలకు ఆయుధంగా తన నగ్న అక్షరాలననే ఉపయోగించారు. అయితే, అజంతా గారు ఆవేశాన్ని విపరీతంగా, అసహ్యంగా ప్రదర్శించలేదు. ఆవేశం ఉన్నప్పటికీ నియంత్రణలో ఉంచుకున్నారు. కవిత్వంలోని శ్రేష్ఠతకు ఆవేశాన్ని ప్రతికూలంగా మార్చుకోలేదు. భావావేశం పేరుతో చాలామంది కవులు తమ పరిధిని దాటిపోతూ, సమర్థించుకోలేని ప్రవర్తన కనబరచడం నేటి పోకడ. అజంతా గారు ఆ దారిలో నడవలేదు.

**"జీవితం నిండా ఇక శూన్యమే" / "బాధ నా ముఖం"**
**"శూన్యంలో నడుస్తున్నాను" / "చల్లని వేళ నా కోసం భగవంతుడుని ప్రార్థించమను" / "జాగ్రత్త సుమా! / ఇక్కడ భగవంతుడు కూడా నిస్సహాయుడే"**

"నా కోసం భగవంతుడిని ప్రార్థించండి" అనే వాక్యం అజంతా గారి భావజాలానికి దర్పణంగా నిలుస్తుంది. అది వ్యక్తిగత ఆత్మనిస్సరణను, మనుషుల అసహాయతను, ఒక విధమైన విధివిలాపాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ భావనలపై ఆధారపడి అజంతా గారు రచించిన స్వప్నలిపి కవితా సంకలనం నిండుగా బాధ, విషాదం, నిరాశ, నిస్పృహ లాంటి భావాలతో నిండి ఉంది. "మన చేతుల్లో ఏమీ లేదు," "ఏమీ చేయలేము," "ప్రపంచాన్ని మార్చలేము" అనే అంగీకారభావం స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ రకమైన వాక్యాల ద్వారా అజంతా గారిని భావభ్యుదయ కవి అని పేర్కొనడం సమంజసమే. కానీ సమాజాన్ని మార్చే సంకల్పం, శ్రమజీవుల సంక్షేమాన్ని కాంక్షించే అభ్యుదయ భావన, ప్రజా చైతన్యాన్ని రగిలించే ఉదాత్తత అజంతా గారి కవిత్వంలో మసకబారింది. కాబట్టి ఆయన్ను అభ్యుదయ కవిగా పరిగణించడంలో అర్థం లేదు. అజంతా గారి కలం లోతైన భావాలతో నిండినదైనా, ఆ లోతు విప్లవ స్ఫూర్తికి మార్గం చూపే దిశగా కాక, ఒక అనివార్య దుఃఖంలో నిమగ్నమై ఉన్న వ్యక్తిత్వాన్ని ప్రతినిధీకరిస్తుంది. అటువంటి కవిత్వం ఆవేశాన్ని కలిగించదు, ఆలోచన కలిగించవచ్చు. అయితే అది ప్రజల పోరాటానికి ప్రేరణ ఇవ్వదు. అజంతా గారు భాషపై అపారమైన పట్టు కలిగిన కవి. పద ప్రయోగంలో ఆలోచనలకు లోతు, భావాలకు బలం స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ఈ భాషా ప్రావీణ్యం, శిల్పపరంగా గొప్పగా ఉన్నప్పటికీ, పాఠక అనుభవపరంగా కాస్త లోటును తెచ్చిపెడుతుంది. అజంతా గారి కవిత్వంలో సరళత కన్నా కఠినత ఎక్కువ. సాధారణ పాఠకుడు తేలికగా అర్థం చేసుకునే పదాలను కాకుండా, విపరీతమైన పదబంధాలు, వాడుకలో లేని పదాలు అధికంగా కనిపిస్తాయి. దాని కారణంగా పాఠకుడు ఒక్కో కవిత అర్థం చేసుకోవడానికి శ్రమించాల్సిన అవసరం వస్తుంది. కొన్ని సందర్భాల్లో భావాన్ని గ్రహించడానికి పునఃపునః చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కవిత్వం ప్రజలకు చేరువ కావాలనే లక్ష్యం వైపు కొనసాగలేదు. కవిత్వం ప్రధానంగా రెండు ధోరణుల్లో కనిపిస్తుంది. ఒకటి సులభంగా అర్థమయ్యి, పాఠకుడి మనసును తాకి, చైతన్యాన్ని కలిగించే కవిత్వం. రెండవది లోతైన శిల్పం, సంక్లిష్టమైన భాష, తీవ్రతతో కూడిన భావాల ద్వారా కవి అంతర్గతాన్ని వ్యక్తపరిచేది.

అజంతా గారు రెండవ శ్రేణికి చెందుతారు. ఆయన కవిత్వంలో శిల్పపరంగా ఉన్న కట్టుదిట్టుదనం, భావ గంభీరత స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కువ శాతం పాఠకులకు వారి కవిత్వాన్ని జీర్ణించుకోవడం కష్టంగా అనిపించే ప్రమాదమే ఎక్కువగా ఉన్నది. పదాల బలిష్టత, భావాల ఘనత కవిత్వాన్ని పఠనాత్మక మానసిక వ్యాయామంగా మలుస్తుంది. అందువల్ల అజంతా గారి కవిత్వం శిల్పపరంగా గొప్పదైనా, స్పష్టత పరంగా కొంత సంక్లిష్టతను కలిగి ఉంది. అలాగే, అజంతా గారి కవిత్వం అన్యాయాన్ని ప్రశ్నిస్తుంది, బాధకు రూపమిస్తుంది, నిస్సహాయతను ప్రకటిస్తుంది. కానీ బాధను న్యాయమైన కోపంగా మార్చి, ఉద్యమంగా మలచే శక్తిని కూడగట్టు కోలేదు. అంటే,

పాఠకుని మనస్సులో మోటివేషన్, దృక్పథ మార్పు కలిగించే స్థాయికి చేరడం కష్టం. అజంతా గారు వ్యథను ఉద్ఘాటిస్తారు, కానీ దానిలో నుంచి మార్పు చెందటానికి మార్గాన్ని చూపడంలో వెనుకబడ్డారు. సాధారణమైన విషయాలను కూడా అసాధారణమైన శిల్పంతో, విభిన్నమైన వాక్య నిర్మాణంతో స్పందించడం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ శైలీకరణ పాఠకుడికి కొంత తడబాటును కలిగించే అవకాశముంది. పదాల సంక్లిష్టత, భావవ్యాప్తి, వాక్యాల పొడవు-ఇవన్నీ ఒక సాధారణ పాఠకుడిని కాస్త వెనక్కి నెట్టేలా చేస్తాయి. ఈ కారణాలన్నీ చూపిస్తూ అజంతా గారి కవిత్వాన్ని తక్కువగా అంచనా వేయడం న్యాయమైనది కాదు. పాఠకుడి అసౌకర్యం కవిత్వంలో లోపమని తేల్చేయడంలో ధ్వని పరిణామం, కాల పరిణామం వంటి అంశాలను పరిగణించకపోతే అసంపూర్ణమే అవుతుంది. ఎందుకంటే అజంతా గారు రచించిన కవిత్వం 1948 నుండి 1992 మధ్య కాలానికి చెందింది. అది ఒక భిన్నమైన భాషా-సాంస్కృతిక వాతావరణానికి ప్రతినిధిగా నిలిచే కాలం. నేటి పాఠకుడికి ఆనాటి భాష, శైలి పూర్తిగా అర్థం కాకపోవడం సహజమే. కానీ ఆ భాషా నిర్మాణాన్ని అర్థరహితంగా భావించడం తగదు. కాలం మారినంత మాత్రాన-గతంలోని భావవైశాల్యాన్ని అసాధారణంగా లెక్క వేయడం సరికాదు. పైగా, ఈ కవిత్వాన్ని విశ్లేషించే ముందు రచయిత తన కవితా యాత్రను ఎలా చూశాడో తెలుసుకోవడమూ అవసరం. అజంతా గారే స్వయంగా స్వప్నలిపిలోని కవిత్వం గురించి చెప్పిన మాటలు ఆయన కవిత్వం వెనుక ఉన్న అంతర్మథనాన్ని, స్పష్టతను మరింతగా చాటుతాయి. కాబట్టి ఆయన కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే, శిల్పాన్ని మాత్రమే కాక- కాలాను గుణమైన దృక్పథాన్ని కూడా మనం అవగాహన చేసుకోవాలి.

"నేను రాసిన పద్యాలన్నీ చిత్తుప్రతులే. ఏ ఒక్క పద్యం కూడా నాకు సంతృప్తి కలిగించలేదు. పత్రికలలోనే కాదు సంకలనాలలో వచ్చిన కవిత్వం కూడా చాలా భాగం చిత్తుప్రతులే. Perfection నా లక్ష్యం." నేటి కవితా ప్రపంచంలో ఒక అస్పష్టత గమనించకమానలేం. తాము రాసిన కవిత్వమే అత్యుత్తమమని, అలాంటి కవిత్వాన్ని ఎవరూ రాయలేరని భావిస్తూ, తమ రచనల మీదే మత్తుగా విర్రవీగే కవుల సంఖ్య పెరిగిపోతున్నది. ఈ విపరీతమైన సంతృప్తి భావన కవిత్వాన్ని నిలకడగా ఎదగనివ్వదు. అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుంది. అలాంటి దుస్థితిలో అజంతా గారి వాక్యాలు ప్రతి కవి గుండె మీద చెరపరాని ముద్ర వేయాలి. "రాసిన కవిత గురించి ఇంకా ఆలోచిస్తూనే ఉంటాను," అని 1948లో రచించిన కవిత గురించి తలచుకుంటూ చెప్పిన అజంతా గారి మాటలు నేటి కవులకు అద్దంగా నిలవాలి. ఎందుకంటే కవిత్వం అనేది కేవలం భావాల ప్రవాహం మాత్రమే కాదు, అది శిల్పం, చైతన్యం, అణచివేత మీద చిత్తశుద్ధి గల ప్రతిస్పందన. దానికి పువ్వుల వంటి సున్నితత్వం ఉండాలి, కొండలా బలమైన నిర్మాణమూ ఉండాలి. ఈ తరం కవులు కుప్పలు తెప్పలుగా కవిత్వం రాస్తున్నారు. కానీ రాసిన కవిత్వాన్ని తిరిగి చూడటం, సరి చేసుకోవడం, మెరుగుపరుచుకోవాలనే సంకల్పం కొరవడుతోంది. కొత్త కవిత రాయడం కంటే, రాసిన వాటినే పదే పదే మెరుగుపరుచుకొని - శక్తివంతంగా మార్చడమే అసలైన కవి లక్షణం అవ్వాలి.

"కవి ప్రపంచాన్ని చూడాలే తప్ప, తానై ప్రపంచానికి కనపడకూడదు." కవి వెనుక ఉండి తన కవిత్వాన్ని ముందుకు జరపాలి. కవి చీకట్లో ఉండి, కవిత్వానికి వెలుగునివ్వాలి. చీకట్లో ఉన్నవాడే వెలుగును దర్శించ గలుగుతాడు. అలా కాకుండా కవి వెలుగులో ఉండి తన కవిత్వాన్ని చీకట్లో నెట్టివేయకూడదు. కవికి అవార్డులు, రివార్డులు, పురస్కారాలు, సన్మానాల కంటే తన కవిత్వాన్ని లక్ష్యం వైపుగా సాగించేలా కృషి చేయడమే ప్రాథమిక కర్తవ్యమై ఉండాలి. తను పరుగులు పెడుతూ తన కవిత్వాన్ని పాతిపెట్టకూడదు. కవి ఎక్కడ ఉన్నా తన కవిత్వం గగన సీమలలో విహరించాలి. రెక్కలు తాను కట్టుకోకుండా కవిత్వానికి రెక్కలు అందించాలి.

అజంతా గారి కవిత్వం ఆషామాషీగా చదివేది కాదు. మనసు పెట్టి శ్రద్ధగా, ప్రేమగా, నిమ్మళంగా చదవాలి. ఒకసారి చదివి వదిలేసే కవిత్వం కాదు. మళ్లీ మళ్లీ చదవాల్సిన కవిత్వం. అయితే అజంతా గారి కవిత్వం నుండి చీకటి నుండి వెలుగులోకి రావడం ఎలానో తెలుసుకోవాలే కానీ అజంతా గారి శూన్యంలో పడిపోకూడదు. శూన్యం మీద కూర్చుంటే తప్పులేదు కానీ శూన్యంలో తప్పిపోతేనే ప్రమాదం. చూపు.. చీకటి నుండి వెలుగులోకి దూకాలే కానీ చీకట్లో జీవితాన్ని మగ్గిపోయేలా చేసుకోకూడదు. మరణం జీవితంలో ఒక భాగమవ్వాలే కానీ మరణమే జీవితం కాకూడదు. అజంతా గారి కవిత్వం అందరికీ ఒకేలా అర్థమవ్వదు. అజంతా గారి కవిత్వం శూన్యం లాంటిది. అందులో ఆకాశం, వెలుగు, చీకటి, నక్షత్రాలు, పాలపుంతలు అలా ఎన్నో ఎనెన్నో.

**జాని తక్కెడశిల**
హెడ్ ఆఫ్ ప్రతిలిపి తెలుగు డిపార్ట్మెంట్,
హైదరాబాద్, ఫోన్ : 7259511956

# 'నిట్టల' బుర్రకథ

- కన్నీడి మనోహర్

**కా**లాలు మారినా మార్పు లేకుండా ఉండే సృజన ప్రక్రియ జానపదం కాదు. కొద్దో గొప్పో మార్పులు పొందినప్పుడే దానికి జీవం వస్తుంది. అజ్ఞాత కర్తృత్వం కలిగినదేదైనా గ్రంథాలకెక్కిన తక్షణం తనదైన జీవ లక్షణాన్ని కోల్పోతుంది. ఎనభై ఏళ్ల కిందట దిగువ గోదావరి ప్రాంతంలో బుర్రకథ కళాకారులు 'నిట్టల బ్రదర్స్' చెప్పిన కథలన్నీ జాతి చైతన్య స్ఫోరకాలు, స్వచ్ఛమైన జానపదాలు. ఇవేవీ పుటలకెక్కలేదు. ఎలా పాడేవారో... వీరి కథన శైలి ఎలాంటిదో తెలుసుకునేందుకు ఇప్పుడు ఎలాంటి ఆధారాలు దొరకవు. వీరి బుర్రకథలు చూసి ఆనందించిన తరం ఇప్పుడు లేదు. తొంభై ఏళ్ల వయోభారంతో ఆనాటి జ్ఞాపకాలతో జీవిస్తున్న నిట్టల సోదరుల్లో ఒకరైన హనుమంతరావు ఆనాటి జానపద కళా విభవానికి ప్రత్యక్ష సాక్షి.

దేశానికి స్వరాజ్యమొచ్చినా.. సగటు జీవి కష్టాలు తీరలేదు. ప్రభుత్వం పటిష్ఠమైన పాలనా యంత్రాంగాన్ని తీసుకొచ్చింది. పంచ వర్ష ప్రణాళికలు పెట్టింది. వరద బాధితులకి ప్రభుత్వాలు ఇచ్చే అరకొర సాయంలోనూ అధికారుల కోతలూ.. దోపిడీలూ... సన్నజీవులను మరీ బాధించాయి. దీనుల నిస్సహాయత, మంత్రుల ఉదాసీనత.. ఆ గోదారి ప్రజల గుండె కోత...ఇవ్వాల్టిది కాదు...గోదారి పుట్టినప్పటిది. సరిగ్గా ఆ సమయంలోనే... కోనసీమలో... తాణెలంక గ్రామంలో శ్రీపాద సుబ్బారావు గారి బుర్రకథ పెట్టారు. ఒక ఎర్రజెండా దళమొచ్చి వరదపోటు దుఃఖాన్ని తంబుర కథగా చెప్పడం ఆ ఊర్లో అదే ప్రథమం.

**"విలవిల తన్నుక నాగయ జీవుడు - వెళ్ళిపోయె నండి
జల జల కన్నుల జలము కారెనా - జనసమూహామునకు."**

అప్పుడావేళ.... కథ వింటున్న పల్లెవాసుల దుఃఖం మనసు లోతున మడుగు కట్టింది. బలుసులమ్మ గుడి దగ్గర చతికిలబడి వింటున్న దీనుల కళ్లల్లో జొటజొటా నీళ్లు తిరుగుతున్నాయి. అది...'కష్టజీవి' కన్నీటి ధార.

ఉద్రేకంగా పూనకం వచ్చినట్టు..ముందుకీ వెనుకకూ కదులుతూ...వాళ్ల పాదాల అందెల్లో రవళించు నాదం కొత్తగా ఉంది. ఆ కదలికల్లో లయవిన్యాసం ముచ్చటగా ఉంది. కథ ముగిసేవరకూ... రెప్పార్పకుండా ఆ బుర్రకథని ఆసక్తిగా చూస్తొన్న ఆ ముగ్గురు పిల్లగాళ్లూ..ఆ ఊరి కరణం బాపన్న గారి సుపుత్రులు.

**"తందానా.... దేవనందనాన"**

కథంతా ఐపోయాక ఇంటికొచ్చారు. కూడూ నీళ్లు సయింతలేదు. చెవుల్లో మ్రోగు తుమ్మెదలు... ఝుమ్మంటున్నాయి గుమ్మెటలు. గుండెలమీద వాలి కూస్తోంది తంబుర పిట్ట. బుర్రని తొల్చేసే కుమ్మరి పురుగు లాంటి రొద. పాడకపోతే ప్రాణాలు పోయేటట్టున్నాయి... వాళ్లు వాయించే బుర్రను ఇదివరకే జంగం వాళ్ల దగ్గర చాలాసార్లు చూశారు.

బుర్ర, అందెలూ, గుమ్మెటలూ అద్దెకు తెచ్చుకుని... కొబ్బరి తోటల్లో సాధనకి కూర్చున్నారు. గురువో మరి! ఊళ్లో కథ చెప్పడం చూశారు కదా! ఆ పాటల గురుతు ఉంది. రెండు మూడు బాణీలతో కథ చెప్పొచ్చని అప్పుడే అనుకున్నారు. నలగనిదే అడుగు ఎలా నటనరక్తి కడుతుంది! పాదాలు నలగాలి, కంఠ నరాలు కదలాలి, రాగం పాకాన్న పడాలి. ఎప్పుడూ ఈ పాటల గోలేనా! చదువో మరి అనంటే... నిజానికి ఆ ఊళ్లో బడి చదువంటే గొప్ప సాహసమే. తాణెల్లంక నుంచి ముమ్మిడివరం వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల మట్టిగట్టు. వానల కాలంలో మోకాళ్లలోతున లేస్తుంది బురద. ఇవతల వృద్ధగౌతమి ఏటిగట్టు. మధ్య ఎత్తైన కొబ్బరి తావుల మధ్యన ఊరు. బాపన్నగారికి పిల్లుల చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆశ. తనకి పదిమంది సంతు. ఐదుగురు ఆడపిల్లలూ, ఐదుగురు మగబిడ్డలు. రామకథంటే ఇష్టమేమో ఏడాదుల తేడాలో అరటి పిలకల్లా మొలచుకొచ్చిన పిల్లలకు రామాయణంలో పాత్రల పేర్లే పెట్టుకున్నారు. పెద్దోడికి శ్రీరామమూర్తి. తాతగారి పేరే! రెండో వాడికి లక్ష్మణరావు, మూడో వాడు భరతరావు, నాల్గో వాడికి శత్రుఘ్నురావు, ఆఖర్న పుట్టిన బిడ్డ.. హనుమంతరావు. ఐతే... ఈ ఐదుగుర్లో బుర్రకథవైపు మొగ్గింది ముగ్గురే!

లక్ష్మణరావు ప్రధాన కథకుడైతే... శత్రుఘ్నురావు, హనుమంతరావు వంతగాళ్లు. రాజకీయం, హాస్యం చెప్పే కథా సహకర్తలు. శత్రుఘ్నురావు, హనుమంతరావూ ఇద్దరూ ఏడాది తేడాతో పుట్టినా బడిలో ఒకే తరగతిలో చదువు. ముమ్మిడివరం బోర్డు స్కూల్లో... వార్షికోత్సవ వేడుకల కోసం సాంస్కృతిక కార్యక్రమాల కోసం పిల్లలను సమాయత్తం చేస్తుంటే... "మేం బుర్ర కథ చెబుతాం!" అని, నిలబడ్డారు ఇద్దరూను. ఈ పిల్లల ధైర్యానికి మురిసిపోయాడా పంతులు. చిట్టి భుజం మీద పెద్ద తంబుర. చిరుగజ్జెల చిందాట. 'బాపూజీ హత్య' పాడి సభికులను కరుణ రసాప్లావితం చేసేశారు. "ఎంత బాగా



నిట్టల బ్రదర్స్

పాడార్రా! " అంటూ దగ్గరకు తీసుకున్నాడా మాస్టారు. చప్పట్లతో నిండిపోయింది పాఠశాల ప్రాంగణమంతా. ఈ కళ ఇలా నాలుగు గోడల మధ్య మగ్గిపోకూడదు. నలుగురిమధ్యలో ప్రవహించాలి. ప్రజల మధ్య కొచ్చి పాడండి! అన్న ఆ గురువుగారి ఆశీర్వచనం అందుకొని, శ్రీరామనవమి పందిళ్లలోనూ, వినాయకచవితి వేదికల మీదకూ వచ్చి.. శారద నీరద వీణియ రాగ సుథతో రస సమంచిత కథలెన్నో చెప్పారు.

ముమ్మిడివరంలో చదువైపోయాక, మరి! పై చదువులకి వెళ్లాలంటే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే! ఒక ఏడాదిన్నర ఇంటిదగ్గరే ఖాళీగా ఉండిపోయారు. ఒకనాడు పెత్తండ్రి వరసైన ఒక పెద్దాయన చుట్టపు చూపుగా వచ్చి పిల్లలవైపు తేరి చూసి ఏమిట్రా మీరు చదువుకోవడం లేదేమీ? బట్టలు సర్దుకుని, నాతో రండని చెప్పి, పెద్దాపురం, అళక్కి వారి సత్రంలో వసతి ఏర్పాటు చేసి, ఆ ఊరి హైస్కూల్లో చేర్పించాడు. అలా..చదువు గాడిన పడింది. సెలవు రోజుల్లో బుర్రకథా కాలక్షేపానికి వీలు కుదిరింది. సరిగ్గా ఆ రోజుల్లో గోదావరికి అనుకుని ఉన్న ఉప్పలగుప్తంలో నాజర్ కథ చెప్తున్నాడని తెలిసి... వెళ్లి చూశారు.

**''రెట్టలు దట్టుచు అరేరేరేయని - మిట్టపడుచు వేగపోట్టిమీసములు పట్టిదువ్వి - కనుబొమలు మడియబట్టి పతాకత్తులూ కతారుబాకులు - తటాలునందుకొని పెలిల్లుమని కక్కటిల్లుచును - దిక్తటంబుల దరగను గండ్రగొడ్డండ్లు కత్తులు బాణా - కర్రలు చేబూని''**

కథ ఐపోయినంత వరకూ మౌనంగా విన్నారు.

నాజర్ గాన కౌశలానికి సమ్మోహితులయ్యారు. వారి గొంతులో నవరసాలూ జీవనాదాలై కొత్త జీవశక్తితో నింపెయ్యడంతో నిండైన అనుభవాన్ని నింపుకొని వచ్చారు. ఒక కథని గానరూపకంగా ఎలా మలచాలో, సందర్భానికి తగిన హాస్యం, రాజకీయం ఏది ఎంత మోతాదులో దట్టించాలో, ఎంచుకున్న కథాంశాన్ని ప్రజా పక్షం చెయ్యడంలో కిటుకులెన్నింటినో నాజర్ ద్వారా గ్రహించారు. అనుకరణ ఎల్లవేళలా అనుసరణీయం కాదు కాని, అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్న వారి కళాతృష్ణకి అది ఆలంబన అయ్యింది. 1948లో పూర్తిస్థాయి బుర్రకథా గానానికి శ్రీకారం చుట్టారు.

తొలి ప్రయత్నంగా పల్నాటి యుద్ధం కథా ప్రక్రియకి నగిషీలు చెక్కారు. ఇది! నాజర్ రూపుదిద్దినదే. ఐతే నిట్టల బ్రదర్స్ తమదైన శైలిలో గానం చేసేవారు. అలా..గోదావరి పరిసర ప్రాంతాల్లో విశేష ప్రేక్షకాదరణ పొందుతున్న సంగతి తెలుసుకున్న డా. గరికపాటి రాజారావు రాజమండ్రిలో అలాంటి కథొకటి చెప్పిద్దామని, నిట్టల బ్రదర్స్‌కి కబురు పంపారు. ఈ రాజారావు కమ్యూనిస్టు, పుట్టిల్లు సినిమా ప్రొడ్యూసర్. రాజమండ్రిలో జరిగిన కమ్యూనిస్టు సభలో నిట్టల బ్రదర్స్ సుంకర రాసిన సీతారామరాజు కథని గానం చేశారు.

**భళా భళానోయ్ తమ్ముడా సై / భాయి భళానోయ్ దాదానా సై / పైసకు గడ్డిని మేసెడి సై / పశువు జన్మమేమెత్తం సై చావుకు వెరువము తెలుసున? / జాగ్రత్తగ మాట్లాడాలి భళా / ముఠాదార్ల బెదరించుచూ సై / రైతుల గొంతులు కోయుచు సై / కూలీల పీకలు నొక్కుచు సై / కూడ బెట్టి ధనరాసులు సై / మేడలు గట్టగ దలచావ భళా / అధికారము, కంట్రాక్టులు సై / అన్నీ నీవే చేతువా సై / కూలికి రోడ్లను పోసిన సై / కూలినంత ద్రిగ మింగియు సై / చాలక నాపై కేసులు సై / చంపివేయగా తలచావా భళా'.** నిజానికి.. అల్లూరి వీరగాధ అడ్డూ అదుపూ లేని నాగుపాము నడకలాగా ఉంటుంది. ఉద్రేక పరుస్తుంది. ఒళ్లు గగుర్పొడుస్తుంది. వింటున్నంతసేపూ ఒకచోటు కుదురుగా ఉండనీదు. నిట్టల సోదరులు ఈ పాటని ఒళ్లు విరుచుకుని మరీ పాడేవారు

ఆ సభకి అతిథిగా వచ్చిన నాజర్ మొదటిసారి నిట్టల గానాన్ని విని, మీకు చక్కని భవిష్యత్తు ఉంది. కొనసాగించండి! అని దీవించారు. ఆరోజుల్లో ఒక సిద్ధాంతం ప్రజల్లోకి తీసుకువెళ్ళాలంటే కళారూపాలు అవసరం కాబట్టి, కళాకారులుగా కమ్యూనిస్టులు బుర్రకథని ఉపయోగించు కున్నారు. అలా నిట్టల బ్రదర్స్ తమ గానాన్ని ప్రజోపయోగం కోసం వెచ్చించారు. పాలకొల్లులో, ఒక కాలేజీ వార్షికోత్సవ సందర్భంలో.. సీతారామరాజు బుర్రకథ చెబుతున్నప్పుడు.. సినీ దర్శకుడు, దాసరి నారాయణరావు ప్రభావితుడై 'ఒరేయ్ రిక్షా!' చిత్రంలో ఒక పాట చిత్రీకరణలో నిట్టల

బుర్రకథకి అవకాశమిచ్చాడు. ఆ కాలంలో గోదావరి ప్రాంతాల్లో అప్పుడప్పుడు కరవు తచ్చాడుతూ ఉండేది. వర్షాలు పడక పంటలు ఎండిపోతుండేవి. కప్పలకి పెళ్లిళ్లు చేసిన కూడా వరుణుడు కరుణించలేదు. ఏం చేద్దాం అనంటే... ఉత్తర గోగ్రహణం కథ చెబుదామనుకున్నారు. ధేనువుకొండ వెంకయ్య రాసిన విరాటపర్వం తెచ్చుకుని, లఘుమాత్రంగా మార్పులూ చేర్పులూ చేసి, సమీప గ్రామాల్లో ప్రదర్శించారు. ఆ ఏడు విస్తారంగా వానలు పడ్డాయి.

స్వాతంత్ర్యానంతర భారతంలో ప్రజా జీవనం మరీ దిగజారింది. వరదలూ, కరవు కాటకాలకు సగటుజీవి కుదేలైపోయాడు. ప్రభుత్వ సాయం, కరవు భత్యం ప్రజలకు దక్కనియ్యకుండా అధికారులు దోచేశారు. ప్రజాకళలపై నిషేద వేటు పడింది. ప్రశాంతంగా సాగే గోదారి ప్రజా జీవితం ఆకలి బాధతో విలవిల్లాడింది. పౌరాణికాలు పాడుతున్నా, వీరగాథలతో అలరిస్తున్న... సంతృప్తి కలగడంలేదు. సాటి మనిషి గుండెలోకి చూడాలి. వాళ్ల దుఃఖాన్ని తడమాలి. అలా...ప్రజావేదనని గానం చేస్తేనే కళకు ప్రయోజనమనుకుని నిట్టల బ్రదర్స్ 'ఆగష్టు 15 పాట' కట్టారు. తణుకులో ఒక రాజకీయ పార్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా పుట్టిన ఈ పాట ఆ తర్వాత్తర్వాత సమకాలీన సాంఘిక సమస్యలను కూడా కలుపుకుని విస్తృతిని పొందింది. స్వాతంత్ర్యమొచ్చాక మనదేశం ఎలా తయారయ్యిందయ్యా అంటే.....

**ఆగష్టు 15 తందాన / అది సుదినమన్నారు తందాన / స్వాతంత్ర్యమన్నారూ.. స్వరాజ్యమన్నారు.. / గాంధీ చెప్పినమాట గంగలో కలిపారు**

అధిక ధరలు, పన్నులు, అధికారుల అక్రమార్జన, బ్లాక్ మార్కెట్, వరకట్న దురాచారం... ఇలా... ప్రజాభ్యుదయం పొడగిట్టని చీకటి గబ్బిలాల కుటిల పాలకులకు దబ్బనంలా గుచ్చుకున్న ఈ పాటకి అఖిలాంధ్రలోకం బ్రహ్మరథం పట్టింది. దేశంలో వివిధ ప్రాంతాలనుంచి ఆహ్వానాలు అందుతున్నాయి. ఉద్యోగం విడిచిపెట్టి నెల్లాళ్ల పాటు కథాగానంతో కాలక్షేపం చేసే పరిస్థితి లేదు. చేస్తున్నవి ప్రభుత్వ ఉద్యోగాలు. రాత్రివేళ కథ చెప్పి, పొద్దున్నే బడిలో ఉండాలి. కొత్త కథలు సమకూర్చుకునేందుకు సమయం చిక్కేది కాదు. సమయాభావం వల్ల సబ్జెక్టు తక్కువ చెప్పినా... తమ దగ్గరున్న కథలతోనే ఎక్కువ ప్రదర్శనలిచ్చారు. డిల్లీ, ప్రగతి మైదాన్‌లో పాడినప్పుడే నిట్టల బ్రదర్స్ గాన కౌశలం దేశానికి తెలిసింది. 'రామాలయం, ఒరేయరిక్షా!' వంటి.. సినిమాలతో అశేష ప్రేక్షకాదరణ పొందారు. ఆంధ్రోద్యమంలో భాగంగా వివిధ ప్రాంతాలు పర్యటించి ఆంధ్ర పౌరుషాన్ని గానం చేశారు. కాకినాడలో ఎస్.టి. జ్ఞానానంద కవి చేతుల మీదుగా సన్మాన పత్రాన్నందుకున్నారు. పెనుగొండ వేమన ఉత్సవాల్లో విశిష్ట పురస్కారం, పాలకొల్లులో గౌరవ సన్మానం, అమలాపురం దేవి ఉత్సవాల్లో ఏటా ప్రశంసా పూర్వక మన్ననలందుకుంటూ గోదావరి ఔన్నత్యాన్నికి కీర్తి తోరణాలు కట్టారు. వీరి బృందంలో రాజకీయం చెప్పే శత్రుఘ్నరావు మైసూరు, శ్రీ గణపతి సత్యదానంద స్వామిజీ ఆశ్రమంలో ఆస్థాన విద్వాంసుడవ్వడంతో... వీరి బుర్రకథా గానానికి శాశ్వతంగా తెరపడింది. 1973లో అంటే తన డెబ్బై మూడో ఏట లక్ష్మణరావు మరణించారు. మరో పదేళ్లకు శత్రుఘ్నరావు తనువు చాలించారు.

నిట్టల బ్రదర్స్..ఆధునిక కళా జగత్తుకి ఆద్యబ్రహ్మలు కాదు. బుర్రకథలకు సృష్టి కర్తలు కాదు. ప్రచార కర్తలంతే! నాజర్‌ని అనుకరించారు. సుంకర కథలను పల్లెపట్టుల్లో వినిపించారు. నాజర్ సృష్టించిన పల్నాటి పోరు కథని గుండెతో ఆలపించారు. తమకుతామే కథ రాసుకుని, స్వరాలు కట్టుకుని పాడే వాగ్గేయకారులు కాకపోవచ్చు గానీ... ఇతరులు కథలకు ప్రచారవాహికగా... ఊరూరు తిరుగుతూ వందలకొద్దీ ప్రదర్శనలివ్వడం సామాన్య విషయం కాదు. అలా గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు అనేక సాంఘిక సమస్యలూ, ప్రజల ఇక్కట్లు, బీదల కన్నీళ్లూ చూసి 'ఆగష్టు 15 పాట' ద్వారా ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపారు. సున్నితమైన హాస్యంతో, చురకత్తుల్లాంటి చమత్కారాలతో అలరించారు. నిట్టల సోదరులు కొత్తగా ఏం చెప్పారూ అనంటే ఒక సంస్కర్త హోదాలో సమాజాన్ని చక్కపెట్టారు. నాటి కళా విభవానికి సాక్షిగా, ఎనిమిది వేల ప్రదర్శనలతో అర్ధ శతాబ్దికి పైగా విలసిల్లిన తమ బుర్రకథా వైభవానికి స్మరణగా నాటి నిట్టల బ్రదర్స్‌లో ఒకరైన హనుమంతరావు గతి తప్పిన బుర్రకథా గమనాన్ని గూర్చి మాట్లాడుతూ...సాంఘిక విలువల వల్లనే బుర్రకథ బతికింది. ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం బుర్రకథా దళాలు వెళ్లిపోయినప్పుడే దాని జీవితం కొడిగట్టిందంటూ నిట్టూర్చారు. ఒక కాలపు అద్భుత గానం చరిత్రకెక్కకుండా ఖిలమైపోయింది. వృద్ధగౌతమిలో లయమైపోయింది. ఎక్కడ పుట్టి, ఎక్కడ పెరిగి, ఎవరి అవసరాల కోసం జీవించిందో వాళ్లతోనే విశ్రమించింది. ఒక రసయాత్ర అర్ధాంతరంగా ఆగిపోయింది.

కన్నిడి మనోహర్
రచయిత, జర్నలిస్ట్,
పేేరు, కోనసీమ, ఫోన్ : 9494044429

# కురివికుళం సంస్థానం
# పెమ్మసాని వారి ప్రస్థానం

– డా. సగిలి సుధారాణి



కురివికుళం సంస్థానం

ఒకప్పుడు దక్షిణాపథాన వైభవోపేతంగా వెలిగిన సంస్థానం కురువికుళం. దక్షిణ తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలోఉన్నది. దీనికి సంస్థానాధీశులుగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు పెమ్మసానివారు పాలించారు. నాటి విజయనగర సామ్రాజ్యం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఒరిస్సాలోని కటక్ నుండి శ్రీలంక వరకు వ్యాపించడానికి కారణం గండికోట వారి సైనికాధిపత్యమే అంటే ఎటువంటి సందేహంలేదు. విజయనగర సంస్థానాధీశులకు పెమ్మసాని, రావెళ్ళ మొదలైన ఇంటిపేర్లు గలవారు సైనాధిపతులుగా ఉండేవారు. వీరు సైనికపరంగా విజయనగర రాజులకు అండదండగా ఉంటూ ఎన్నో విజయాలను సాధించి పెట్టారు. అందుకే వారిని గండికోటకు సామంతులుగా రాయలు నియమించాడు. సుమారు 200. సం. పెమ్మసాని వంశీకులు గండికోట రాజధానిగా చేసుకొని పరిపాలించినట్లు మనకు చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. ఆవిధంగా గండికోట సంస్థానానికి సామంతులుగా ఒక్కవెలుగు వెలిగారు.

తళ్ళికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం పతనమైన తరువాత పరాయి పాలకులు అదను చూసుకొని సంస్థానాలపై కూడా దండెత్తారు. పరాయి పాలకుల దండయాత్రలు, ప్రతికూల పరిస్థితుల వలన ఈ సంస్థానాదీశులు దక్షిణాది బాట పట్టారు. మధుర, తిరుచ్చి ప్రాంతాలను పరిపాలించే విశ్వనాథ నాయకుడు పెమ్మసాని వారితోపాటు వారి బంధువర్గాన్ని, వివిధ వర్గాల వారిని సాదరంగా ఆదరించాడు. వారిని విరుదునగర్, తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాలలోని కొన్ని ప్రాంతాలకు సంస్థానాధీశులుగా నియమించాడు. ముఖ్యంగా 'ఇళయరస నేందల్' సంస్థానానికి రావెళ్ళవారిని, 'కురివికుళం' సంస్థానానికి పెమ్మసాని వారిని సంస్థానాధీశులుగా నియమించారు. అలా దక్షిణాపథంలోని తిరునెల్వేలి జిల్లా కురువికుళం సంస్థానాధీశులుగా స్థిరపడినవారు పెమ్మసానివారు. ఈవిధంగా విశ్వనాథనాయకుని పాలనకింది పలు సంస్థానాల పాలకులంతా తెలుగువారే కావడం విశేషం.

**కురువికుళం సంస్థానం చారిత్రక మూలాలు :** ఉన్నతమైన సేవా భావన కలిగిన పెమ్మసానివారు శతాబ్దాల క్రితం నుండే తుంగభద్ర తీర ప్రాంతం నుండి వలస వచ్చి, విజయనగర సామ్రాజ్యంలో శ్రీ కృష్ణదేవరాయల కాలంలో గౌరవనీయ స్థానం సంపాదించారు. రాయలవారికి వీరు ప్రధాన సేనాధిపతులుగా సేవలందించారు.

పెమ్మసాని వారిలో ప్రధాన సేనాధిపతి పెద్దితిమ్మ నాయుడు ప్రసిద్ధులు. ఆయన గొల్లపూడి, శివగొట్టికి సమీపంలో ఉన్న ప్రాంతాలను నియంత్రించేవారు. వీరి ఆదాయము సంవత్సరానికి 9 లక్షల రూ.లు ఉండేది. అందులో 24,000 రూ.లు శిస్తుఖజానాకు ఖరారుగా చెల్లించేవారు. ఆయన 25,000 సేనలతో కూడిన గజబలాన్ని కలిగి ఉండేవారు. పెద్దితిమ్మ నాయుడుతో పాటు వారి వంశంవారు విజయనగర రాజ్యానికి పెద్ద ఎత్తున సేవలందించారు. ఆ కాలంలో ఈ కుటుంబం బడుగు, బలహీన వర్గాలకు అండదండగా నిలిచింది. ఈనాటి కురువికుళం పెమ్మసాని వారంతా ఆయన వారసులే!

రాజ్యంలో సంస్కరణలు చేపట్టడంలోను, అత్యవసర సమయంలో రాజుకు తిమ్మప్ప నాయుడు సలహాలు ఇవ్వడంలో కూడా ప్రముఖపాత్ర వహించేవారు. ప్రజలు కూడా వారిని ఎంతో గౌరవించారు. మహ్మదీయ పాలకుల దాడులను తిమ్మప్ప నాయుడి సైన్యం తట్టుకోలేకపోయింది. పరిస్థితి క్లిష్టతరంగా మారడాన్ని గ్రహించి దక్షిణాపథానికి వలస వెళ్లడానికి నిర్ణయించుకొన్నారు. తిమ్మప్ప నాయుడు వారసుడు పెద్ద వీరప్ప నాయుడు మధుర రాజైన విశ్వనాథ నాయకుడిని కలిశాడు. అప్పటికే పెమ్మసానివారి గొప్పతనం గురించి విన్న విశ్వనాథ నాయకుడు, గండికోటను

శాంతియుతంగా పాలించిన వారి ప్రతిభను గుర్తెరిగినవాడే! అట్టివారు నేడు శత్రువుల దాడులతో బలహీనపడ్డారని గ్రహించి పెద్ద వీరప్ప నాయుడుకి 'కురువికుళం' అనే సంస్థానాన్ని అప్పజెప్పాడు. అయితేపెద్ద వీరప్ప నాయుడు కురువికుళంకు వెళ్లినప్పుడు, అక్కడ అప్పటికే తిష్టవేసి అధికారం చెలాయిస్తున్న బందిపోటు దొంగ 'కురువి తలైవన్' అతడిని లోనికి అనుమతించలేదు. దీంతో ఇరువురి మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. చివరకు కురువి తలైవన్ మరణించగా, పెద్ద వీరప్ప నాయకుడిని విజయం వరించింది. మధుర మరియు తిరుచిరాపల్లి రాజుకి మంత్రి విజయ మీనాక్షి నాయుడు గారు పెమ్మసాని కుటుంబం గురించి ఈ క్రింది ప్రకటనను ఈస్ట్ ఇండియా కంపెనీకి రాశారు.

*"రాయల పరిపాలన సమయంలో పెమ్మసాని కుటుంబ పూర్వీకులు గండికోట పాలకులుగా ఉన్నారు. ఆ ప్రాంతం పతనం కావడంతో వారు మా అధీనంలోని ప్రాంతాలకు వచ్చారు. మధుర రాజైన విశ్వనాథ నాయకుడు వారికి 'కురువికుళం' అనే జాగీర్‌ను అప్పగించాడు. మధుర రాజు రాజ్యాధికార పరిధిలోకి వచ్చే ఇతర పాళెగార్లు (పాళయగార్లు) రాజుని కలిసేటప్పుడు, వెండితో మరియు బంగారంతో తయారైన పూలతో, పట్టు వస్త్రాలతో రాజు ముందు మోకాళ్లపై వాలి నమస్కరించేవారు. తరువాత కొంత దూరంలో చేతులు జోడించి నిలబడేవారు. కాని, పెమ్మసాని వారిని పరిచయం చేసినప్పుడు, రాజు వారిని గౌరవంగా ఆహ్వానించి, కరచాలనం చేసి వారిని తమతో పాటు సమాన స్థానం కలిగిన వారిగా పరిగణించి ఆదరించేవాడు."*

కుటుంబ పత్రములు (రికార్డులు) ప్రకారం, పెమ్మసాని పెద్ద వీరప్ప నాయుడు ఈస్ట్ ఇండియా కంపెనీ పక్షాన పాంచాళంకురిచ్చిపై విజయం సాధించడానికి సహాయపడ్డాడు. అలాగే మలబారు దేశంమీద యుద్ధంలో ముఖ్యపాత్ర వహించి దానిని స్వాధీనం చేసుకొని, మధుర, తిరుచిరాపల్లి రాజైన ముద్దు వీరప్ప నాయుడుకి ఆ ప్రాంతాన్ని తిరిగి అప్పగించి, వారి సహాయాన్ని కోరారు. మహమ్మదీయ పాలకులు, మధుర, చుట్టుపక్కల ప్రాంతాలను జయించిన తర్వాత కురువికుళం జాగీర్‌ను పేష్కష్ (పన్ను) చెల్లించే 'జమీందారీ'గా మార్చారు. వారికి ఫర్మానా కూడా జారీ చేశారు. శాశ్వత భూపరిష్కార విధానం అమలులోకి వచ్చినప్పుడు, బ్రిటిష్ ప్రభుత్వం కురువికుళంను జమీందారీగా గుర్తించింది.



కొండలరాయస్వామి నాయుడు

22వ తరం శ్రీ తిమ్మ నందయస్వామి నాయుడు జమీందార్ కొంతకాలం కురివికుళం సంస్థానాన్ని పరిపాలించారు. వీరి వారసుడుగా శ్రీ పెమ్మసాని కొండలరాయ స్వామి నాయుడు 1878లో జన్మించారు. వారు ఇంటివద్దనే ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. తరువాత తిన్నెవెల్లి హిందూ కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసించారు. తండ్రి నందయస్వామి నాయుడుగారు ఆధ్యాత్మిక చింతన మార్గంలో నడవడం మూలంగా పదమూడేళ్ల వయస్సున్న తన కుమారుడు కొండలరాయ స్వామి జమీందారీ బాధ్యతలు అప్పజెప్పారు. వీరు తాలూకా మరియు జిల్లా బోర్డుల సభ్యుడిగా కూడా ఉన్నారు, ఈ రెండు బాధ్యతల్లోనూ తమప్రాంత ప్రజల ఆశలను నెరవేర్చేలా విశేష కృషి చేశారు. కురువికుళం ప్రాంత యూనియన్ స్థాపించబడినప్పుడు ప్రభుత్వం ఆయనను చైర్మన్‌గా నియమించింది. జమీందారు గారు తన ఎస్టేట్ పరిపాలనలో తగిన అనుభవాన్ని సంపాదించారు. అధికారులందరూ కూడా ఆయన పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కురువికుళ పట్టణ నిర్వహణను శుభ్రంగా, క్రమబద్ధీకరించడం మూలంగా ఆంగ్లేయ అధికారుల నుండి ఆయనకు ప్రశంసలు లభించాయి. శ్రీ నందస్వామిదురై కొండలరాయస్వామి నాయుడు గారు తెలుగు సంస్కృత భాషలలో నిష్ణాతుడు. ఈయన అనేక గుడులు, ధర్మశాలలు మరియు ఇతర ఉపయోగకరమైన సంస్థల నిర్మాణంకోసం మూడున్నర లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. ఆయన కాలంలో కురువికుళం ప్రాంతంలో రహదారులు నిర్మించబడ్డాయి. యాత్రికుల ప్రయాణికుల కోసం ఆయన ఒకచౌల్ట్రీ (సత్రం) కూడా నిర్మించారు. ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు చాలా కృషి చేశారు. దీని మూలంగా అధికారులందరిలో ఆయనకు మంచి పేరు వచ్చింది. పేదలకు చేసిన దానాలను గుర్తించడమే గాక, బ్రిటిష్ సామ్రాజ్యానికి చూపిన విధేయతకు గుర్తింపుగా,

కురువికుళంకు చెందినకొండలరాయసామి నాయుడు గారికి, ఢిల్లీ ఇంపీరియల్ అసెంబ్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా గౌరవపత్రంను అందజేశారు.

**పత్రంలోని సారాంశం :** "*వైస్రాయ్ మరియు గవర్నర్ జనరల్గారి ఆదేశాల మేరకు, ఈ గౌరవ పత్రాన్ని బ్రిటిష్ సామ్రాజ్యపు మహారాణి విక్టోరియాగారి పేరున, కురువికుళంకి చెందిన కట్టుగుత్తదారు నందసామిదురై కుమారుడు కొండల్ రాయసామి నాయకరు అందజేస్తున్నాము. ఇది ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి చూపిన విశ్వాసానికి మరియు పేదల పట్ల చేసిన దానకృషికి గుర్తింపుగా ఇచ్చిన గౌరవము*–**బక్కింగ్‌హామ్&చాందోస్, జనవరి 1, 1877**

ప్రిన్స్ మరియు ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ భారతదేశానికి విచ్చేసిన సందర్భంగా, కార్మికవర్గాలకోసం శ్రీ పెమ్మసాని కొండలరాయస్వామినాయుడు రాత్రిపాఠశాలను స్థాపించారు. అందులో విద్యార్థులకు ఉచితంగా విద్యను బోధించేవారు. పెమ్మసాని కొండలరాయస్వామి నాయుడు తెలుగు భాషలోనేగాక, ఉత్తమ తమిళ పండితులు! అలాగే సంస్కృత భాషలో కూడా పరిజ్ఞానం కలిగి ఉన్నారు. ఆయన ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలరు, రాయగలరు. మృదుస్వభావి, వినయశీలుడు, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించేవారు. తన మిత్రులపట్ల దయార్ద్రతతో ఉండేవారు. ఆయన ప్రవర్తనలోనూ, స్వభావంలోనూ ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం గలవాడిగా పేరు పొందారు. అందుకే ప్రభుత్వాధికారులు మరియు చుట్టుపక్కల జమీందారులు ఆయనను 'మోడల్ నోబుల్‌మాన్'గా పేర్కొంటారు.

**కురివికుళ సంస్థానం నేడు అగ్గిపెట్టల గోడోన్!:** "ఘనమైన చరిత్రను పదిలంగా పునాదుల్లో పదిల పరచుకొంది కురివికుళ సంస్థానం. ఒకప్పటి పెమ్మసాని వారి సంస్థానానికి గుర్తుగా మిగిలి అలనాటి ప్రాభవానికి నిదర్శనంగా ఉన్న భవనం నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొంది. అగ్గిపెట్టల తయారీ వ్యాపారులు తమ సరుకులను నిలువచేసుకొనేందుకే అలనాటి కురువికుళం రాజభవనం ఉపయోగించుకోవడం భాధాకరమైన విషయం! కాలమహిమ!

ప్రస్తుతం కురివికుళంలో మాజీ సంస్థానాధీశుల వారసులు ఎవరూ  అక్కడ లేరు. అందరూ వేరువేరు ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఆ సంస్థానానికి సమీపంలో ఉన్న ఎనభై సంవత్సరాలు పైబడిన ఒక పెద్దామెను పలకరిస్తే, నాపేరు మారెమ్మ. *మాది కురివికుళం సంస్థానం, మా పరంపర (ఇంటిపేరు)* పెమ్మసాని. *మా పూర్వీకులు గండికోటనుంచి జమీన్‌దారుగా వచ్చి ఇక్కడ పరిపాలన చేసినారు. ఇక్కడ కోవెల కూడా కట్టినారు* అని చెప్పారు. ప్రస్తుతం ఆమె కూడా జీవించిలేరు.

**కురివికుళం వారసుల జాడ :** కురివికుళం సంస్థానం చివరి పాలకుడైన పెమ్మసాని కొండలరాయుడి రామస్వామి నాయుడి ఏకైక కుమార్తె పెమ్మసాని రాజేశ్వరిగారు చివరి వారసురాలు. రాజేశ్వరీ దేవికి చిన్నవయస్సులోనే కృష్ణా జిల్లాకి చెందిన అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యంతో వివాహం జరిగింది. దీనితో ఆమె కృష్ణాజిల్లాలో మెట్టినింట అడుగు పెట్టారు. వారి కుమారుడు ఈశ్వరప్రసాద్. వీరి కుమార్తె మాగంటిరూప. సినీరంగ ప్రముఖులు, మాజీ ఎం.పి. మురళీమోహన్ గారి కోడలు. రూపగారితో నేను ముఖాముఖి జరిపినపుడు "*మా నాయనమ్మ రాజేశ్వరీ దేవి శ్రీ పెమ్మసాని కొండలరాయస్వామి నాయుడుగారికి ఏకైక సంతానం కావడం మూలంగా ఈ పక్కలో (తెలుగునాట) అత్తగారింట్లో అడుగు పెట్టడంతో ఇక్కడే ఉండిపోయారు. అక్కడ ఉన్న (పుట్టినిల్లు–కురివికుళం సంస్థానం) ఆస్తులపై దృష్టి పెట్టలేదు. నాయనమ్మ వాళ్ళ నాన్నగారు ఆరోజుల్లో పగలు పనిచేసే వారికోసం రాత్రిబడి మొదలు పెట్టారు. అలా నడిచిన సంస్థానం నేడు దయనీయ స్థితిలో ఉండటం టి.వి మాధ్యమ ప్రసారం ద్వారా మీరు చూపిన కథనం చూసి మా ముగ్గురం అక్కాచెల్లెళ్ళం కంటనీరు పెట్టుకొన్నాం. మా చిన్నప్పుడు ఆ భవనాన్ని (కురివికుళ సంస్థానం) చూసినట్లు గుర్తు! అమ్మవారి ఉత్సవాలకు నాయనమ్మ బ్రతికి ఉన్న రోజులలో వెళ్ళేవాళ్ళం. మమ్మల్ని చూస్తూనే వారు ఆప్యాయంగా పలకరించేవారు. బాగుండారా! కూడు తింటారా! నాయన ఎలా ఉండారు....... ఇలా వారి తెలుగు అందంగా సాగిపోతుంద*'ని చెప్పారు.

**రాజుల ఆస్తులు రాళ్ళపాలు! :** నాయనమ్మ చనిపోయిన 20.సం.లలో ఒక్కసారి కూడా మేము కురివికుళం సంస్థానానికి వెళ్ళలేదు. ఆమె బతికి ఉన్నప్పుడే ఆ స్థలాన్ని, భవంతిని కబ్జా చేసేశారు. ఆ కేసు విషయమై ఆమె ఎన్నో సంవత్సరాలపాటు పోరాడారు. కానీ ఆమెకు వీలుకాలేదు "రాజుల ఆస్థులు రాళ్ళపాలు" అని అంటారు. మా నాయనమ్మ విషయంలో అది నిజమైందని చెప్పారు. ఆమె దానికి వారసురాలైనా పోరాడటానికి ఆమె జీవితకాలం సరిపోలేదు. మా వల్ల ఏమవుతుందని వదిలేశామని నిర్లిప్తతతో రూపగారు చెప్పారు.

**డా. సగిలి సుధారాణి**
పరిశోధకురాలు, హైదరాబాద్, ఫోన్ : 9490428825

# కన్నీరు

**– శ్రీరామ్**

ఏమిటి చిరునవ్వు?

– అదొక వరం, భగవంతుని ప్రత్యక్షానికి సాక్ష్యం.

ఏమిటి కన్నీరు?

–అదొక శాపం, భగవంతుని పరోక్షానికి సాక్ష్యం.

ఈ ప్రశ్నలూ, సమాధానాలూ రెండూ నన్ను తికమకపెట్టేవి, మంత్రముగ్ధమూ చేసేవి. కన్నీళ్లు మనల్ని కలత పెడతాయి, చిరునవ్వులు సంతోషభరితం చేస్తాయి. ఆ రెంటి సంబంధాన్ని కనిపెట్టడానికి మనిషి అనాదిగా అవిశ్రాంతంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కన్నీళ్లూ, చిరునవ్వుల గురించిన ప్రశ్నలు అత్యుత్తమ మానవ మస్తిష్కాలను సైతం నిరంతరాయంగా విస్తుగొలుపుతూనే ఉన్నాయి. వాటి సమాధానాలపై కొందరు చిరునవ్వులు చిందించి ఊరుకుంటారు, కొందరు ధారాపాతంగా కన్నీళ్లు కురిపిస్తారు. ఇంకా కొందరైతే, వీచే గాలిని బట్టి తమ ఆకృతులను మార్చుకునే మేఘాల్లా, జీవితంలో తమకెదురయ్యే రకరకాల అనుభవాలను బట్టి పదే పదే తమ సమాధానాలను సవరించుకుంటూ ఉంటారు. కన్నీటికీ, చిరునవ్వుకీ ఉన్న మోసపూరిత సంబంధమనే చిక్కుముడిని విప్పడానికి అసంఖ్యాక ప్రయత్నాలు జరుగుతూనే వచ్చాయి. కానీ అది ఏ ప్రయత్నాలకూ చలించకుండా జిబ్రాల్టర్ శిలలా ఉండిపోతూనే ఉంది. ఇప్పటికీ అది అనేక వివరణలకు అవకాశమిచ్చే మోనాలిసా చిరునవ్వులానే మిగిలిపోయింది. ఈ సమస్యకు అంతిమ పరిష్కారం ఇప్పటికీ సుదూరస్వప్నమే అయింది. కన్నీళ్లు, చిరునవ్వుల గురించిన ఈ ప్రశ్నలు నా మీద అదేపనిగా దాడి చేస్తూ, నా అంతఃకరణ లోలోతుల్లోకి ఇంకిపోయాయి. మన సాధారణ ఊహలకు అందని ఈ చిక్కుముడిని విప్పడానికి నేను ప్రయత్నించినప్పుడల్లా వాటి మోసపూరిత శక్తి నా తెలివిని అధిగమిస్తూనేవచ్చింది, దాంతో నా ఆలోచనా ప్రక్రియ కాస్తా దారి తప్పేసి, నన్ను తప్పుడు నిర్ధారణలవైపు విజయవంతంగా నడిపిస్తూవచ్చింది.

ఈ ప్రశ్నల పిడికిట్లో నిస్సహాయంగా చిక్కుకున్నానన్న సంగతిని గమనించిన నేను, ప్రశ్నించడమే మానుకున్నాను. నా హృదయాంతరాలలోని అలజడీ, ఆర్భాటం క్రమంగా సద్దుమణిగాయి. ఒకింత ఉపశమనమూ చెందాను. సమాధానం కనుగొనే ప్రయత్నమే చేయకపోవడం నాకు ఇంత ఓదార్పునిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. నిజంగా తెలివైనవాడంటే, తగిన సమాధానాలిచ్చేవాడు కాదనీ, తగిన ప్రశ్నలు వేసేవాడనీ అంటారు. దాంతో, అంతుబట్టని ఆ ప్రశ్నలకు సమాధానం కనుగొనే ప్రయత్నం మానేసి నావైన కొన్ని ప్రశ్నలతో వాటిని ఎదుర్కోడానికి ద్విగుణీకృత ఉత్సుకతతో నాలో నేనే నిర్ణయించుకున్నాను. ముందుగా, అతిముఖ్యంగా నేను వేసుకున్న ప్రశ్న: భగవంతుడు



వివేకవంతుడు కాడా?... పోనీ తగినంత వివేకవంతుడు కాడా? నన్ను మించిన వివేకవంతుడు కాడా? మనందరి కన్నా కూడా వివేకవంతుడు కాడా? భవిష్యత్తులో వివేకవంతులు కాగలిగినవారందరికన్నా కూడా వివేకవంతుడు కాడా? ఆపైన, భగవంతుడు నిజంగా నన్ను ప్రేమిస్తాడా? అందరికన్నా కూడా ఎక్కువగా నన్ను ప్రేమిస్తాడా? నా తల్లిదండ్రుల కన్నా కూడా ప్రేమిస్తాడా? ఇలాంటి ప్రశ్నల పరంపర నా హృదయాన్ని గుచ్చింది. ఫలితమే 'హసిత బాష్పా'లనే ఈ పద్దెనిమిది కవితల కవితాత్మక ఆవిష్కారం.

అశ్రుకణం! ఎంత అందమైన పేరు! ఆ మాట ఉచ్చరిస్తే చాలు, నా పెదవులు పరిశుద్ధమైపోతాయి. ఆ మాట నా హృదయంలో ఎంతటి శాంతిని నింపిందో, వడగట్టిన ఎంతటి జ్ఞానాన్ని నా మెదడులో రంగరించిందో, దాని ఒడిలో అత్యంత కఠోరజీవన పాఠాలను ఎన్ని నేర్చానో, ఎన్ని నిగూఢ విశ్వరహస్యాలను అది నా అంతః కర్ణాలలో ఊదిందో ఎవరికీ తెలియదు. దాని స్పర్శ ఎంత మృదువుగా ఉంటుంది, ఎంత ఉపశాంతినిస్తుంది, దాని పాటలు ఎంత శ్రవణపేయంగా ఉంటాయి! అది నా పెదవులపై ఎన్నెన్ని వాడిపోని చిరునవ్వులు పూయిస్తుంది, నా హృదయపు చీకటిగుహల్లోకి అంతమెరుగని కాంతిని ప్రసరింపజేస్తుంది! నా వెన్ను పొడవునా విలక్షణమైన, తిరిగి మామూలు స్థితికి రాలేని, ఎంతటి అవ్యక్తపారవశ్యాన్ని ప్రవహింపజేస్తుంది! నాకు పిచ్చిపట్టిందనుకుంటున్నారా? అనుకోవాల్సిందే! అనుకోకపోతే, పై పంక్తులు మీరు చదవలేదని అర్థం. ఇంతవరకు నేను భగవంతుడు పిచ్చివాడనే భ్రమలో ఉన్నాను. కానీ, ఇప్పుడు నాకు తెలుసు, నేనే పిచ్చివాణ్ణి, భగవంతుడు కాదు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పైపైన చూస్తూ, మధ్యమధ్య మన జీవితంలోకి లోతుగా తొంగి చూసుకున్నా, భగవంతుని ఉనికికి నిక్కమైన సాక్ష్యం దొరుకుతుంది. ఇన్ని రోజులూ ఆయన నా సమీపంలోనే ఉన్నా, ఆయనను దర్శించడానికి దూరపు చూపు లోపించిన నా కళ్ళకు తగిన కళ్ళద్దాలు కరవయ్యాయి. ఇన్ని రోజులూ ఆయన అవ్యాజప్రేమ అనే దివ్యవర్షంలో స్నానమాడుతూనే ఉన్నాను, కానీ అలసిపోయిన నా నరాలు నిరవధికమైన ఆయన కృపావైభవాలను అందుకోలేక పోయాయి. విస్తుగొలిపే ఆయన వివేకమూ, సంభ్రమాశ్చర్యాలు కలిగించే ఆయన అవ్యాజప్రేమా నన్ను నిర్మల నిశ్శబ్దంలోకి నెట్టి, ఏకాంతమనే ఆనందధామంలోకి విసిరేశాయి.

కన్నీళ్లు, చిరునవ్వులు; జననమరణాలు; మంచి, చెడులు; ఉదయాస్తమయాలు, రాత్రీ, పగలూ పరస్పర వ్యతిరేకాలు కావు. మనం అపార్థం చేసుకునే పరస్పర పర్యాయపదాలు; పైకి మాత్రమే కనిపించే వ్యతిరేకార్థకాలు. అవి పరస్పర విరుద్ధార్థకాలు కావు, పరస్పరపూరకాలు. నిజానికవి ఒకదానినొకటి పరిపోషించు కుంటాయి, ఒకదాని సమక్షాన్ని ఒకటి ఆనందిస్తాయి, ఒకదానితో ఒకటి కరచాలనం చేసుకుంటాయి, ఒకదానినొకటి ఆలింగనం చేసుకుంటాయి, అంతిమంగా ఆనందభరిత జీవన నృత్యంలో సంతోషభరితంగా ఒకదానితో ఒకటి కలసిపోయి కరిగిపోతాయి. కన్నీళ్లు, చిరునవ్వులు ఒకదానినొకటి విడిచి ఉండలేవు. మనం ఎప్పుడైతే కన్నీళ్లను తిరస్కరిస్తామో, చిరునవ్వులను కూడా తిరస్కరించినట్టే. ద్వంద్వాత్మకమైన వాటి పరస్పరాధారాన్ని ఎవరూ విడదీయలేరు.

తల్లి పురిటి నొప్పులనుంచి పుట్టే శిశువు, మరోచోట, మరో సమయంలో మృత్యుహింసతో సమాధిగతమవుతున్న మరో శిశువుకు పర్యవసానమే. నేటి తల్లి పొందే అనిర్వచనీయానందం, నిన్నటి తల్లి పొందే కడుపుకోత ఫలితమే. రేపటి చితిమంటలు నేటి పుట్టినరోజు వెలుగులకు సూచికలే. ఒక తల్లి వేదన ఇంకొక తల్లికి వేడుక. ఒక చెట్టు పుట్టడానికి ఒక విత్తనం మరణించక తప్పదు. వేసవి మహోగ్రతాపం లేనిదే భూమాత కడుపు పండించే వర్షర్తువు లేదు. వేసవిలో సూర్యకిరణాలు తగినంత వేడిమిని సంతరించుకోనిదే, సముద్రపు నీటి బిందువులను ఆకాశానికెత్తి వర్షర్తువులో మన మీద జలధారలు కురిపించలేవు. ఆకలీ, అన్నమూ పరస్పర వ్యతిరేకాలు కావు. ఆకలిగొననిదే మనం అన్నపు రుచిని ఆనందించలేం. పూర్తిగా నిండిన కడుపు విందు భోజనాన్ని ఆస్వాదించలేదు. మనం ఆరోగ్యాన్ని కోల్పోతాం, జబ్బుపడతాం, తిరిగి ఆరోగ్యాన్ని పొందుతాం, ఆనందతాండవం చేస్తాం. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడా ఆనందనృత్యం చేయలేం. పోగొట్టుకుంటే కానీ అదెంతటి భాగ్యమో తెలుసుకోలేం. కనుక ఆరోగ్యమూ, రోగమూ పరస్పర వ్యతిరేకాలు కావు. పరస్పర పూరకాలు. ఒక నాటకంలోని నాయకుడూ, ప్రతినాయకుడూ భిన్నధ్రువాలు కారు. ఇద్దరూ ద్వంద్వాత్మక దివ్యనాటకంలో అనివార్య భాగాలు. ప్రతినాయకుడు లేని చలనచిత్రం విసుగు పుట్టిస్తుంది. నాటకం పూర్తికాగానే నాయకుడూ, ప్రతినాయకుడూ దర్శకునితో కలసి కాఫీ సేవిస్తారు. కమ్మరి ఒక ఇనపగడ్డను తీసుకుని రెండు ముక్కలు చేస్తాడు. ఒక ముక్కతో గాయపరిచే కరవాలాన్ని చేస్తాడు, ఇంకొక ముక్కతో ఆ గాయంనుంచి కాచుకునే డాలు తయారుచేస్తాడు. యుద్ధం జరిగినంతసేపూ కరవాలం గాయపరచడానికీ, డాలు కాపాడడానికీ ప్రయత్నిస్తూ, పైకి పరస్పరవిరుద్ధాలుగా కనిపించే తమ పాత్రలను పోషిస్తూనే ఉంటాయి. యుద్ధమెప్పుడైతే ముగిసిందో, ఆ రెంటినీ ఒక మూలకు విసిరేస్తారు. అవి పరస్పరాలింగనంలో ఆనందంగా అక్కడే పడుంటాయి. అలాగే, ఒక నాయకుడూ, ప్రతినాయకుడూ, ఒక మిత్రుడూ, ఒక శత్రువూ కూడా. జీవననాటకం ఎప్పుడైతే ముగిసిందో, అప్పుడిరువురూ భగవంతుడి దివ్యోద్యానానికి చేరి విశ్వదర్శకుని సన్నిధిలో సంతోషంగా ఉండిపోతారు. కన్నీటిపట్ల మన విద్వేషమంతా విశ్వసంబంధమైన స్పృహ లోపించడం నుంచే పుడుతోంది. కన్నీటి చుక్క మూలాలు ఏమిటో, వాటి ప్రారంభమూ, అంతమూ ఎక్కడో మనకు తెలియవు. దాని అంతర్నిర్మాణం తెలియని అంధత్వం మనది. దానినంతగా ద్వేషించడానికి అదీ కారణం. కన్నీటి చుక్క విషాదభరిత దుర్గతి ఎలాంటిదో చూడండి. దానికి అన్ని తలుపులూ మూసుకుంటాయి, అందరూ, అన్నివేళలా దానిని అసహ్యించుకుంటారు, ఏ ఒక్కరి ప్రేమకూ అది నోచుకోదు. బహుశా కన్నీటి చుక్క అంతగా ఎవరూ కన్నీరు కార్చి ఉండరు. అది ఆత్మకథే రాసుకుంటే బహుశా అది మన కంట తడి పెట్టిస్తుంది. 'అన్ని సముద్రాలనూ ఇంకిపోయేలా చేయండి, వాటిని తిరిగి నా కన్నీటితో నింపుతా'నని అది రోదించవచ్చు. ప్రతిరోజూ అది ఎందరెందరి తలుపులో తడుతుంది. కానీ ఒక్కరూ దానిని ఆహ్వానించరు. అలాంటి తిరస్కృత, పరాజిత అశ్రుబిందువు నిజానికి భగవంతునికి అత్యంత 'ప్రేమబంధువు'. చిరునవ్వూ, కన్నీరూ రెండూ భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రమైన సంతానం. కానీ మనం ఆయన సంతానంలో ఒకరిని ప్రేమిస్తాం, ఇంకొకరిని ద్వేషిస్తాం. అది న్యాయమేనా? తన సంతానంలో ఒకరిని ద్వేషించడం ద్వారా భగవంతుని మనం సంతోషపెట్టగలమా? అదే భగవంతుడు– అందరికన్నా వివేకవంతుడూ, మనల్ని అమితంగా ప్రేమించేవాడూ, అందరికన్నా మనకత్యంత ప్రేమాస్పదుడూ అయిన అదే భగవంతుడు – మనకు చిరునవ్వులూ పంచుతున్నాడు, కన్నీళ్లూ ఇస్తున్నాడు. మనకు తల్లీ, తండ్రీ కూడా తనేగా రూపెత్తిన, అంతకన్నా ఇంకా లక్షల రెట్లు ఎక్కువైన భగవంతుడు తను అమితంగా ప్రేమించే తన పిల్లలమైన మనకు కన్నీటిని ప్రసాదిస్తే ఎందుకు విచారించాలి? వాటికి మనమెందుకు భయపడాలి? మన సుఖదుఃఖాల ద్వంద్వాత్మక అస్తిత్వంలో మనకు అర్థంకాని మన శ్రేయస్సు ఏదో ఇమిడి ఉంటే తప్ప అపారక్షమా సముద్రుడైన భగవంతుడు మనకు కన్నీళ్లు ఎందుకిస్తాడు? తరచు ఇవే ప్రశ్నలు నాకు నేను వేసుకుంటూ ఉంటాను. ఇలా నన్ను నేను ప్రశ్నించుకున్న కొద్దీ కన్నీటికీ, చిరునవ్వుకీ ఉన్న సంబంధం మరింత తేటగా నాకు అర్థమవుతూ వచ్చింది. భగవంతుడు మనల్ని కన్నీటితో శిక్షిస్తున్నాడా, లేక కన్నీటితో చికిత్స చేస్తున్నాడా?

పిల్లవాడికి శిక్షలా అనిపించే ఆయన సూదిమందు నిజానికతనికి చికిత్స మాత్రమే. కన్నీటిచుక్క మన పాపాలకు

శిక్ష కాదు, మన జీవితాన్ని పీడించే అదృశ్యరోగాలకు చికిత్స. మనం ఎంత ఇష్టంగా, ఎంత సంతోషంగా చికిత్సను స్వీకరిస్తామో అంత త్వరగా రోగవిముక్తులమవుతాం. నొప్పి కలిగించే సూదిమందు ఇచ్చినందుకు వైద్యుడికి ఫీజు చెల్లించి ఎలా కృతజ్ఞతలు చెప్పుకుంటామో, అలాగే మనకు కన్నీళ్లు ఇచ్చినందుకు భగవంతుడికి కూడా కృతజ్ఞతలు చెప్పుకుని వాటిని ఆనందంగా స్వీకరించాలి. భగవంతుడు మనల్ని ద్వేషించేవాడూ, మనల్ని శిక్షించేవాడూ, మన పాపాలకు ప్రతీకారం తీర్చుకునేవాడూ, మనం కష్టాలు పడుతుంటే వికృతంగా వినోదించేవాడూ కానే కాడు. ఆయన ప్రేమ ఎంత గాఢమూ, షరతులు లేనిదీ అంటే, ఆయనను మనమెంత నిరవధికంగా ద్వేషిస్తామో, ఆయన అంతగా అలుపెరుగని ప్రేమను మనపై వర్షిస్తాడు. నిజానికి, పెద్దగా చదువుసంధ్యలులేని సామాన్యులు సైతం భగవంతుని నిర్వచించుకునేదీ, భావించుకునేదీ ఎట్టి షరతులూ లేని ప్రేమైకమూర్తిగానే! తన ప్రేమను మనకు పంచడానికాయన ఎటువంటి షరతులూ పెట్టడు. ఈ ఐహికజగతికి చెందిన ఒక సాధారణగృహిణే తను కన్న పసిపాప తన ముఖాన్ని కాళ్లతో తన్నినా ఆ కాళ్ళను ప్రేమతో ముద్దాడినప్పుడు, అంతకన్నా లక్షల రెట్లు మాతృత్వం మూర్తీభవించిన భగవంతుడు మన హృదయాల్లో కన్నీటినెందుకు కుమ్మరిస్తాడు? భగవంతుడూ, కన్నీరూ–రెండూ అనాదిగా మన అవగాహనకు అతీత మవుతూనే ఉన్నాయి. మనం జీవించి ఉన్నంతవరకూ మన దైహిక అవసరాలను, అది కూడా సాధ్యమైన మేరకు మాత్రమే తీర్చుకోడానికి ఉద్దేశించిన మన అల్పమేధస్సు, దివ్యవివేకపు లోతుల్ని ఎప్పటికీ కొలవలేదు. మనం అడగకుండానే తల్లిప్రేమ అనే అద్భుతస్పర్శతో మనల్ని అనుగ్రహించే భగవంతుడు; మనం కోరకుండానే నులివెచ్చని, తీయతీయని, పుష్టికరమైన పాలనూ, మనం నేర్చుకోకుండానే వాటిని గ్రోలే కళనూ మనకు ప్రసాదించిన భగవంతుడు, మన ఊపిరితిత్తులను నింపుకోడానికి సమృద్ధిగా ప్రాణవాయువును సిద్ధంచేసి ఉంచిన భగవంతుడు... ఎంత అనివార్యం కాకపోతే మనకు కన్నీళ్ళు ఇస్తాడు! ఏమడగాలో కూడా మనకు తెలియని దశలో ఈ అమూల్య వరాలను అనుగ్రహించాడాయన. భగవంతుని కారుణ్యమూ, వివేకమూ అలాంటివి. భగవంతుని చర్యా, ప్రతిచర్యల లోలోతులు తెలియని మనం ఆయనను అపార్థం చేసుకోవడం ప్రారంభిస్తాం. నిజంగా కన్నీటిని ద్వేషించడమంటే ఏమిటో కూడా మనలో చాలామందికి తెలియదు, కన్నీటిని ద్వేషించడమంటే, స్వయంగా భగవంతుని ద్వేషించడమే, ఎందుకంటే, కన్నీరు ఆయన ప్రియాతిప్రియమైన సంతానం.

కన్నీరు మన జీవితంలో పోషించే సాంద్ర సానుకూల పాత్రను మనమెప్పుడైతే గుర్తిస్తామో, కన్నీరు భగవంతుడి ప్రేమ, వివేకాలనుంచి జనించిన అనర్ఘశిశువన్న సంగతిని మనమెప్పుడైతే అర్థం చేసుకుంటామో అప్పుడు దానిపట్ల మన ద్వేషం మాయమవుతుంది, దానిని ప్రేమించడం ప్రారంభిస్తాం. కన్నీరు అనేది మారువేషం ధరించిన చిరునవ్వు. మనం దానిని ద్వేషించడమంటే చిరునవ్వును ద్వేషించడం. కన్నీటిని చిరునవ్వుగా మార్చుకోడానికి ఏకైక మార్గం, కన్నీటిని చూసి చిరునవ్వు చిందించడమే. ప్రేమ, ఆమోదాల మధ్య నలిగిన కన్నీరే చిరునవ్వుగా రూపాంతరం చెందుతుంది. భగవంతుడిచ్చిన కన్నీటిని స్వీకరించి ఆనందించడమే అత్యుత్తమ ఆరాధన. కన్నీటిని సంతోషంగా ఆమోదించేవాడే భగవంతుని సంతోషపెడతాడు. కన్నీరు మారురూపంలో ఉన్న భగవంతుని మహోన్నత ఆశీస్సు. మన పెదవులపై నిర్భీతీ, నిత్యసంతోషమూ వెల్లివిరిసే చిరునవ్వే భగవంతుని పట్ల మన హృదయంలోని అదృశ్యవిశ్వాసానికి దృశ్యమాన సాక్ష్యం. చాలామంది కన్నీటిని ఎందుకు తప్పించుకోలేరంటే, తప్పించుకోవాలని అనుకుంటారు కనుక. మనమెన్నడూ ఆ పని చేయకూడదు. కన్నీరే మనకు పెన్నిధి. కన్నీరే కళ్ళు చేసుకున్న అదృష్టం. కన్నీరు మన హృదయాలలో ఇంద్రధనువులను సృష్టిస్తుంది. చీకటిమబ్బుల మధ్య సూర్యుడు చిందించే చిరునవ్వే ఇంద్రధనువులను ఆవిష్కరిస్తుంది. వర్షం లేనిదే ఇంద్రధనువు లేదు. అందుకే, కన్నీటిచుక్క కంటికి ఆభరణం. వింతగొలిపే వైరుధ్యమేమిటంటే, కన్నీటిని విజయవంతంగా తప్పించుకునే అతి దగ్గరిదారి, దాని ప్రేమలో పడడమే. కన్నీటికి దూరంగా పారిపోవాలనుకుంటే మనం చేయవలసింది, దానికి దగ్గరగా పరుగెత్తడమే. నాకు తెలిసినంతవరకూ, కన్నీటి పొందులో పారవశ్యంతో కరిగిపోయిన ఏ కొందరో తప్ప, దానినుంచి విజయవంతంగా తప్పించుకున్న వారు మానవచరిత్రలోనే లేరు. కన్నీటిని ఎప్పుడైతే ఆమోదించి సహనంతో అక్కున చేర్చుకుంటామో అప్పుడు వాటిని తొలగించమని భగవంతుని ప్రార్థించే సమయంకన్నా కూడా త్వరగా అవి అదృశ్యమవుతాయి. చిరునవ్వులో కన్నా కన్నీటిలో భగవంతుని వివేకాన్ని దర్శించగలిగినవాడే నిజమైన ఆధ్యాత్మికద్రష్ట. కన్నీటిచుక్క మనకు సంతోషం కలిగించకపోవచ్చు, కానీ మనల్ని వివేకవంతుల్ని చేస్తుంది. చిరునవ్వు మనకు సంతోషం కలిగించవచ్చు, కానీ వివేకవంతుల్ని చేయలేదు. కనుక మనం అసంతుష్టి – జ్ఞానం సంతుష్టి, అజ్ఞానాలలో ఒక జంటనే ఎంచుకోవాలి. భగవంతుడు మన చిరునవ్వును హరించేది, దానిని రెట్టింపూ, మూడురెట్లూ చేసి తిరిగి మనకు అందించడానికే; ఆధ్యాత్మికపు లోచూపు విప్పారిన ఏ వ్యక్తికైనా ఆ సంగతి తెలుస్తుంది, అందుకే అతను మొదటి జంటనే ఎంచుకుంటాడు. కన్నీటిచుక్క చిరునవ్వును

వీడని నీడే. కనుక కన్నీటి గురించి మనకు భయమక్కర్లేదు. దగ్గరలోనే ఎక్కడో చిరునవ్వుల వెలుగులజడి మనకోసం ఎదురు చూస్తోందని దానర్థం. బాహ్యంగా కనిపించే ముళ్ళకంచెను దాటి, కన్నీటిచుక్క ఆంతరిక ప్రకృతి దృశ్యంలోకి మనం మానసికయాత్ర చేసినప్పుడు అక్కడ అంతటా పొడవునా అంతులేకుండా చిరునవ్వులు వికసిస్తూ కనిపిస్తాయి. కన్నీటిచుక్క తనను ప్రేమించే ఏ ఒక్కరి హృదయాన్నీ ఎప్పటికీ ముక్కలు చేయదు. నిజానికి వాళ్ళు మాత్రమే దానినుంచి విజయవంతంగా తప్పించుకోగలరు. ఆగ్రహంతో మీదపడే గొడ్డలి పదునుకు ఎప్పటికీ గురయ్యే కొయ్యదుంగ, ఎక్కడున్నా వేటును తప్పించుకోలేదు; ఎక్కడ దాగినా గొడ్డలి దానిని ముక్కలుగా నరుకుతుంది. అదే దుంగ ఆ గొడ్డలికి పొడవైన, ప్రియమైన పిడి అయినప్పుడు గొడ్డలి దానినేమీ చేయలేదు. ఎంత ప్రయత్నించినా అది ఆ దుంగను తాకలేదు. అలాగే, కన్నీటి గొడ్డలి మనను తాకకూడదనుకుంటే మనం దానికి పిడిగా మారి ప్రేమతో దానిని పట్టుకోవాలి.

మనం జయప్రదంగా, సహజగతిలో కన్నీటిని తప్పించుకోగల మార్గాలు మూడే. మొదటిది, కన్నీటిని స్వాగతించడం, కన్నీటిచుక్క మన తలుపు తట్టినప్పుడు దానిని తిరస్కరించకుండా ఉండడం, మనకు చిరునవ్వులు వర్షించే మన ప్రియభగవానుడే కన్నీటినీ పంపించాడని భావించి సంతోషంగా ఆహ్వానించడం! ఆయన ఇచ్చేది ఏదైనా అక్కున చేర్చుకోదగినదే. మనమాలా చేసినప్పుడు దాని ప్రభావం యాభై శాతం మటుమాయమైపోతుంది. రెండో మార్గం, కన్నీరు ఇచ్చినందుకు భగవంతునికి కృతజ్ఞతలు చెప్పడం; మనల్ని అపారంగా ప్రేమించే అమితవివేకవంతుడైన తండ్రి మనకు ఏదిచ్చినా కృతజ్ఞతలకు అర్హమే. కనుక దానిని స్వాగతించడమే కాదు, భగవంతుడికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అప్పుడు కన్నీరు డెబ్బై అయిదు శాతం బలహీనపడిపోతుంది. ఇక చివరిగా, అతిముఖ్యంగా మనం చేయవలసింది, కన్నీటితో ప్రేమలో పడడం. అలాగే, భగవంతుడు చిరంజీవులైన తన సంతానానికి ప్రసాదించినదేదైనా ప్రేమించదగినదే. కన్నీటిని స్వాగతించి, భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకోవడం కూడా సరిపోదు. దానితో మనం వెనుదిరిగి రాలేనంత ప్రేమలో పడాలి. అప్పుడు షరతులు లేని మన ప్రేమ అనే వెచ్చని కౌగిలిలో కన్నీటిచుక్క ఆవిరై, మనల్ని మరింత విజ్ఞులనూ, వివేకవంతులనూ, ఉన్నతులనూ చేసి పూర్తిగా మాయమై పోతుంది. అప్పుడు మనం భగవంతునికి మరింత సంతోషమూ, వివేకమూ నిండిన సంతాన మవుతాం. వివేకంతోపాటు రంగు రంగుల సంతోషాల ఇంద్రధనువు మన సొంతమవుతుంది. సంతోష, వివేకాలను రెంటినీ పొందడానికి ఇదొక్కటే మార్గం. ఏ కన్నీటిచుక్కైనా ఈ చివరి మార్గానికి తలొంచి తప్పుకోవలసిందే. అప్పటికీ అది తలొంచలేదంటే దానర్థం, అది ఇంకెంతమాత్రం కన్నీటిచుక్క కాదనే. అది మారు రూపంలో మనకిచ్చిన వరం. అది కేవలం, ఏ క్షణంలో నైనా తన వైభవోపేత రూపంలో మనముందుకు రావడానికి సిద్ధపడే – ముసుగు ధరించిన చిరునవ్వు. కన్నీళ్లూ, చిరునవ్వుల మధ్య రేగే భయానక ఘర్షణకు స్థితప్రజ్ఞుడు ఆందోళన చెందడు. కన్నీళ్ళే తన చిరునవ్వులకు ఎరువని అతనికి తెలుసు. కన్నీటి గర్భంలో ఇంకెక్కడా దొరకనన్ని చిరునవ్వులు దాగున్నాయని కూడా అతనికి తెలుసు. విచ్చుకునే చిరునవ్వుల మూలాలు కన్నీటి లోలోతుల్లో నాటుకున్నాయనే నిరంతరస్పృహలో అతనుంటాడు.

అందుకే కృష్ణుని చిరునవ్వుల వెలుగుల మూలాలు రాముని విషాద్రశువులలో దాగున్నాయి. రాముడు దుఃఖించినంతగానూ కృష్ణుడు చిరునవ్వులు చిందించాడు. బహుశా రాముని కన్నీళ్లే కృష్ణుని చిరునవ్వులకు కారణమయ్యుంటాయి. చిరునవ్వులకూ, కన్నీళ్ళకూ మధ్య ఎప్పటికీ తెగని అంతస్సంబంధం అలాంటిది. వివేకవంతుడు తనకెదురయ్యే జీవనకల్లోలాలకు ఎన్నటికీ చలించడు. నిలువునా కుంగదీసే ఎలాంటి అడ్డంకులకూ ఆందోళన చెందడు. కన్నీటి పెనుతుపానుకు భయోద్విగ్నుడు కాడు. ప్రతి కలవరపాటూ అసాధారణవివేకంవైపే నడిపిస్తుంది. ప్రతి అడ్డంకీ మరింత పరుగులవీరుణ్ణే చేస్తుంది. ప్రతి కన్నీటిచుక్కా చిరునవ్వుల పూలరాశితో కప్పేస్తుంది. కన్నీటిచుక్కలోకి ప్రయాణం మన చిరునవ్వుకు ప్రాణం పోస్తుంది. ముత్యపు చిప్పలో ఎదురయ్యే ఒక ఆటంకం నుంచే ముత్యం పుడుతుంది. ఆ ఆటంకాన్ని తిరస్కరించడం జరగదు సరికదా, ముత్యపు చిప్పలో స్రవించే ద్రవం దానికి పైపూత అవుతుంది. మెరుపులీనే ముత్యం అలా తయారవుతుంది. అలాగే మనం కూడా కన్నీటిచుక్క అనే అంతరాయానికి మన ప్రేమ అనే పూత పూద్దాం, అప్పుడది మెరిసిపోయే చిరునవ్వుల ముత్యంగా రూపాంతరం చెందుతుంది. కనుక అందరం చిరునవ్వులపై చిరునవ్వు చిందిద్దాం, కన్నీటిని చూసి చిరునవ్వులొలికిద్దాం, కన్నీళ్ళలోంచి చిరునవ్వులు పారిద్దాం, ఆ హసితబాష్పాలు మన జీవనగగనాన కాంతిమంతమైన ఇంద్రధనువులను సృష్టిస్తాయి.

మి

శ్రీరామ్, హైద్రాబాద్.

**అట్టమీద బొమ్మలు**

| | | | |
|---|---|---|---|
| **1. అర్జున** | తండ్రి తనయులు | **2. ద్రోణాచార్య** | తండ్రీ కొడుకులే |
| **4. అభిమన్యు** | ఇద్దరూ ధీరోదాత్తులే | **3. అశ్వత్థామ** | ఇద్దరూ ధర్మం తప్పినవారే. |

చిత్రాలు : ఇది కైమూర్ ఆర్ట్ – AI మోడిఫైడ్

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి  బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణి చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణంగా వారికి పత్రికను పంపడం ఆపుతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ–మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.,** Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**